

ఈనాడు



కరీంనగర్ 21-3-2018 బుధవారం సిటీ సంపుటి 44 సంచిక 220
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

తెలుగు వెలగాల్సిందే

మొదటిదశలో పదో తరగతి వరకు ఒక సబ్జెక్టుగా బోధన • ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టం

- వచ్చే విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం
- ప్రైవేటు బడుల్లోనూ తెలుగు పండితులు తప్పనిసరి
- ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం
- తమిళనాడులో అధ్యయనం చేసిన అధికారులతో సమీక్ష


తెలుగు అమలుపై మంత్రులు, అధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

ఈనాడు - హైదరాబాద్

వచ్చే విద్యా సంవత్సరం(2018-19) నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు భాషను తప్పనిసరిగా ఒక సబ్జెక్టుగా బోధించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. మొదటి దశలో పదో తరగతి వరకు మాత్రం బోధించాలని నిర్ణయించామని ప్రకటించారు. ఈ విధానం అమలుకు ప్రస్తుత శాసనసభ సమావేశాల్లోనే చట్టం తెస్తున్నట్లు వెల్లడించారు. మాతృభాష బోధనపై తమిళనాడులోని విధానాన్ని అధ్యయనం చేయడానికి వెళ్లి వచ్చిన అధికారులతో ఆయన మంగళవారం ప్రగతి భవన్‌లో సమావేశమయ్యారు. తెలుగును ఒక సబ్జెక్టుగా బోధించడంపై రూపొందించాల్సిన విధి విధానాలపై చర్చించారు. 'మాతృభాష తెలుగును రక్షించుకోవడం, మన సంస్కృతిని కాపాడుకోవడం లక్ష్యంగా తెలంగాణలోని అన్ని విద్యా సంస్థల్లో తెలుగును సబ్జెక్టుగా బోధించాలని నిర్ణయించాం. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఆంగ్ల మాధ్యమంలో చదవడం అందరికీ అనివార్యమవుతోంది. పిల్లల భవిష్యత్తును కూడా దెబ్బతీయవద్దు. అదే క్రమంలో తెలుగు కనుమరుగు కావొద్దు. అందుకే ఆంగ్ల మాధ్యమంలో చదివే విద్యార్థులు కూడా తెలుగు భాష నేర్చుకోవాలనే నిబంధన విధిస్తున్నాం' అని కేసీఆర్ పేర్కొన్నారు.

ఇంటర్‌లో అమలు కాస్త ఇబ్బంది: మొదట ఇంటర్మీడియట్(12వ తరగతి) వరకు తెలుగును తప్పనిసరి చేయాలని (మిగతా 2లో)

కాల్‌సెంటర్ కొలువులకు కత్తెర!



అమెరికన్లకే ఆ ఉద్యోగాలు లభించే నిబంధనలతో సెనెట్‌లో బిల్లు

వాషింగ్టన్: భారతదేశంలో పలువురికి ఉపాధి కల్పిస్తున్న కాల్‌సెంటర్ ఉద్యోగాలపై అమెరికన్లకు కన్నుకుట్టింది. తమ దేశంలోని కంపెనీలు ఆ ఉద్యోగాలను విదేశాలకు తరలిస్తున్నందున అమెరికన్లు నిరుద్యోగులుగా మారిపోతున్నారంటూ గగ్గోలు పెడుతున్నారు. దీనిలో భాగంగానే పొరుగు సేవల (అవుట్ సోర్సింగ్) ఉద్యోగాలు ఇతర దేశాలకు తరలిపోకుండా నిరోధించే లక్ష్యంతో రూపొందించిన బిల్లు ఒకటి అమెరికా సెనెట్ ముందుకు వచ్చింది. ఈ బిల్లు అమెరికా చట్టసభల ఆమోదం పొందితే భారత్‌లో లక్షల మందికి ఉపాధికల్పిస్తున్న కాల్ సెంటర్ ఉద్యోగాలు ప్రమాదంలో పడతాయి. ఓహియో రాష్ట్రానికి చెందిన డెమోక్రాట్ సెనెటర్ షెరాడ్ బ్రౌన్ ప్రతిపాదిత బిల్లును అమెరికా కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టారు. ప్రతిపాదిత బిల్లు ప్రకారం...

- కాంట్రాక్టులను అప్పగించే సమయంలో విదేశాలకు ఉద్యోగాలను తరలించని కంపెనీలకే అమెరికా ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలి.
- కాల్ సెంటర్ ఉద్యోగాలను విదేశాలకు బదలాయిస్తున్న కంపెనీల జాబితాను రూపొందించి బహిరంగపరచాలి.
- వినియోగదారు (సర్వీస్ కస్టమర్)కు కాల్ సెంటర్ ఉద్యోగి తాను ఎక్కడి నుంచి పనిచేస్తున్నదీ వెల్లడించాల్సి ఉంటుంది.
- దానితో పాటు తన (మిగతా 2లో)

ఉస్మానియా, ఆంధ్రా వర్సిటీలకు
పూర్తి స్వయం ప్రతిపత్తి

- హెచ్‌సీయూ, కాకతీయ, నల్సార్, ఇఫ్లూకూ ఇదే హోదా
- 62 ఉన్నత విద్యాసంస్థలను ప్రకటించిన యూజీసీ
- కేంద్రమంత్రి ప్రకాశ్ జావడేకర్ వెల్లడి

ఈనాడు, అమరావతి; దిల్లీ: దేశవ్యాప్తంగా 62 ఉన్నత విద్యాసంస్థలకు మంగళవారం యూజీసీ పూర్తి స్వయంప్రతిపత్తి హోదాను కల్పించింది. విద్యాప్రమాణాలను ఉన్నతంగా నిర్వహిస్తున్నందుకు ఈ హోదాను కల్పించినట్లు కేంద్ర మానవవనరుల అభివృద్ధిమంత్రి ప్రకాశ్ జావడేకర్ వెల్లడించారు. జాబితాలో ఐదు కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, 21 రాష్ట్ర, 26 ప్రైవేటు వర్సిటీలతో పాటు పది కళాశాలలు ఉన్నాయన్నారు. కేంద్రీయ విద్యాసంస్థల్లో జేఎన్‌టీయూ-న్యూదిల్లీ, బనారస్ హిందూ వర్సిటీ(వారణాసి), అలీగఢ్ (మిగతా 2లో)

మళ్లీ అదే చిత్రం

లోక్‌సభలో చర్చకు రాని అవిశ్వాసం

- వెల్‌లో ఏఐఏడీఎంకే, తెరాస ఆందోళన
- ఇరాక్‌లో భారతీయుల మృతిపై ప్రకటనకు సుష్మాస్వరాజ్ ప్రయత్నం
- అడ్డుకున్న విపక్షాలు... స్పీకర్ ఆగ్రహం
- రాజకీయాల్లోపడి మానవత్వాన్ని మరిచిపోయారని మండిపాటు • సభ నేటికి వాయిదా -2లో


రిజర్వేషన్ల పెంపు విషయంలో కేంద్రం వైఖరికి నిరసనగా పార్లమెంటు హౌస్ మెయిన్‌గేట్ వద్ద ఆందోళన చేస్తున్న తెరాస ఎంపీలు

ఏపీ ఎంపీలు జాగ్రత్తగా మాట్లాడాలి

- అవిశ్వాసంపై ముందుగా మా నేతకు చెప్పాల్సింది
- కేంద్రం రిజర్వేషన్ల హక్కును రాష్ట్రాలకు ఇవ్వాల్సిందే -2లో
- తెరాస ఎంపీల వ్యాఖ్యలు
- కొనసాగుతున్న నిరసనలు

అమానుష కాండ


ఇరాక్‌లో అపహరణకు గురైన 39 మంది భారతీయుల ఊచకోత

- ఐసిస్ ఘాతుకం
- మూడేళ్ల తర్వాత వెలుగులోకి చేదు నిజం
- సామూహిక ఖనన ప్రదేశంలో వెలుగుచూసిన మృతదేహాలు
- సరిపోలిన డీఎన్ఏ
- రాజ్యసభలో సుష్మ స్వరాజ్ ప్రకటన


ఇరాక్‌లో ఐసిస్ చేతిలో మృత్యువాత పడిన హర్‌సిమ్రన్‌సింగ్ కుటుంబ సభ్యుల రోదన

దిల్లీ: ఇరాక్‌లో మూడేళ్ల కిందట అపహరించిన 39 మంది భారతీయులను కర్కశ ఉగ్రవాద మూక ఐసిస్.. దారుణంగా హతమార్చినట్లు వెలుగులోకి వచ్చింది. వారు ఎక్కడోచోట సజీవంగా ఉంటారన్న ఆశలు వమ్మయ్యాయి. బాధితులను ఎప్పుడు పొట్టనబెట్టుకున్నారన్నది ఇంకా తెలియరాలేదు. మృతదేహాలను ముష్కరులు.. బదోశ్ గ్రామంలో సామూహికంగా ఖననం చేశారు. వాటిని వెలికితీసి, డీఎన్ఏ పరీక్షల ద్వారా గుర్తించినట్లు విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ మంగళవారం రాజ్యసభలో ప్రకటించారు. మృతదేహాలను ప్రత్యేక విమానంలో భారత్‌కు తీసుకొచ్చి, బంధువులకు అప్పగిస్తామని చెప్పారు. ఇందుకు 8-10 రోజులు పడుతుందని విదేశాంగ శాఖ సహాయ మంత్రి వి.కె.సింగ్ విలేఖరులతో చెప్పారు.

ఇరాక్‌లోని రెండో పెద్ద నగరమైన మోసుల్‌ను 2014లో ఐసిస్ ఉగ్రవాదులు (మిగతా 2లో)



పోలవరంపై వక్రీకరిస్తారా?

కేంద్రానికి లేని ఆలోచన కలిగేలా మాట్లాడటం దుర్మార్గం

పవన్ కల్యాణ్‌కు ఏమైనా కల వచ్చిందా?

భాజపాకి వైకాపా, జనసేన కోవర్టులు -3లో

చంద్రబాబు తీవ్ర ఆగ్రహం

ఫేస్‌బుక్కయింది!

- 'సమాచార దుర్వినియోగం'పై అలజడి
- భారీగా నష్టాలపాలైన షేర్లు
- విచారణకు హాజరుకావాలని జుకెర్‌బర్గ్‌కు అమెరికా, బ్రిటన్, ఈయూ ఆదేశాలు



వాషింగ్టన్, లండన్, బ్రసెల్స్: కోట్లాది మంది వ్యక్తిగత సమాచారం దుర్వినియోగమైందన్న ఆరోపణలు ఫేస్‌బుక్‌ను కుదిపేస్తున్నాయి. ఓవైపు షేర్లు కుదేలవుతుంటే.. మరోవైపు సంస్థపై దర్యాప్తు బృందాల ప్రశ్నల వర్షం కురుస్తోంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ కోసం పనిచేసిన "కేంబ్రిడ్జ్ అనలిటికా" సంస్థకు దాదాపు ఐదు కోట్ల మంది ఫేస్‌బుక్ ఖాతాల సమాచారం చిక్కిందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వీటిపై స్పందిస్తూ అనలిటికా ఖాతాను ఫేస్‌బుక్ స్తంభింపచేసింది. ఈ లీక్‌పై సమగ్ర విచారణ జరగాల్సిందేనని అమెరికా సహా అట్లాంటిక్ మహాసముద్రానికి రెండు వైపునున్న దేశాల నుంచీ డిమాండ్లు వస్తున్నాయి. అమెరికా కాంగ్రెస్ ఎదుట గూగుల్, ట్విటర్ సీఈవోలతో సహా హాజరుకావాలని ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకెర్‌బర్గ్‌కు డెమోక్రటిక్ సెనెటర్ అమీ క్లోబుచార్, రిపబ్లికన్ సెనెటర్ జాన్ కెన్నడీ సూచించారు. మరోవైపు సమాచార దుర్వినియోగంపై వివరణ ఇవ్వాలని బ్రిటన్ పార్లమెంటరీ కమిటీ కూడా జుకెర్‌బర్గ్‌కు నోటీసులు పంపింది. ఈ దారుణ వైఫల్యంపై సంజాయిషీ ఇవ్వాలని జుకెర్‌బర్గ్‌ను కోరినట్లు ప్రతినిధుల సభలోని డిజిటల్, సంస్కృతి, మీడియా, క్రీడలు వ్యవహారాల కమిటీ ఛైర్మన్ తెలిపారు. ఫేస్‌బుక్‌తోపాటు కేంబ్రిడ్జ్ అనలిటికాపైనా సమగ్ర దర్యాప్తు చేపడుతున్నామని బ్రిటన్ సమాచార (మిగతా 2లో)

పార్కింగ్ దందాకు చెల్లుచీటి -3లో

అరగంట వరకూ ఉచితం

పురపాలనలోకి కొత్తగా 1000కి పైగా గ్రామాలు

పురపాలక చట్టంలోనే గ్రామాల పేర్లు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పురపాలన విస్తరించనుంది. రాష్ట్రంలో సుమారు వెయ్యికిపైగా గ్రామాలు త్వరలో పురపాలన పరిధిలోకి రానున్నాయి. తెలంగాణ రాష్ట్ర పురపాలక శాఖ ప్రస్తుత శాసనసభ సమావేశాల్లో తీసుకురానున్న పురపాలక సవరణ చట్టంలో పది వేలకు పైబడి జనాభా ఉన్న అన్ని మేజర్ గ్రామపంచాయతీలను నగర పంచాయతీలుగా మార్చనున్నారు. ఈ నేపథ్యంలో సుమారు 500 గ్రామాలదాకా కొత్త నగర పంచాయతీల పరిధిలోకి రానున్నాయి. మొదటి విడతగా 26కి పైగా కొత్త నగర పంచాయతీలు ఏర్పాటు కానున్నాయి. ఇవి కాకుండా సుమారు 500 గ్రామాలు ప్రస్తుతమున్న నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో విలీనం కానున్నాయి. తుదిరూపు దిద్దుకుంటున్న పురపాలక సవరణ చట్టంలోనే వివిధ అంశాలతోబాటు కొత్తగా ఏర్పాటవనున్న నగర పంచాయతీలు, వాటి పరిధిలోకి వచ్చే గ్రామాలు, విలీనం కానున్న గ్రామాల పేర్లను స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిసింది.

క్రిమినల్ కేసులన్నా.. బేఖాతరు -14లో

- 'పది' పరీక్షల్లో ఆగని అక్రమాలు

ఇదీ సంగతి!





ఏపీ ఎంపీలు జాగ్రత్తగా మాట్లాడాలి

ఈనాడు, దిల్లీ: రాష్ట్ర విభజన జరిగి నాలుగేళ్లయినా ఇప్పటికీ అశాస్త్రీయం, తొందరపాటు అంటూ ఆంధ్రప్రదేశ్ ఎంపీలు మాట్లాడుతున్నారని తెరాస ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెదేపా, వైకాపా ఎంపీలు తెలంగాణ గురించి జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు. మంగళవారం లోక్‌సభ వాయిదా అనంతరం తెరాస ఎంపీలు జితేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్, బూరనర్సయ్యగౌడ్, సీతారాంనాయక్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బాల్కసుమన్, దయాకర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీబీపాటిల్, నగేశ్, మల్కాజిగిరి ఎంపీ మల్లారెడ్డి, ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసులురెడ్డి పార్లమెంటు గేటు నంబరు 1 వద్ద నిరసన తెలిపారు. 'జై కేసీఆర్, జై మమత' అంటూ నినాదాలు చేశారు. అక్కడే ఉన్న టీపీసీసీ నేత పొన్నాల లక్ష్మయ్యను నిరసనలో పాల్గొనాలని విజ్ఞప్తి చేయగా ఆయన తిరస్కరించారు. అనంతరం వినోద్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లు షెడ్యూలు 9లో పొందుపరిస్తే సరిపోతుందని చెప్పినా కేంద్రం పట్టించుకోలేదని అందుకే రిజర్వేషన్ల కోసం నిరసన తెలుపుతున్నామన్నారు. ఏపీ ఎంపీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ఎప్పుడు చర్చకు వచ్చినా విభజన అంశాలన్నింటిపైనా మాట్లాడతామన్నారు. అవిశ్వాసం తీర్మానంపై సభాపతి సాకులు చెప్తూ వాయిదాలు వేస్తున్నారని ఆరోపించారు. తెరాస ఎంపీల నిరసన అవిశ్వాస తీర్మానంపై చర్చకు అడ్డుకాదన్నారు. సభ ఆర్డర్‌లో లేకపోయినా ఆర్థిక బిల్లునే ఆమోదింపచేసిన సభాపతికి పోడియంపై నుంచి 50 తలలు లెక్కించడం పెద్ద కష్టమేమీ కాదన్నారు. తెదేపా ఎంపీలు అశోక్‌గజపతిరాజు, సుజనాచౌదరిలు పదే పదే అశాస్త్రీయం, తొందరపాటు అనే పదాలు ఉపయోగించడం తగదన్నారు. బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ.. 'భాజపావారికో కాంగ్రెస్ వారికో సీఎం కేసీఆర్‌ను ఆడించే సత్తా లేదు. కేసీఆర్ ఎవరినైనా ఆడిస్తారు' అని అన్నారు. మమ్మల్ని అడిగే కేంద్రంలో చేరారా.. తర్వాత విడిపోయారా అని ఏపీ తెదేపా ఎంపీలను ప్రశ్నించారు. అవిశ్వాసం ప్రవేశపెట్టే ముందే తెరాస అధినేత కేసీఆర్‌ను సంప్రదించి ఉండాల్సిందన్నారు. మేం నోటీసు ఇచ్చాం మీరు మద్దతివ్వాలంటే కుదురదు అని గౌడ్ అన్నారు. సీతారాం నాయక్, బాల్కసుమన్ మాట్లాడుతూ.. అన్ని రాష్ట్రాలకు ఒకేవిధంగా రిజర్వేషన్లు ఉండాలని డిమాండు చేశారు.

గ్రామీణ బ్యాంకుల బాధ్యత కేంద్రానిదే.. ఎంపీ వినోద్: దేశంలోనిగ్రామీణ బ్యాంకులను కాపాడాల్సిన బాధ్యత కేంద్రానిదేనని తెరాస ఎంపీ వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారమిక్కడ అఖిలభారత గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు వినోద్ సంఘీభావం ప్రకటించారు.

ప్రాగాటూల్స్ పునరుద్ధరణ లేదు: కేంద్రం

సికింద్రాబాద్ కవాడిగూడలోని ప్రాగాటూల్స్ లిమిటెడ్ పునరుద్ధరణకు ప్యాకేజీలు ఇచ్చే ఉద్దేశం లేదని కేంద్రం స్పష్టంచేసింది. మంగళవారం తెరాస ఎంపీ బూరనర్సయ్యగౌడ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి బాబుల్ సుప్రియో ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

పరిమితంగానే అప్పులు

- శాసనసభలో ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: "దేశ స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ)లో 49.5 శాతం విలువైన సొమ్మును కేంద్రం అప్పులుగా తీసుకుంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరో రూ.6.24 లక్షల కోట్లు తెస్తామని ఇటీవల కొత్త బడ్జెట్‌లో తెలిపింది. కానీ, తెలంగాణ రాష్ట్ర జీఎస్‌డీపీలో 21 శాతమే రుణాలు తీసుకున్నాం. కేంద్రం తెచ్చిన ఉదయ్ పథకం వల్ల విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల కోసం తీసుకున్న రూ.9 వేల అప్పులు కూడా ఇందులో ఉన్నాయి. అవి లేకపోతే జీఎస్‌డీపీలో రుణాల శాతం 19 దాటదు" అని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. బడ్జెట్‌పై శాసనసభలో మంగళవారం చర్చ సందర్భంగా ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ సమాధానమిస్తున్నప్పుడు సీఎం జోక్యం చేసుకుని ప్రభుత్వ అప్పులపై వివరణ ఇచ్చారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "వచ్చే ఏడాది కేంద్రం చెల్లించాల్సిన అప్పుల సొమ్ము రూ.8.76 లక్షల కోట్లుగా ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో చెప్పారు. అమెరికా మొత్తం జీడీపీ విలువ 14 ట్రిలియన్ డాలర్లు కాగా దానికన్నా ఎక్కువ అప్పులు ఆ దేశానికున్నాయి. జపాన్ జీడీపీకన్నా ఆ దేశానికి 250 శాతం అధికంగా అప్పులున్నాయి. అవి రెండూ బుద్ధి తక్కువ దేశాలా..? తెలంగాణ ఏర్పడకముందు పదేళ్ల కాలంలో ఉమ్మడి ఏపీ బడ్జెట్‌లో మూలధన వ్యయం రూ.1.19 లక్షల కోట్లు కాగా.. గత నాలుగేళ్లలో తెలంగాణ రాష్ట్రంలో ఈ వ్యయం రూ.1.17 లక్షల కోట్లుగా ఉంది. రాష్ట్రంలో ఏం జరుగుతుందో తెలుసుకోకుండా ద్వేషపూరితంగా మాట్లాడటం మంచిది కాదు. తెలంగాణలో అమలవుతున్న కార్యక్రమాలేమీ కనపడటం లేదా? ఇక్కడ అమలవుతున్నన్ని పేదల సంక్షేమ పథకాలు ఒక్క భాజపా పాలిత రాష్ట్రంలోనైనా ఉన్నాయా? ఇక్కడ ఉన్నన్ని పథకాలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి? ఇక్కడ మేం ఇస్తున్న 'కేసీఆర్ కిట్' మాదిరిగానే మధ్యప్రదేశ్‌లో సైతం ఇస్తామని అక్కడి ముఖ్యమంత్రి ఇప్పుడు ప్రకటించారు. తెలంగాణ ఆదాయంలో ఈ ఏడాది 22 శాతం వృద్ధి ఉంది. వచ్చే ఏడాది మరో 15 శాతం ఉంటుంది. ఈ పరిస్థితి ఏ రాష్ట్రంలోనైనా ఉందా? ఉద్యోగుల కోసం నిర్ణీత గడువులోగా వేతన సవరణ సంఘం(పీఆర్‌సీ) వేస్తాం. మధ్యంతర భృతి(ఐఆర్) కూడా ఇస్తాం. దీని కోసం బడ్జెట్‌లో నిధులు కూడా పెట్టాం. హైదరాబాద్‌లో రోడ్లు బాగా లేవన్నారు. అది ఒప్పుకొంటాం. వాటిని బాగుచేయడానికి మున్సిపల్ శాఖ పనిచేయాలి. అంతేకాని హద్దూపద్దూ లేని విమర్శలు చేయడం కొత్త రాష్ట్రానికి మంచిది కాదు. ఇసుక మాఫియా అంటున్నారు.. ఇప్పుడు ఇసుకపై వస్తున్న ఆదాయంలో కాంగ్రెస్ పాలనలో పది శాతమైనా వచ్చిందా? రైతులకు రూ.16 వేల కోట్ల రుణమాఫీ చేస్తే.. ఏం చేయలేదని అంటున్నారు. మాఫీ సరిగా అమలుకాలేదంటూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రైతుల వివరాలు శుద్ధ తప్పు అని తేలింది. 38 లక్షల మంది రైతులకు మాఫీ చేసినప్పుడు కొన్ని తప్పులు జరిగి ఉండొచ్చు. రైతులకు ఎక్కడైనా అన్యాయం జరిగిందని నిర్దుష్టంగా వివరాలిస్తే వాటిని పరిశీలిస్తాం. రూ.16 వేల కోట్లు ఇచ్చిన వాళ్లం.. మరో రూ.100 కోట్లు అవసరమైతే ఇవ్వకుండా ఉంటామా. ఇలా కొద్దిమందికి ఇవ్వకుండా మేం ఎందుకు చెడ్డపేరు తెచ్చుకుంటాం. ఆ రైతుల వివరాలిస్తే ఆర్థిక, వ్యవసాయ మంత్రులు 3, 4 రోజుల్లో చర్చించి పరిష్కరిస్తారు" అని చెప్పారు.

పంచాయతీరాజ్, తెలుగు బిల్లులకు ఈ సమావేశాల్లోనే ఆమోదం

- గవర్నర్‌కు సీఎం వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: కొత్త పంచాయతీరాజ్ చట్టం, విద్యాసంస్థల్లో తెలుగు బోధన తప్పనిసరి బిల్లులను ఈ శాసనసభా సమావేశాల్లోనే ఆమోదిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ గవర్నర్ నరసింహన్‌కు తెలిపారు. మంగళవారం రాజ్‌భవన్‌లో సీఎం గవర్నర్‌తో భేటీ అయ్యారు. కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని పక్కాగా రూపొందించేందుకు వీలుగా పలు అంశాలను అందులో చేరుస్తున్నామని సీఎం తెలిపారు. ముసాయిదా ఇప్పటికే సిద్ధమైందని.. ఒకటి, రెండు రోజుల్లో బిల్లు సభకు చేరుతుందని వెల్లడించారు. విద్యాసంస్థల్లో తెలుగు తప్పనిసరి బిల్లు సైతం సిద్ధమైందని, దానిని సభలో ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. అసెంబ్లీలోబడ్జెట్ సమావేశాల తొలిరోజు పరిణామాలు, వాటి పర్యవసానాలు, న్యాయస్థానంలో వాదనలు, ఇతర అంశాలను సీఎం గవర్నర్‌కు వివరించినట్లు తెలిసింది. భద్రాచలంలో జరిగే శ్రీరామనవమి ఉత్సవాలకు గవర్నర్‌ను సీఎం ఆహ్వానించారు. గవర్నర్‌తో భేటీ అనంతరం కొత్త పంచాయతీరాజ్ చట్టం, తెలుగు బోధన తప్పనిసరి బిల్లులపై సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌లో సమీక్ష నిర్వహించారు.


రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి కేసీఆర్

ఉస్మానియా, ఆంధ్రా వర్సిటీలకు పూర్తి స్వయం ప్రతిపత్తి

(మొదటి పేజీ తరువాయి)

ముస్లిం యూనివర్సిటీ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం; ది ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్(ఇఫ్లూ)కు పూర్తిస్థాయి స్వయంప్రతిపత్తి లభించింది. తెలంగాణలోని నల్సార్, ఉస్మానియా, కాకతీయ వర్సిటీలతోపాటు ఆంధ్రప్రదేశ్ నుంచి ఆంధ్రా, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయాలకు జాబితాలో స్థానం లభించింది. డీమ్డ్ టుబీ వర్సిటీల కేటగిరి-1లో ఏపీకి చెందిన రాష్ట్రీయ సాంస్కృతిక విద్యాపీఠ్(తిరుపతి), గీతం(విశాఖపట్నం) ఉన్నాయి. కేటగిరి-2లో హైదరాబాద్‌లోని ఇక్ఫాయ్‌కు హోదా లభించింది. ఇంజినీరింగ్ కళాశాలల్లో హైదరాబాద్‌లోని నారాయణమ్మ, పశ్చిమగోదావరిలోని శ్రీవాసవి, తూర్పుగోదావరిలోని బొన్నం వెంకట చలమయ్య ఇంజినీరింగ్ కళాశాలలకు స్వయం ప్రతిపత్తి హోదా దక్కింది. ఈ హోదా రావడం వల్ల వర్సిటీలు అవసరాలకు అనుగుణంగా సొంతంగా కొత్త కోర్సులు ప్రారంభించేందుకు, విదేశీ అధ్యాపకుల నియామకం చేపట్టేందుకు, విదేశీ విద్యార్థులను చేర్చుకునేందుకు, దూరవిద్య కోర్సుల(ఆన్‌లైన్ కూడా) నిర్వహణకు, విద్యాపరమైన ఒప్పందాల విషయంలో స్వేచ్ఛ లభించనుంది. విదేశీ విశ్వవిద్యాలయాలతో ఒప్పందాలకు వీలు కలుగుతుంది. కళాశాలలు సొంతంగా పరీక్షలు నిర్వహించవచ్చు.

మళ్లీ అదే చిత్రం

ఈనాడు, దిల్లీ: లోక్‌సభలో మళ్లీ అదే చిత్రం. స్పీకర్ ముందు తెదేపా, వైకాపాల అవిశ్వాస తీర్మానాలు. వెల్‌లో ఏఐఏడీఎంకె, తెరాస సభ్యుల ఆందోళన. సజావుగా లేదంటూ చర్చ లేకుండానే సభ వాయిదా. మరో రోజుకోసం తెదేపా, వైకాపాల అవిశ్వాస తీర్మానాల సమర్పణ. గత శుక్రవారం నుంచి లోక్‌సభలో కనిపిస్తున్న ఈ పరిస్థితి మంగళవారం కూడా పునరావృతమైంది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా అంశంపై తెదేపా, వైకాపా ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలు చర్చ దశకు రాకుండానే మురిగిపోయాయి. స్పీకర్ సుమిత్రా మహాజన్ వీటిని తిరస్కరించారు. తర్వాత- ఇరాక్‌లో ఐసిస్ ఉగ్రవాదుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయిన భారతీయుల విషాదాంతం గురించి సభలో ప్రకటన చేయడానికి విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్ సిద్ధంకావడం ఆందోళనకు దారితీసింది. అప్పటికే వెల్‌లో ఏఐఏడీఎంకె, తెరాస సభ్యులు ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ నిల్చొన్నారు. కాంగ్రెస్, వామపక్షాలు, ఎస్పీ, తృణమూల్, తెలుగుదేశం, వైకాపా సభ్యులు లేచి తొలుత అవిశ్వాసాన్ని చర్చకు తీసుకున్న తర్వాతే మిగతా అంశాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. స్పీకర్ మాత్రం సుష్మాస్వరాజ్ ప్రకటనకు అనుమతించారు. దాంతో ప్రతిపక్షాల సభ్యులు తమ ఆందోళనను మరింత ఉద్ధృతం చేశారు. మంత్రి తన ప్రకటనను పూర్తి చేయకుండానే కూర్చుండిపోయారు.

ఇలాంటి రాజకీయాలు ఆక్షేపణీయం

ప్రతిపక్షాల తీరుపై స్పీకర్ సుమిత్రా మహాజన్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. ఇది సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. 'మానవత్వాన్ని అంతగా మరిచిపోయారా? అసలు మీకు ఎలాంటి మనోభావనలు లేవా? ఇలాంటి రాజకీయాలు చేయొద్దు' అని కాంగ్రెస్ సభ్యుల బెంచీలవైపు చూస్తూ వ్యాఖ్యానించారు. 'ఇది చాలా ఆక్షేపణీయం, దారుణం, బాధాకరం. రాజకీయాల కారణంగా మనం ఇంత సంవేదనాహీనంగా తయారయ్యామా?' అని నిష్ఠూరమాడారు. ఇలాంటి ఆక్షేపణీయమైన పరిస్థితి ఎప్పుడూ చూసి ఉండబోమని పేర్కొంటూ అవిశ్వాస తీర్మాన నోటీసులను చదివి వినిపించారు. సభ సజావుగా లేనంతవరకూ తాను వాటికి మద్దతిచ్చేవారిని లెక్కించలేనని పేర్కొన్నారు. సభ సజావుగా లేని కారణంగా అవిశ్వాస నోటీసులను సభ ముందుంచలేకపోతున్నట్లు చెప్పి బుధవారానికి వాయిదావేశారు.

తంబిదురైకి నచ్చజెప్పేందుకు విఫలయత్నం

ఏఐఏడీఎంకె సభ్యుల ఆందోళన కారణంగా అవిశ్వాస తీర్మానాలు చర్చకు రాకపోవడంతో తెలుగుదేశం, కాంగ్రెస్, ఎన్‌సీపీ, టీఎంసీ సభ్యులు ఒకదశలో ఏఐఏడీఎంకె నాయకుడు తంబిదురై వద్దకు వెళ్లి కొద్దిసేపు సభ సజావుగా ఉండటానికి సహకరించేలా నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అప్పుడు ఏఐఏడీఎంకె సభ్యులంతా వారి స్థానాల్లోనే నిల్చొన్నారు. స్పీకర్ రావడం, వెల్‌లో ఎవరూ లేకపోవడాన్ని చూసి తంబిదురై సైగచేయడంతో ఆ పార్టీ సభ్యులంతా మూకుమ్మడి ఆందోళన మొదలుపెట్టారు. సుష్మాస్వరాజ్ లేచినప్పుడు ఏఐఏడీఎంకె, తెరాస సభ్యులు ఆమె మాట్లాడేందుకు అనువైన వాతావరణం కల్పించారు. అయితే వెల్‌లో అంతమంది సభ్యులుండగా సుష్మాస్వరాజ్ ప్రకటనెలా చేస్తారంటూ కాంగ్రెస్, వామపక్షాల సభ్యులు ప్రశ్నించడంతో గందరగోళం నెలకొంది.

చొరవ తీసుకోని ప్రభుత్వం... మిగతా రోజులూ ఇంతే!

సభలో అవిశ్వాసంపై చర్చకు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించినా చేతల్లో చిత్తశుద్ధిని చూపడం లేదని వివిధ రాజకీయ పార్టీలు వ్యాఖ్యానించాయి. సభను సజావుగా నడపాలనుకుంటే ఏఐఏడీఎంకె, తెరాస సభ్యులతో ప్రభుత్వ పెద్దలు సమాలోచనలు జరిపి, ఒప్పించేవారని పేర్కొన్నాయి. లేదంటే ఆందోళన చేస్తున్న వారిని సస్పెండ్ అయినా చేసి ఉండేవారని అభిప్రాయపడ్డాయి. ప్రభుత్వపరంగా, భాజపా నుంచి అలాంటి చొరవ ఇంతవరకూ కనిపించలేదని విపక్ష ఎంపీలు ఉదహరిస్తున్నారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఇలా చేయిస్తోందనీ, ఎన్నిరోజులు సభ సాగినా ఇదే పరిస్థితి పునరావృతమవుతుందని వ్యాఖ్యానించారు. చర్చ నుంచి ప్రభుత్వం పారిపోతోందని ఆరోపించారు. బ్యాంకుల్లో భారీ కుంభకోణాలు, ఏపీ ప్రత్యేక హోదా, కావేరీ జలాలపై పార్లమెంటులో చర్చ జరగాలని తాము కోరుకుంటున్నట్లు చెప్పారు.

కాల్‌సెంటర్ కొలువులకు కత్తెర!

(మొదటి పేజీ తరువాయి)

కాల్‌ను అమెరికాలోని సర్వీస్ ఏజెంట్‌కు బదిలీ చేయమని కోరే హక్కు కూడా వినియోగదారుకు లభిస్తుంది.

అమెరికన్ల ఉద్యోగాలకు రక్షణ

"అమెరికాలో పన్ను ప్రోత్సాహకాలను పొందుతున్న చాలా కంపెనీలు దేశంలోని తమ కాల్‌సెంటర్లను మూసివేసి వాటిని ఇతర దేశాలకు తరలించాయి. దీనివల్ల అమెరికన్లు ఉద్యోగాలు కోల్పోతున్నారు. అమెరికన్ల ఉద్యోగాలకు మనం భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది "అని బిల్లును ప్రవేశపెడుతున్న సమయంలో బ్రౌన్ పేర్కొన్నారు. కమ్యూనికేషన్స్ వర్కర్స్ ఆఫ్ అమెరికా సంస్థ అధ్యయనం ప్రకారం.. అమెరికా కంపెనీల కాల్ సెంటర్ల ఉద్యోగాలను పొందటంలో భారత్, ఫిలిప్పీన్స్ తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఈజిప్టు, సౌదీ అరేబియా, చైనా, మెక్సికో లాంటి దేశాల్లోనూ అమెరికా కంపెనీలు కాల్ సెంటర్లను ప్రారంభించాయని ఆ నివేదిక వెల్లడించింది. కాల్ సెంటర్ల వ్యాపారంలో భారత దేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉందని, ఏడాదికి రూ.1,87,600 కోట్ల ఆదాయం దీని ద్వారా పొందుతోందని అమెరికాకు చెందిన నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ అంచనా వేసింది.

హెచ్-1బి వీసాలకు వ్యతిరేకంగా ఉద్యమం

ఏప్రిల్ 1 నుంచి వర్క్ వీసాల దరఖాస్తులు ప్రారంభంకానున్న నేపథ్యంలో హెచ్-1బి వీసాల దుర్వినియోగాన్ని అడ్డుకోవాలంటూ ప్రోగ్రెసివ్స్ ఫర్ ఇమ్మిగ్రేషన్ రిఫామ్ అనే అమెరికా సంస్థ ప్రచారాన్ని చేపట్టింది. శాన్‌ఫ్రాన్సిస్కో మెట్రో రైల్వే స్టేషన్లలో ఆ మేరకు గోడ పత్రికలు వెలిశాయి. అమెరికన్లను ఉద్యోగాల నుంచి తొలగించి, వారి స్థానంలో చౌకగా లభించే విదేశీ నిపుణులను దేశానికి తీసుకొచ్చేందుకు హెచ్-1బి ప్రోగ్రామింగ్‌ను కంపెనీలు ఉపయోగించుకుంటున్నాయని ఆ సంస్థ ఆరోపించింది. కేవలం డిగ్రీ పూర్తయిన వారినే తీసుకొస్తున్నారనీ, వచ్చిన వారికీ ఉద్యోగభద్రత ఉండదంటూ ఈ నెల 15వ తేదీ నుంచి ప్రచారాన్ని ముమ్మరం చేసినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. అమెరికన్లనే ఉద్యోగాల్లోకి తీసుకోవాలని, ఆ మేరకు హెచ్1బి వీసా నిబంధనలను కఠినతరం చేయాలని ఆ సంస్థ డిమాండ్ చేస్తోంది.

గ్రీన్‌కార్డుల జారీలో జాప్యంపై నిరసనలు

శాశ్వత నివాస హోదా కల్పించే గ్రీన్ కార్డుల జారీలో జరుగుతున్న జాప్యానికి నిరసనగా భారతీయ వృత్తినిపుణులు అమెరికాలోని పలు ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. వందల మంది పాల్గొన్న ఈ ప్రదర్శనలు శాంతియుతంగా కొనసాగాయి. ఒక్కో దేశానికి ఏడాదికి ఏడు శాతం చొప్పున కోటా నిర్ణయించి ఆ మేరకే గ్రీన్‌కార్డులను లాటరీపద్ధతిలో జారీ చేయటం వల్ల అధిక సంఖ్యలో ఉన్న భారతీయ నిపుణులకు అన్యాయం జరుగుతోంది. ఈ నిబంధనల వల్ల ప్రస్తుతమున్న తమ నిరీక్షణ జాబితా పూర్తి కావటానికి 70ఏళ్ల సమయం పడుతుందని హెచ్-1బి వీసాలపై అమెరికాలో పనిచేస్తున్న భారతీయ నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. భారతీయ నిపుణుల ఉద్యమానికి అమెరికన్ చట్టసభల సభ్యుల నుంచీ మద్దతు లభిస్తోందని ఇటీవలే ఏర్పడిన భారతీయ-అమెరికన్ల సంస్థ 'జీసీరిఫామ్స్' పేర్కొంది. అమెరికా ఆర్థికాభివృద్ధికి శ్రమిస్తున్న 3లక్షల మంది భారతీయ వృత్తి నిపుణుల పట్ల వివక్ష చూపేలా ఉన్న ఈ కోటా విధానాన్ని రద్దు చేయాలని అమెరికాలోని అన్ని రాష్ట్రాలకు ఆందోళనను విస్తరింపజేయనున్నట్లు సంస్థ నిర్వాహకులు వెల్లడించారు. అర్కన్సాస్, కెంటుకీలోని ఫ్రాంక్‌ఫర్ట్, నెబ్రాస్కా, ఒరెగాన్‌లోని హిల్స్‌బొరో తదితర ప్రాంతాల్లో అమెరికన్లూ తమకు మద్దతుగా ప్రదర్శనల్లో మాట్లాడారని జీసీ రిఫామ్స్ వెల్లడించింది.

ఫేస్‌బుక్కయింది!

(మొదటి పేజీ తరువాయి)

కమిషనర్ ఎలిజబెత్ డెన్‌హామ్ వెల్లడించారు. కేంబ్రిడ్జ్ అనలిటికా రికార్డుల పరిశీలనకు సహకరించట్లేదని ఆమె తెలిపారు. సంస్థ సర్వర్లను జల్లెడపట్టేందుకు కోర్టు అనుమతి తీసుకుంటున్నామని స్పష్టంచేశారు. ఐరోపా సమాఖ్య (ఈయూ) పార్లమెంటు పౌర హక్కుల కమిటీ కూడా తమ ఎదుట ఫేస్‌బుక్ ప్రతినిధులు హాజరుకావాలని ఆదేశించింది. మరోవైపు ఓటర్లకు ఎరవేసేందుకు 5 కోట్ల మంది సమాచారాన్ని ఉపయోగించుకున్నామని అనలిటికాలో పనిచేసిన క్రిస్ వైలీ తెలిపారు. అసలు లీక్ ఎలా జరిగిందో తెలుసుకునేందుకు ఓ డిజిటల్ ఫోరెన్సిక్ సంస్థను ఫేస్‌బుక్ నియమించింది. సోమవారంనాటికి 6.8 శాతం మేర నాస్‌డాక్‌లో సంస్థ షేర్లు నష్టపోయాయి. మంగళవారం ఉదయమూ ఈ పతనం కొనసాగింది. ఫేస్‌బుక్ భద్రతా విభాగం అధిపతి అలెక్స్ స్టామోస్ సంస్థను వీడిపోతున్నట్లూ వార్తలు వచ్చాయి.

అమానుష కాండ

(మొదటి పేజీ తరువాయి)

ఆక్రమించారు. ఆ సందర్భంగా ఒక నిర్మాణ సంస్థలో పనిచేస్తున్న 40 మంది భారతీయ కార్మికులను, కొందరు బంగ్లాదేశ్ వాసులను బందీలుగా పట్టుకున్నారు. భారతీయ ఖైదీల్లో ఎక్కువ మంది పంజాబ్‌కు చెందినవారే ఉన్నారు. వీరిలో గురుదాస్‌పూర్‌కు చెందిన హర్జీత్ మాసిహ్.. ఉగ్రవాదుల నుంచి తప్పించుకోగలిగాడు. భారత్‌కు చెందిన మిగతా బందీలను ఐసిస్ ముఠా సభ్యులు దారుణంగా ఊచకోత కోయడాన్ని తాను చూశానని అతడు అప్పట్లో చెప్పాడు. అయితే ప్రభుత్వం ఆ వాదనను తిరస్కరించింది. "అవన్నీ కట్టు కథలే" అంటూ సుష్మ అప్పట్లో కొట్టిపడేశారు. నిర్దిష్ట ఆధారాలు లేకుండా.. బందీలు మరణించారని తాను ధ్రువీకరించబోనన్నారు.

తాజాగా సుష్మ రాజ్యసభలో ప్రకటన చేస్తూ.. అపహరణకు గురైన 39 మంది భారతీయులను ఐసిస్ ఉగ్రవాదులు చంపేశారని తెలిపారు. "నిర్దిష్ట ఆధారాలు లేకుండా వారు చనిపోయినట్లు తాను ప్రకటించబోనని లోగడ చెప్పా. ఇప్పుడు దీనిపై ఆధారాలు లభించాయి. భారమైన హృదయంతో ఈ ప్రకటన చేస్తున్నా" అని పేర్కొన్నారు.

భోజనం చేసి వస్తుంటే..

అపహరణకు దారితీసిన పరిస్థితులను వివరిస్తూ.. మోసుల్‌ను ఐసిస్ ఆక్రమించగానే చాలా మంది ఇరాకీలు ఆ నగరాన్ని వీడారని సుష్మ చెప్పారు. భారత్, బంగ్లాదేశ్ కార్మికులు మాత్రం అక్కడే ఉండిపోయారన్నారు. భోజనం తర్వాత తిరిగొస్తున్న సమయంలో వారు అపహరణకు గురైనట్లు ఆహారసరఫరా వ్యాపారి ఒకరు చెప్పినట్లు పేర్కొన్నారు. తొలుత వారందరినీ ఒక జౌళి కర్మాగారానికి తరలించారన్నారు. అక్కడ.. బంగ్లాదేశ్ కార్మికులను వేరు చేసి, ఎర్బిల్ నగరానికి పంపినట్లు పేర్కొన్నారు. "అలీ అనే వ్యక్తి నుంచి తనకు ఫోన్‌కాల్ వచ్చినట్లు ఆహార సరఫరాదారు చెప్పాడు. తాను బంగ్లాదేశ్ వాసినని, ఐసిస్ ఆదేశాల మేరకు తనను ఎర్బిల్ తరలించాలని సదరు సరఫరాదారుకు వివరించాడు" అని సుష్మ చెప్పారు. ఎర్బిల్ నుంచి మసీహ్ తనకూ ఫోన్ చేశాడని, అయితే అక్కడికి ఎలా చేరుకోగలిగాడో చెప్పలేదని ఆమె పేర్కొన్నారు. "బహుశా తన పేరు అలీ అని చెప్పడం ద్వారా అతడు.. బంగ్లాదేశ్ వాసులను ఎర్బిల్‌కు చేరవేయడానికి కేటరర్ ఏర్పాటు చేసిన వ్యాన్‌లో తప్పించుకొని ఉంటాడు. మరుసటి రోజు భారతీయ బందీలను లెక్కించినప్పుడు ఒకరు తగ్గినట్లు ఉగ్రవాదులు గుర్తించారు. ఆ తర్వాత వారిని బదోశ్‌లోని కారాగారానికి తరలించారు" అని తెలిపారు.

నేలమీదే పడుకున్న వీకే సింగ్

బందీల ఆచూకీ కోసం విదేశాంగ శాఖ సహాయ మంత్రి వి.కె.సింగ్ చేసిన కృషి అద్భుతమని సుష్మ ప్రశంసించారు. "గత జూన్‌లో మోసుల్‌కు ఐసిస్ కబ్జా నుంచి విముక్తి లభించాక, ఆయన ఇరాక్ వెళ్లారు. గల్లంతైన భారతీయుల కోసం గాలింపు మొదలుపెట్టారు. భారత రాయబారి, ఇరాక్‌కు చెందిన ఒక అధికారితో కలిసి.. బందీలు చివరిగా గడిపిన ప్రదేశమైన బదోశ్ కారాగారానికి వెళ్లారు. గాలింపు సమయంలో వారు ముగ్గురూ ఇక చిన్న ఇంట్లో నేల మీదే నిద్రించాల్సి వచ్చింది. స్థానికులను ఆరా తీసినప్పుడు సదరు సామూహిక ఖనన ప్రదేశం గురించి వెలుగులోకి వచ్చింది. ఇరాకీ అధికారులతో కలిసి అక్కడ శోధించారు. నేలలో లోతుగా చొచ్చుకెళ్లి, గాలింపు జరిపే రాడార్‌ను ఉపయోగించి, ఒక దిబ్బ కింద మృతదేహాలు ఉన్నట్లు గుర్తించారు. ఇరాక్ అధికారుల సాయంతో వాటిని వెలికి తీశారు" అని వివరించారు.

మృతదేహాలకు పొడవైన జుట్టు, చేతి కడియాలు, ఇరాక్‌కు సంబంధంలేని బూట్లు, గుర్తింపు కార్డులు ఉన్నాయని సుష్మ చెప్పారు. "మృతుల అవశేషాలను బాగ్దాద్ పంపి, డీఎన్ఏ పరీక్షలు నిర్వహించారు. గుర్తింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసేందుకు బాగ్దాద్‌కు చెందిన 'మార్టియర్స్ ఫౌండేషన్' సేవలనూ వినియోగించుకున్నాం. 38 మంది భారతీయుల డీఎన్ఏ.. మృతదేహాల అవశేషాలతో సరిపోలాయి. రాజు యాదవ్ అనే బాధితుడికి సంబంధించి 70 శాతం మేర మాత్రమే సరిపోలింది. అతడి తల్లిదండ్రులు జీవించి లేకపోవడం వల్ల బంధువుల డీఎన్ఏను ఉపయోగించాల్సి రావడమే ఇందుకు కారణం" అని పేర్కొన్నారు.

ప్రత్యేక విమానంలో..

భారతీయుల మృతదేహాలను స్వదేశానికి తీసుకురావడానికి మంత్రి వి.కె.సింగ్ ఇరాక్ వెళతారని సుష్మ చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక విమానాన్ని పంపుతున్నట్లు తెలిపారు. మృతుల్లో 27 మంది పంజాబ్‌వాసులు కాగా, హిమాచల్‌కు చెందిన నలుగురు, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇద్దరు, బిహార్‌కు చెందిన ఆరుగురు ఉన్నారు.

బందీలు ఊచకోత విషాదకరమని రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. మృతులకు సంతాపంగా సభ్యులంతా నిలబడి మౌనం పాటించారు. బందీల కుటుంబాలను ఆశల్లో ఉంచుతూ, తప్పుదోవ పట్టించిందని ప్రభుత్వంపై కాంగ్రెస్ మండిపడింది. "భారతీయులు సజీవంగా ఉన్నారని ప్రభుత్వం గత ఏడాది భరోసా ఇచ్చింది" అని రాజ్యసభలో విపక్ష నేత గులాం నబీ ఆజాద్ వ్యాఖ్యానించారు. బందీల హత్యోదంతంపై లోక్‌సభలోనూ ప్రకటన చేయడానికి సుష్మ ప్రయత్నించగా.. పలు అంశాలపై విపక్ష పార్టీలు చేస్తున్న ఆందోళన కారణంగా అది సాధ్యపడలేదు.

బాధిత కుటుంబాలకు తోడుగా: ప్రధాని

ఇరాక్‌లో హత్యకు గురైన 39 మంది భారతీయుల కుటుంబాలకు భారత్ మొత్తం సంఘీభావంగా నిలుస్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. విదేశాల్లోని భారతీయుల భద్రతకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. ''మోసుల్‌లో ఆత్మీయులను కోల్పోయినవారందరి బంధువుల కోసం భారతీయులందరూ దుఃఖిస్తున్నారు. బందీల ఆచూకీ తెలుసుకోవడానికి భారత విదేశాంగ శాఖ, నా మంత్రివర్గ సహచరులు సుష్మ, వి.కె.సింగ్‌లు శక్తివంచన లేకుండా కృషి చేశారు'' అని ట్విటర్‌లో పేర్కొన్నారు.

తెలుగు వెలగాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

భావించామనీ, అయితే ఇంటర్ అన్ని విద్యాసంస్థల్లో ఒకే మాదిరిగా లేకపోవడం వల్ల అమలు చేయడం కాస్త ఇబ్బందిగా మారుతుందని కేసీఆర్ తెలిపారు. తమిళనాడు, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో మాతృభాష బోధన అమలును పరిశీలించిన తర్వాత మొదటి దశలో పదో తరగతి వరకు తెలంగాణలో తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా బోధించాలని నిర్ణయించామన్నారు.

పాఠ్య ప్రణాళిక బాధ్యత తెలుగు వర్సిటీ, సాహిత్య అకాడమీలకు..

తరగతుల వారీగా తెలుగు పాఠ్య ప్రణాళికను రూపొందించాల్సిందిగా తెలుగు విశ్వవిద్యాలయం, సాహిత్య అకాడమీలను ముఖ్యమంత్రి కేసీఆర్ కోరారు. భాషను కాపాడుకోవడంతోపాటు మాతృభాష ద్వారా జీవితంలో ఉపయోగపడే విషయాలను విద్యార్థులకు బోధించాలని చెప్పారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, దేశభక్తిని పెంచే అంశాలు ఉండాలని వివరించారు. తెలుగు చదివే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉండేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో కూడా తప్పనిసరిగా ఒక తెలుగు పండిట్ ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను సీఎం ఆదేశించారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు కేటీఆర్, జూపల్లి కృష్ణారావు, పద్మారావు, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్య, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్, సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎస్వీ సత్యనారాయణ, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి నర్సింగ్‌రావు, సాహిత్య అకాడమీ కార్యదర్శి ఏనుగు నర్సింహారెడ్డి, ఎస్‌సీఈఆర్‌టీలో తెలుగు పాఠ్య పుస్తకాల సమన్వయకర్త సువర్ణ వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తరగతి నుంచి మొదలు..

తెలుగు తప్పనిసరి సబ్జెక్టు ప్రక్రియ దశలవారీగా అమలు కానుంది. వచ్చే విద్యా సంవత్సరంలో మొదట ఒకటో తరగతితో ప్రారంభమవుతుంది. కన్నడ, తమిళం, మరాఠీ తదితర పాఠశాలల్లోనూ మొదటి తరగతి చదివే వారికి తెలుగు సబ్జెక్టు ఉంటుంది. సీబీఎస్ఈ వంటి ఇతర బోర్డుల బడుల్లోనూ ఒకటో తరగతి నుంచే తెలుగు మొదలవుతుందని అధికారులు చెబుతున్నారు. ఎంసెట్‌లో ర్యాంకింగ్‌కు ఇంటర్ మార్కులకు వెయిటేజీ ఉండటం, ఎంతోమంది తెలుగేతర విద్యార్థులు హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతుండటం, ఇప్పటికే సంస్కృతం, హిందీ అధ్యాపకుల ఆందోళనలు వంటి పలు అంశాలను దృష్టిలో పెట్టుకొని మొదటి దశలో 10వ తరగతి వరకు మాత్రమేనని ప్రభుత్వం ప్రకటించింది. దశల వారీగా అమలు చేస్తామనడం వల్ల ఇంటర్‌లో అమలు ఉండకపోవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

గ్రహం అనుగ్రహం

21-3-2018 బుధవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
వసంత రుతువు; చైత్ర మాసం; శుక్ల పక్షం
చవితి: మ. 3-48 తదుపరి పంచమి
భరణి నక్షత్రం: రా. 7-26 తదుపరి కృత్తిక
అమృత ఘడియలు: మ. 2-45 నుంచి 4-18 వరకు
వర్జ్యం: ఉ.శే. 6-58 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-44 నుంచి 12-31 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.6-08; సూర్యాస్తమయం: సా.6-07

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కర్నూలు	39.2	24.4
ఆదిలాబాద్	38.8	16.7
హన్మకొండ	38.5	19.5
కరీంనగర్	38.0	23.0
మెదక్	37.9	18.1
మహబూబ్‌నగర్	37.4	23.0
హైదరాబాద్	36.9	22.3
రామగుండం	36.8	21.1
నిజామాబాద్	36.0	22.0
సూర్యాపేట	35.5	26.0
ఖమ్మం	35.0	21.0

పోలవరంపై వక్రీకరిస్తారా..!?

ఈనాడు, అమరావతి: "పోలవరం ప్రాజెక్టు పునరావాసం, భూసేకరణ వ్యయాన్ని రాష్ట్రమే భరిస్తుందని నేను చెప్పానా? ఎప్పుడు చెప్పాను? ఎక్కడ చెప్పాను? కేంద్రానికి లేని ఆలోచన కలిగేలా మాట్లాడటం ఎంత దుర్మార్గం. నేనేదో ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు లాలూచీ పడినట్లు అపవాదు వేస్తారా? మీకు కల వచ్చిందా(పవన్‌కల్యాణ్‌ను ఉద్దేశించి)? కలవచ్చినా ఇలాంటి చెడు కలలు రాకూడదు" అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇలాంటి సున్నితమైన విషయాలపై ఎవరికి వారు ఇష్టానుసారంగా మాట్లాడితే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని వ్యాఖ్యానించారు. నిన్న ఒకాయన(పవన్‌కల్యాణ్‌నుద్దేశించి) పోలవరంపై వక్రీకరించి మాట్లాడారని, ఇదెక్కడి చోద్యమని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో మంగళవారం మధ్యాహ్నం చంద్రబాబు ప్రసంగించారు. "పోలవరం ప్రాజెక్టు భూసేకరణ, పునరావాసం వ్యయాన్ని పూర్తిగా కేంద్రమే భరిస్తుందని నాటి యూపీఏ ప్రభుత్వమే చెప్పింది. భూసేకరణ, పునరావాసానికి రూ.33 వేల కోట్లు అవసరమవుతుంది. ప్రాజెక్టును నేను అధికారంలోకి రాకముందే కాంట్రాక్టరుకు అప్పగించారు. ఆ సంస్థ పనులు చేయలేకపోతే.. కేంద్ర మంత్రే ముందుకొచ్చి నవయుగ కంపెనీకి పనులివ్వాలని సూచిస్తే.. పాతధరలకే వారికి పనులు అప్పగించి చేయిస్తున్నాం. ప్రాజెక్టును వెంటనే కేంద్రానికి అప్పగించేందుకు సిద్ధమని ఏడాది కిందటే శాసనసభలో ప్రకటించాను." అని వ్యాఖ్యానించారు.

ప్రత్యేక హోదా మా హక్కు

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వరని చంద్రబాబు ప్రశ్నించారు. "అది మా హక్కు. ప్రత్యేక హోదా ఇచ్చిన రాష్ట్రాలకు వేరేగా పారిశ్రామిక రాయితీలు ఇచ్చారు. వారికిచ్చినప్పుడు మనకెందుకు ఇవ్వరు? అప్పటి ప్రధాని అయిదేళ్లపాటు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటిస్తే.. అరుణ్‌జైట్లీ, వెంకయ్యనాయుడు పదేళ్లు కావాలన్నారు. దీనికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత మీపైన (భాజపాను ఉద్దేశించి) లేదా?" అని ప్రశ్నించారు. 'ఆంధ్రప్రదేశ్ హక్కుల గురించి నేను అడుగుతుంటే నాపైన బాణాలు ఎక్కుపెడతారా? ఒక్కొక్కరిని పంపించి నాపైన దాడి చేయిస్తారా? కేంద్రానికి, రాష్ట్రమంటే పడదా? ఒకాయన(పవన్‌కల్యాణ్) ఇష్టప్రకారం మాట్లాడతారు. వారిద్దరు(పవన్, జగన్‌లను ఉద్దేశించి) నన్నే తిడతారు. స్నేహపూర్వకంగా కలిసి పోటీ చేసినందుకు భాజపా వాళ్లూ నన్నే తిడుతున్నారు" అన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ చెబుతున్నవన్నీ పచ్చి అబద్ధాలని చంద్రబాబు ధ్వజమెత్తారు. "ప్రధాని మోదీతో నాకు విరోధమున్నట్టుగా అంటున్నారు. నాకు, మోదీకి విరోధం ఏముంది? మోదీ చెప్పారా మీతో" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. భాజపా, వైకాపా, జనసేన పార్టీల స్క్రిప్ట్ ఒకటేనని, అవన్నీ ఒకేచోట తయారవుతున్నాయని ధ్వజమెత్తారు.

పార్టీ ఎంపీలతో జరిగిన టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి సంబంధించి అన్ని పార్టీల నేతలతోను తాను మాట్లాడతానని, మద్దతివ్వాల్సిందిగా కోరతానని తెలిపారు. "భాజపా, జనసేన, వైకాపాలు తెదేపాపై బురదజల్లడమే ఏకైక అజెండాగా పెట్టుకున్నాయి. తెదేపాకి చెడ్డపేరు తేవాలని చూస్తున్నాయి" అని పేర్కొన్నారు. 'సభకు ఎవరూ గైర్హాజరు కావొద్దు. వెల్‌లోకి వెళ్లొద్దు. మీ స్థానాల్లో లేచి నిలబడండి. సభ వాయిదా పడితేనే వెల్‌లోకి వెళ్లండి. ఏ పార్టీల సభ్యులు వెల్‌లోకి వెళ్లి అవిశ్వాసంపై చర్చ రాకుండా చూస్తున్నారో ప్రజలకు తెలుసు." అన్నారు.

ఉద్యోగాలపై ఆన్‌లైన్‌లో వివరాలు

ఆంధ్రప్రదేశ్‌లో గత నాలుగేళ్లలో ఎంతమందికి ఉద్యోగాలు కల్పించామో వారి పేర్లతో సహా వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. గత నాలుగేళ్లలో 14 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. "పెట్టుబడులు, పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ కల్పన" అంశంపై ఆంధ్రప్రదేశ్ శాసనసభలో మంగళవారం లఘుచర్చ జరిగింది. అన్ని జిల్లాలకు పెట్టుబడులు వచ్చేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చంద్రబాబు అన్నారు. ఒక్క పైసా అవినీతికి ఆస్కారమివ్వం.. అన్న అంశాన్ని కియా మోటార్స్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందంలోనే పొందుపరిచామని వ్యాఖ్యానించారు. "పరిశ్రమలు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, మైనింగ్, పర్యాటకం ఇలా విభిన్న రంగాలకు పెట్టుబడులు రాబడుతున్నాం. భాగస్వామ్య సదస్సుల్లో 2536 ఒప్పందాలు కుదుర్చుకున్నాం. వాటిద్వారా రూ.18.55 లక్షల కోట్లు పెట్టుబడులు వస్తాయి. మొత్తం 44 లక్షల ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి." అని బాబు వివరించారు.



అహర్నిశలు శ్రమించే ముఖ్యమంత్రికే రేటింగ్ ఇస్తారా?

- **పవన్‌పై లోకేష్ మండిపాటు**

ముఖ్యమంత్రి చంద్రబాబు పనితీరుకు రెండున్నర మార్కులు వేస్తానంటూ జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మండిపడ్డారు. "రాష్ట్రం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రికి. . నాలుగేళ్లుగా ఎక్కడా కనిపించని వాళ్లంతా ఇప్పుడొచ్చి మార్కులేస్తాం, ర్యాంకులిస్తామంటారా?" అంటూ ఆగ్రహం చెందారు. తనపై గాలివాటంగా ఆరోపణలు చేస్తే కుదరదని, ఆధారాలుంటే నిరూపించాలని సవాల్ విసిరారు. "ఎవరో దుమ్ము వేస్తే నేను తుడుచుకోవాలా? తాత ఎన్టీఆర్‌కి నేను చెడ్డపేరు తెస్తున్నానంటారా? అధికారం మాకు కొత్త కాదు. నేను పుట్టేటప్పటికే తాత ముఖ్యమంత్రిగా ఉన్నారు" అని లోకేష్ ధ్వజమెత్తారు. ఆయన మంగళవారం శాసనసభ లాబీల్లో తనను కలిసిన విలేఖరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "రాష్ట్రం కోసం అహర్నిశలు కష్టపడుతున్న వ్యక్తికి ఇన్ని మార్కులు ఇస్తాననడం ఎంతవరకు న్యాయం. రాజధాని లేని రాష్ట్రానికి ఆయన రాజధానిని ఏర్పాటు చేశారు. ఎన్నో పరిశ్రమలు తెచ్చారు. అలాంటి వ్యక్తికి రేటింగ్‌లు ఇస్తామంటే చాలా బాధ కలిగింది." అన్నారు. "మేం ఎవరితోనూ లాలూచీ పడటం లేదు. నాపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసిన ఆయనే, వాటిపై నిలబడలేదు. ఒక టీవీ ఇంటర్వ్యూలో ఎవరో అనుకుంటున్న విషయాలు చెప్పానంటూ వెనక్కు తగ్గారు. మీరు చేసిన ఆరోపణకు ఆధారంగా మీ దగ్గర ఒక ఫోన్ రికార్డుగానీ, ఫొటో గానీ ఉందా?" అని పవన్ వ్యాఖ్యలపై లోకేష్ మండిపడ్డారు. ప్రణాళికా సంఘం సభ్యుడు పెద్దిరామారావు తనతో కలసి ఉన్న ఫొటోని సామాజిక మాధ్యమాల్లో పెట్టి, ఆయనే శేఖర్‌రెడ్డి అని ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రత్యేక హోదాయే జనసేన డిమాండ్

- దాంతో పాటు చట్టంలో చెప్పినవన్నీ ఇవ్వాలి
- జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రకటన

ఈనాడు-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని జనసేన డిమాండ్ చేస్తోందని.. దీంతో పాటు ఆర్థికపరమైన అన్ని నిధులూ ఇవ్వాలని, చట్టంలో పేర్కొన్న ప్రతీ విషయాన్ని అమలు చేయాలని అడుగుతోందని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. ఆయన మంగళవారం ఈ మేరకు ట్వీట్ చేయడంతో పాటు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక హోదా సాధనకు సంబంధించి కీలకంగా, సున్నితంగా ఉన్న ఈ తరుణంలో మాటలను, అభిప్రాయాలను ఎవరూ వక్రీకరించవద్దని విన్నవించారు. రాష్ట్రానికి నిధులు ఇస్తే సరిపోతుందని తాను ఎన్నడూ చెప్పలేదని, సోమవారం ప్రసారమైన తన ఇంటర్వ్యూలో ప్రత్యేక హోదాపై తాను చెప్పిన అభిప్రాయాలను కొన్ని పత్రికలు, ప్రసార మాధ్యమాలు వక్రీకరించాయని పేర్కొన్నారు. విభజన చట్టంలో చెప్పిన ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వాల్సిన నిధులతో పాటు అదనపు ఆర్థిక సాయమూ అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌కు ఏది అవసరమో, ఏవి ఇస్తామని మాట ఇచ్చారో అవి కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జనసేన అభిప్రాయాలను ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఇప్పటికే అర్థం చేసుకున్నారని అభిప్రాయపడ్డారు.

ఆర్జిత సెలవులివ్వాలని జాక్టో ఆందోళన

ఈనాడు, హైదరాబాద్: రెండేళ్ల క్రితం వేసవి సెలవుల్లో మధ్యాహ్న భోజన విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు గౌరవ వేతనం కాకుండా దామాషా పద్ధతిలో ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి(జాక్టో) ఆందోళన చేపట్టింది. మంగళవారం తెలంగాణ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద సమితి నేతలు ఆందోళన నిర్వహించారు. ఈ విషయంలో జీఓ 114ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేతలు భుజంగరావు, రఘునందన్, అంజిరెడ్డి, చంద్రమోహన్, అబ్దుల్లా, చెన్నయ్య, సదానంద్‌గౌడ్, వేణుగోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

23న నిరసన ప్రదర్శనలు: 'ఉపాధ్యాయులకు మంజూరు చేసిన అగౌరవ వేతనాన్ని రద్దు చేసి నిబంధనల ప్రకారం 24 రోజుల సంపాదిత సెలవులు జమ చేయాలని' కోరుతూ ఈనెల 23న జిల్లా, డివిజన్ కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) తెలిపింది.

మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో విశాఖ, ఖమ్మం

ఈనాడు, దిల్లీ: దేశంలో 85% మావోయిస్టు కార్యకలాపాలు కేవలం 35 జిల్లాల్లోనే జరుగుతున్నాయని, వాటిలో తెలుగు రాష్ట్రాల్లోని విశాఖపట్నం, ఖమ్మం జిల్లాలు ఉన్నాయని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ జి.ఆహిర్ తెలిపారు. మంగళవారం లోక్‌సభలో ఓ లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. గతేడాది దేశవ్యాప్తంగా 804 ఘటనలు జరగ్గా అందులో విశాఖజిల్లాలో 21 నమోదైనట్లు వివరించారు. ఖమ్మం జిల్లాలో ఎలాంటి హింసాత్మక ఘటనా నమోదు కాలేదని వెల్లడించారు. సుకమా, గడ్చిరోలి జిల్లాలు తొలి రెండుస్థానాల్లో ఉన్నట్లు తెలిపారు. 2012-14తో పోలిస్తే 2015-17 మధ్య కాలంలో వామపక్ష తీవ్రవాద కేడర్ నిర్మూలన 88.6%, లొంగుబాట్లు 92.2%మేర పెరిగినట్లు వెల్లడించారు. తీవ్రవాద ప్రభావం అధికంగా ఉన్న 35 జిల్లాల్లోనూ 20 జిల్లాల్లోనే 80% ఘటనలు జరిగినట్లు వివరించారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాల్లో మినీ థియేటర్లు!

- **హైటెక్స్ తరహాలో నిర్మాణాలు**
- **వచ్చే వారంలో టెండర్లు**

ఈనాడు, హైదరాబాద్: ఖాళీగా ఉన్న సంస్థ స్థలాల్లో మినీ థియేటర్ల నిర్మాణాలకు మళ్లీ టెండర్లు పిలవాలని తెలంగాణ ఆర్టీసీ నిర్ణయించింది. డిపోలు, బస్టాండ్లలోని ఖాళీ స్థలాలను లీజు ప్రాతిపదికన థియేటర్ల నిర్మాణానికి కేటాయించాలని నిర్ణయం తీసుకుంది. తొలిదశలో టెండర్లకు అర్హులు లభించకపోవటంతో కొద్దికాలం ఆ అంశాన్ని ఆర్టీసీ పక్కనపెట్టింది. తాజాగా మళ్లీ ఆ ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చింది. తొలిదశలో హైదరాబాద్, కరీంనగర్ జోన్ల పరిధిలోని 23 ప్రాంతాలను గుర్తించింది. మినీ థియేటర్లను అత్యాధునిక సాంకేతికతతో నిర్మించాలని ప్రతిపాదించారు. హైటెక్స్‌లోని సమావేశ మందిరాల తరహాలో అవసరాన్ని బట్టి మార్పులు చేర్పులు చేసుకునేందుకు వీలుగా వాటిని నిర్మించేందుకు గుత్తేదారుల నుంచి ఆసక్తి వ్యక్తమవుతోందని ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'తో చెప్పారు. హైదరాబాద్ ఆర్టీసీ జోన్ పరిధిలో 9, కరీంనగర్ జోన్‌లో 14 స్థలాలను గుర్తించారు. తొలిదశతో పోలిస్తే తాజాగా పిలిచే టెండర్లలో స్థలాల సంఖ్య పెరిగినట్లు సమాచారం. ఆయా స్థలాలను పదేళ్లపాటు లీజుకు ఇవ్వనున్నారు. మినీ థియేటర్లతో పాటు ఫుడ్‌కోర్టులనూ అనుమతించనున్నారు. ఒక్కో మినీ థియేటర్‌లో గరిష్ఠంగా 199 సీట్లను అనుమతిస్తారు. సినిమా విడుదలైన తొలివారం తరవాత డిమాండు తగ్గుముఖం పట్టిన సందర్భాల్లో సీట్ల సంఖ్యను తగ్గించుకుని ఆ స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగించుకునేందుకు అవకాశముంటుంది. హైటెక్స్‌లోని సమావేశ మందిరాల సైజును, సీట్లను అవసరాలకు తగినట్లు మార్చుకునేందుకు వీలుగా ఆధునిక సాంకేతికతతో నిర్మించారు. అదే తరహాలో ఈ వీటినీ నిర్మించాలన్నది ప్రతిపాదన. లీజు గడువు తీరాక వాటిని తొలగించటమూ సులువుగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

త్వరలో ఉత్తర్వులు: రాష్ట్రంలో మినీ థియేటర్ల విధానాన్ని అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన కసరత్తును పూర్తి చేసినట్లు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. టెండర్ల ప్రక్రియ పూర్తయ్యేలోగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు మినీథియేటర్ల విధానం లేదు. తొలిసారిగా ఆ విధానాన్ని తీసుకురానున్నారు.

ఆదాయం పెంచుకునేందుకే

ఇతర మార్గాల ద్వారా ఆదాయాన్ని రాబట్టుకునేందుకు మినీ థియేటర్ల విధానాన్ని తీసుకొస్తున్నాం. ఉన్న ఆస్తులను వృథాగా ఉంచే కన్నా వాటిని సద్వినియోగం చేసుకోవటం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నది ఆలోచన. ప్రస్తుతం గుర్తించిన ప్రాంతాల్లో 1000 నుంచి 1200 చదరపు గజాల స్థలాలను టెండర్ల ద్వారా ఇవ్వనున్నాం.

– జీవీ రమణారావు, ఆర్టీసీ ఎండీ

నిర్ణీతకాల ఉద్యోగాల సదుపాయం అన్ని రంగాలకు విస్తరణ: కార్మిక శాఖ

దిల్లీ: సరళతర వ్యాపారాల నిర్వహణకు మరింత వెసులుబాటు కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం నిర్ణీత కాలవ్యవధి ఉద్యోగాల (ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్)పై కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకూ ఈ తరహా ఉద్యోగాలు దుస్తుల తయారీ రంగానికే పరిమితమై ఉండేవి. తాజా నిర్ణయం ప్రకారం అన్ని రంగాల్లోనూ మానవ వనరులను అవసరమైన కాలానికి పనికి కుదుర్చుకోచ్చు. ఈ మేరకు ఇండస్ట్రియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (స్టాండింగ్ ఆర్డర్)కు సవరణ చేస్తూ కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటనను వెలువరించింది. నిర్ణీత కాలవ్యవధి ఉద్యోగాలను అన్ని రంగాలకు విస్తరిస్తామని గత నెల బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వెల్లడించిన విషయం తెలిసిందే. నిర్ణీత కాలవ్యవధి ఉద్యోగాలంటే...ఆ ఉద్యోగం ఎంత కాలం పాటు కొనసాగుతుందో ముందే నిర్ణయమై ఉంటుంది. ఆ సమయం ముగిసిన తర్వాత తాఖీదులతో పనిలేకుండానే ఉద్యోగ కాలం ముగుస్తుంది. ఉద్యోగ కాలంలో సేవా నిబంధనలు, పని గంటలు జీత భత్యాల చెల్లింపులు కార్మిక చట్టాలకు లోబడి శాశ్వత ఉద్యోగులతో సమానంగా చెల్లిస్తారు.

కేసీఆర్‌తో థర్డ్‌ఫ్రంట్ సాధ్యపడదు: కోదండరాం

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కేసీఆర్‌తో థర్డ్‌ఫ్రంట్ ఏర్పాటు సాధ్యపడదని తెలంగాణ రాజకీయ ఐకాస ఛైర్మన్ కోదండరాం అన్నారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతు సదస్సు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఇదివరకు ఎన్టీఆర్, చంద్రబాబు తదితరులు థర్డ్‌ఫ్రంట్ కోసం ప్రయత్నించి విఫలమయ్యారని పేర్కొన్నారు. థర్డ్‌ఫ్రంట్ ఏర్పాటు మంచిదే అయినా అది ఎట్టి పరిస్థితుల్లో సాధ్యం కాదని తెలిపారు. తాము 500 గ్రామాల్లో తిరిగి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నామని, ఏ ఒక్కరూ సంతోషంగా ఉన్నట్లు చెప్పలేదన్నారు. రైతుల పక్షాన నిలబడి ఐకాస పోరాటం చేస్తుందని చెప్పారు.

అర్బన్ వసతి గృహంపై వివరాలు కోరిన రాష్ట్ర విద్యాశాఖ

కరీంనగర్ విద్యావిభాగం, న్యూస్‌టుడే : కరీంనగర్‌లో ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అర్బన్ రెసిడెన్షియల్ వసతి గృహానికి అధికారులు ఇష్టారాజ్యంగా నిధుల మంజూరు చేస్తూ పక్కదారి పట్టించిన విషయాలపై రాష్ట్ర విద్యాశాఖ ఆడిట్ నివేదికల్లో గుర్తించినా.. దానికి సంబంధించి రాష్ట్ర అధికారులు కోరిన వివరాలను పంపించడంలో జాప్యమే నెలకొంటోంది. తోచిన రీతిలో బిల్లులు పెట్టడం, వాటికి అధికారులు మంజూరు ఇవ్వడం, రికార్డుల నిర్వహణలో లోపాలు వంటి అక్రమాలను రాష్ట్ర విద్యాశాఖ చేయించిన ఆడిట్ నివేదికలో వెల్లడించి గత నెలలో దానికి సంబంధించిన పలు అంశాలపై జిల్లా విద్యాశాఖ నుంచి రిమార్కులను కోరారు. ఈ విషయాలపై గత నెల 23న 'ఈనాడు-కరీంనగర్'లో 'స్వచ్ఛంద'స్వాహా! పేరుతో కథనాన్ని ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా పాలనాధికారి వెంటనే రిమార్కులతో నివేదిక సమర్పించాలని కోరారు.


శ్రీశైలంలో మరింత దిగువకూ వినియోగం!

- ఏప్రిల్ వరకు సాగర్‌లో 515 అడుగుల మట్టం ఉంచాలి
- కనీస మట్టాల దిగువ నీటిని గత వాటాల మేరకే వాడుకోవాలి
- తెలంగాణ, ఏపీ ఇంజినీర్లు, కృష్ణా బోర్డు చర్చల్లో నిర్ణయం

ఈనాడు – హైదరాబాద్

శ్రీశైలం జలాశయంలో 800 అడుగుల మట్టం వరకు నీటిని వినియోగించుకోవచ్చని గతంలో పేర్కొన్న కృష్ణా బోర్డు.. ఇంకా దిగువకూ తీసుకోవచ్చని తాజాగా నిర్ణయించినట్లు తెలిసింది. నాగార్జునసాగర్‌లో మాత్రం ఏప్రిల్ వరకు 515 అడుగుల నీటిమట్టం ఉండాలని నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కనీస నీటిమట్టాల దిగువన ఉన్న నీటిని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య గతంలో నిర్ణయించిన వాటాల మేరకే వాడుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. కనీస నీటిమట్టాల దిగువన 33 టీఎంసీలు అందుబాటులో ఉంటాయని అంచనాకు వచ్చినట్లు సమాచారం. దీనిపై మంగళవారం రాత్రి పొద్దుపోయేదాకా రెండు రాష్ట్రాల ఇంజినీర్లు, బోర్డు అధికారుల మధ్య తీవ్రస్థాయిలో చర్చలు జరిగాయి. వాటాలకు సంబంధించి బోర్డు నుంచి అధికారిక ఆదేశాలు వెలువడాల్సి ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు మురళీధర్, వెంకటేశ్వరరావు, బోర్డు సభ్యకార్యదర్శి పరమేశంలతో కూడిన త్రిసభ్య కమిటీ మంగళవారం సమావేశమై నీటి వినియోగం, రిజర్వాయర్లలో నీటిమట్టం నిర్వహణ తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ఉదయం త్రిసభ్య కమిటీ సమావేశం జరగ్గా.. సాయంత్రం రెండు రాష్ట్రాల ఇంజినీర్లు, బోర్డు అధికారులు కలిసి నీటి వినియోగానికి సంబంధించిన లెక్కలు, ఉన్ననీటిలో ఎవరికి ఎంత అన్నదానిపై సుదీర్ఘంగా చర్చించారు. శ్రీశైలంలో 800 అడుగులు, నాగార్జునసాగర్‌లో 500 అడుగుల మట్టం వరకు నీటిని వినియోగించుకోవాలని గతంలో బోర్డు నిర్ణయించగా.. మే వరకు సాగర్‌లో కనీస నీటిమట్టం నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ వరకు సాగర్‌లో 515 అడుగుల మట్టం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది. శ్రీశైలంలో 800 అడుగుల వరకు తీసుకోవాలని నిర్ణయించిన బోర్డు.. గత కొన్ని రోజులుగా వేగంగా ఖాళీ చేస్తోంది. ప్రస్తుతం 816 అడుగుల మట్టం ఉంది. అయితే మంగళవారం జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో 800 అడుగుల కంటే దిగువ నుంచి కూడా తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. ముచ్చుమర్రి ద్వారా ఒక టీఎంసీ నీటిని తీసుకోవాల్సి ఉందని, ఈ నీటిని వారంలో తీసుకొంటామని.. అప్పటివరకు దీనికి తగ్గట్లుగా శ్రీశైలంలో మట్టం నిర్వహించి సాగర్‌లో 515 అడుగుల పైన ఉన్న నీటిని వినియోగించుకోవాలని ఆంధ్రప్రదేశ్ కోరగా, దీనికి అంగీకరించినట్లు తెలిసింది. కనీస నీటిమట్టాల దిగువన ఉన్న నీటిని తాగునీటికి వాడుకోవాల్సి ఉన్నందున వాటాలో మార్పు చేయాలని.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య గతంలో నిర్ణయించినట్లుగా 66:34 శాతం కాకుండా 31:69 శాతం వాడుకోవాల్సి ఉంటుందని తెలంగాణ ప్రతిపాదించింది. దీనిపై తీవ్రస్థాయిలో చర్చ జరిగినా, ఆంధ్రప్రదేశ్ అంగీకరించకపోవడంతో గతంలో నిర్ణయించిన వాటా ప్రకారమే వాడుకొనేలా నిర్ణయించినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. అయితే, అధికారికంగా ఆదేశాలు వెలువడితే కానీ దీనిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు.

పోతిరెడ్డిపాడు నుంచి అనధికారికంగా నీటిని మళ్లించారని, ఈ నీటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని తెలంగాణ కోరగా.. ఈ ప్రతిపాదనతో ఆంధ్రప్రదేశ్ ఏకీభవించలేదని తెలిసింది. పోతిరెడ్డిపాడు నుంచి 90 టీఎంసీలకుపైగా నీటిని తీసుకొన్నందున లీకేజీ ద్వారా 50 నుంచి 100 క్యూసెక్కులు పోయి ఉండొచ్చని, మొత్తమ్మీద ఒక టీఎంసీ కంటే ఎక్కువ ఉండదని, ఇలాంటి పరిస్థితి అన్ని రిజర్వాయర్లలోనూ ఉంటుందని ఆంధ్రప్రదేశ్ పేర్కొన్నట్లు తెలిసింది. దీనిపై రెండు రాష్ట్రాలు ఒకరితోఒకరు ఏకీభవించలేదని సమాచారం. మరోవైపు జూరాల నుంచి తెలంగాణ ఎక్కువ నీటిని తీసుకొన్నట్లు ఆంధ్రప్రదేశ్ పేర్కొనగా, ఈ వాదనకు తెలంగాణ తోసిపుచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద ఆవిరయ్యే నీటిపై కూడా పరస్పరం భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.



20-3-2018 నుంచి 31-05-2018 దాకా రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలకు కృష్ణా బోర్డు తాజా కేటాయింపులివీ..

శ్రీశైలం నుంచి..

తెలంగాణ అవసరాలకు..
కల్వకుర్తి- ఒక టీఎంసీ

ఆంధ్రప్రదేశ్ అవసరాలకు..
హెచ్ఎన్ఎస్ఎస్, ముచ్చుమర్రి - ఒక టీఎంసీ

సాగర్ నుంచి..

తెలంగాణ అవసరాలకు..
హైదరాబాద్, నల్గొండలకు తాగునీటి సరఫరా - 6 టీఎంసీలు, సాగర్ ఎడమ కాలువ 10 టీఎంసీలు (వ్యవసాయం, తాగునీరు)

ఆంధ్రప్రదేశ్ అవసరాలకు..
సాగర్ కుడి కాలువ-7 టీఎంసీలు, సాగర్ ఎడమ కాలువ-4 టీఎంసీలు, కృష్ణా డెల్టా - 4 టీఎంసీలు

పొలం చదును చేస్తుండగా బయటపడ్డ వెండి నాణేలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: పొలాన్ని చదును చేస్తుండగా వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం కత్తేపల్లి శివారులో పురాతన వెండి నాణేలు బయటపడ్డాయి. నల్గొండ జిల్లాకు చెందిన నారాయణ కత్తేపల్లి శివారులో కొనుగోలు చేసిన పొలాన్ని చదును చేయిస్తున్నారు. ఈ సమయంలో మట్టిని తరలించే ట్రాక్టర్ల డ్రైవర్లు, కూలీలు వెండి నాణేలను గుర్తించి విషయాన్ని పొలం యజమానికి చేరవేశారు. ఈ సందర్భంగా నాణేలు కొన్నింటిని ఆయన తీసుకోగా మరికొన్ని కూలీలు, ట్రాక్టర్ల డ్రైవర్లు ఎవరికివారు తీసుకుపోయారు. గ్రామస్థులకు ఈ సమాచారం తెలియడంతో ఎవరికివారు రేయింబవళ్లు మట్టిలో వెతికారు. సమాచారం తెలుసుకున్న ఆత్మకూరు సీఐ శంకర్, తహశీల్దార్ జేకే మోహన్ అక్కడికి వచ్చి పొలం యజమానితో పాటు, గ్రామస్థుల్లో కొందరి వద్ద ఉన్న 17 వెండి నాణేలను స్వాధీనం చేసుకున్నారు. ఉర్దూ ముద్రణలో ఉన్న నాణేలను వెంటనే అప్పగించాలని లేకుంటే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇంకా 60 నాణేలు కొందరి వద్దే ఉండిపోయాయని గ్రామస్థులు చెబుతున్నారు. స్వాధీనం చేసుకున్న నాణేలను తానీషాల కాలం నాటివిగా భావిస్తున్నారు. తహశీల్దారు మోహన్ మాట్లాడుతూ.. స్వాధీనం చేసుకున్న నాణేలు ఏ నాటి కాలం నాటివో ధ్రువీకరించాల్సి ఉందని చెప్పారు.



లభ్యమైన వెండి నాణేలు

పార్కింగ్ దందాకు చెల్లుచీటి

- అరగంట వరకూ ఉచితం
- ఆ తర్వాత కూడా నిబంధనల మేరకే
- మాల్స్, మల్టీప్లెక్స్‌లు, కాంప్లెక్స్‌ల్లో అమలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో హైదరాబాద్ సహా ఇతర పట్టణాల్లో వాణిజ్య సముదాయాలు, మాల్స్, మల్టీప్లెక్స్‌ల్లో పార్కింగ్ రుసుముల భారీ వసూళ్లపై ప్రభుత్వం నియంత్రణ విధానాన్ని విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త పార్కింగ్ నిబంధనలు, రుసుముల వసూలు విధానం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. వాణిజ్య సముదాయాలు, మాల్స్, మల్టీప్లెక్స్‌ల్లో పార్కింగ్‌లు నిర్వహించే సంస్థలు, వ్యక్తులు ఈ నిబంధనలను విధిగా పాటించాలని పేర్కొన్నారు. ఉత్తర్వులను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ సహా ఇతర పట్టణ స్థానిక సంస్థలను ఆదేశించారు.

మొదటి అరగంటకు ఉచితం

వాణిజ్య సముదాయాలు, మాల్స్, మల్టీప్లెక్స్‌ల్లో మొదటి అరగంటకు ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించాలి.



కొనుగోలు చేస్తే.. గంటైనా ఉచితమే

30 నిమిషాలు పైబడి గంట వరకూ వాహనాన్ని పార్కింగ్ చేసి ఉంటే సంబంధిత వాణిజ్య సముదాయం, మాల్, మల్టీప్లెక్స్‌ల్లో వస్తువులు కొనుగోలు చేసిన బిల్లును చూపితే ఎలాంటి పార్కింగ్ రుసుము వసూలు చేయకూడదు. షాపింగ్ చేయని వారి నుంచి నిర్దేశిత రుసుము వసూలు చేసుకోవచ్చు.

బిల్లు ఎక్కువున్నా ఉచితమే

గంటకు పైబడి వాహనాన్ని పార్కింగ్ చేసి ఉంటే.. అలాంటి వారు అదే షాపింగ్ మాల్‌లో షాపింగ్ చేసిన మొత్తం లేదా సినిమా టికెట్ విలువ పార్కింగ్ రుసుము కంటే ఎక్కువుంటే రుసుము వసూలు చేయకూడదు. షాపింగ్ చేయని వారి నుంచి వసూలు చేసుకోవచ్చు.

ఈనాడు

పార్లమెంటు ఉన్నదెందుకు?

అత్యున్నత శాసన నిర్మాణ వేదికగానే కాదు, ప్రపంచ మానవాళిలో ఆరోవంతు మంది భవిష్యత్తును నిర్దేశించేదిగానూ భారత పార్లమెంటు విశిష్టత ఎనలేనిది. చట్టసభల ప్రతిష్ఠ ఒక్కసారి నేలమట్టమైతే ప్రజాస్వామ్యమే పెనుసంక్షోభంలో పడుతుందన్న స్పృహతో తొలితరం నేతలు జాగ్రత్తగా నిర్మించిన విలువల పునాదులు కదలబారిపోతున్న బాధాకర దృశ్యం- పార్లమెంటు ప్రతిష్టంభనలో నేడు కళ్లకు కడుతోంది. జనవరి 29 నుంచి ఏప్రిల్ ఆరో తేదీ నడుమ మొత్తం 31 రోజులు పార్లమెంటు భేటీ కావాలని, 32 బిల్లులకు ఉభయసభల ఆమోదం పొందాలని బడ్జెట్ సమావేశాల అజెండాగా నిర్ణయించారు. ఫిబ్రవరి తొమ్మిది దాకా జరిగిన తొలివిడత పార్లమెంటు సమావేశాల్లో నిర్దేశిత కాలానికి మించి లోక్‌సభ ఏకాయికి 134.6 శాతం, రాజ్యసభ 96 శాతం సభా సమయాన్ని సద్వినియోగం చేశాయి. బడ్జెట్ సమావేశాల మలి అంచె ఈ నెల అయిదున మొదలైంది లగాయతు చర్చల స్థానాన్ని సొంత రాజకీయ రచ్చ ఆక్రమించేయగా- ఆలోచనాపరులెల్లా కలవిచేసేలా కాలదహనం పన్నెండు రోజులుగా నిత్యకృత్యమైపోయింది. ఉభయసభలు కనీసం పది శాతం సమయమైనా పని చెయ్యడంలేదన్న విశ్లేషణలు- అసలు పార్లమెంటు ఉన్నది ఎందుకన్న మౌలిక ప్రశ్నను రేకెత్తిస్తున్నాయి. రణగొణ ధ్వనులతో సభ హోరెత్తుతుండగానే లక్షల కోట్ల రూపాయల వ్యయ ప్రణాళికకు కేంద్ర సర్కారు మూజువాణీ ఓటుతో మొహర్ వేయించుకుంది. ఎప్పుడో 2003-'04లో, ఇటీవల 2013-'14లో ఎలాంటి చర్చ లేకుండా బడ్జెట్‌కు చాపచుట్టేసిన 'గిలిటెన్ ప్రారబ్ధం' ఇప్పుడు మళ్ళీ అనుభవమైంది. రిజర్వేషన్ల పెంపుదలకు రాజ్యాంగాన్ని సవరించాలంటూ తెరాస, కావేరి యాజమాన్య మండలి కోసం ఏఐఏడీఎంకేలు ఆందోళన చేస్తుంటే, బ్యాంకుల కుంభకోణాలపై విపుల చర్చ కోసం కొన్ని పార్టీలు, ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో మోదీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం కోసం తెదేపా వైకాపాలు పట్టుబడుతుండగా సభ స్తంభించిపోతోంది. చర్చించడమే పార్లమెంటు ప్రధాన విధి అయినప్పుడు, ఆయా అంశాలపై చర్చ జరగాలని పాలక ప్రతిపక్షాలు వాంఛిస్తున్నప్పుడు- అర్థాంతరంగా సభలెందుకు వాయిదాపడుతున్నాయి? అన్ని అంశాలపై క్రమానుగత చర్చ జరిగితేనే కదా, పార్లమెంటు ద్వారా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ అయ్యేది!

పార్లమెంటులో తొలిసారి 1969లో కాలిడిన తాను పీవీ విజ్ఞత నుంచి, అటల్‌జీ వాక్పటిమ నుంచి, మధులిమయే, డాక్టర్ నాథ్‌పాయ్‌ల వ్యంగ్యోక్తుల నుంచి, పీలూమోదీ హాస్యం, ఇంద్రజిత్ గుప్తా గట్టి ప్రత్యుత్తరాల నుంచి ఎంతో నేర్చుకొన్నానని ప్రణబ్‌దా చెప్పిన మాట- పార్లమెంటులో ఉండి తీరాల్సిన విలువలేమిటో వెల్లడిస్తోంది. రాజ్యాంగ సూత్రాలు, ఆదర్శాలకు కట్టుబాటు చాటుతున్నామంటూ ఆయా సందర్భాల్లో మనకర తీర్మానాలు చేస్తున్న పార్లమెంటు సభ్యులు- ఏ దశలోనూ విలువలు, సత్ప్రమాణాల్ని మన్నిస్తున్న దాఖలాలు లేనేలేవు. కాబట్టే, చర్చ (డిబేట్) అసమ్మతి (డిసెంట్) నిర్ణయం (డెసిషన్)... ఇలా మూడు 'డి'లతో గౌరవప్రదంగా నడవాల్సిన పార్లమెంటు ప్రతిష్ఠకు నాలుగో 'డి' (డిస్రప్షన్- అడ్డుకోవడం) తూట్లు పొడుస్తోంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య బండికి పాలక ప్రతిపక్షాలు జోడెద్దు. ప్రతిష్టంభనకు ఎవరికివారు ఎదిరి పక్షమే కారణమంటూ దులపరించేసుకోవడం సరికాదు. సామర్థ్యం అంకితభావం సహకారం సంయమనం పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మూలస్తంభాల్లాంటివి. అవి పెకలుబారిపోతే, పార్టీల సంకుచిత రాజకీయాల సంగ్రామ వేదికలుగా చట్టసభలు దిగజారిపోతే- ఏం ఉద్ధరిస్తాయని ప్రజలు పార్టీల్ని ఎన్నుకోవాలి? 'పార్లమెంటును బోట్‌క్లబ్ స్థాయికి దిగజార్చారని ఒకనాడు లోక్‌సభాపతిగా సంగ్మా ఈసడించిన, రోజువారీ ప్రతిష్టంభనకు కినిసి నేడు రాజ్యసభాపతిగా వెంకయ్య విందును రద్దుచేసినా- వారి చర్యల్లో ప్రతిఫలిస్తోంది 130 కోట్ల జనావళి సంవేదన!

పార్లమెంటు సమావేశాలు నిరాటంకంగా జరిగేలా తగు మార్గదర్శకాల్ని జారీ చెయ్యాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విజ్ఞతాయుతంగా స్పందించింది. సభను ఎలా నిర్వహించాలో సభాపతికి తెలుసునంటూ రాజ్యాంగ లక్ష్మణ రేఖను అతిక్రమించలేమని స్పష్టీకరించింది. ఏ కొద్దిమంది సభ్యులో మొత్తం సభను 'హైజాక్' చేసే దుస్థితి- నియమాలు నిబంధనల బలహీనతల్నే వెలెత్తిచూపుతోంది. పరిపాలన సజావుగా సాగేలా తగిన శాసన ప్రతిపాదనలకు పార్లమెంటు మద్దతు కోరడం ప్రభుత్వాల విధి. పాలనలో లొసుగుల్ని వెలెత్తిచూపుతూ సరైన చర్య ద్వారా ప్రజాప్రయోజనకర శాసనాల రూపకల్పనకు దోహదపడుతూనే పాలకుల్ని వారి తప్పొప్పులకు జవాబుదారీ చెయ్యడం విపక్షాల బాధ్యత! తమ తమ కర్తవ్యాల నిర్వహణలో ఎవరూ శ్రుతి మించకుండా చూసేందుకే లిఖిత నిబంధనలు, అలిఖిత ప్రమాణాలు ఉన్నాయి. వాటిని బేఖాతరు చేసి కంచే చేను మేస్తుంటే- పార్లమెంటు ప్రతిష్ఠే మసకబారిపోతోంది. రెండు పుష్కరాల నాడు ప్రజాజీవనంలో ప్రమాణాలపై బ్రిటన్ ఏర్పాటుచేసిన నోలన్ కమిటీ సూచనలు- అక్కడి క్షీణవిలువలకు అడ్డుకట్ట వేసి పార్లమెంటు ప్రతిష్ఠను నిలబెట్టాయి. ఏడాదికి కనీసం 160 రోజులు భేటీ అయ్యే బ్రిటన్ పార్లమెంటులో- ప్రతి సమావేశంలో 20 రోజుల అజెండాను ప్రతిపక్షాలే నిర్ధారిస్తాయి. అందులోనూ ప్రధాన విపక్షానికి 17 రోజులు, చిన్న పార్టీలకు మూడు రోజులు కేటాయించారు. ప్రతి బుధవారం అరగంట సేపు ప్రధానమంత్రి సమాధానమిచ్చే ప్రశ్నల సమయం 1961 నుంచి అమలులో ఉంది. ఏయే రోజుల్లో ఏయే మంత్రిత్వశాఖల అంశాలు చర్చకు వచ్చేదీ ముందే నిర్ధారణ అయిపోవడంతో అంతరాయాల్లేకుండా సభ సాగిపోతూ ఉంటుంది. అలాంటి గౌరవప్రద ఒరవడిని మనం పుణికిపుచ్చుకోలేమా?- పార్టీలన్నీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయమిది!

అడవికి అండ... అవనికి దండ



డాక్టర్ జీవీఎల్ విజయ్‌కుమార్

వైవిధ్య భరితమైన వృక్షజాతులు, జీవజాలానికి అడవులు ఆలవాలం. అడవి బిడ్డలకు కొండంత అండ. ఉపాధి, వాణిజ్య అవకాశాల సృష్టి ద్వారా ఆర్థిక రంగానికి అవి చేయూతనిస్తాయి. అనేక అటవీ ప్రాంతాలు పర్యాటక కేంద్రాలుగా ప్రజలకు మానసికోల్లాసాన్ని పంచుతున్నాయి. భారత్‌లో దాదాపు 20 కోట్ల జనాభా అడవులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రత్యక్షంగా 19 కోట్ల పశువులు, జంతువుల ఆహార అవసరాలను అరణ్యాలే తీరుస్తున్నాయి. జనాభా పెరుగుదల, అభివృద్ధి పథకాలు, పట్టణీకరణ కొన్నేళ్లుగా అడవులపై ఒత్తిడిని పెంచుతున్నాయి. ఈ కారణాలవల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా 73 లక్షల హెక్టార్ల మేర అడవులు అంతరించిపోతున్నాయని అధ్యయనాలు చాటుతున్నాయి. అంతరిస్తున్న అడవుల వల్ల జీవవైవిధ్యానికి ప్రమాదం ముంచుకొస్తోంది. పర్యావరణ సమస్యలూ పెచ్చరిల్లుతున్నాయి. దీంతో అడవులను కాపాడుకోవాలన్న స్పృహ అంతర్జాతీయంగా ఇనుమడిస్తోంది. ఐక్యరాజ్య సమితి 2012లో ఆమోదించిన తీర్మానం ప్రకారం 2013 నుంచి ఏటా మార్చి 21న అంతర్జాతీయ అటవీ సంరక్షణ దినోత్సవాన్ని పాటిస్తున్నారు.

అభివృద్ధికి ఊతం

నేడు ప్రపంచవ్యాప్తంగా ఆహారం, ఇంధనం, జీవనోపాధి కోసం 130 కోట్లమంది అడవుల మీద ఆధారపడుతున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వీరి సంఖ్య దాదాపు 88.3 కోట్లు. భారతదేశ ఆర్థికాభివృద్ధి, ఉపాధికల్పన రంగాల్లో అడవుల పాత్ర గణనీయమైనది. ప్రపంచంలో అత్యధిక అటవీ వనరులుగల దేశాల జాబితాలో భారత్‌ది పదో స్థానం. రష్యా, బ్రెజిల్, కెనడా, అమెరికా, చైనా, కాంగో, ఆస్ట్రేలియా, ఇండొనేసియా, సూడాన్‌లు భారత్ కన్నా ముందువరసలో ఉన్నాయి. ప్రపంచంలోని మొత్తం అటవీ విస్తీర్ణంలో మొదటి పది దేశాలే 67 శాతాన్ని ఆక్రమిస్తున్నాయి. భారతదేశ స్థూల దేశీయోత్పత్తిలో అడవుల రంగం వాటా 2002లో 1.7 శాతం ఉంటే, 2010నాటికది 0.9 శాతానికి పడిపోయింది. ఇతర రంగాల్లో ఊహించని వృద్ధిరేటు నమోదు కావడమే ఈ మార్పునకు కారణం. వాస్తవానికి అటవీ ఉత్పత్తుల విషయంలో భారత్ ముందంజలో ఉంది. మనదేశ అటవీ ఉత్పత్తులైన కాగితం, ప్లైఉడ్, వంటచెరకు, జిగురు, దాణా, గ్రాసం, సుగంధద్రవ్యాలు, సౌందర్య సాధనాలు, ఔషధ మొక్కలు వంటివాటికి వాణిజ్యపరంగా అత్యంత గిరాకీ ఉంది. విదేశాల నుంచి కలప దిగుమతుల విషయంలోనూ భారత్ ప్రముఖ స్థానంలో ఉంది. దేశ విపణిలో విదేశీ కలప ఉత్పత్తులకు విశేషమైన ఆదరణ లభిస్తుండటంతో ముడికలప దిగుమతులు భారీగా ఉంటున్నాయి. భారత్‌లో చౌకగా లభించే కార్మికుల లభ్యత, అధిక సంఖ్యలో కలపకోత మిల్లులు ఉండటంతో ప్రధానంగా మలేసియా, మియన్మార్, చైనా, న్యూజిలాండ్ తదితర దేశాల దిగుమతులకు మంచి వాణిజ్య అవకాశాలున్నాయి. పాక్షికంగా తయారైన, తయారీకి సిద్ధంగా ఉన్న విడికలప సామగ్రికి భారతీయ విపణిలో వ్యాపారావకాశాలు మెరుగైన దశలో ఉన్నాయి. చైనా, మలేసియా నుంచే కలప దిగుమతులు 60 శాతం ఉండగా, తక్కిన 40 శాతం ఇటలీ, జర్మనీ, సింగపూర్, శ్రీలంక, అమెరికా, హాంకాంగ్, తైవాన్‌ల నుంచి దిగుమతవుతున్నాయి. టేకుకర్రకు భారత్‌లో విశేషమైన గిరాకీ ఉంది. భారతీయ అటవీ ఉత్పత్తుల్లో కాగితం తయారీకి వాడే కలప ప్రధానమైంది. భారత్‌లో ఏటా దాదాపు 3,000 మెట్రిక్ టన్నుల కాగితం తయారవుతోంది. దేశవ్యాప్తంగా 400 పైచిలుకు కాగితం మిల్లులు ఉన్నాయి. 2002లోనే మూడు కోట్ల ఘనపు మీటర్ల కలపను భారత్ వినియోగించుకోవడం విశేషం. దేశంలో ఏటా దాదాపు 27 కోట్ల టన్నుల వంట చెరకు, 2,800 టన్నుల దాణా/గ్రాసం, 10.20 కోట్ల టన్నుల ఇతర అటవీ ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. సగటున ఏటా రూ. 27,500 కోట్ల విలువైన అటవీ ఉత్పత్తులను దేశంలో వివిధ అవసరాలకు ఉపయోగిస్తున్నారు. ఇక వంటచెరకు వాడకంలో భారత్ ప్రపంచంలోనే ముందుంది. వాస్తవానికి అటవీ ఉత్పత్తుల సామర్థ్యానికి అయిదు రెట్లు మించి ఈ వినియోగం ఉంది. దీనిలో అత్యధిక శాతం వ్యవసాయానుబంధ పంటల నుంచి సేకరిస్తున్నారు. దేశంలోని అడవుల నుంచి కలపేతర ఉత్పత్తులూ గణనీయంగా ఉంటున్నాయి. లేటెక్స్, నూనెలు, సుగంధ లేపనాలు, ఔషధాలు, రసాయనాలు వీటిలో ప్రధానమైనవి. కలపేతర అటవీ ఉత్పత్తుల్లో దాదాపు 60శాతం భారత్‌లోనే వినియోగంలో ఉన్నాయి. ప్రభుత్వ ఖజానాకు లభించే ఆదాయంలో 50 శాతం వీటి ద్వారానే సమకూరుతుండటం- ఆర్థిక వ్యవస్థలో అడవుల ప్రాధాన్యాన్ని వివరిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన 12 జీవవైవిధ్య మండలాల్లో ఒకటి భారత్‌లో ఉంది. ప్రపంచంలోని మొత్తం 32 జీవవైవిధ్య ఉదక మండలాల జాబితాలో భారత్‌లోని పశ్చిమ కనుమలు, తూర్పు హిమాలయాలకు చోటుదక్కింది. ప్రపంచ పుష్ప, వృక్ష సంపదలో 12 శాతం ఇండియాలోనే ఉన్నాయి. దాదాపు 47వేల రకాల పుష్పజాతి, పుష్పేతర మొక్కలు, 2,500 రకాల చేపలు, 17వేల రకాల యాంజియోస్పెర్మ్‌లకు భారతీయ అడవులు ఆవాసంగా ఉన్నాయి. 90 వేల రకాల జీవజాతులు భారతీయ అడవుల్లో లభ్యమవుతున్నాయి. అడవులేకాక, చిత్తడి నేలలు, సరస్సులు సైతం అనేక రకాల వలస పక్షులకు ఆశ్రయం కల్పిస్తున్నాయి. 'వరల్డ్ వైడ్‌ఫండ్ ఫర్ నేచర్' సంస్థ నివేదిక ప్రకారం దేశంలో దాదాపు 300 రకాల పక్షుల వేట, వర్తకం కొనసాగుతూనే ఉంది. ప్రతి నెలా వేల సంఖ్యలో పక్షులను అడవుల్లో పట్టి, పెంపకం కోసం విపణుల్లోకి తరలిస్తున్నారు. దేశంలో నేటికీ కొన్ని సంచార ఆటవిక తెగలకు వేట ప్రధానవృత్తిగా ఉంది.



నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం

లక్ష్యాలకు ఆమడదూరం

భారతీయ అడవుల్లోని జీవ వైవిధ్య మండల ప్రాంతాలు, అభయారణ్యాలు, వన్యమృగ సంరక్షణా కేంద్రాలు, వేసవి విడిదులు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. దీనివల్ల అక్కడి గిరిజన, ఇతర షెడ్యూల్డు కులాలు, ఆదివాసీ కుటుంబాల యువతకు ఉపాధి, వ్యాపార అవకాశాలు మెరుగు కావడమేకాకుండా ప్రభుత్వానికి ఆదాయమూ సమకూరుతోంది. జీవనశైలిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నేడు ఉద్యాన వనాలు, వనభోజనాలు, వన విహారాలు, వినోద, విహార యాత్రలకు ప్రాధాన్యం పెరుగుతోంది. పలు పట్టణాభివృద్ధి సంస్థలు ఉద్యాన వనాలను ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నాయి. అడవుల విస్తీర్ణాన్ని పెంచడమే లక్ష్యంగా భారత్‌లో 1970వ దశకంలోనే దీర్ఘకాల ప్రాతిపదికన కార్యాచరణ ప్రారంభించినప్పటికీ, ఆశించిన ఫలితం దక్కలేదు. 'స్టేట్ ఫారెస్ట్ రిపోర్ట్- 2017' ప్రకారం దేశంలో 7,08,273 చ.కి.మీ విస్తీర్ణంలో అడవులు విస్తరించి ఉన్నాయి. అంటే దేశ భౌగోళిక విస్తీర్ణంలో అది 21.53 శాతమే. 1988నాటి జాతీయ అటవీ విధానం ప్రకారం అడవుల శాతాన్ని 33 శాతానికి పెంచాలన్నది లక్ష్యం. వనసంరక్షణ సమితులు, సామాజిక అడవుల పెంపకం వంటి కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ లక్ష్యానికి చేరడంలో వైఫల్యాలే ఎదురవుతున్నాయి. అందుకుగల కారణాలను సమగ్రంగా విశ్లేషించాలి. అడవుల సంరక్షణలో ప్రభుత్వం, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలి. పారిశ్రామికీకరణ, పట్టణీకరణతో అడవులు తరిగిపోకుండా చూడాలి. లేదా ప్రత్యామ్నాయంగా భూవసతి కల్పించి మొక్కలను పెంచాలి. పెరుగుతున్న జనాభా అవసరాల కోసం అధిక ఆహారోత్పత్తి పేరిట అటవీ భూములు వ్యవసాయ భూములుగా మారకుండా నియంత్రించాలి. దేశంలో నేటికీ 70 శాతానికి పైగా ప్రజలు వంట చెరకుగా కట్టెలనే ఉపయోగిస్తున్నారు. దీనివల్ల అడవులపై ఒత్తిడి పెరగకుండా వంటచెరకు కోసం మొక్కలను పెంచాలి. పశువులు అటవీ భూములపై పడి మేయకుండా పశుగ్రాస పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలి. గిరిజన తెగలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను కల్పించి, ఆదాయ వనరులను సమకూర్చడం ద్వారా వారు అడవులపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చు. తద్వారా వారి సేవలనూ అడవుల సంరక్షణకు ఉపయోగించుకోవచ్చు. గృహ నిర్మాణాల్లో, ఫర్నీచర్ తయారీలో కర్రకు ప్రత్యామ్నాయంగా ఇనుము, స్టీలు ఇతర లోహాల వాడకాన్ని ప్రోత్సహించాలి. అప్పుడే అడవులు దట్టంగా అలముకుని పర్యావరణ పరిరక్షణకు పాటుపడతాయి. వైవిధ్యభరితమైన వృక్ష, జంతు జాలాలతో అలరారుతుంటాయి. పుడమి తల్లికి పచ్చలహారమై నిలిచి హరిత భారత స్వప్నం సాకారమయ్యేలా చేస్తాయి.

టాంజానియా ఆదర్శం





పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, వ్యవసాయ విస్తరణ కోసమంటూ అడవులను అడ్డగోలుగా నరికేస్తూపోతే మానవాళి మనుగడే ప్రమాదంలో పడుతుంది. అయిదున్నర కోట్లకు పైబడిన జనాభా గల తూర్పు ఆఫ్రికా దేశం టాంజానియాకు ఇది బాగా అనుభవమైంది. అంతరించిపోతున్న అడవుల వల్ల దేశార్థికం దెబ్బతింటోందని గ్రహించిన టాంజానియా ప్రభుత్వం, ప్రజలు సత్వరం మేలుకొని దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ప్రభుత్వం ప్రత్యేక నిధి ఏర్పాటు చేయగా, ప్రజలు ఎవరికివారు అటవీ పరిరక్షణ కోసం తమ తమ జీవన విధానాల్లో మార్పులు చేసుకున్నారు. వంటచెరకు కోసం చెట్ల నరికివేతకు స్వస్తి పలికారు. తీర ప్రాంతం లిండీలోని మూడు జిల్లాలకు చెందిన ఆరు గ్రామాల ప్రజలు సంయుక్తంగా అడవుల సంరక్షణ పథకాన్ని అమలు చేసి, సత్ఫలితాలు పొందుతున్నారు. సామాజిక బృందాలుగా ఏర్పడి అటవీ ఆధారిత ప్రణాళికలు రచించుకున్నారు. తేనెటీగల పెంపకం వంటి ఆదాయార్జన మార్గాలను ఎంచుకున్నారు. వారి చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి. పర్యావరణమూ సహకరించింది. గ్రామీణులు పూరి గుడిసెల స్థానంలో పక్కా ఇళ్లు నిర్మించుకున్నారు. యువత స్వయంఉపాధి మార్గాలు సృష్టించుకుని, అడవులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించుకున్నారు. పర్యావరణ, అటవీ శాఖలకు నిఘా పర్యవేక్షణ వ్యయాలూ గణనీయంగా తగ్గిపోయాయి. ప్రకృతి వరప్రసాదమైన అడవులను పరిరక్షించుకుంటూనే ఆర్థిక స్వావలంబన కోసం ప్రత్యామ్నాయ మార్గాలు చేపట్టి నేడు ప్రగతిపథంలో పయనిస్తున్నారు.

కుదురైన రాతతో ఏకాగ్రత

ఇది పరీక్షల కాలం. విషయ పరిజ్ఞానం ఉన్నా, సరైన చేతిరాత లేని కారణంగా పలువురు అభ్యర్థులు మార్కులు కోల్పోతున్నారు. గుండ్రని అక్షరాలతో కూడిన ద్రవిడ భాష- తెలుగు. ఇందులో దస్తూరి బాగుండాలి అంటే, సాధన ప్రాథమిక విద్యలోనే మొదలై మాధ్యమిక దశలోనూ కొనసాగాలి. ఈ పద్ధతి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో తప్ప, మరెక్కడా లేదు. దస్తూరిని పెంపొందించే కాపీరాత ప్రభుత్వ విద్యాలయాల్లో తప్పనిసరి కాదు. సమాధాన పత్రాల్లో సమాచారం ఉన్నా, చేతిరాత లోపించడమే విద్యార్థులకు ఎంతో ఇబ్బందికరంగా పరిణమిస్తోంది. మూల్యాంకన సమయంలో ఇది ప్రస్ఫుటమవుతోంది. పాఠ్యాంశాల్లో, ప్రణాళికల్లో కాపీరాతను తప్పనిసరి చేయాల్సిన అవసరాన్ని ప్రస్తుత స్థితి సూచిస్తోంది. భావ వ్యక్తీకరణకు మధుర స్వరంలా, పరీక్షల్లో విజయానికి చక్కని దస్తూరి అత్యవసరం.

మనిషి మాట్లాడటం ప్రారంభించిన తరవాత, నాగరికత గల జాతులు తమ భాషలకు లిపి కనుగొన్నాయి. నేటికీ లిపి లేని భాషలు అనేకం గణనీయంగానే ఉన్నాయి. మొదట బొమ్మల రూపంలో ప్రారంభమైన లిపి- చతురస్రాకార, గుండ్రని, గొలుసుకట్టు అక్షరాలుగా అభివృద్ధి చెందింది. భాష- జననం, లిపి- దాని అభివృద్ధి. అది ఇప్పటి రూపు సంతరించుకోవడం అంచెలవారీగా సాగిన పరిణామం. ఒక భాషలో ఉండే శబ్దాల్ని బట్టి, లిపి రూపొందుతుంది. రాసే అక్షరాలు అందంగా కనిపించాలంటే, ప్రత్యేక సాధన తప్పదు. చదువుల తొలి దశలోనే ఆ ఒరవడి కావాలి. మలిదశలో అది సాధ్యంకాదని భాషాశాస్త్రం చెబుతుంది. ఓ వ్యక్తి ఓనమాలు నేర్చినప్పటి నుంచి వీలునామా వరకు జీవితంలో ఎన్ని అక్షరాలు, పదాలు రాస్తాడన్నది పరిశోధన చేసితీరాల్సిన అంశం. పరీక్షల్లో అభ్యర్థులు అందంగా రాస్తే, ఒకప్పుడు అదనపు మార్కులు ఇచ్చేవారన్నది గమనార్హం.

తన చేతిరాత అందంగా ఉండనందుకు అనేకసార్లు బాధపడ్డానని మహాత్మాగాంధీ 'స్వీయచరిత్ర'లో రాసుకున్నారు. దస్తూరి నిపుణుల ప్రకారం- అది సర్వసహజంగా వివిధ అంశాలపై ఆధారపడి ఉంటుంది. వాటిలో మెదడు అభివృద్ధి, నైపుణ్యాలు, స్వీయ నియంత్రణ ప్రధానమైనవి. కేవలం మనోభావాల్ని తెలియజేయడమే కాకుండా- కన్ను, మెదడు నరాలకు రక్త ప్రసరణ, వ్యాయామాల్ని రాత కలిగిస్తుంది. దీన్ని వైద్యులు తేల్చి చెబుతున్నారు. విద్యార్థి అటు తరగతి గదిలో, ఇటు ఇంట్లో విద్య పూర్తి అయ్యేలోపల కొన్ని లక్షల పదాలు రాస్తాడు. తన జ్ఞానాన్ని పరీక్షల్లో కాగితంమీద అక్షర రూపంలో పెడతాడు. ఇకమీదట అటువంటి పని ఉండకపోవచ్చని లండన్ కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి చెందిన పరీక్షల నిర్వాహకులు చెబుతున్నారు. అక్కడ దశాబ్దాలుగా గల చేతిరాతల పరీక్షల విధానానికి మంగళం పాడనున్నారు. విద్యార్థుల చేతిరాత క్షీణత కారణంగా, ల్యాప్ టాప్/ఐపాడ్ వాడుకోవాలని భావిస్తున్నారు. 'డిజి



ప్రోత్సహించాల్సిన తరుణం

టల్ విద్యావ్యూహం'లో భాగంగా అలా కసరత్తు ప్రారంభిస్తున్నారు. 'చేతిరాత అనేది ప్రస్తుత తరం విద్యార్థులు కోల్పోయిన ఓ కళ' అని ప్రాజెక్టు బాధ్యులు ఆచార్య సారొపియర్‌సాల్ ఇటీవల వ్యాఖ్యానించారు. రాత సవ్యంగా లేనివారి సమాధానపత్రాలు చదవడం అధ్యాపకులకు చాలా కష్టంగా ఉందని ఆమె చెబుతున్నారు. విద్యారంగంలో ఎంతో ముందున్న ఫిన్లాండ్‌లో ప్రభుత్వం గొలుసుకట్టు రాత తరగతుల నిర్వహణను నిరాకరిస్తోంది. మీటల బల్ల (కీ బోర్డు) సామర్థ్యం పెంచాలని విద్యాలయాల్ని అది ఆదేశించింది. ఆధునిక యుగంలో కమ్యూనికేషన్ ప్రాథమిక నైపుణ్యాలు (మీటలు నొక్కడం, సందేశాలు పంపించడం వంటి సామర్థ్యాలు) పెంపొందించాలని ఆ ప్రభుత్వం సూచించింది. చేతిరాత మెరుగుపరచుకోవడానికి ఉపయోగించే సమయాన్ని కంప్యూటర్ మీటలకు వినియోగిస్తే అధిక ప్రయోజనం ఉంటుందని అంటోంది. ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయనీ అభిప్రాయపడుతోంది. అమెరికాలో కొన్ని రాష్ట్రాలు తప్ప పలుచోట్ల గొలుసుకట్టు రాతల తరగతుల్ని రద్దుచేశారు. ఇండియానా, నార్త్ కెరొలినా వంటివి పాఠ్యప్రణాళికలో గొలుసుకట్టు రాతల్ని ఉంచాలంటున్నాయి.

అన్ని రంగాల్లోనూ సాంకేతికత తెచ్చిన మార్పులు విద్యావ్యవస్థపైనా గణనీయంగా కనిపిస్తున్నాయి. డిజిటల్ తరగతి గదులు వచ్చి పిల్లలకు కలం, కాగితాల్ని క్రమేపీ దూరం చేస్తున్నాయి. నల్లబల్ల బదులు తరగతి గదిలో తెల్ల తెరల ఉపయోగం పెరుగుతోంది. పరిపాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వాలు, ఇతర సంస్థలు ఇ-ఫైలింగ్ విధానాన్ని అమలుపరచడం చేతిరాత వినియోగాన్ని తగ్గిస్తోంది. చేతిరాతలో ఉన్న అనేక రచనల్ని భావితరాలకు అందించేందుకు భారత ప్రభుత్వం లోగడ ఒక ప్రయత్నం ప్రారంభించింది. దేశ విదేశాల్లో ఉన్న తాళపత్ర గ్రంథాల్ని శోధించి నేటితరానికి అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్రం చేపట్టిన డిజిటలీకరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా వివిధ గ్రంథాలయాలు, సంగ్రహాలయాల్లో ఉన్న 43 లక్షల తాళపత్ర రచనల్ని ఇప్పటికే నవీకరించారు. ఎలక్ట్రానిక్ యంత్రాల ప్రవేశానికి ముందు, తక్కువ అక్షరాలతో ఎక్కువ సమాచారం రాయడానికి షార్ట్ హ్యాండ్ ఉపయోగించేవారు. కొన్ని టైప్‌రైటింగ్ పరీక్షల్లో తప్ప, నేడు దాని ప్రాధాన్యం తగ్గింది. సులభంగా తక్కువ సమయంలో రాయడానికి కంప్యూటర్ మీటలు పనికొస్తాయి. వాటిపై ఎంత నైపుణ్యం సంపాదించినా, చేతిరాతను అశ్రద్ధ చేయడం తగదు. కలం పట్టుకోవడం అంటే- శరీరం, మనసు రెండింటినీ ఒకే చోట లగ్నం చేయడం! చేతిరాత కంటికి వ్యాయామం కలిగిస్తే, కంప్యూటర్ రాత శ్రమనిస్తుంది. రోజువారీ విషయాలు పొందుపరచే డైరీని చేతితో రాస్తేనే ఆనందం. ప్రముఖుల చేతిరాత పత్రాలు కోట్ల రూపాయల ధర పలకడమూ ఆ రాత పట్ల మక్కువను వెల్లడిస్తోంది!

– డాక్టర్ గుజ్జు చెన్నారెడ్డి
(రచయిత– సహాయ ఆచార్యులు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం)

ఈనాడు లేఖలు

సేవా సంస్థలపై దృష్టి

తెలంగాణలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛంద సేవాసంస్థల పనితీరును ప్రభుత్వం సమీక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వివిధ పథకాల అమలు, కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి అవి నిధులు పొందుతున్నాయి. వాటిని ఎలా వినియోగిస్తున్నాయో, ఫలితాలు ప్రయోజనాలు ఏ దశలో ఉన్నాయో పూర్తిస్థాయిలో పరిశీలించాలి. పూర్వాపరాలు తెలుసుకోకుండా, క్షేత్రస్థాయి వాస్తవాలు గ్రహించకుండా నిధుల్ని కొనసాగించడం అనర్థదాయకం. కొన్ని సంస్థలు కేవలం ప్రచార కాంక్షతో వ్యవహరిస్తూ ప్రభుత్వం నుంచి ఏదోవిధంగా నిధులు పొందడంపైనే చూపు సారిస్తున్నాయి. నిర్వహణ దక్షత ఉన్నప్పటికీ సరిపడా నిధులు లేని కారణంగా మరికొన్ని సంస్థలు ముందుకు సాగలేకపోతున్నాయి. ఈ రెండు రకాల పరిస్థితుల్నీ గమనించి నిధుల్ని కేటాయించటం, కొనసాగించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత. అదే సమయంలో, అలంకారప్రాయంగా మారిన సంస్థలపై చర్యలు తీసుకోవడం అవసరం.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

కొరవడిన నియంత్రణ

హైదరాబాదులో ప్రైవేటు వైద్యం నానాటికీ ఖరీదైనదిగా మారిపోతోంది. కనీస ఆరంభ రుసుము అయిదు వందల రూపాయలకు ఎగబాకింది. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఇది మరింత ఎక్కువగా ఉంటోంది. పది రోజులకు మందులు రాసిన తరవాత వెళ్తే, మళ్ళీ కొత్తగా రుసుములు వసూలు చేస్తున్నారు. పాత రుసుము వారం రోజులకే పరిమితమని చెబుతున్నారు. ఇక వైద్యులు రాస్తున్న పరీక్షలకు వేల రూపాయలు ఖర్చవుతున్నాయి. ఇన్‌పేషెంట్‌గా ఆస్పత్రిలో చేరితే రెండు మూడు రోజులకే వేల రూపాయల బిల్లు చెల్లించాల్సి వస్తోంది. గది అద్దెలు సైతం సామాన్యుడు మోయలేని విధంగా ఉంటున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల అధిక రుసుముల దందాకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

- జఫరుల్లా ఖాన్, మహబూబ్‌నగర్

వృత్తిధర్మం

వృత్తినే దైవంగా భావించాలని భారతీయ సంస్కృతి బోధిస్తుంది. మనిషి తన పని పట్ల నిబద్ధత కలిగి ఉండాలి. అంకిత భావంతో కర్తవ్యాన్ని నెరవేర్చాలి. దాన్ని మించిన దైవారాధన మరేదీ లేదు. నీతి, నిజాయతీలతో వ్యవహరించే మనిషే వృత్తిలో దైవాన్ని చూడగలడు.

భారతం, భగవద్గీత, ఖురాన్, బైబిల్ వంటి మతగ్రంథాలన్నీ వృత్తిని త్రికరణశుద్ధిగా నిర్వహించాలంటాయి.


ధర్మవ్యాధుడు బ్రహ్మజ్ఞాని. నిత్యమూ తన వృత్తిధర్మాన్ని అనుసరించేవాడు. ఒకరోజు తన దగ్గరకు వచ్చిన కౌశికుడికి ఆయన పలు ధర్మసూక్ష్మాలు వివరిస్తాడు. 'నేను వృత్తిరీత్యా మాంస విక్రేతను. కొనుగోళ్లు, అమ్మకాల్లో ఎవరినీ మోసగించను. నన్ను నమ్ముకున్నవారిని ఎన్నటికీ వంచించను. ఏనాడూ అసత్యం లేదా అప్రియం పలకను' అంటాడు.

మానవుడు స్వధర్మ వర్తనను వీడకూడదు. చిత్తశుద్ధితో చేసే పనుల వల్లనే అతడికి సత్ఫలితాలు, పేరు ప్రఖ్యాతులు కలుగుతాయి. పరోపకారం, దాతృత్వం, ఔదార్యం వంటి సద్గుణాలు పెంపొందుతాయి. వివేకయుక్తమైన మనసు, ధర్మాచరణ తప్పని తత్వం వల్ల పరమోన్నతి లభిస్తుంది. వృత్తిధర్మం పాటించే వ్యక్తికి అవన్నీ సులభసాధ్యమవుతాయి.

రత్నాకరుడు దారిదోపిడి వంటి నేరాలకు పాల్పడేవాడు. ఒకనాడు నారదముని ప్రబోధంతో, తన పాపపంకిల జీవితానికి స్వస్తి పలికాడు. వాల్మీకి మహర్షిగా మారి, రామాయణ రచనకర్తగా లోకప్రసిద్ధుడయ్యాడు. ఆయన ధర్మావలంబన విశిష్టత తెలుసుకున్నవాడు. కల్మషరహిత వర్తనతో చిర యశస్సు గడించిన చరితార్థుడు.

అంతర్యామి

ఈ సృష్టిలోని ప్రతి వృత్తీ విశిష్టమైనదే. ఏ వృత్తీ గొప్పదీ కాదు, ఏ వృత్తీ నీచమైనదీ కాదు. అన్ని వృత్తులూ సమప్రాధాన్యం కలిగినవే. శరీరంలోని ఏ అవయవం పనిచేయకున్నా, మనిషి జీవితం కుంటువడుతుంది. అలాగే ఏ వృత్తి చేసేవారు దాన్ని వీడితే, సమాజం అనేక ఇబ్బందులపాలవుతుంది.



ఏ వృత్తిలో రాణించాలన్నా, మనిషికి ప్రధానంగా రెండు అంశాలు దోహదపడతాయి. వృత్తిని ప్రేమించడం ఒకటి. నిరంతరమూ శ్రమించడం మరొకటి.

వృత్తిని ప్రేమించడం అంటే, చేస్తున్న పనిమీద ఆసక్తి పెంచుకోవడం. పనిలో పూర్తిగా నిమగ్నమైనప్పుడే, అతడు చక్కని నైపుణ్యం సంపాదించడానికి ఎంతో అవకాశం ఉంటుంది. అదే నైపుణ్యాన్ని కృషికి అనుసంధానించినప్పుడు, వృత్తిలో తిరుగులేనివాడవుతాడు. సంఘంలో పేరుప్రఖ్యాతులు సంపాదించుకుంటాడు.

పరంపరగా లభించే వృత్తినైనా, తనకు ఇష్టమైనదైనా మనిషి దాన్ని సమర్థంగా పూర్తిచేయాలి. యాంత్రికంగా పనిచేయడం తగదు. అది వృత్తికి, సమాజానికీ ద్రోహం చేసినట్లవుతుంది.

లోకంలో ఏ వృత్తీ పూల పానుపు కాదు. దేని ఇబ్బందులు దానికి ఉంటాయి. ఎటువంటి పరిస్థితిలోనైనా, ప్రతి మనిషీ తన వృత్తికి తాను న్యాయం చేయాలి. ఇతరులతో అనవసరంగా పోల్చుకోకూడదు. కర్తవ్యనిర్వహణ దృష్టి కలిగి ఉన్నప్పుడు అశాంతి, ఆత్మన్యూనత అతణ్ని ఏమీ చేయలేవు. ఆ వ్యక్తి నిత్యచైతన్యంతో ఉంటాడు. అందరి గౌరవాన్నీ సంపాదించుకుంటాడు.

వృత్తిధర్మ ఆచరణలోనే సమాజ శ్రేయం ఇమిడి ఉంది. ఎవరు చేయాల్సిన పనిని వారు ధర్మంగా, సక్రమంగా నిర్వర్తించినప్పుడే- సమష్టి రూపమైన మానవ సమాజం పురోగమిస్తుంది!

– విశ్వనాథ రమ

ఇన్నేళ్లు ఎందుకు మభ్యపెట్టారు?

- ఇరాక్ ఊచకోత బాధిత కుటుంబాల ఆగ్రహం

చండీగఢ్

మానవ మృగాల చేత చిక్కిన తమవారు జీవించే ఉంటారన్న ఆశ.. ఈ ఆత్మీయుల మదిలో ఎప్పుడో మిణుకుమిణుకుమంటూ ఉండేది. నరహంతక ముఠా చెరలో ఎంత అవస్థపడుతున్నారోనని తలుచుకొని వారు అనుక్షణం కుమిలిపోయారు. క్షేమంగా తిరిగొస్తారని కళ్లు కాయలుకాసేలా ఎదురు చూశారు. విడుదల కోసం ప్రభుత్వం చుట్టూ చెప్పులరిగేలా తిరిగారు. ఆ ఆశలు.. ఆకాంక్షలు.. నిరీక్షణలు.. ఒక్కసారిగా ప్రకటనతో చెదిరిపోయాయి. ఇరాక్‌లో ఐసిస్ ముష్కరుల చేతిలో చిక్కిన 39 మంది భారతీయులు ఊచకోతకు గురయ్యారని విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ మంగళవారం రాజ్యసభలో ప్రకటించగానే.. బాధిత కుటుంబాలన్నీ దుఃఖసాగరంలో మునిగిపోయాయి. ఇన్నేళ్ల పాటు ఈ విషయాన్ని తమకు ఎందుకు చెప్పలేదంటూ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాయి. చివరికి ఆ దుర్వార్తను కూడా టీవీల ద్వారా తెలుసుకోవాల్సి వచ్చిందని కన్నీటిపర్యంతమయ్యాయి. "ప్రభుత్వం మమ్మల్ని ఇన్నేళ్లపాటు అజ్ఞానంలో ఉంచేసింది. దాదాపు నాలుగేళ్లు గడిచాక ఇప్పుడు దిగ్భ్రాంతికర ప్రకటన చేసింది. సుష్మాస్వరాజ్ వద్దకు 11-12 సార్లు వెళ్లాం. తమకు అందిన సమాచారం ప్రకారం వారు సజీవంగానే ఉన్నారని ఆమె చెప్పారు. ఉగ్రవాదుల చెర నుంచి తప్పించుకొని వచ్చిన హర్జీత్ అబద్ధమాడుతున్నాడని తెలిపారు. మరి ఇప్పుడు అకస్మాత్తుగా ఈ ప్రకటనేంటి? మా దగ్గర సమాచారమే లేదని మొదటే ప్రభుత్వం చెప్పాల్సింది" అని నిషాన్ అనే మృతుడి సోదరుడు సర్వాన్ వాపోయాడు. తన సోదరుడితో చివరిసారిగా 2014 జూన్ 21న మాట్లాడానని చెప్పాడు. ఇది ప్రభుత్వపరంగా పెద్ద వైఫల్యమని దుయ్యబట్టారు. "వేరేకు చెందిన నర్సులను కాపాడిన ప్రభుత్వం.. మా వాళ్లను ఎందుకు రక్షించలేకపోయింది" అని ప్రశ్నించారు. ఊచకోతలో ప్రాణాలు కోల్పోయిన మజీందర్ సింగ్ సోదరి గుర్పిందర్ కౌర్ కూడా ఇవే ప్రశ్నలను లేవనెత్తారు. తన సోదరుడు జీవించిఉన్నాడని విశ్వసించానని, ఆ విషయాన్ని టీవీ ద్వారానే తెలుసుకున్నా అని గద్గద స్వరంతో చెప్పారు. వ్యవసాయం చేసుకునే మజీందర్‌కు కొందరు తప్పుడు ఏజెంట్లు ఇరాక్ పంపారని వాపోయారు. "నా సోదరుడి నుంచి ఒకరోజు ఫోన్‌కాల్ వచ్చింది. ఉగ్రవాద చర్యల వల్ల తాను ఇరాక్‌లో చిక్కుకుపోయానని పేర్కొన్నారు. బయటకు రావడం కష్టంగా ఉందన్నాడు" అని పేర్కొన్నారు. ప్రభుత్వం సానుభూతి మాటలు చెప్పింది కానీ ఏ చర్యలూ చేపట్టలేదని దుయ్యబట్టారు. గత ఏడాది అక్టోబర్‌లో మృతుల కుటుంబాల నుంచి డీఎన్ఏ నమూనాలు సేకరించారని చెప్పారు. "నా మనస్సు అప్పుడే కీడు శంకించింది. డీఎన్ఏ సేకరణకు కారణాలను ప్రభుత్వం అప్పట్లో చెప్పలేదు" అని దుయ్యబట్టారు. మరో మృతుడు గోబిందర్ సింగ్ కుటుంబం కూడా టీవీ ఛానళ్ల ద్వారానే ఈ దుర్వార్తను తెలుసుకుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి నిర్ధారణ రాలేదని గోబిందర్ సోదరుడు దేవేందర్ సింగ్ చెప్పారు. మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని, అతడి కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కేంద్రం తమకు తప్పుడు హామీలు ఇచ్చిందని ధర్మిందర్ కుమార్ అనే మృతుడి సోదరి డింపుల్‌జీత్ కౌర్, రంజిత్ సింగ్ అనే హతుడి తల్లి బల్వీందర్ కౌర్ వాపోయారు.



తమ కుటుంబ సభ్యుల ఆచూకీ తెలుసుకోవడంలో సహకరించాలని కోరుతూ ఫిబ్రవరి 7, 2016న సుష్మాస్వరాజ్‌ను దిల్లీలో కలిసి విన్నవిస్తున్న 39 మందికి చెందిన కుటుంబ సభ్యులు

రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలి: కాంగ్రెస్

దిల్లీ: ఇరాక్‌లో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు 39 మంది భారతీయుల్ని పొట్టనపెట్టుకున్న ఘటనలో ప్రభుత్వ స్పందన తీరును విపక్షాలు తప్పుపట్టాయి. బందీలు సురక్షితంగా ఉన్నారని ఇన్నాళ్లుగా మభ్యపెడుతూ లేనిపోని ఆశలు కల్పించారని, ఇప్పుడు మృతుల కుటుంబీకులకు ముందుగా సమాచారం ఇవ్వకపోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించాయి. 39 మంది ప్రాణాలు కోల్పోవడం దిగ్భ్రాంతికరమని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు రూ.కోటి చొప్పున కేంద్రం పరిహారం చెల్లించి క్షమాపణ కోరాలని పార్టీ డిమాండ్ చేసింది. బాధిత కుటుంబాలకే కాకుండా యావత్ జాతికి ఇది విషాదమని గులాంనబీ ఆజాద్ వ్యాఖ్యానించారు. ప్రజలకు తప్పుడు సమాచారం ఇవ్వడం క్రూరత్వమని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అన్నారు. మూడేళ్లుగా దేశాన్ని ఎందుకు మభ్యపెట్టారని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రశ్నించారు. మృతుల విషయాన్ని ముందుగా కుటుంబీకులకు చెప్పకుండా పార్లమెంటులో వెల్లడించడం అమానుషమని లోక్‌సభలో సీపీఎం నేత మహ్మద్ సలీం చెప్పారు. తమ వారు లేరనే విషయాన్ని బాధిత కుటుంబాలు ప్రభుత్వం నుంచి కాకుండా టీవీ వార్తల ద్వారా తెలుసుకోవాల్సి రావడం క్షమార్హం కాదని నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా ఆక్షేపించారు. కుటుంబాలకు పరిహారం చెల్లించడంతో పాటు మృతుల అంత్యక్రియలకు అవసరమైన ఏర్పాట్లన్నీ చేయాలని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్‌కు పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ కోరారు. సుష్మా రాజీనామా చేయాలని ఆమ్‌ఆద్మీ పార్టీ నేత కన్వర్ సంధు డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌వి చౌకబారు రాజకీయాలు: స్వరాజ్

తామెప్పుడూ ఎవరికీ తప్పుడు ఆశలు కల్పించలేదని, తప్పుడు పత్రం పట్టించలేదని సుష్మాస్వరాజ్ విలేకరుల సమావేశంలో స్పష్టంచేశారు. కాంగ్రెస్ చౌకబారు రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. పార్లమెంటరీ పద్ధతుల్ని అనుసరించే ముందుగా పార్లమెంటుకు విషయం తెలిపానని సమర్థించుకున్నారు. బాధ్యతాయుత ప్రభుత్వంగా బలమైన ఆధారాలు చేతిలో లేకుండా మరణాలను ధ్రువీకరించలేమని చెప్పారు. ఉగ్రవాదుల చెర నుంచి తప్పించుకున్న ఏకైక వ్యక్తి హర్జీత్ తన పేరును ఆలీగా మార్చుకుని, బంగ్లాదేశ్ వాసిగా బయటపడ్డాడని వివరించారు.

మూడేళ్లుగా చెబుతూనే ఉన్నా నమ్మలేదు

ఐసిస్ చెర నుంచి తప్పించుకున్న హర్జీత్ వ్యాఖ్య



చండీగఢ్: ఇరాక్‌లో ఐసిస్ ఉగ్రవాదుల చెరలో ఉన్న 39 మంది భారతీయులు ఊచకోతకు గురయ్యారని తాను మూడేళ్లుగా చెబుతూనే ఉన్నానని.. నాటి ఘటనలో తప్పించుకున్న హర్జీత్ మాసిహ్ పేర్కొన్నాడు. అయితే ప్రభుత్వం తన వాదనను తిరస్కరించిందన్నాడు. పంజాబ్ పోలీసులు తనపై పెట్టిన మానవ అక్రమ రవాణా కేసును ఉపసంహరించాలని డిమాండ్ చేశాడు. తాను ఆరునెలల పాటు జైల్లో గడిపి, బెయిలుపై విడుదలయ్యానన్నాడు. అక్రమ రవాణాతోపాటు మోసం వంటి కేసులనూ ప్రభుత్వం బనాయించిందని ఆరోపించాడు. తన ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందని, వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నానని చెప్పారు. ప్రభుత్వం తనకు ఉద్యోగం ఇవ్వాలన్నాడు. ఇరాక్ నుంచి భారత్‌కు తిరిగొచ్చాక.. ప్రభుత్వ అధికారులు తనను దిల్లీ, బెంగళూరు, గురుగ్రామ్‌లో నిర్బంధించారని హర్జీత్ చెప్పాడు. "మిగతా 39 మంది మరణించారని ఎవరితోనూ చెప్పవద్దని నాకు స్పష్టంచేశారు. వారి గురించి నాకు ఎలాంటి సమాచారం లేదని చెప్పమన్నారు" అని పేర్కొన్నాడు. హర్జీత్ స్వస్థలం.. పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లా కాలా అఫ్గానా గ్రామం.

ఎంపీల విందును రద్దుచేసిన వెంకయ్యనాయుడు

ఈనాడు, దిల్లీ: ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాజ్యసభాధ్యక్షుడి హోదాలో పెద్దల సభ సభ్యుల కోసం ఈనెల 21న తలపెట్టిన విందును రద్దు చేశారు. గత రెండు వారాలుగా సభ స్తంభించిపోయిన నేపథ్యంలో విందు చేసుకోవడం భావ్యం కాదన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. బుధవారం రాజ్యసభ సభ్యులందరికీ విందు ఇవ్వాలని ఆయన తొలుత ప్రతిపాదించారు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, వివిధ పక్షాల నేతలు, ప్రధాన ప్రతిపక్ష నాయకుడితో మాట్లాడి, ఆహ్వాన పత్రికలను కూడా సిద్ధం చేశారు. రెండు వారాలుగా తుడిచిపెట్టుకుపోయిన సభా కార్యకలాపాలు సోమవారం నుంచైనా సజావుగా సాగుతాయనుకుంటే తద్విరుద్ధంగా మూడోవారం తొలిరోజూ సభ స్తంభించిపోవడంతో ఆయన విందును రద్దు చేశారు. ఎలాంటి పనిచేయకుండా ఇలా విందు చేసుకోవడం బాగుండదన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రత్యేక వంటవాళ్లను రప్పించాలనుకున్నప్పటికీ చివరి నిమిషంలో అందరికీ వద్దని చెప్పారు. గత వారం కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఎంపీల బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించడానికూడా వెంకయ్యనాయుడు నిరాకరించారు.

నా వెనక దేవుడు, ప్రజలు ఉన్నారు: రజనీ

తమిళ ఉగాది ఏప్రిల్14న పార్టీ ప్రకటన..?



పోయెస్‌గార్డెన్‌లో మాట్లాడుతున్న రజనీ

ఈనాడు డిజిటల్, చెన్నై: తన వెనుక దేవుడు, ప్రజలు ఉన్నారని సూపర్‌స్టార్ రజనీకాంత్ అన్నారు. ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా రెండు వారాల పాటు హిమాలయాలకు వెళ్లిన రజనీకాంత్ మంగళవారం చెన్నై తిరిగి వచ్చారు. రెండు వారాల పాటు తన పర్యటన ఆశాజనకంగా సాగిందని ఆయన వివరించారు. తన వెనుక భాజపా ఉండి నడిపిస్తోందన్న ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. రాష్ట్రంలో రామరథ యాత్రపై ఆంక్షలు సరికాదని పేర్కొన్నారు. పుదుకోట్టైలో పెరియార్ విగ్రహం ధ్వంసాన్ని ఖండించారు. ఇలాంటి చర్యలు సమాజానికి మంచివి కావని వివరించారు. తదుపరి రాజకీయ కార్యకలాపాలు కొనసాగుతాయని ప్రకటించారు. రాష్ట్రంలోని వివిధ అంశాలు, సమస్యలపై రజనీకాంత్ స్పందించడం లేదని సాగుతున్న ప్రచారానికి ముగింపు పలికేలా ఆయన సన్నాహాలు చేసుకుంటున్నారు. తమిళ ఉగాది ఏప్రిల్ 14న సొంత పార్టీని ప్రారంభించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారని సమాచారం. ఆయన సహచరుడు కమల్‌హాసన్ ఇప్పటికే ఎంఎన్ఎంను మదురైలో ప్రారంభించారు. టీటీవీ దినకరన్ కూడా మదురైలోనే పార్టీని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో రజనీకాంత్ ఎక్కడినుంచి పార్టీని ప్రారంభించనున్నారన్న అంశంపై ఆసక్తి నెలకొంది.

శశికళ భర్త నటరాజన్ కన్నుమూత



ఈనాడు డిజిటల్, చెన్నై-బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి వి.కె.శశికళ భర్త నటరాజన్ మరుతప్ప (74) మృతి చెందారు. గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన్ను ఇటీవలే చెన్నై నగరంలోని గ్లోబల్ ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. అక్కడే చికిత్సపొందుతూ మంగళవారం తెల్లవారుజామున 1.35కు తుదిశ్వాస విడిచారు. బెంగళూరు శివారులోని పరప్పన అగ్రహార చెరసాలలో ఉన్న శశికళకు ఈ నేపథ్యంలో 15 రోజుల పెరోల్ మంజూరైంది. మంగళవారం ఉదయం నటరాజన్ మృతదేహాన్ని బెసెంట్ నగర్‌లోని నివాసానికి తరలించారు. పుదుచ్చేరి ముఖ్యమంత్రి నారాయణస్వామి, డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, ఎండీఎంకే నేత వైగో, ఏఎంఎంకే నేత టీటీవీ దినకరన్, వామపక్ష నాయకులు, శశికళ కుటుంబ సభ్యులు వివేక్, జై ఆనంద్, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ నటరాజన్ తమిళ భాషాభిమాని అని, విద్యార్థిగా ఉన్నప్పుడే ఆయన హిందీ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారని పేర్కొన్నారు. బుధవారం తంజావూరులో నటరాజన్ అంత్యక్రియలు నిర్వహిస్తారు.

2జీ స్పెక్ట్రం కేసు తీర్పుపై దిల్లీ హైకోర్టుకు సీబీఐ

చెన్నై, న్యూస్‌టుడే: 2జీ స్పెక్ట్రం కేసు నుంచి కేంద్ర మాజీ మంత్రి రాజా, డీఎంకే ఎంపీ కనిమొళి తదితరులను విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ సీబీఐ మంగళవారం దిల్లీ హైకోర్టులో అప్పీలు దాఖలు చేసింది. ఈ అవినీతి వల్ల ప్రభుత్వానికి రూ.కోట్ల నష్టం వాటిల్లిందంటూ కొన్నేళ్ల క్రితం సీబీఐ కేసు నమోదుచేసిన విషయం తెలిసిందే. విచారణ అనంతరం కనిమొళి, రాజా సహా 17 మంది నిందితులను విడుదల చేస్తూ ప్రత్యేక న్యాయస్థానం ఇటీవల తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ తీర్పును సవాలు చేస్తూ సీబీఐ అప్పీలు దాఖలు చేసింది.

ఇసుక తవ్వకాలపై విధాన రూపకల్పన

- గనులు, ఖనిజాల జాతీయ సమాలోచన సదస్సులో ఆవిష్కరించిన కేంద్ర మంత్రి

దిల్లీ: నిర్మాణ రంగానికి అత్యంత కీలక వనరు అయిన ఇసుక లభ్యత, సరఫరా, అక్రమ తవ్వకాల నిరోధానికి సంబంధించిన సమస్యల పరిష్కారంలో రాష్ట్రాలకు చేయూతనందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఓ విధాన రూపకల్పన చేసింది. మంగళవారం దిల్లీలో నిర్వహించిన జాతీయ గనులు, ఖనిజాల సమాలోచన సదస్సులో కేంద్ర గనుల శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమార్ దీనిని ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వాలతో విస్తృతంగా సంప్రదించి ఈ విధానాన్ని రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. కేంద్రం రూపొందించిన విధానం...రాష్ట్రాలు తమకున్న ప్రత్యేక పరిస్థితులు, వనరుల అందుబాటు ఆధారంగా సొంత విధానాలను తయారు చేసుకోవటానికి వీలుకల్పిస్తుందన్నారు. ఇసుక గిరాకీ-సరఫరాను అంచనా వేయటం, ఇసుక లభ్యతను గుర్తించటం, రవాణా, ఈ ప్రక్రియలన్నిటినీ పరిశీలించే యంత్రాంగం ఏర్పాటు ఈ విధానంలో భాగంగా ఉంటాయి. ఇసుకకు ప్రత్యామ్నాయాలను గుర్తించటం, అవసరమైతే దిగుమతిచేసుకోవటం, ఇసుక క్షేత్రాల తవ్వకాలకు సత్వర అనుమతులు వంటివీ ఇమిడిఉంటాయి.

68 ఇసుక క్షేత్రాలు... రూ.1.43 లక్షల కోట్ల ఆదాయం

ఖనిజాల వేలం నిబంధనలు-2015కు గత ఏడాది సవరణలు తీసుకొచ్చిన అనంతరం ఇసుక క్షేత్రాల(శాండ్ బ్లాక్స్) వేలంలో ఇబ్బందులు తొలగి ఆ ప్రక్రియ వేగం పుంజుకుందని నరేంద్ర సింగ్ తోమార్ తెలిపారు. గత ఏడాది 68 ఇసుక క్షేత్రాల వేలం ద్వారా రాష్ట్రాలకు లీజు కాలానికి రూ.1.43 లక్షల కోట్ల ఆదాయం లభించే అవకాశం దక్కిందన్నారు. ప్రధాన మంత్రి ఖనిజ్ క్షేత్ర కల్యాణ్ యోజన (పీఎంకేకేకేవై) పోర్టల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ పోర్టల్ ద్వారా గనుల లీజు వ్యవస్థ (మైనింగ్ టెనెమెంట్ సిస్టమ్-ఎంటీఎస్) రిజిస్ట్రేషన్లు, ఆదాయాల పరిశీలనకు వీలుకలుగుతుంది. దేశవ్యాప్తంగా ఇసుక క్షేత్రాల గుర్తింపు మొదలు తవ్వకాల అనంతరం దానిని మూసివేసే వరకు జరిగే ప్రక్రియలన్నిటి సమాచారాన్ని ఇది సమకూర్చుకుంటుంది. జిల్లా గనుల సంస్థలు (డీఎంఎఫ్) సేకరించే నిధులను గనుల తవ్వకాలతో ప్రభావితమైన ప్రాంతాల అభివృద్ధికి పీఎంకేకేకేవై ద్వారా వినియోగిస్తారు.

ప్రతిష్టంభన తొలగించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదు: విపక్షం

దిల్లీ: పార్లమెంటులో నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించే ఉద్దేశం ప్రభుత్వానికి ఏమాత్రం లేదనీ, బ్యాంకు కుంభకోణాలు సహా కీలకమైన అంశాలపై సభల్లో చర్చ జరగకుండా చూడడానికే ఇలాంటి కుట్రకు పాల్పడుతోందనీ విపక్షాలు ఆరోపించాయి. రాజ్యసభ విపక్ష నేత గులాంనబీ ఆజాద్ కార్యాలయంలో మంగళవారం వివిధ ప్రతిపక్షాల నేతలు సమావేశమై పార్లమెంటులో నెలకొన్న పరిస్థితిని చర్చించారు. పార్లమెంటును నడపడంపై ప్రభుత్వానికి ఆసక్తి లేదనీ, చట్టసభల పరిశీలనను తప్పించాలనే చూస్తోందనీ వారు ఆరోపించారు. జాతీయస్థాయి ప్రాధాన్యం ఉన్న అంశాలను చర్చించాలని తామంతా కోరుకుంటున్నా ప్రభుత్వం మాత్రం చొరవ చూపించకుండా పారిపోతోందనీ ఆజాద్ చెప్పారు. బ్యాంకు కుంభకోణాలపై చర్చకు ప్రభుత్వం చాలా భయపడుతోందని ఆరోపించారు. ఒక్క సీనియర్ మంత్రి అయినా ప్రతిపక్షంతో మాట్లాడలేదని గుర్తుచేశారు. గందరగోళం మధ్య ఆర్థిక బిల్లును ఆమోదించగా లేనిది అవిశ్వాసంపై చర్చ ఎందుకు చేపట్టడం లేదని కాంగ్రెస్ చీఫ్ విప్ జ్యోతిరాదిత్య సింధియా ప్రశ్నించారు. సమావేశంలో కాంగ్రెస్‌తో పాటు తృణమూల్, బీఎస్పీ, ఎస్పీ, ఎన్సీపీ, డీఎంకే, సీపీఐ, సీపీఎం, జేఎంఎం సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీల తీరుకు రాహుల్ కారణం: సుష్మ

ఇరాక్ ఘటనపై లోక్‌సభలో ప్రకటన చేసేందుకు తాను ప్రయత్నించినప్పుడు కాంగ్రెస్ సభ్యులు అనుసరించిన వైఖరికి ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీయే కారణమని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యులు రాజకీయ లక్ష్మణరేఖల్ని అతిక్రమించారనీ, సభలో ప్రశాంతత నెలకొనకుండా చూడాలని వారికి రాహుల్ ఆదేశించారనీ ఆమె చెప్పారు. మృతులపైనా రాజకీయాలు చేయాలా అని ప్రశ్నించారు.



పద్మ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని మోదీ, హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తదితరులు ◆ రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ నుంచి పద్మవిభూషణ్ అవార్డులను స్వీకరిస్తున్న పి.పరమేశ్వరన్, ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్, పద్మభూషణ్ అవార్డులను స్వీకరిస్తున్న ప్రొ.వేద్‌ప్రకాశ్ నందా, ఫిలిపోస్ మార్ క్రిసోస్తొమ్ థామా వాల్యా మెట్రోపాలిటన్, పద్మశ్రీ అందుకుంటున్న నారాయణ్‌దాస్

ఇళయరాజాకు పద్మవిభూషణ్ ప్రదానం

ముస్తాఫా ఖాన్, పరమేశ్వరన్‌లకూ అవార్డులు అందించిన రాష్ట్రపతి

దిల్లీ: సంగీత సామ్రాట్ ఇళయరాజా, హిందుస్థానీ శాస్త్రీయ సంగీత విద్వాంసుడు గులాం ముస్తాఫా ఖాన్, హిందుత్వ సిద్ధాంతకర్త పరమేశ్వరన్ పరమేశ్వరన్‌లతో పాటు 43 మంది ప్రముఖులకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పద్మ పురస్కారాలను ప్రదానంచేశారు. రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, పలువురు క్యాబినెట్ మంత్రులు హాజరయ్యారు. ఇళయరాజా, ముస్తాఫా ఖాన్, పరమేశ్వరన్‌లకు పద్మవిభూషణ్‌ను ప్రదానంచేశారు. క్రైస్తవ మతగురువు ఫిలిప్స్ మార్ క్రిసోస్టామ్, పురాతత్వశాస్త్రవేత్త రామచంద్రన్ నాగస్వామి, న్యాయ నిపుణుడు వేద్ ప్రకాశ్ నంద, హిందుస్థానీ శాస్త్రీయ సంగీత గాయకుడు పండిట్ అరవింద్ పరీఖ్‌లకు పద్మ భూషణ్ అందించారు. పద్మశ్రీ అవార్డులు అందుకున్న ప్రముఖుల్లో ఐఐటీ కాన్పూర్ పూర్వవిద్యార్థి అరవింద్ గుప్తా, ఆయుర్వేద వైద్య నిపుణురాలు లక్ష్మీకుట్టీ తదితరులున్నారు.

మాట నిలబెట్టుకోని మోదీకి గుణపాఠం

- సంఘ సంస్కర్తల ఆశయాలకు భాజపా తిలోదకాలు
- ప్రచార సభలో రాహుల్‌గాంధీ ధ్వజం



ఉడుపి జిల్లా యర్మాళులో నీరుదోసె-రొయ్యల కూరతో అల్పాహారాన్ని ఆరగిస్తున్న రాహుల్‌గాంధీ తదితరులు

పడుబిద్రి నుంచి ఈనాడు ప్రతినిధి: ఇచ్చిన మాట నిలబెట్టుకోని ప్రధాని నరేంద్రమోదీకి ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి మంగుళూరులో, అంతకుముందు అరేబియా సాగర తీరంలోని ఉడుపి జిల్లా పడుబిద్రిలో నిర్వహించిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభలలో ఆయన ప్రసంగించారు. సంఘ సంస్కర్తలు బసవేశ్వరుడు, నారాయణగురు నామస్మరణ చేస్తున్న భాజపా నేతలు ఆచరణలో వారి ఆశయాలు, ఆకాంక్షలకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. పది మంది బడా శ్రీమంతుల రుణాలు రూ.2.50 లక్షల కోట్లను మాఫీ చేసిన నరేంద్రమోదీ ప్రభుత్వం. . రైతు రుణాలను మాఫీ చేసేందుకు మాత్రం ససేమిరా అంటోందని విమర్శించారు. గోవా, మేఘాలయ, మణిపుర్ రాష్ట్రాల్లో డబ్బు సంచులను కుమ్మరించి రాజ్యాధికారాన్ని కొనుక్కున్నారని ఆరోపించారు. 'వాళ్లు పదవుల కోసం ఏమైనా చేస్తారు.. కాంగ్రెస్ దేశం కోసం ఏమైనా చేస్తుంది. ఇదీ రెండు పార్టీల మధ్య వ్యత్యాసం' అని పేర్కొన్నారు. గుజరాత్ విద్యా రంగంలో దారుణంగా వెనుకబడిందని, 90 శాతం విద్యా సంస్థలను ప్రభుత్వ రంగం నుంచి తప్పించి శ్రీమంతులకు అప్పగించారని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో విదేశాల నుంచి భారతీయుల నల్లధనాన్ని తెప్పించి మన దేశ పౌరుల బ్యాంకు ఖాతాల్లో రూ.15 లక్షల చొప్పున జమ చేస్తానన్న నరేంద్రమోదీ నాలుగేళ్లు గడిచినా కనీసం పది రూపాయలైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఏడాదికి రెండు కోట్ల మందికి ఉద్యోగావకాశాలిస్తామని చెప్పారని, నాలుగేళ్ల వ్యవధిలో ఏడాదికి లక్ష ఉద్యోగాలివ్వడమే గగనమైందని ఆరోపించారు. 60 ఏళ్లలో దేశం ఏ మాత్రం ప్రగతి సాధించలేదని నరేంద్రమోదీ పదేపదే ప్రచారం చేయటం దేశ ప్రజలను అవమానించటమేనని పేర్కొన్నారు. కోట్ల మంది పేదలు, రైతులు, చిల్లర వ్యాపారులు, కార్మికులు స్వేదం చిందించి దేశాన్ని ప్రపంచ దేశాలతో సరిసమానంగా, తల ఎత్తుకునేలా చేశారని శ్లాఘించారు. రాజకీయ లబ్ధి కోసం సమాజంలో చిచ్చుపెట్టటం వారి దైనందిన కార్యక్రమమని ఆరోపించారు. మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో మంగళూరుకు వచ్చిన రాహుల్‌గాంధీ ఉడుపి జిల్లా ఎర్నాల్‌తెంకి గ్రామంలో 30 మత్స్యకారుల కుటుంబాల మహిళలతో మాట్లాడారు. దక్షిణ కర్ణాటకలో పేరుగాంచిన అల్పాహారం నీరు దోసే, చేపల కూరను ఆరగించారు. అనంతరం గ్రామంలోనే నిర్మించిన సేవాదళ్ కార్యకర్తల శిక్షణ కేంద్రం 'రాజీవ్‌గాంధీ రాజకీయ విద్యా సంస్థ' భవంతిని లాంఛనంగా ప్రారంభించారు.

ఎస్సీ, ఎస్టీ చట్టం కింద తక్షణ అరెస్టులు వద్దు:సుప్రీం

దిల్లీ: షెడ్యూల్ కులాలు, తెగలపై అకృత్యాల నిరోధక చట్టం (ఎస్సీ, ఎస్టీ యాక్ట్) కింద నమోదయ్యే తప్పుడు కేసులతో ప్రభుత్వ సేవకులు వేధింపులకు గురికాకుండా చూసేందుకు సుప్రీం కోర్టు వరుస ఆదేశాలు జారీచేసింది. "కేసు నమోదైన వెంటనే తప్పనిసరిగా అరెస్టు"అనే కఠిన నిబంధనను సడలించింది. ఈ అంశంపై జస్టిస్ ఆదర్శ్ గోయెల్, జస్టిస్ యూయూ లలిత్‌లతో కూడినధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. వీటిని అనుసరించని పక్షంలో క్రమశిక్షణ, కోర్టు ధిక్కార చర్యలనూ ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఈ ఆదేశాలన్నీ తక్షణమే అమలులోకి వస్తున్నట్లు వివరించింది.

ఎంబీబీఎస్ తర్వాత ఆ అర్హత పరీక్ష వద్దు!

- పార్లమెంటు స్థాయిసంఘం సిఫార్సులు

ఈనాడు, దిల్లీ: వైద్య విద్యార్థులు ఎంబీబీఎస్ తర్వాత ప్రాక్టీస్ చేయాలన్నా.. పీజీకి దరఖాస్తు చేసుకోవాలన్నా జాతీయ అర్హత పరీక్ష (నేషనల్ లైసెన్సియేట్ ఎగ్జామినేషన్) ఉత్తీర్ణతను తప్పనిసరి చేస్తూ కొత్త జాతీయ వైద్య కమిషన్ బిల్లులో పొందుపరిచిన నిబంధనను పార్లమెంటరీ స్థాయిసంఘం తప్పుపట్టింది. దీంతో విద్యార్థులపై తీవ్రఒత్తిడితో పాటు, ప్రజారోగ్యానికి సంబంధించి కూడా ఇబ్బందులు ఎదురవుతాయని స్పష్టంచేసింది. వివిధ విశ్వవిద్యాలయాలు నిర్వహించే పరీక్షల పవిత్రతను తక్కువచేసే అవకాశం ఉంటుందని, కొంతకాలానికి దేశంలో జనాభా, వైద్యుల నిష్పత్తిలో అంతరం తీవ్రమవుతుందని పేర్కొంది. ఈ నిబంధన వద్దంటూ.. ఎంబీబీఎస్ చివరి సంవత్సరం పరీక్షల్లోనే దీన్ని అంతర్భాగం చేయాలని సిఫార్సు చేసింది. సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు రామ్‌గోపాల్ యాదవ్ నేతృత్వంలోని వైద్య, ఆరోగ్యశాఖ స్థాయిసంఘం మంగళవారం పార్లమెంటు ముందుంచిన నివేదికలో పలు సిఫార్సులు చేసింది.

- ◆ ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఫీజుల నియంత్రణ.. రాష్ట్రాల్లో ఇప్పుడున్న నియంత్రణ వ్యవస్థ కొనసాగింపు. డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో 50% సీట్ల ఫీజుల నియంత్రణకు ప్రత్యేక వ్యవస్థ. అన్ని పారా మెడికల్ సేవలకు రెగ్యులేటరీ/లైసెన్సింగ్/అక్రిడిటేషన్ నిబంధనలు.
- ◆ కొత్తగా వచ్చే జాతీయ వైద్య కమిషన్ సభ్యులుగా నియమితులయ్యేవారు బాధ్యతలు చేపట్టేటప్పుడు, వైదొలిగేటప్పుడు వెబ్‌సైట్‌లో తమ బంధువుల వృత్తి, వాణిజ్యపరమైన సంబంధాలను ముందుగానే ప్రకటించాలి. ఇదే తరహాలో డెంటల్, నర్సింగ్ మండళ్ల ఏర్పాటు.
- ◆ ఎంబీబీఎస్ అనంతరం దేశంలో కనీసం కొంతకాలం సేవలందించిన తర్వాతే బయటికెళ్లేలా నిబంధనలు. గ్రామీణ ప్రాంతాల్లో కచ్చితంగా ఏడాదిపాటు పనిచేయడం. ప్రభుత్వాలు కూడా గ్రామాల్లో వైద్యపరంగా మౌలిక వసతులు కల్పించాలి. సిబ్బందిని నియమించడంతో పాటు గౌరవప్రదమైన వేతనం ఇవ్వాలి.
- ◆ ఎన్ఎంసీ బిల్లులో బ్రిడ్జికోర్సును తప్పనిసరి నిబంధనగా చేర్చరాదు.
- ◆ ఆయుష్ ప్రాక్టీషనర్లతోపాటు, బీఎస్సీ నర్సింగ్, బీడీఎస్, బీఫార్మా వారి సామర్థ్యాలను పెంచే కోర్సులను నిర్వహించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకే వదిలిపెట్టాలి. సరైన అర్హతల్లేకుండా వైద్యవృత్తి చేపట్టేవారిపై క్రిమినల్ కేసుల నమోదు.

అంగుళం స్థలాన్నీ వదులుకోం

- ప్రత్యర్థులతో యుద్ధానికీ సిద్ధమే: జిన్‌పింగ్



బీజింగ్: తమ దేశ భూభాగం నుంచి అంగుళం స్థలాన్ని కూడా వదులుకోబోమని చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ స్పష్టం చేశారు. ప్రపంచంలో తమదైన స్థానం సాధించేందుకు ప్రత్యర్థులతో యుద్ధానికి దిగడానికైనా తాము సిద్ధమని ఆయన అన్నారు. పార్లమెంటు (ఎన్‌పీసీ) సమావేశాల ముగింపు సందర్భంగా మంగళవారం చేసిన ప్రసంగంలో జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే భారత్‌తోపాటు, జపాన్, వియత్నాం తదితర దేశాలతో తమకున్న భూ, సముద్ర సరిహద్దు వివాదాలను ఆయన ప్రస్తావించలేదు. అందుకోవాల్సిన స్థానాన్ని దక్కించుకునేందుకు చైనాకు అన్ని సామర్థ్యాలున్నాయని జిన్‌పింగ్ అన్నారు. "గొప్ప కల కోసం 170 ఏళ్లుగా పోరాడుతున్నాం. ఇప్పుడు ఆ కలను సాకారం చేసుకోవడానికి అత్యంత చేరువగా ఉన్నాం. దేశ సార్వభౌమత్వాన్ని మనం రక్షించుకోవాలి. పూర్తి స్థాయిలో దేశ ఏకీకరణను సాధించాలి. వేర్పాటువాదులను ఉపేక్షించేది లేదు. అలాంటివారికి.. చరిత్రలో నిలిచిపోయే శిక్షలు తప్పవు" అంటూ బౌద్ధ గురువు దలైలామా, తైవాన్ వేర్పాటువాదులను పరోక్షంగా జిన్‌పింగ్ హెచ్చరించారు. ఇటు విస్తరణ కాంక్ష, వేరే దేశాలపై పెత్తనం చేయాలన్న యోచన తమ దేశానికెప్పుడూ లేదని.. బెదిరించడం అలవాటుగా ఉన్నవారే మిగతావారి నుంచి తమకు ప్రమాదముందని భావిస్తుంటారని పరోక్షంగా అమెరికాకు చురకలు అంటించారు. దేశంలో పాలక కమ్యూనిస్టు పార్టీయే సర్వోన్నతమైనదని.. సైన్యం, ఇతర ప్రభుత్వ విభాగాలు దాని నాయకత్వంలోనే పనిచేయాలని మరోసారి నొక్కివక్కాణించారు. ఇటు దేశీయ, విదేశీ పెట్టుబడిదారులకు సమానమైన అవకాశాలను కల్పిస్తామని చైనా ప్రధాని లీ కెక్వియాంగ్ అన్నారు.

జిన్‌పింగ్‌తో మోదీ ఫోన్ సంభాషణ: చైనా అధ్యక్షుడిగా ఇటీవల రెండో దఫా ఎన్నికైన షి జిన్‌పింగ్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం టెలిఫోన్‌లో సంభాషణ జరిపారు. రెండోసారి పదవి చేపట్టినందుకు జిన్‌పింగ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటు సోమవారం చైనా సామాజిక మాధ్యమం వీబో వేదికగానూ.. జిన్‌పింగ్‌కు మోదీ అభినందనలు తెలిపారు.

రైతుల వివరాలు నేడు వ్యవసాయశాఖకు అప్పగింత

కలెక్టర్లకు సీసీఎల్‌ఏ ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: రైతుల భూముల రెవెన్యూ ఖాతాల వివరాలన్నీ వెంటనే వ్యవసాయశాఖకు అప్పగించాలని రాష్ట్ర భూపరిపాలనా ప్రధాన కమిషనర్ రాజేశ్వర్ తివారీ కలెక్టర్లను ఆదేశాలిచ్చారు. వాస్తవానికి ఈ సమాచారం మొత్తం ఈనెల 8నాటికే ఇవ్వాలని గతంలో ఆదేశించినా 72లక్షల ఖాతాలకుగాను తహసీల్దార్లు ఇప్పటివరకూ 67లక్షల ఖాతాలు సక్రమంగా ఉన్నట్లు ఆమోదించారు. వీటిలో 57లక్షల ఖాతాలనే ఇప్పటికి పట్టాదారు పాసు పుస్తకాల ముద్రణకు అనుమతించారు. ఇటీవల కొన్ని జిల్లాల్లో పర్యటించినప్పుడు రెవెన్యూ ఖాతా వివరాలకు క్షేత్రస్థాయిలో రైతుల సమాచారానికి వ్యత్యాసమున్నట్లు గుర్తించినట్లు సీసీఎల్‌ఏ తెలిపారు. రెవెన్యూ ఖాతా సమాచారాన్ని, ముసాయిదా పాసు పుస్తకం ప్రతిని రైతుకిచ్చి పునఃపరిశీలించాలని ఆదేశించారు. తరవాత పాసు పుస్తకాల తుది ముద్రణకు అనుమతించాలని సూచించారు. భూములపై వివాదాలు, ఇతర సమస్యలుంటే వాటిని, అసైన్డ్ భూముల రైతుల వివరాలన్నీ ఈనెల 24లోగా పరిష్కరించి వ్యవసాయశాఖకు ఇవ్వాలి.

24న పీసీసీ మేళా

ఈనాడు, హైదరాబాద్: బేగంపేట్ పాస్‌పోర్టు సేవా కేంద్రంలో ఈనెల 24న తొలిసారిగా 'పీసీసీ(పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికేట్స్) మేళా'ను నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి(ఆర్పీవో) డా.ఈ.విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. కువైట్‌తో పాటు మరికొన్ని దేశాలు పాస్‌పోర్టుతో పాటు పీసీసీని తప్పనిసరి చేశాయని తెలిపారు. పీసీసీ కావాలనుకుంటే రూ.500 చెల్లించి ఆన్‌లైన్‌లో టైం స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. గతంలో పాస్‌పోర్టు జారీ చేసినప్పుడు పోలీసులు ఇచ్చిన ధ్రువపత్రం ఆధారంగా పాస్‌పోర్టు అధికారులే పీసీసీని జారీ చేశారన్నారు. ఇటీవల పీసీసీలకు డిమాండ్ పెరిగిందని, చాలామంది ఆన్‌లైన్‌లో స్లాట్స్ లభించడం లేదని ఫిర్యాదు చేస్తున్నారని, ఈ నేపథ్యంలో మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మేళాలో పాల్గొనాలనుకునే వారు పాస్‌పోర్టు వెబ్‌సైట్‌లో స్లాట్స్‌ను నమోదు చేసుకోవాలని సూచించారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ(హైదరాబాద్ విభాగం) అధికారులు పాల్గొంటున్నారని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెలంగాణలోని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లు ఒక రోజు మూల వేతనాన్ని మాజీ సైనికోద్యోగుల కుటుంబాలకు సాయం చేయడానికి సైనిక సంక్షేమ నిధికి అందజేశారు. ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందచేస్తారు. ఈ మేరకు ఆర్థికశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కర్ణాటకలో 'మైనార్టీ' రాజకీయం

- తెరమీదకు లింగాయత్‌ల మతపరమైన మైనార్టీ హోదా
- కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తుందా?
- ఆ రాష్ట్ర ఎన్నికలపై ప్రభావం చూపే అంశం

ఎన్నికల ముంగిట్లో ఉన్న కర్ణాటకలో సిద్ధరామయ్య ప్రభుత్వం, ఆ రాష్ట్రంలోని లింగాయత్‌లను 'మతపరమైన మైనార్టీలు'గా గుర్తించాలని అనూహ్యమైన నిర్ణయం తీసుకుంది. ఎన్నికల సమీకరణలపై విశేష ప్రభావం చూపేదిగా భావిస్తున్న ఈ నిర్ణయాన్ని కొన్ని వర్గాలు స్వాగతించగా, మరికొన్ని వర్గాలు వ్యతిరేకిస్తున్నాయి. ముఖ్యంగా కర్ణాటకలో అధికారంలోకి రావాలని ఆశిస్తున్న భాజపా దీన్ని సమర్థించటం లేదు. కాంగ్రెస్ పార్టీకి సైతం ఇది మేలు చేస్తుందని చెప్పలేమని కొన్ని వర్గాలు అంటున్నాయి. కానీ కర్ణాటక ఎన్నికల్లో లింగాయత్‌లు విశేష ప్రభావం చూపుతారనేది మాత్రం విస్పష్టం.



పన్నెండవ శతాబ్దానికి చెందిన సంఘ సంస్కర్త అయిన బసవణ్ణ అనుచరులే లింగాయత్‌లు. నిర్వికారుడైన పరమ శివుని లింగాయత్‌లు ప్రార్థిస్తారు. సమాజంలో పాతుకుపోయిన బ్రాహ్మణ సంప్రదాయాలను ఎదిరించి సామాన్య ప్రజలందరికీ తన బోధనలతో దగ్గరైన ఘనత బసవణ్ణ సొంతం. కుల వర్గీకరణను, వైదిక సంప్రదాయాలను ఆయన వ్యతిరేకించారు. మహిళలకు సమానస్థానం కల్పించడం, పనిలోనే దైవం ఉందని బోధించిన బసవణ్ణను కాలక్రమంలో ఎందరో అనుసరించారు. వారే లింగాయత్‌లు అయ్యారు.

మైనార్టీ హోదా ఎందుకు?

కర్ణాటకలో వీరశైవులు, లింగాయత్‌లు ఒకే మతవర్గంగా ఉన్నారు. కానీ వీరశైవులు తమను అణగదొక్కుతున్నారని, అందువల్ల తమకు మతపరమైన మైనార్టీలుగా గుర్తింపు ఇవ్వాలని లింగాయత్‌లు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. తాము వీరశైవుల మాదిరిగా హిందూమత సంప్రదాయంలోని పరమ శివుని కాకుండా, గురువు ఉపదేశం ద్వారా భగవంతుని ధ్యానించే సంప్రదాయాన్ని పాటిస్తున్నామని చెప్పుకుంటున్నారు. తమ గురువైన బసవణ్ణను, వీరశైవులు గౌరవించటం లేదనేది మరొక ఫిర్యాదు. లింగాయత్‌లు, వీరశైవులు ఒకటేనని చెబుతున్నారని లింగాయత్‌లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల తమకు మతపరమైన మైనార్టీలుగా ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని కోరుతున్నారు.

జనాభాలో 17 శాతం

- కర్ణాటక రాష్ట్ర జనాభాలో లింగాయత్‌లు 17 శాతం వరకూ ఉంటారు. ముఖ్యంగా ఉత్తర కర్ణాటకలో లింగాయత్‌లు ఎక్కువ. వీరు మొదటి నుంచీ భాజపా మద్దతుదార్లుగా ఉన్నారు.
- కర్ణాటకలోని 225 శాసనసభ నియోజకవర్గాలకుగానూ 100 నియోజకవర్గాల్లో లింగాయత్‌ల ప్రభావం ఉంటుంది.
- భాజపాకు ఉన్న లింగాయత్ ఓటు బ్యాంకును చీల్చి లబ్ధి పొందాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆకస్మికంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు మేరకు లింగాయత్‌లకు మతపరమైన మైనార్టీ హోదా ఇవ్వాలా.. వద్దా.. అనే విషయంలో కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాలి.

వీరశైవులు వేరా?

పరమ శివుని ఆరాధించే వీరశైవులది లింగాయత్‌లలోని ఉపశాఖ. వేదాలు, ఆగమ శాస్త్రాల్లోని ఆచార, వ్యవహారాలను వీరశైవులు అనుసరిస్తారు. కులవ్యవస్థను గౌరవిస్తారు. వీరు హిందువులుగానే గుర్తింపు పొందారు. కానీ శివుని మినహా ఇతర హిందూ దేవుళ్లను వీరశైవులు ఆరాధించరు. కర్ణాటకతో పాటు, కేరళ, మహారాష్ట్ర, ఆంధ్ర, తెలంగాణలో వీరశైవులు ఉన్నారు. దేశంలోని అయిదు పవిత్ర మఠాలు, వీరశైవులకు పరమ పూజ్యనీయ దర్శన స్థలాలు. అవి- కాశీ, రామేశ్వరం, ఉజ్జయిని, రంభపుర, శ్రీశైలం మఠాలు.

వీరశైవుల అభ్యంతరం!

పంచాచార్యులనే అయిదుగురు వీరశైవుల గురువులు, లింగాయత్‌లకు ప్రత్యేకంగా మైనార్టీ హోదా ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీరశైవులు, లింగాయత్‌లు వేర్వేరు కాదని, ఇద్దరూ ఒకటేననేది వీరి వాదన.

హోదా లభిస్తుందా?

ఏదైనా ఒక సామాజిక వర్గానికి మైనార్టీ హోదా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేయగలదు కానీ, మైనార్టీ హోదా ఇచ్చే అధికారం మాత్రం కేంద్ర ప్రభుత్వానిదే. అన్నీ కలిసివచ్చి లింగాయత్‌లకు మైనార్టీ హోదా లభిస్తే, విద్య, ఉద్యోగాల్లో ఇతర మైనార్టీల మాదిరిగానే అదనపు ప్రయోజనాలు లభిస్తాయి. కానీ కర్ణాటకలో ఎన్నికల వేళ ఇది అమల్లోకి వస్తుందా? కేంద్ర ప్రభుత్వం ఒప్పుకుంటుందా? అనేది సందేహాస్పదమే. ఎన్నికల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొనే కర్ణాటక ప్రభుత్వం లింగాయత్‌లకు మైనార్టీ హోదా అంశాన్ని తెర మీదకు తెచ్చిందని అక్కడి వివిధ వర్గాలు విమర్శిస్తున్నాయి. ఎటూ కేంద్రంలోని భాజపా ప్రభుత్వం దీన్ని ఒప్పుకోదని, ఏది జరిగినా తమకు లాభమేనని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. భాజపా కర్ణాటక శాఖ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడ్యూరప్ప, జాతీయ నాయకుడు జగదీష్ షెట్టార్ లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన నేతల్లో ఉన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రతిపాదనను అఖిల భారత వీరశైవ మహాసభ సమర్థించింది. కానీ సిద్ధరామయ్య విభజన రాజకీయాలు చేస్తున్నారని జేడీ(యూ) కర్ణాటక అధ్యక్షుడు హెచ్‌డీ కుమారస్వామి విమర్శించారు.

2014లో జైనులకు...

- కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 2014 జనవరిలో జైనులకు మైనార్టీ హోదా కల్పించింది.
- ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్సీల తర్వాత మైనార్టీ హోదా పొందిన ఆరో సామాజిక వర్గం జైనులు.
- 2001 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో జైనులు 0.4 శాతం (దాదాపు 42 లక్షలు) ఉన్నారు. 2014 జనాభా లెక్కల ప్రకారం జైనుల జనాభా 50 లక్షలు. వీరిలో అత్యధికులు ముంబయి నగరంలోనే ఉన్నారు.
- 2014 కంటే ముందే జైనులు రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో మైనార్టీలుగా గుర్తింపు పొంది ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో దేశవ్యాప్తంగా మైనార్టీలుగా గుర్తింపు పొందే అవకాశం జైనులకు వచ్చింది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

ఊయలే ఉరి తాడైంది



అరుణ్

కేసముద్రం, న్యూస్‌టుడే: ఊయలే ఉరి తాడుగా మారి ఓబాలుడు మరణించిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలోని బ్రహ్మంగారి తండాలో మంగళవారం చోటుచేసుకుంది. ధన్నసరి శివారు రేకులతండాకు చెందిన కేలోతు సరోజ, సుధాకర్ దంపతుల చిన్న కుమారుడు కేలోతు అరుణ్(9). బ్రహ్మంగారి తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈబాలుడు నాలుగో తరగతి చదువుతున్నాడు. అదే తండాలో అమ్మమ్మ ఉంటున్న అమ్మమ్మ ఇంటికి మంగళవారం ఒంటిపూట బడి ముగిశాక అరుణ్ తన సోదరి సంధ్యతో కలిసి వెళ్లాడు. ఇంటి ఎదుట రేకులకు కట్టిన ఊయలలో అరుణ్ ఊగుతుండగా ప్రమాదవశాత్తు తాడు ఉరిపడింది. ఇరుగు పొరుగు వారు వచ్చి చూడగా అప్పటికే అరుణ్ మరణించి ఉన్నాడు.

మూడు విడతలుగా ఎంసెట్ కౌన్సెలింగ్

- ఎన్నో సమస్యలకు పరిష్కారంగానే..
- ప్రభుత్వ కళాశాలల్లో చేరితే అసలు ధ్రువపత్రాలు ఇవ్వాల్సిందే

ఈనాడు, హైదరాబాద్: త్వరలో ప్రారంభం కానున్న (2018-19) విద్యాసంవత్సరానికి ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి జరిపే ఎంసెట్ కౌన్సెలింగ్‌లో ఈసారి 'మూడో విడత' కూడా నిర్వహించనున్నారు. ఇప్పటివరకు ఎంసెట్‌లో కేవలం రెండు విడతల కౌన్సెలింగ్ మాత్రమే జరుపుతున్నారు. ఈ రెండు విడతల విధానంలో ఇతర సంస్థల్లో సీట్లను ఆశించి, వాటిని పొందలేకపోయినవారు రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరే అవకాశాన్నీ కోల్పోతున్నారు. తప్పనిసరై రాష్ట్రంలోనే చేరాల్సి వస్తే యాజమాన్య కోటాను ఎంచుకోవాలి. వీటన్నింటికీ పరిష్కారం రెండు విడతలు పూర్తయిన తర్వాత జులై చివరి వారంలో లేదా ఆగస్టు మొదటి వారంలో మూడోవిడత కౌన్సెలింగ్ నిర్వహించడమేనని ఉన్నత విద్యామండలి, రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఒక నిర్ణయానికి వచ్చాయి. మూడో విడతలో లేదా ఆ తర్వాత కళాశాలలో బ్రాంచీలు మారేందుకు స్లైడింగ్‌కు అవకాశం ఇస్తారు. అయితే స్లైడింగ్ ద్వారా బ్రాంచి మారినవారు బోధనా రుసుం పొందేందుకు అర్హులు కాదు. వారికి కూడా ఎలా న్యాయం చేయవచ్చో అధికారులు ఆలోచిస్తున్నారు.

సీట్లు మిగిలిపోకుండా కొత్త వ్యూహం: జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకులు వచ్చిన వారు కూడా ఎంసెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొంటున్నారు. జేఎన్‌టీయూ, ఉస్మానియా అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు పొందుతున్నారు. తర్వాత ఎన్ఐటీ, ఐఐటీల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్‌కు హాజరై సీటొస్తే ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఇతర సంస్థల్లో చేరుతున్నారు. స్లైడింగ్ లేకపోవడం వల్ల ఈ సీట్లు ఖాళీగా ఉండిపోతున్నాయి. ఏటా ఈ రెండు కళాశాలల్లో 100కు పైగా సీట్లు ఖాళీగా ఉంటున్నాయి. అందుకే విశ్వవిద్యాలయం ప్రాంగణాల్లోని కళాశాలల్లో చేరేవారి నుంచి ఒరిజినల్ ధ్రువపత్రాలు తీసుకోవాలని నిర్ణయించారు.

మే మొదటివారంలోనే కళాశాలలకు అనుమతి: ఇప్పటికే కళాశాలలను తనిఖీ చేయడం పూర్తి చేసిన జేఎన్‌టీయూ మే మొదటి వారంలో అనుబంధ గుర్తింపు (అనుమతులు) జారీ చేయనుంది. ఈ జాబితాను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలికి అప్పగిస్తామని జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి ఆచార్య వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. గత మూడేళ్ల నుంచి చేసిన ప్రయత్నం వల్ల చాలావరకు ప్రైవేటు కళాశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడ్డాయని ఆయన తెలిపారు.

నెలల తరబడి తిరగాల్సిందే!

- భవన నిర్మాణ అనుమతుల్లో అంతులేని జాప్యం
- పేరుకు 21 రోజులు.. వాస్తవంలో నెలలు..
- కొర్రీలు వేసి వెనక్కి పంపుతున్నారు
- ఉత్తర్వులు వచ్చి రెండు నెలలైనా అదే జాప్యం

ఈనాడు - హైదరాబాద్: భవన నిర్మాణ అనుమతుల్లో నెలల తరబడి జాప్యం తప్పడం లేదు. తెలంగాణలో పురపాలక భవన నిర్మాణ అనుమతులకు 21 రోజుల విధానం మాటలకే పరిమితమైంది. భవన నిర్మాణ అనుమతుల్లో జాప్యాన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రక్రియను వేగవంతం చేసే లక్ష్యంగా అనుమతులు ఇచ్చేందుకు నిర్దేశించిన గడువు 30 రోజుల నుంచి 21 రోజులకు తగ్గిస్తూ రెండు నెలల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. ఇది ఉత్తర్వులకే పరిమితమైంది తప్ప ఆచరణలో అమలు కావడం లేదు. అనుమతులకు రెండు నెలలు అంతకు మించే సమయం తీసుకుంటోంది. పురపాలక శాఖ, పట్టణ ప్రణాళిక అధికారులు దరఖాస్తుల్లో లోపాలు ఉన్నాయంటూ వెనక్కి పంపిస్తున్నారు. ఫలితంగా పురపాలక శాఖలో అపరిష్కృతంగా ఉన్నట్లు చూపకుండా సమస్య దరఖాస్తుదారుల్లోనే ఉందన్నట్లుగా తేల్చేస్తున్నారు. భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ వివిధ దశల్లో జరగాల్సి ఉన్న నేపథ్యంలో ఎవరికి వాళ్లు సమస్య ఉందని, దరఖాస్తు సక్రమంగా లేదని రిమార్కులు రాసి తిరస్కరిస్తున్నారు. భవన నిర్మాణ అనుమతికి దరఖాస్తు చేసిన 21 రోజుల్లో అనుమతి ఇవ్వడమో లేదంటే తిరస్కరించడమో చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నేపథ్యంలో అనుమతి ఇవ్వకుండా కొర్రీలు వేసి తిరస్కరిస్తున్నారు. మళ్లీ అడిగిన సమాచారం, నిర్దేశించిన వివరాలను అందచేసినా నెలలకొద్దీ సమయం పడుతోంది.

పక్కాగా ఉంటున్నా సమస్యలు: భవన నిర్మాణ అనుమతులకు లైసెన్స్‌డ్ సర్వేయర్ల ద్వారా ఆన్‌లైన్ విధానంలోనే దరఖాస్తు చేసుకుంటున్నా రకరకాల కారణాలు చూపుతూ అనుమతులను జాప్యం చేస్తున్నారని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం నగరపాలక సంస్థలో భవన నిర్మాణ అనుమతికి దరఖాస్తు చేసుకుని మూడు నెలలైనా అనుమతి రాలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్ నుంచి సుమారు 400 భవన నిర్మాణ దరఖాస్తులు రాగా ఇప్పటి వరకూ అనుమతి లభించినవి వందలోపే ఉండటం గమనార్హం. వరంగల్ నగర పాలక సంస్థలో భవన నిర్మాణ అనుమతి కావాలంటే రెండు నెలలు ఆగాల్సిందే. రాష్ట్రంలో అత్యధిక పురపాలక సంఘాలు నగర పాలక సంస్థల్లో ఇదే పరిస్థితి. యాజమాన్య హక్కు వివరాలను పరిశీలించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందనీ, రెవెన్యూ శాఖ నుంచి సరైన సమాచారం ఉండటం లేదని పురపాలక శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఆచరణలో సాధ్యం కావడం లేదు: గతంలో 30 రోజుల్లోపు భవన నిర్మాణ అనుమతి ఇవ్వాలని ఉత్తర్వులు ఉన్నప్పుడు రెండు నెలల నుంచి నాలుగు నెలల సమయం తీసుకునేది. ఇప్పుడు కూడా అంతే సమయం తీసుకుంటోంది తప్ప అంతకంటే ముందు అనుమతులు ఇవ్వడం సాధ్యం కావడం లేదని పట్టణ ప్రణాళిక అధికారులు స్పష్టం చేస్తున్నారు. 21 రోజుల్లో అనుమతి ఇవ్వడం అన్నది చాలా సాధారణ అంశంగా కన్పిస్తుంది కానీ వాస్తవంగా సమస్య ఉందని పేర్కొంటున్నారు. సిబ్బంది కొరత, పలు రకాల అదనపు బాధ్యతలతో పాటు అనేక సమస్యలు ఉన్నాయని చెబుతూ పోస్టులు ఖాళీలుగా ఉండటం, ఒక్కరే పలు విధులు నిర్వహించాల్సి రావడంతో ఉత్తర్వులు ఉన్నా అమలు చేయలేకపోతున్నామని పేర్కొంటున్నారు.

బాలికపై అత్యాచారం చేసిన నిందితుల అరెస్టు

పినపాక(మణుగూరు గ్రామీణం), న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం పాండురంగాపురంలో బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను మంగళవారం ఏడూళ్ల బయ్యారం పోలీసులు అరెస్టు చేశారు. ఈకేసులో నిందితులైన 12 మందిపై పోక్సో చట్టం కింద, ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేశారు. నిందితులు సోమవారం తెల్లవారుజామున ఆటోలో పారిపోతుండగా వారిని అమరారం వద్ద పట్టుకున్నట్లు డీఎస్పీ ఆర్.సాయిబాబా తెలిపారు. ఈకేసులో 14 మందిని అరెస్టు చేయగా ఒక వ్యక్తి పరారీలో ఉన్నాడు.

ఔషధ విక్రేతలూ క్షయ కేసుల్ని నివేదించాల్సిందే

- లేకపోతే ఆరు నెలల జైలుశిక్ష
- ఆరోగ్య మంత్రిత్వశాఖ నోటిఫికేషన్

దిల్లీ: క్షయ వ్యాధిగ్రస్తుల వివరాలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలో ఔషధ విక్రేతల్నీ భాగస్వాముల్ని చేయాలని కేంద్రం నిర్ణయించింది. అలా చేయడంలో వారు విఫలమైతే ఆరు నెలల వరకు కారాగార శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉందంటూ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ఒక నోటిఫికేషన్ వెలువరించింది. టీబీ చికిత్సకు ఔషధాల్ని విక్రయించేవారంతా ఆయా రోగుల వివరాలను, వారికి ఇచ్చిన మందులను గురించి జిల్లా సమన్వయాధికారులకు తెలియజేయాలని తాజా ఆదేశాలు చెబుతున్నాయి. ప్రభుత్వ దృష్టికి రాకుండా పోతున్న టీబీ కేసుల గురించి తెలుసుకునేందుకే ఈ ప్రయత్నమని సంబంధిత శాఖాధికారి ఒకరు తెలిపారు. క్షయకు పూర్తిస్థాయి చికిత్స అందడంలో రోగుల సహకారం అవసరమనీ, వారు స్వచ్ఛందంగా ముందుకువచ్చి వివరాలు ఇవ్వాలనీ కోరారు. జిల్లాల వారీ అధికారుల వివరాలను కేంద్ర క్షయ విభాగం వెబ్‌సైట్లో ఎప్పటికప్పుడు తాజాపరుస్తామని చెప్పారు.

ఆదిలాబాద్ సీసీఐ అధికారులపై సీబీఐ కేసులు

ఈనాడు, హైదరాబాద్: వ్యాపారులతో కుమ్మక్కై రైతులకు అందాల్సిన మద్దతు ధరను కొల్లగొట్టిన నేరంపై సీబీఐ అధికారులు మంగళవారం మూడు కేసులు నమోదు చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో 2014లో చోటుచేసుకున్న ఈ కుంభకోణంపై దర్యాప్తు జరిపిన హైదరాబాద్ సీబీఐ విభాగం తాజాగా ఎఫ్.ఐ.ఆర్.లు జారీ చేసింది. పత్తి మద్దతు ధరను ఆసరాగా చేసుకుని ఆదిలాబాద్ జిల్లాలో కొందరు వ్యాపారులు కుంభకోణానికి తెరతీశారు. సీసీఐ అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై తప్పుడు పత్రాలతో తామే రైతులమని చెబుతూ రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన పత్తిని మద్దతు ధరకు అమ్మేవారు. 2014లో జరిగిన ఈ ఉదంతంపై సీబీఐ ఇటీవల విచారణ జరిపింది. ప్రాథమిక ఆధారాలు లభించడంతో మంగళవారం కేసులు నమోదు చేశారు. ఆదిలాబాద్ జిల్లా జైన్నూరు, నార్నూరు, చెన్నూరు, పోచరలలోని సీసీఐ కేంద్రాల్లో ఈ కుంభకోణం జరిగినట్లు ఎఫ్.ఐ.ఆర్.లలో పేర్కొన్నారు. దీనికి సంబంధించి సీసీఐ అధికారులు మహేష్ రమేష్‌రావు, రూపేష్‌సింగ్, కె.వి.కృష్ణారెడ్డి, సి.కె.భట్టి, ఆర్.భగవాన్, సునీత్ సుభాష్‌రావ్ దేశ్‌ముఖ్, వ్యాపారులు మగాద్ అలీ, షేక్ జమీర్, పుష్కర్ రామేశ్వర్, జి.రంగారావు, కె.రాకేష్, కె.రూపేష్, కె.శ్రీదేవి, కె.సుజాత, స్వప్న, హరిచంద్, ముబీన్ విరాని, రిజ్వాన్, మల్లికార్జున్, ప్రేమ్ చంద్, జగన్‌లపై సీబీఐ అధికారులు కేసులు నమోదు చేశారు.

ప్రత్యేక సెలవుగా 'సకల జనుల సమ్మె' కాలం

- ప్రభుత్వంతో తెలంగాణ మజ్దూర్ యూనియన్ చర్చలు సఫలం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: సకల జనుల సమ్మె కాలాన్ని ఆర్టీసీ కార్మికులకు ప్రత్యేక సాధారణ సెలవుగా పరిగణించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు మంగళవారమిక్కడ అసెంబ్లీ సమావేశ మందిరంలో తెలంగాణ మజ్దూర్ యూనియన్(ఎన్ఎంయూ) నాయకులు ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఆర్టీసీలో ఖాళీల భర్తీకి, ఉద్యోగ భద్రత విషయమై యూనియన్ ప్రతినిధులు, ఆర్టీసీ యాజమాన్యంతో కూడిన కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వం సమ్మతించినట్లు ఎన్ఎంయూ ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి తెలిపారు. గతేడాది ఏప్రిల్ నుంచి కార్మికులకు రావాల్సిన జీతభత్యాల సవరణ అంశంపై వారంలోగా తిరిగి సమావేశం కానున్నట్లు చెప్పారు. సమావేశంలో మంత్రులు హరీశ్‌రావు, మహేందర్‌రెడ్డి, టీఎస్ఆర్టీసీ ఛైర్మన్ ఎస్.సత్యనారాయణ, ఎండీ రమణారావు, రవాణశాఖ ముఖ్య కార్యదర్శి సునిల్‌శర్మ, ఎన్ఎంయూ అధ్యక్షుడు తిరుపతి, కార్యనిర్వాహక అధ్యక్షుడు థామస్‌రెడ్డి పాల్గొన్నారు.

'గిరిజన' వైద్య సేవలకు అధిక ప్రాధాన్యం

- పీజీ వైద్యవిద్య ప్రవేశాల్లో 'పీజీ నీట్' మార్కులకు అదనంగా జత
- సీట్ల రిజర్వేషన్లకు చెల్లుచీటి
- 15 శాతం అన్‌రిజర్వుడ్ కోటా ఎత్తివేత
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ఈనాడు- హైదరాబాద్: గిరిజన, మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించేందుకు ముందుకొచ్చే వైద్యులకు పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో అధిక ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ వైద్యంలో గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న వైద్యులకు క్లినికల్ సీట్లలో 30 శాతం, నాన్ క్లినికల్ సీట్లలో 50 శాతం సీట్లను ఇప్పటి వరకూ రిజర్వేషన్ కింద కేటాయిస్తుండగా.. ఈ రిజర్వేషన్ కోటా విధానానికి సర్కారు చెల్లుచీటి రాసింది. గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న ప్రభుత్వ వైద్యులకు పీజీ వైద్యసీట్లలో ప్రాధాన్యం కల్పించడంలో నీట్ మార్కులను ప్రాతిపదికగా చేసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం తెలంగాణ వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీచేశారు. ఉత్తర్వుల్లో మార్గదర్శకాలివి..

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సమాంతర ఆసుపత్రులు, డిస్పెన్సరీలు, తాలుకా ఆసుపత్రులు, సంచార వైద్య సేవలు, కుష్ఠు నియంత్రణ కేంద్రాలు, నమూనా సర్వే అంచనా కేంద్రాలు, తదితర ప్రభుత్వ వైద్యసేవల్లో గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న ప్రభుత్వ వైద్యులే అర్హులు. ఒప్పంద, పొరుగు సేవల్లో పని చేస్తున్న వారికి వర్తించదు.
- గిరిజన ప్రాంతాల్లో పనిచేసిన ప్రభుత్వ వైద్యులకు. . ఎంబీబీఎస్‌లో సాధించిన మార్కులను ప్రాతిపదికగా తీసుకొని ఆ మార్కులకు ఏడాదికి 10 శాతం చొప్పున.. గరిష్ఠంగా 30 శాతం మార్కులను.. పీజీ నీట్‌లో పొందిన మార్కులకు అదనంగా జత చేస్తారు.
- గ్రామీణంలో అయితే.. ఎంబీబీఎస్‌లో మార్కులకు ఏడాదికి 8 శాతం చొప్పున లెక్కించి, గరిష్ఠంగా 24 శాతం మార్కులను నీట్ మార్కులకు అదనంగా కలుపుతారు.
- పట్టణ ప్రాంతాల్లో పని చేస్తున్న ప్రభుత్వ వైద్యులకు నీట్ పీజీలో ఎలాంటి మార్కుల ప్రాధాన్యత వర్తించదు.
- అఖిల భారత వైద్యవిద్య సీట్ల కూటమిలో చేరడం వల్ల 50 శాతం సీట్లను ఇవ్వాల్సి రావడంతో.. ఇప్పటి వరకూ అమల్లో ఉన్న 15 శాతం అన్‌రిజర్వుడ్ కోటాను ఎత్తేశారు. మిగిలిన 50 శాతం సీట్లన్నీ కూడా స్థానికత ప్రాతిపదికన భర్తీ చేస్తారు.

అమ్మ దొంగా ఇలా ఉంటావా?


బిడ్డ పుట్టిన తర్వాత ఫొటో తీయటం మామూలే. మరి తల్లి కడుపులో పెరుగుతున్న నలుసు రూపాన్ని కళ్ల ముందు కదలాడేలా చేస్తే? అటువంటి పనే చేస్తోంది ఎంబ్రియో 3డీ అనే రష్యా కంపెనీ. అవును.. గర్భస్థ శిశువును 3డి నమూనా రూపంలో గర్భిణులకు అందిస్తోంది. ప్లాస్టిక్‌తోనే కాదు.. వెండి, బంగారం వంటి విలువైన లోహాలతోనూ నమూనాలు రూపొందిస్తుండటం విశేషం.




అమ్మ కడుపులో బిడ్డ 3డీ బొమ్మగా...

ఎలా చేస్తారు?

ముందుగా శాస్త్రవేత్తలు ఎంఆర్ఐ స్కాన్ చిత్రాల సాయంతో పిండం 3డి రూపాన్ని పునర్ నిర్మిస్తారు.



ఒకసారి కచ్చితమైన నమూనాను సృష్టించాక దాన్ని కాల్పనిక వాస్తవ పరికరం సమ్మిళితం చేస్తుంది. కాల్పనిక వాస్తవ పరిజ్ఞానం (వర్చువల్ రియాలిటీ) అల్ట్రాసౌండ్ స్కాన్ల సాయంతో పిండం ప్లాస్టిక్ నమూనాను సృష్టిస్తుంది.



మొదట్లో రష్యన్ కంపెనీ ప్లాస్టిక్ నమూనాలను మాత్రమే తయారుచేసేది. తర్వాత ప్లాస్టర్ నమూనాలపై వెండి, బంగారు పూతలను పూయటం ఆరంభించింది.



శాస్త్రరంగంలో కాల్పనిక వాస్తవ పరిజ్ఞానం (వీఆర్)

- బ్రెజిల్ శాస్త్రవేత్తలు 2016లో 3డి ఇమేజింగ్ పరిజ్ఞానాన్ని రూపొందించారు
- ఆక్యులస్ రిఫ్ట్ వర్చువల్ రియాల్టీ హెడ్‌సెట్ ద్వారా ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్ స్కాన్లను 3డి నమూనాలుగా తీర్చిదిద్దారు.
- ఎంఆర్ఐ స్కాన్లు కచ్చితమైన నమూనాలను సృష్టించడానికి దోహదం చేశాయి.
- ఈ హెడ్‌సెట్ ద్వారా తల్లి కడుపులో ఉన్న బిడ్డను బయటి నుంచే స్పష్టంగా చూడొచ్చు.

ప్రయోజనాలు

3డి నమూనాలను కాల్పనిక వాస్తవ పరిజ్ఞానంతో మేళవించటం వల్ల పిండం అవయవాల తీరుతెన్నులను మరింత బాగా అర్థం చేసుకోవచ్చు.

ఈ కొత్త పరిజ్ఞానాన్ని వైద్య విద్యలో ఉపయోగించుకోవచ్చు. పిండం ఎదుగుదలను, పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించొచ్చు.

విమర్శ

ఈ పరిజ్ఞానాన్ని కేవలం వినోదం కోసం వినియోగించుకోవటం తగదని పరిశోధకులు హెచ్చరించారు.

గ్యాడ్జెట్ గురూ!

ఛార్జరే కాదు...



కారు ఏదైనా ప్రయాణాల్లో కచ్చితంగా 'కారు ఛార్జర్'ని వాడడం మామూలే. కానీ, అదే కారు ఛార్జర్‌ని మీ డ్రైవింగ్‌ని మరింత స్మార్ట్‌గా మార్చేస్తే. ఎలాగంటారా? అయితే, పెబుల్ కంపెనీ అందుబాటులోకి తెచ్చిన 'పీసీసీ3ఎం' స్మార్ట్ కారు ఛార్జర్ గురించి తెలుసుకోవాల్సిందే. ఇది ఛార్జరే కాదు. బ్లూటూత్ పరికరంలా మారిపోయి ప్రయాణాన్ని సురక్షితం చేస్తుంది. కారు నడుపుతున్నప్పుడు ఫోన్ కాల్ వస్తే ఫోన్ కోసం వెతికే పని లేకుండా ఛార్జర్‌కి ఇన్‌సర్ట్ అయి ఉన్న 'ఇయర్ పాడ్'ని చెవిలో పెట్టుకుంటే సరి. బ్లూటూత్ 4.1 టెక్నాలజీ ఇయర్‌పాడ్ పని చేస్తుంది. చిత్రంలో మాదిరిగా ఛార్జర్‌పై భాగంలో అతుక్కుని ఛార్జ్ అవుతుంది. ఛార్జింగ్ లేనప్పుడు ఆటోమాటిక్‌గా ఛార్జ్ అవ్వడంతో పాటు.. వాడకుంటే ఆటోమాటిక్‌గా ఆటో-ఆఫ్ అవుతుంది. ఒకసారి ఛార్జ్ చేసి 4 గంటలు మాట్లాడొచ్చు. కారు ఛార్జర్‌కి మూడు యూఎస్‌బీ పోర్టులు ఉన్నాయి. ధర రూ.2,499. **ఇతర వివరాలకు** https://goo.gl/1mT7tv

లెడ్‌లైట్లతో మ్యూజిక్



వైర్‌లెస్ హెడ్‌సెట్‌లతో మ్యూజిక్ వినడం సర్వసాధారణం. కానీ, ధరించిన హెడ్‌సెట్‌కి ఎల్‌ఈడీ లైట్లు ఉంటే! అవి మ్యూజిక్ ట్రాక్స్‌కి అనుగుణంగా వెలిగి... ఆరితే! కచ్చితంగా అది ట్రెండీ హెడ్‌సెట్టే. అలాంటిదాన్నే దేశీయ కంపెనీ జెబ్రానిక్స్ మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 10 గంటల పాటు పాటలు వినొచ్చు. బిల్ట్‌ఇన్ మైక్‌తో ఫోన్ కాల్స్ కూడా మాట్లాడొచ్చు. చెవులపై ఒత్తిడి పడకుండా మెత్తటి కుషన్స్‌తో ఎంత సమయం అయినా ధరించి మ్యూజిక్ మస్తీ చేయవచ్చు. 10 మీటర్ల పరిధిలో వైర్‌లెస్‌గా పరికరాలతో కనెక్ట్ అయి ఉంటుంది. రూ.6,999.

ఇతర వివరాలకు https://goo.gl/JZxHfL

పాడుతా... తీయగా.. చల్లగా!

మనిషి, మరమనిషి చెట్టపట్టాలు వేసుకుని జీవించటం మరెంతో దూరంలో లేదు. ఇప్పటికే మర మనుషులు (రోబోలు) చాలాపనుల్లో మనకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నాయి. మనిషి రూపంలో, మనిషిలా మాట్లాడుతూ.. మనం వేసే ప్రశ్నలను అర్థం చేసుకొని, వాటికి తగ్గట్టుగా జవాబులిస్తూ ఆశ్చర్యపరుస్తున్నాయి కూడా. త్వరలో ఇవి తీరికలేని పనులతో అలసిపోయి మనం సోఫాలో కూలబడ్డప్పుడు, దగ్గరికి వచ్చి.. వీనుల విందైన సంగీతాన్ని వినిపించినా ఆశ్చర్యపోనవసరం లేదు. నమ్మబుద్ధి కావటం లేదా? అయితే కొత్త 'గాయక రోబో' గురించి తెలుసుకోవాల్సిందే. దీని పేరు రోవర్. మనిషి-మరమనుషుల మధ్య స్పందనలు, ప్రతిస్పందనలపై పరిశోధనలు చేస్తున్న సాంటాబార్బరాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ (యూసీఎస్‌బీ) విద్యార్థిని హన్నా వోల్ఫే దీనికి రూపకల్పన చేశారు. చూడ్డానికిది ఓ పొడవైన స్టాండులా కనబడుతుంది. ఉష్ణోగ్రతను పసిగట్టే సెన్సర్ల ద్వారా ఇది మన రాకను గుర్తించి, దగ్గరకు వచ్చి ఆగుతుంది. కెమెరా కళ్లతో మన ప్రతిస్పందనలను రికార్డు చేసుకొని.. మన సానుకూల, ప్రతికూల భావోద్వేగాలకు అనుగుణంగా స్వరాలను కూర్చుకొని సంగీతంగా వినిపిస్తుంది. ఒకరకంగా ఇది స్టార్‌వార్స్ కథలోని కల్పిత రోబో ఆర్2డి2 మాదిరిగా చప్పుళ్లను, డిజిటల్ ఎఫెక్ట్స్‌ను సృష్టించి వినిపిస్తుందని చెప్పుకోవచ్చు.



ప్రజలను సంతోషపరచే కళాత్మక ప్రతిస్పందన పరికరాన్ని తయారుచేయాలనే ఉద్దేశంతోనే హన్నా కొత్త రోబోకు రూపకల్పన చేశారు. ఎవరైనా మన దగ్గరకు వచ్చి, మన కోసం పాట పాడి సంతోషాన్ని కలిగిస్తే ఎలా ఉంటుందనే ఆలోచనే దీనికి ప్రాణం పోసిందట. ఈ రోబోకు రూంబా అనే వ్యాక్యూమ్ పరికరం పాదాల మాదిరిగా పనిచేస్తుంది. దీంతోనే ఇది కదులుతూ మనుషుల దగ్గరకు వస్తుంది. ఇక దీనికి అమర్చిన 'రాస్ప్‌బెర్రీ పై' పరిజ్ఞానం మెదడులా.. 'అర్డ్యునో' నాడీ వ్యవస్థలా పనిచేస్తాయి. ఇది కేవలం కళాత్మకమైన ప్రతిరూపమే కాదు.. రోబోల కదలికలకు మనుషులు స్పందించే తీరుతెన్నులను పరిశీలించటానికి తోడ్పడే పరికరం కూడా అని హన్నా చెబుతున్నారు. "మనకు ఇష్టమున్నా లేకపోయినా మనం రోబోలతో మాట్లాడుకునే రోజులు మరెంతో దూరంలో లేవు. కాబట్టి మనం వాటితో ఎంత బాగా మాట్లాడగలం? అవి మనకు సమాచారాన్ని ఎలా చేరవేస్తాయి? అనే విషయాల గురించి ఆలోచించాల్సిన తరుణం ఆసన్నమైంది" అని ఆమె అంటున్నారు. అందుకే ప్రజల ప్రతికూల, సానుకూల స్పందనలకు అనుగుణంగా శబ్దాలను వెలువరించే రోవర్‌కు రూపకల్పన చేశానని వివరిస్తున్నారు.

సైజ్ జీరో పీసీలు

సీపీయూ... సెంట్రల్ ప్రాసెసింగ్ యూనిట్ ఒకప్పుడు పెద్ద డబ్బానే. తీసుకెళ్లాలంటే భుజంపైకి ఎత్తుకోవాల్సిందే! వాడుకోవాలంటే పెద్ద టేబుల్ కొనాల్సిందే!కానీ, ఇప్పుడు సిస్టం కాబినెట్ కాస్త స్లిమ్ అయిపోయింది. ఎంతలా అంటే... సెల్‌ఫోన్‌లా జేబులో పట్టేస్తుంది.. టిఫిన్ బాక్స్‌లా బ్యాగులో ఒదిగిపోతుంది. వీటిని 'మినీ పీసీ'లంటూ ముద్దుగా పిలుస్తున్నారు. టెక్కింట్లో సందడి చేస్తున్న వీటి సంగతులు సంక్షిప్తంగా!



క్రోమ్ ఓఎస్‌తో కొత్తగా..

అసుస్ క్రోమ్‌బిట్

యూఎస్‌బీ డ్రైవ్‌లా కనిపించే పర్సనల్ కంప్యూటర్. క్రోమ్ ఓఎస్‌తో పని చేస్తుంది. గూగుల్ డ్రైవ్ ద్వారా 100 జీబీ స్పేస్‌ని రెండేళ్లపాటు ఉచితంగా వాడుకోవచ్చు. క్రోమ్ వెబ్‌స్టోర్‌లో ఉంటే అన్ని వెబ్ అప్లికేషన్స్‌ని పీసీలో రన్ అవుతాయి. వెబ్ విహారానికి, వ్యక్తిగత అవసరాలకు అనువైంది. హెచ్‌డీఎంఐ, యూఎస్‌బీ 2.0, బ్లూటూత్ 4.0, వై-ఫై నెట్‌వర్క్‌లతో పని చేస్తుంది. వైర్‌లెస్ లేదా యూఎస్‌బీ 2.0 కీబోర్డ్‌ని కనెక్ట్ చేసి వాడుకోవచ్చు.

ఇతర వివరాలకు https://goo.gl/W2prMA

మానిటర్ చాటున...

ఎక్స్‌ఎల్-200సీ

పలు రకాల పోర్టులతో స్లిమ్‌గా మానిటర్ వెనక అతుక్కుని పని చేస్తుంది. ఇంటెల్ ప్రాసెసర్‌తో పని చేస్తుంది. మైక్రో ఎస్‌డీ కార్డ్ స్లాట్‌తో ఎక్స్‌టర్నల్ మెమొరీని పీసీకి ఇన్‌సర్ట్ చేయగలగడం దీంట్లోని ప్రత్యేకత. మిని పీసీగానే కాకుండా 'క్లౌడ్ కంప్యూటింగ్'కి అనుకూలమైంది. ఆఫీస్ అప్లికేషన్స్, బ్రౌజర్ బేస్డ్ ఆప్స్, ఆఫీస్ సూట్‌లను సులభంగా రన్ చేసుకుని పర్సనల్ డెస్క్‌టాప్‌లా వాడుకోవచ్చు. ర్యామ్ 2జీబీ. ఇంటర్నల్ స్టోరేజ్ సామర్థ్యం 32జీబీ. వీజీఏ, హెచ్‌డీఎంఐ, 1 యూఎస్‌బీ 3.0, రెండు యూఎస్‌బీ 2.0, మైక్రోఎస్‌డీ స్లాట్ ఉన్నాయి. విండోస్ 10 ఓఎస్‌తో వాడుకోవచ్చు.

ఇతర వివరాలకు https://goo.gl/wxDHhR

ఇదో ఛాక్లెట్ క్యాండీ

ఎసర్ రెవో వన్

స్మార్ట్‌ఫోన్‌ని రిమోట్‌లా వాడుకుని పని చేస్తుంది. వైర్‌లెస్ కీబోర్డు, మౌస్‌లను అనుసంధానం చేయవచ్చు. స్టోరేజ్ సామర్థ్యం ఎంతో తెలుసా? 2టీబీ. ప్రత్యేక పోర్టులతో ఎక్స్‌టర్నల్ హార్డ్‌డ్రైవ్‌లను కనెక్ట్ చేయవచ్చు. విండోస్ 10 హోం ఓఎస్‌తో పని చేస్తుంది. ఇంటెల్ ఐ5 ప్రాసెసర్‌ని వాడారు. ర్యామ్ 8జీబీ. డిస్‌ప్లే పోర్ట్, హెచ్‌డీఎంఐ, ఇథర్నెట్ పోర్ట్, రెండు యూఎస్‌బీ 2.0, మరో రెండు యూఎస్‌బీ 3.0 పోర్టులు ఉన్నాయి.

ఇతర వివరాలకు https://goo.gl/oSY5kR

టిఫిన్ బాక్స్‌లో హెచ్‌పీ

హెచ్‌పీ క్రోమ్‌బాక్స్ జీ2

వ్యక్తిగత అవసరాలకు సరిపడేలా క్రోమ్ ఓఎస్‌తో ముందుకొచ్చింది. టిఫిన్ బాక్సు పరిమాణంలో ఎక్కడైనా ఒదిగిపోతుంది. ఇంటెల్ ఐ7, ఐ5, సెలెరాన్ ప్రాసెసర్లతో మోడళ్లు ఉన్నాయి. 16జీబీ వరకూ ర్యామ్‌ని సపోర్ట్ చేస్తుంది. యూఎస్‌బీ టైప్-సీ పోర్ట్ ఉంది. హెచ్‌డీఎంఐ, డిస్‌ప్లే పోర్టు, మూడు యూఎస్‌బీ 3.0 పోర్ట్‌లు, ఇథర్నెట్, వై-ఫై నెట్‌వర్క్‌లను సపోర్ట్ చేస్తుంది. ఇంటర్నల్ మెమొరీ 64జీబీ. మెమొరీ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు మైక్రోఎస్‌డీ స్లాట్ ఉంది. ఇతర వివరాలకు https://goo.gl/TKzHyr

పీసీ కార్నర్



చిన్న 'స్టిక్' మాదిరిగా...

ఐబాల్ స్ప్లెండో

మార్కెట్‌లో సందడి చేస్తున్న స్ట్రీమింగ్ స్టిక్‌ల స్మార్ట్ టీవీలకు కనెక్ట్ చేసి కంప్యూటర్‌లా మార్చేయవచ్చు. పెన్ డ్రైవ్ మాదిరిగా కనెక్ట్ చేసి వాడుకోవచ్చు. విండోస్ 10 ఓఎస్‌తో పని చేస్తుంది. ర్యామ్ 2జీబీ. ఇంటర్నల్ మెమొరీ 32జీబీ. ఇంటెల్ ఆటమ్ క్వాడ్ కోర్ ప్రాసెసర్‌ని వాడారు. మైక్రోసాఫ్ట్ 'వన్‌డ్రైవ్' నుంచి 15 జీబీ క్లౌడ్ స్పేస్‌ని ఉచితంగా వాడుకోవచ్చు. హెచ్‌డీఎంఐ, మైక్రోఎస్‌బీ 2.0, బ్లూటూత్ 4.0, మైక్రోఎస్‌డీ స్లాట్, వై-ఫై సౌకర్యాలు ఉన్నాయి.

ఇతర వివరాలకు https://goo.gl/jPKpTZ

4జీబీ ర్యామ్‌తో...

గిగాబైట్ బ్రిక్స్

సాధారణ హోం యూజర్ నుంచి మొదలుకుని హైఎండ్ వినియోగదారులకూ సరిపడేలా పలు మోడళ్లలో మినీ పీసీలు ఉన్నాయి. సెలెరాన్ ప్రాసెసర్ నుంచి ఐ3, ఐ5, ఐ7 ప్రాసెసర్లను సపోర్ట్ చేసేలా పలు మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. ర్యామ్ 4జీబీ. స్టోరేజ్ సామర్థ్యం 1టీబీ. నాలుగు యూఎస్‌బీ 3.0 పోర్టులు, హెచ్‌డీఎంఐ, డిస్‌ప్లే, ఇథర్నెట్ పోర్టులు వాడుకోవచ్చు. బ్లూటూత్ 4.0, వై-ఫై నెట్‌వర్క్‌ల సపోర్ట్ ఉంది. విండోస్ 10 హోం ఓఎస్ వెర్షన్‌ని బిల్ట్‌ఇన్‌గా అందిస్తున్నారు.

ఇతర వివరాలకు https://goo.gl/pGPBTa

అరుదైనవి ఏమున్నాయి?

ప్రశ్నజవాబులు



1 **రెండేళ్ల నుంచి లెనోవో బీ320 మోడల్ ల్యాపీని వాడుతున్నాను. మానిటర్‌పై గ్రాఫిక్స్ ఉండాల్సినదాని కంటే ఎక్కువగా 'జూమ్‌ఇన్' అయ్యి కనిపిస్తున్నాయి. దీంతో విండోలను 'మ్యాక్సిమైజ్' చేయలేకపోతున్నా. చాలా రకాలుగా ప్రయత్నించా. పరిష్కారం దొరకలేదు. ఏం చేయాలి?**

– హరికిరణ్, అనంతపూర్

డ్రైవర్స్‌లో సమస్య వల్ల ఇలా జరగొచ్చు. డిఫాల్ట్‌గా ఉన్న సెట్టింగ్స్‌ని మీరితేనే ఇలాంటి సమస్యలు వస్తాయి. అందుకే విండోలను మీరు మినిమైజ్ లేదా మ్యాక్సిమైజ్ చేయలేరు. గ్రాఫిక్ డ్రైవర్స్‌ని ముందు అన్‌ఇన్‌స్టాల్ చేయండి. తర్వాత లెనొవా ప్రతిపాదించే గ్రాఫిక్ డ్రైవర్లను తిరిగి ఇన్‌స్టాల్ చేయండి. దీంతో సమస్య పరిష్కారం అవుతుంది. డ్రైవర్స్ డౌన్‌లోడ్‌కి https://goo.gl/gznWhQ లింక్‌ని చూడండి.

2 **ల్యాప్‌టాప్, ఫోన్ వాడకంలో అరుదైన ప్రయోజనాల్ని తెలుపగలరు?**

– కె.శిరిష, విశాఖపట్టణం

ఫోన్‌లో రెండు...

తెరపై టచ్‌పాయింట్స్

ఫోన్‌లో డెమో వీడియోలు చిత్రీకరిస్తున్నారా? అయితే, మీరెక్కడ తాకుతున్నారో చేసేవారికి 'మార్క్' రూపంలో తెలియాలంటే? ఆండ్రాయిడ్ ఓఎస్‌లో 'ఎనేబుల్ ది డిస్‌ప్లే టచ్ పాయింట్స్' ఆప్షన్‌ని ఎనేబుల్ చేస్తే సరి. దీంతో మీరు తెరపై ఎక్కడ తాకినా తెల్లటి మార్క్ కనిపిస్తుంది. ఆప్షన్‌ని ఎనేబుల్ చేసేందుకు సెట్టింగ్స్‌లోని 'అబౌంట్'లోకి వెళ్లి 'డెవలపర్ ఆప్షన్స్'ని చూడండి. జాబితాలో కనిపించే 'షో టచ్‌పాయింట్స్'ని ఎనేబుల్ చేయాలి.

కళ్లకి ఒత్తిడి లేకుండా...

ఇప్పుడొచ్చేవన్నీ హై ఎండ్ రిజల్యూషన్‌తో కూడిన స్మార్ట్ ఫోన్లే.

ప్రకాశవంతమైన డిస్‌ప్లేతో ఫోన్‌ని అదేపనిగా వాడడం కళ్లకు ఒత్తిడి కలిగించే విషయమే. మరైతే, దీనికి ఏదైనా చిట్కా ఉందా? ఏముందీ... ఎంత హై ఎండ్ ఫోన్‌ని అయినా నలుపు, తెలుపులోకి మార్చేస్తే సరి. డెవలపర్ ఆప్షన్స్‌లోకి వెళ్తే అందుకు చిట్కా ఉంది. 'స్టిమ్యులేట్ కలర్ స్పేస్' ఆప్షన్ ఉంది. సెలెక్ట్ చేసి 'మోనోక్రోమసీ' ఆప్షన్‌ని తాకితే చాలు. డిస్‌ప్లే నలుపు, తెలుపులోకి మారిపోతుంది.

పీసీలో రెండు...

విండోస్ 10లో 'గాడ్‌మోడ్'

ఆపరేటింగ్ సిస్టంకి సంబంధించిన మొత్తం కంట్రోల్స్‌ని ఒకేచోటు నుంచి యాక్సెస్ చేసేందుకు ఈ గాడ్‌మోడ్‌ని వాడొచ్చు. ఈ గాడ్‌మోడ్ అంటే ఎంతో తెలుసా? విండోస్ 10లో క్రియేట్ చేసుకోగలిగే 'విండోస్ మాస్టర్ కంట్రోల్ ప్యానల్ హార్ట్‌కట్'. డెస్క్‌టాప్‌ని విరివిగా వాడేవారికి ఎంతగానో ఉపయోగపడే ఆప్షన్. దీన్ని ఎనేబుల్ చేసుకునేందుకు సిస్టం 'అడ్మిన్' ఎకౌంట్‌లోకి లాగిన్ అవ్వాలి. తర్వాత డెస్క్‌టాప్‌పై రైట్‌క్లిక్ చేసి 'న్యూ' ఆప్షన్‌ని సెలెక్ట్ చేయాలి. తర్వాత 'ఫోల్డర్' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఫోల్డర్ పేరు God Mode.{ED7BA470-8E54-465E-825C-99712043E01C} టైప్ చేసి ఎంటర్ నొక్కండి చాలు.

ఎయిరో షేక్

విండోస్ 10తో అందుబాటులోకి వచ్చిన ప్రత్యేక ఆప్షన్స్‌లో ఇదొకటి. దీంతో కావాల్సిన విండోని కాకుండా డెస్క్‌టాప్‌పై ఓపెన్ చేసిన అన్ని విండోలను మినిమైజ్ లేదా మ్యాక్సిమైజ్ చేయవచ్చు. అందుకు మీరు ఎంపిక చేసిన విండో టైటిల్‌బార్‌పై మౌస్‌తో నొక్కి ఉంచి ఒకసారి షేక్ చేస్తే చాలు. తెరచుకుని ఉన్న మిగతా విండోలన్నీ మినిమైజ్ అవుతాయి. మళ్లీ అవి మ్యాక్సిమైజ్ అవ్వాలంటే మరోసారి టైటిల్‌బార్‌ని పట్టుకుని షేక్ చేయాలి. ఈ ఆప్షన్‌ని ఎనేబుల్ లేదా డిసేబుల్ చేయాలంటే? 'సెర్చ్'లో 'లోకల్ గ్రూపు' ఆప్షని టైప్ చేసి వచ్చిన పాప్‌అప్ మెనూలోని 'ఎడిట్ గ్రూపు పాలసీ' ఆప్షన్‌ని సెలెక్ట్ చేయండి. వచ్చిన విండోలోని User Configuration-> Administrative Templates-> Desktop ఆప్షన్‌ని సెలెక్ట్ చేయాలి. వచ్చిన రైట్‌కిక్ ప్యానల్‌లో Turn off Aero Shaking minimizing mouse gestures ఆప్షన్ కనిపిస్తుంది. ఆప్షన్ డిసేబుల్ మోడ్‌లో ఉంటే 'నాట్ కాన్ఫిగర్డ్' అని కనిపిస్తుంది. ఎనేబుల్ చేద్దాం అనుకుంటే ఆప్షన్‌పై డబుల్ క్లిక్ చేసి వచ్చిన విండోలోని 'ఎనేబుల్డ్' ఆప్షన్‌ని చెక్ చేస్తే చాలు. ఎప్పుడైనా డిసేబుల్ చేసేందుకు 'డిసేబుల్డ్' ఆప్షన్ ఉంది.

- యశస్విన్ రెడ్డి, rdp.in

ఈనాడు సినిమా


రాశీఖన్నా

అలా ఎప్పుడూ ఆలోచించను

సరైన సమయంలో సరైన సినిమా పడిందనే మాట చిత్ర పరిశ్రమలో అప్పుడప్పుడు వినిపిస్తూనే ఉంటుంది. రాశీ ఖన్నా విషయంలోనూ ఈ మధ్య అది వినిపించింది. వరుసగా పరాజయాలు ఎదుర్కొన్న ఆమెకి 'తొలిప్రేమ'తో పెద్ద ఊరట లభించడంతో ఆ మాట నిజమైంది. ఆ చిత్రంలో రాశి అందంతోపాటు, అభినయమూ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. అయితే రాశీ ఖన్నా మాత్రం సమయానికి తగ్గట్టుగా సినిమాల్ని ఎంచుకోవడం తెలియదంటోంది. "తెలుగులో నేను చేసిన తొలి సినిమాని చూశాక సరైన సినిమాతోనే ప్రవేశించావన్నారు చాలామంది. అయితే తెలుగులోకి ప్రవేశించడానికి ఇది తగిన సినిమానా కాదా? అని నేనెప్పుడూ ఆలోచించలేదు. కథ విన్నాను, రెండో ఆలోచన లేకుండా ఒప్పుకొన్నాను. అదే కాదు, ఆ తర్వాత కూడా ఏ సినిమా విషయంలోనూ ఆలోచించలేదు. ఒకసారి ప్రేమకథ చేయాలి, ఆ తర్వాత మాస్ కథని ఎంచుకోవాలి, ఇంకోసారి ఇంకో రకమైన సినిమా చేయాలి అంటూ చాలామంది చాలా రకాల మాటలు చెబుతుంటారు. కానీ నాకు ఆ లెక్కలేవీ తెలియవు. కథని కథగా వినడమే నాకు తెలుసు. ఆ విషయంలో సంతృప్తి లభించిందంటే చాలు" అని చెప్పింది రాశి.

శ్రియ పెళ్లిసందడి



ప్రముఖ కథానాయిక శ్రియ పెళ్లిపీటలెక్కారు. రష్యాకి చెందిన తన చెలికాడు ఆండ్రీ కొశీవ్‌ని వివాహం చేసుకొన్నారు. అత్యంత సన్నిహితులు, బంధుమిత్రుల సమక్షంలో ముంబయిలో పెళ్లి వేడుక జరిగినట్టు తెలుస్తోంది. ఈ జంట 17, 18, 19 తేదీల్లో మూడు రోజుల వేడుకగా పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకొన్నట్టు మొదట బాలీవుడ్ వర్గాలు పేర్కొన్నాయి. అయితే 12 నుంచే పెళ్లి సందడి మొదలైనట్టు సమాచారం. ముంబయిలో 12నే ఈ జోడీ పెళ్లి చేసుకొని, ఆ పెళ్లిని రిజిస్టర్ చేయించిందని తెలిసింది. అయితే శ్రియ, ఆమె కుటుంబ సభ్యులు, సన్నిహితులు కానీ పెళ్లి గురించి అత్యంత గోప్యత పాటించారు. దాంతో పెళ్లి వివరాలేవీ బయటికి రాలేదు. మంగళవారం వీరి పెళ్లికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు బయటికొచ్చాయి. వివాహ విందులో శ్రియ, కొశీవ్ జంట నృత్యాలు చేస్తూ బంధుమిత్రుల అభినందనలు అందుకోవడం వీడియోల్లో కనిపించింది. శ్రియ ప్రేమ నన్ను వ్యక్తిగతంగా మరింత ఉత్తమంగా మార్చిందని కొశీవ్ వేడుకలో చెప్పారు. టెన్నిస్ క్రీడాకారుడిగా, వ్యాపారవేత్తగా కొశీవ్‌కి మంచి గుర్తింపు ఉంది. శ్రియ ఉషాకిరణ్ మూవీస్ సంస్థ నిర్మించిన 'ఇష్టం'తో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ తర్వాత దక్షిణాది భాషలతో పాటు, హిందీలోనూ నటించి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకొంది. త్వరలోనే ఆమె వెంకటేష్‌తో కలిసి నటించబోతోంది.

సైయ్యన్నది ధర్మాగ్రహం.. సంకల్పమే వజ్రాయుధం


కల్యాణ్‌రామ్

ఎదుటివాళ్లని నవ్వించడం ఎంత కష్టమో, ఓ మాటతో స్ఫూర్తి నింపడం కూడా అంతే కష్టం! 'లే.. పోరాడు' అంటే... పని జరగదు. ఎందుకు లేవాలో? ఎలా పోరాడాలో చెప్పాలి. మాట మంత్రం కావాలి. పదం.. కదం తొక్కించేలా వినిపించాలి. ఇలాంటి మాటలు, పాటలు... వినడం అరుదైన సంగతే. 'ఎం.ఎల్.ఎ'లో మాత్రం అలాంటి పాట ఒకటి వినిపించింది. 'నేడే వెలిగిద్దాం.. సంక్రాంతి కాంతుల సంధ్యా దీపం' అంటూ ప్రేరేపించారు. ఈ గీతం రామజోగయ్య శాస్త్రి కలం నుంచి జాలువారింది. కల్యాణ్‌రామ్, కాజల్ జంటగా నటించిన 'ఎం.ఎల్.ఎ' ఈనెల 23న విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా ఈ పాట గురించి రామజోగయ్య శాస్త్రి ఏమంటారంటే...?

కొత్త పాట గురూ!

చిత్రం: ఎం.ఎల్.ఎ
సంగీతం: మణిశర్మ
గానం: అనురాగ్ కులకర్ణి
రచన: రామజోగయ్యశాస్త్రి


"పాట ఎప్పుడైనా సందర్భానికి అనువుగా ఉంటూ, బయట కూడా తన ఉనికిని చాటుకోవాలి. అలాంటి పాటలు రాసే అవకాశం చాలా అరుదుగా వస్తుంటుంది. ఈసారి 'ఎం.ఎల్.ఎ' ఇలాంటి పాట రాయడానికి నాకో దారిచ్చింది.

కొంతమంది బలవంతులు చాలామంది బలహీనుల్ని శాసిస్తూ ఉంటారు. అలాంటప్పుడు ఎక్కడో ఉద్యమం.. అలజడి.. నిప్పు రాజుకోవాలి. అది జ్వాలగా మారాలి. అప్పుడుగానీ ఆ వేడి అవతలివాళ్లకు ముట్టదు. ప్రపంచమంతా చీకటి రాజ్యమేలుతున్న సందర్భంలో ఎక్కడో ఓ చోట వెలుగు కిరణం కనిపిస్తుంది. అది కొన్ని లక్షల కిరణాలుగా రూపాంతరం చెందితే చీకటి అంతం అవుతుంది. ఈ మార్పుకి కారణమైన తొలి కిరణం చాలా గొప్పది. ఆ కిరణం ఈ పాటలో కథానాయకుడు.

ధర్మాగ్రహంలో కోపం ఉండదు. నిజాయతీ ఉంటుంది. అదే.. మనకు శక్తి, ఆయుధం. ఈ పాటలో కథానాయకుడి లక్ష్యం, పోరాటం, యుద్ధం వెనుక ఓ ధర్మం ఉంది. **'సై అన్నది ధర్మాగ్రహం, సంకల్పమే వజ్రాయుధం'** అనే మాట రాయడానికి కారణం అదే. ఓ మంచి పని చేయాలని ముందడుగు వేస్తే... మనకు తెలియకుండానే ఆకాశంతో తలపడేంత శక్తి వస్తుంది. అదే ముందుకు నడిపిస్తుంది. **'ఒక మంచి పని తలకెత్తుకుని గగనాలతో తలపడదాం'** అని రాశా అందుకే.

కన్నీళ్లని చులకన చేయకూడదు. దానికీ గొంతు ఉంటుంది. అదీ మాట్లాడుతుంది. 'మనం కష్టాలు అనుభవించడానికే ఉన్నాం..' అనే ఉదాసీనత ఎప్పటికీ మనలోకి రాకూడదు. మన బలహీనత ఇంకొకరికి బలం కాకూడదు. ఈ విషయాలన్నీ రెండో చరణంలో వినిపిస్తాయి. 'నేను' అనుకుంటే ఒంటరితనమే. 'మనం'లో బలం ఉంది. 'బలవంతమైన సర్పము చలిచీమల చేత చిక్కి చావదే సుమతీ' అని మనం చదువుకున్నాం. అంతకంటే స్ఫూర్తి ఎక్కడి నుంచి వస్తుంది? **'పిడికిళ్లు బిగిశాయంటే సంకెళ్లు చల్లాచెదురే'** అని చెప్పడం వెనుక ఉద్దేశం అదే. ఓ ఉదాత్తమైన ఆలోచనలో పుట్టిన పాట ఇది. కథానాయకుడు తన ఆశయ సాధనకు.. మిగిలిన వాళ్లని ఉత్తేజపరుస్తూ పాడుకునే పాట.

ఈ పాటని తెరకెక్కించేటప్పుడు నేనూ సెట్‌కి వెళ్లా. దర్శకుడు తెరపై చాలా చక్కగా తీశాడు. ఈ పాట వింటున్నప్పుడు కలిగే ఉద్వేగం.. తెరపై చూస్తున్నప్పుడు మరింత పెరుగుతుంది"


- రామజోగయ్యశాస్త్రి

పల్లవి

నేడే వెలిగిద్దాం.. సంక్రాంతి కాంతుల సంధ్యా దీపం
యుద్ధం యుద్ధం... యుద్ధానికి సిద్ధం..
ఈనాడే తొలగిద్దాం.. జగాన మిగిలిన చీకటి మొత్తం
యుద్ధం యుద్ధం.. ఓ.. యుద్ధానికి సిద్ధం..
ఒక మంచి పని తలకెత్తుకుని, గగనాలతో తలపడదాం..
విధి వంచితుల తలరాతలకు చిరునవ్వులు చూపెడదాం...
మన సాయం మనమే.. మన సైన్యం మనమే
గెలుపొందేదెప్పుడూ పోరాడే గుణమే
తడిబారిన చెంపలు తుడిచేద్దాం తక్షణమే
యుద్ధం యుద్ధం.. యుద్ధానికి సిద్ధం..

చరణం 1:

సైయ్యన్నదీ... ధర్మాగ్రహం
సంకల్పమే.. వజ్రాయుధం..
కళ్ళు నెత్తికెక్కి.. నెత్తికెక్కితొక్కే.. కండకావరాలు ఎన్నాళ్లు..
ఒళ్లుకొవ్వెక్కి.. పేద గొంతునొక్కే.. అరాచకాలు ఇంక చాలు చాలు..
చలి చీమలన్నీ చేరి.. విషనాగుల మదమణచాలి..
ఇన్నాళ్ల దౌర్జన్యాన్ని.. నిలదీసి నిరశించాలి..
ఎలుగెత్తే వరకు.. గుర్తించడు ఎవడూ
మన నెత్తుటి ఉడుకు.. ఈ ఊపిరికర్థం ఉద్యమమే కడవరకు..
యుద్ధం యుద్ధం.. యుద్ధానికి సిద్ధం...

చరణం 2:

కన్నీళ్లకూ గొంతున్నది, కష్టాలకూ చెల్లన్నది
బానిసత్వమే నీ పౌరసత్వమంటూ
బలిసినోడు తిప్పుతుంటే మీసం..
ఈ జన్మకింతేనంటూ.. ఆ మాటనొప్పుకుంటూ
నీకు నువ్వు చేసుకోకు మోసం
పిడికిళ్లు బిగిసాయంటే.. సంకెళ్లు చెల్లా చెదురే..
గడిదాటి కదిలారంటే, బలహీనులైనా పులులే..
భయపడుతూ ఉంటే భయపెడుతుంటారే
పడి ఉంటామంటే.. పడగ్గె కాటేస్తారే
ఎహె.. తెగబడితే, మన జోలికే రారే..
యుద్ధం యుద్ధం.. యుద్ధానికి సిద్ధం..

ఓ కొత్త కల్యాణ్‌రామ్‌ని చూస్తారు

"కాంబినేషన్లను కాదు కథని నమ్మి సినిమాలు తీసేవాళ్లంటే నాకు ఇష్టం. అలాంటి నిర్మాతలతో పనిచేసినందుకు ఆనందంగా ఉంద"న్నారు కల్యాణ్ రామ్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఎం.ఎల్.ఎ'. కాజల్ కథానాయిక. ఉపేంద్రమాధవ్ దర్శకుడు. కిరణ్ రెడ్డి, భరత్ చౌదరి నిర్మాతలు. శుక్రవారం విడుదలవుతోంది. మంగళవారం హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ్ రామ్ మాట్లాడుతూ "పటాస్‌కి రెండు గంటలసేపు కథ విన్నా. ఆ తరవాత అంతసేపు 'ఎమ్.ఎల్.ఎ'కే విన్నాను. కళ్లకు కట్టినట్టు సినిమా మొత్తం చూపించేశాడు దర్శకుడు. నటన, డాన్స్, స్టైల్... ఇలా అన్ని విషయాల్లోనూ ఓ కొత్త కల్యాణ్‌రామ్‌ని చూస్తారు. కాజల్ తొలి సినిమా నాతోనే చేసింది. ఈ పన్నెండేళ్లలో యాభై సినిమాలు చేసేసింది. నేను 14 సినిమాలే చేశా. కాజల్ నటిగా చాలా ఎదిగింది. తను మరో 50 సినిమాలు చేయాల"న్నారు. కాజల్ మాట్లాడుతూ "నా తొలి కథానాయకుడు కల్యాణ్‌రామ్‌తో మరోసారి పనిచేయడం ఆనందంగా ఉంది. తొలి సినిమా రోజుల్లో సలహాలు ఇచ్చేవారు. ఒదిగి ఉండే మనస్తత్వం ఆయనది. ఇప్పటికీ అలానే ఉన్నార"ంది. "నేను అడిగిన దానికంటే ఎక్కువే ఇచ్చారు నిర్మాతలు. కల్యాణ్‌రామ్ నా కథని నమ్మారు. ప్రతి విషయంలోనూ స్వేచ్ఛ ఇచ్చార" అన్నారు ఉపేంద్రమాధవ్. కార్యక్రమంలో బ్రహ్మానందం, డి.సురేష్‌బాబు, శ్రీనువైట్ల, భీమినేని శ్రీనివాసరావు, జెమినికిరణ్, పోసాని, నరేష్, వి.ఎన్.ఆదిత్య, రవికిషన్, ఎం.ఎల్.కుమార్ చౌదరి, కోన వెంకట్, గోపీ మోహన్ ఎన్.శంకర్, రామజోగయ్య శాస్త్రి, కాసర్ల శ్యామ్, పృథ్వీ, వంశీ పైడిపల్లి, మనాలి రాథోడ్, లాస్య తదితరులు పాల్గొన్నారు.

భారత్‌లో బేవాచ్ భామ?


ప్రియాంక చోప్రా



సల్మాన్‌ఖాన్

ప్రియాంక చోప్రా 'బేవాచ్' చిత్రంతో హాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. అంతకుముందే అక్కడి సీరియల్స్‌లో నటిస్తున్న ఈ భామ ఇప్పుడు అక్కడ ఓ పక్క సినిమాలు, మరో పక్క సీరియల్స్‌తో బిజీగా ఉంది. ఇదంతా బాగానే ఉన్నా 'జై గంగాజల్' తర్వాత మళ్లీ బాలీవుడ్ తెరపై కనిపించలేదు ప్రియాంక. తాజాగా హిందీలో ఓ సినిమా అంగీకరించినట్టు సమాచారం. సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా 'భారత్' చిత్రం తెరకెక్కనుంది. అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రంలో ప్రియాంకను కథానాయికగా తీసుకున్నారట. న్యూయార్క్‌లో 'క్వాంటికో' టీవీ సిరీస్ షూటింగ్ సమయంలో ప్రియాంకకు అలీ కథ వినిపించారట. గతంలో ఈ ఇద్దరి కలయికలో వచ్చిన 'గుండే' విజయం సాధించింది. సల్మాన్‌ఖాన్, ప్రియాంక కూడా పదేళ్ల తర్వాత కలిసి నటించబోతున్నారు. 'భారత్'లో నటించడం కోసం తన హాలీవుడ్ డేట్స్‌ను సర్దుబాటు చేసే పనిలో ఉంది ప్రియాంక. అతుల్ అగ్నిహోత్రి నిర్మిస్తున్న ఈ చిత్రం కొరియన్ చిత్రం 'ఓడ్ టు మై ఫాదర్' ఆధారంగా తెరకెక్కుతోంది. వచ్చే నెల నుంచి ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది.

'సింబా'లో సారా

కొత్త కబుర్లు

'కేదార్‌నాథ్'తో బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతుంది సైఫ్ అలీఖాన్ కూతురు సారా అలీఖాన్. ఈ సినిమా సెట్స్‌పై ఉండగానే మరో అవకాశం దక్కించుకొంది సారా. రణ్‌వీర్‌సింగ్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న చిత్రం 'సింబా'. ధర్మ ప్రొడక్షన్స్‌లో కరణ్‌జోహార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి రోహిత్ శెట్టి దర్శకుడు. రణ్‌వీర్‌సింగ్ సరసన కథానాయికగా సారా అలీఖాన్‌ను ఎంపిక చేసినట్టు సోషల్ మీడియాలో పంచుకొంది ధర్మమూవీస్. మే నుంచి ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణ మొదలుకానుంది. విజయాలతో జోరుమీదున్న రణ్‌వీర్‌సింగ్, మాస్ మసాలా చిత్రాలకు పెట్టింది పేరైన రోహిత్ శెట్టి, ఓ కథను భారీ స్థాయిలో వెండితెరకు తీసుకొచ్చే నిర్మాత కరణ్ కలయికలో వస్తున్న ఈ చిత్రంలో సారాను తీసుకోవడం ఆమెకు మంచి అవకాశంగా చెబుతున్నాయి బాలీవుడ్ వర్గాలు.


రణ్‌వీర్‌సింగ్


సారా అలీఖాన్

పంచ్ డైలాగ్

ప్రేమంటే ఇద్దరికీ ఒకే బ్రాండ్ కాఫీ నచ్చడం కాదు. ఇద్దరూ కలసి ఓ మంచి కాఫీ తయారు చేసుకోవడం.

చిత్రం: మిస్టర్ పర్‌ఫెక్ట్

- పంపినవారు: పి.భానుచందర్ రెడ్డి, హైదరాబాద్

చిరునామా: సినిమా డెస్క్,
ఈనాడు కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్- 501512


దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం జరిగిన పద్మ పురస్కారాల ప్రదానం కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా 'పద్మవిభూషణ్' పురస్కారాన్ని స్వీకరిస్తున్న ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా.

స్ఫూర్తిని నింపే 'చిరుతేజ్ సింగ్'

తొమ్మిదేళ్ల వయసులోనే ఇండియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌ల్లోకి ఎక్కిన 'చిరుతేజ్ సింగ్' జీవితం ఆధారంగా ఆ చిన్నారి పేరుతోనే ఓ చిత్రం తెరకెక్కింది. చిరుతేజ్ సింగ్‌తోపాటు, మనాలి రాథోడ్, సౌమ్య వేణుగోపాల్ ప్రధాన పాత్రలు పోషించారు. డా॥ఆనంద్‌కుమార్ దర్శకత్వం వహించారు. ఎన్.ఎస్.నాయక్ నిర్మాత. ఈ చిత్రాన్ని హైదరాబాద్‌లో అనాథ పిల్లల కోసం ప్రత్యేకంగా ప్రదర్శించారు. దర్శకుడు మాట్లాడుతూ "చిరుతేజ్ సింగ్‌ని ప్రేరణగా తీసుకుని పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలనే ఉద్దేశంతోనే చిత్రాన్ని రూపొందించాం" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "జ్ఞాపకశక్తితో ఎదిగిన చిరుతేజ్‌సింగ్ చరిత్రని చిన్నారుల్లో స్ఫూర్తిని నింపేలా తెరపైకి తీసుకొచ్చాం. నటి సమంత అక్కినేని, సీత నారాయణ్, దర్శకులు వీరశంకర్, మధుర శ్రీధర్, నిర్మాత రాజ్ కందుకూరి తదితరులు సినిమాని చూసి అభినందించారు. బాల మేధావులను, వాళ్లపై తీసిన ఇలాంటి చిత్రాలను ప్రభుత్వం ప్రోత్సహించాలి. బాలల చిత్రోత్సవాలతోపాటు అంతర్జాతీయ బాలల చిత్రోత్సవంలోనూ ఈ సినిమాని ప్రదర్శిస్తాం. ఏప్రిల్‌లో విడుదల చేస్తామ"న్నారు. చిరుతేజ్‌సింగ్ మాట్లాడుతూ "మహబూబాబాద్‌కి చెందిన గిరిజన బాలికను. అమ్మానాన్నలు కిరణ్ సింగ్, వసంత ఉపాధ్యాయులు. వీరి ప్రోత్సాహం కారణంగానే జ్ఞాపకశక్తిని పెంచుకొన్నా. 3 నిమిషాల్లో 236 ప్రపంచ దేశ చిత్రపటాలను గుర్తించడంతో ఇండియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సాధించా. ఒకే నిమిషంలో 81 ప్రపంచదేశ చిత్రపటాల్ని గుర్తించి 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో నమోదయ్యా. ఇంకా పలు అవార్డులను సాధించి పిల్లలకి ఆదర్శంగా నిలవాలనుంది" అన్నారు. మనాలి రాథోడ్, సౌమ్య వేణుగోపాల్, మహేశ్ నునావత్, గీతా పూనిక్ పాల్గొన్నారు.


చిరుతేజ్ సింగ్

అనగనగా ఓ 'గులేబకావళి'


ప్రభుదేవా, హన్సిక

ప్రభుదేవా, హన్సిక జంటగా నటించిన చిత్రం 'గులేబకావళి'. కల్యాణ్ దర్శకత్వం వహించారు. మల్కాపురం శివకుమార్ నిర్మాత. సంగీతం: వివేక్-మెర్విన్ స్వరాలు అందించారు. హైదరాబాద్‌లో జీవిత రాజశేఖర్ ప్రచార చిత్రాన్ని ఆవిష్కరించారు. తొలి సీడీని దర్శకుల సంఘం అధ్యక్షుడు ఎన్.శంకర్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "ఈ ప్రచార చిత్రం చూస్తే నిధి కోసం జరిగే కథ అనిపిస్తోంది. ఇలాంటి సినిమాలంటే నాకు ఇష్టం. ప్రభుదేవా నృత్యాలు ప్రత్యేకాకర్షణ. ఒక పాటలో అయితే ప్రభుదేవా దాదాపుగా సింగిల్ టేక్‌లో చేసినట్టు అనిపించింద"ని అన్నారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ ఛైర్మన్ రసమయి బాలకిషన్ మాట్లాడుతూ "ఆనాటి 'గులేబకావలి' మాదిరిగానే ప్రభుదేవా నటించిన ఈ 'గులేబకావళి' సినిమా విజయాన్ని సాధిస్తుంద"న్నారు. నిర్మాత మాట్లాడుతూ "గులేబకావళి అనే ఓ ఊర్లో జరిగిన కథ ఇది. మూడు పాటలు ఆకట్టుకుంటాయి. ప్రభుదేవా డ్యాన్స్, హన్సిక అందాలు, గ్రాఫిక్స్, సంగీతం..ఒకటేంటి చాలా ప్రత్యేకతలు కలిగిన ఈ సినిమాని ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది. ఏప్రిల్ 6న విడుదల చేస్తున్నామ"న్నారు. ఈ కార్యక్రమంలో బోగారం శ్రీనివాస్, జానీ మాస్టర్, బీకం లోకేష్, బీరం సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విహార యాత్రలో...

నివిన్ పాల్, అరుణ్ కురియన్, థామస్ మాథ్యూ, సిద్ధి మహాజన్ కట్టి, అనార్కలీ మారికర్, అన్ను ఆంటోనీ ప్రధాన పాత్రధారులుగా నటించిన మలయాళ చిత్రం 'ఆనందం'. ఈ చిత్రాన్ని ఇదే పేరుతో ఎత్తరి గురురాజ్ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. గణేష్ రాజ్ దర్శకుడు. ఈనెల 23న విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లో 'ఆనందం' లోగోను దామోదర ప్రసాద్, ప్రచార చిత్రాన్ని పద్మరాజ్ విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "ఇంజనీరింగ్ తొలి సంవత్సరం చదువుతున్న ఆరుగురు విద్యార్థుల కథ ఇది. వాళ్లంతా విహారానికి వెళ్లినప్పుడు చోటుచేసుకున్న అనుభవాల నేపథ్యంలో సాగుతుంది. ఐదు పాటలున్నాయ"న్నారు. నిర్మాత గురురాజ్ మాట్లాడుతూ "పేరుకి తగ్గట్టే అందర్నీ ఆనందపరిచే సినిమా. సినిమా చూసిన కాలేజీ కుర్రాళ్లు తమ జ్ఞాపకాల్ని గుర్తు తెచ్చుకుంటారు. సచిన్ వారియర్ స్వరాలు ఆకట్టుకుంటాయ"న్నారు.


సిద్ధి మహాజన్ కట్టి, అనార్కలీ మారికర్

'తను చాలా ప్రొఫెషనల్...' అని ఎవరినైనా అంటే పని బాగా చేస్తుంది అంతేగా అనుకుంటున్నారా...
కాదు.. పని వాతావరణంలో వాళ్లు పెట్టుకునే కొన్ని నియమాలూ, మాటతీరూ, నడతా, భావవ్యక్తీకరణా, కష్టపడేతత్వం... ఇలా అన్నింట్లో తమదైన ముద్ర వేయడమే అసలైన ప్రొఫెషనలిజం అవుతుంది. అప్పుడే ఉద్యోగినిగా వందకు వంద మార్కులు పడతాయి. ఇది మాటల్లో చెప్పడం తేలికే కానీ ఆచరణే అసలైన సవాల్. దాన్ని ఎలా అధిగమించాలో చూద్దాం.

ఉద్యోగంలో... 100/100 మార్కులు పడాలంటే!



కొందరు మహిళలుంటారు. ఆఫీసులోకి అడుగుపెట్టాక పని తప్ప చుట్టుపక్కల ఏ జరుగుతోందో పట్టించుకోరు. నా పని నేను చేసుకుని ఇంటికి వెళ్తున్నానా లేదా అని మాత్రమే ఆలోచిస్తారు. ఈ క్రమంలో ఎక్కడికక్కడ ప్రణాళిక పేరుతో తనకంటూ ఓ చక్రబంధనాన్ని ఏర్పరచుకుంటారు. మరికొందరు పనిచేసే చోట ఇతరులతో ముఖ్యంగా మగవారితో మాట్లాడరు. ఎందుకంటే ఆఫీసులో ఇలా మాట్లాడినా, కాస్త స్నేహంగా ఉన్నా.. లేనిపోని విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని భయపడతారు. కొన్నిసార్లు మహిళల్నీ దూరం పెట్టేస్తుంటారు. ఈ తీరు ప్రొఫెషనలిజం అనుకుంటే పొరపాటు. అలాగని అందరితో అతి చనువుగా అత్యుత్సాహంగా ఉండటం కూడా కాదు. ఈ రోజుల్లో ఎంచుకున్న రంగంలో రాణించాలంటే, కెరీర్ నిచ్చెనను పైపైకి ఎక్కేయాలంటే... పురుషులతో సమానంగా కష్టపడటం తెలిసుండాలి. ఏదయినా చేయగల సమర్థతా రావాలి. అలాగే వ్యక్తిగతంగా, వృత్తిపరంగా పెట్టుకోవాల్సిన నియమాలూ కొన్ని ఉంటాయి. అప్పుడే 'షీ ఈజ్ ప్రొఫెషనల్' అనే కిరీటం సిగలో చేరుతుంది. గుర్తింపూ ఉంటుంది అంటారు కెరీర్ నిపుణులు.

దేనికైనా సై...

వృత్తిపరంగా దేనికైనా మనం సమర్థులం అని చెప్పగలగాలి. అదెలాగో వివరిస్తున్నారు ఆర్గనైజేషనల్ సైకాలజిస్టు డాక్టర్ కవితా గూడపాటి.

- ప్రొఫెషనలిజం అనేది స్త్రీ, పురుషులకు వేర్వేరుగా ఉండదు. దాన్ని మనంతట మనం సృష్టించుకున్నాం. కాబట్టి ఉద్యోగంలో విజయం సాధించాలంటే.. మనంతట మనం కొన్ని నియమాలు పెట్టుకోవాలి. దాన్నే వర్క్ ఎథిక్స్ అంటారు. వాటిల్లో సమయపాలనా, ఏ విషయంలోనైనా చొరవా, బృందంతో కలిసి పనిచేయగలగడం, భావవ్యక్తీకరణ స్పష్టంగా ఉండటం, సమర్థతా, నిజాయతీ లాంటి లక్షణాలు తప్పనిసరిగా ఉండాలి.
- పురుషులు ఎక్కువగా ఉండే రంగంలో పనిచేస్తున్నా, మరే సంస్థలో అయినా... సరే 'నేను మహిళను కాబట్టి.. నాకంటూ కొన్ని వెసులుబాట్లూ, సౌకర్యాలు కావాలి. ఫలానా చోటికి నేను వెళ్లలేను, ఆలస్యం అయితే ప్రయాణాలు చేయలేను...' లాంటివి చెప్పకూడదు. పురుషులతో సమానంగా జీతభత్యాలూ, పదోన్నతుల్ని సాధించాలంటే... ఇలాంటివాటన్నింటినీ వదిలేయాలి. వాళ్లతో సమానంగా పనిచేయడానికి సిద్ధంగా ఉండాలి.
- సంస్థను బట్టీ, పని వాతావరణాన్ని బట్టీ మన ఆహార్యం కూడా మారిపోవాలి. అవసరాన్ని బట్టీ, పనిచేసే సంస్థకు అనుగుణంగా దుస్తుల విషయంలో పురుషులకు దీటుగా ఉండాలి. అలాగని జీన్స్‌లూ, సూట్లే వేసుకోవాలని కాదు. సందర్భానికి తగినట్లుగా మన ఆహార్యం కూడా మారుతుండాలి. మాటతీరు కూడా హుందాగా ఉండాలి.
- స్నేహపూర్వకంగానే వ్యవహరించాలి కానీ సహోద్యోగులతో ఓ సరిహద్దు పెట్టుకోవాలి. ఏ మాటైనా సూటిగా, స్పష్టంగా చెప్పగలగాలి. తను చాలా డైనమిక్ అనే గుర్తింపు తెచ్చుకోవాలి. ఏ పని అయినా చేయగలను అని నిరూపించుకోగలగాలి. ముఖ్యంగా రిస్కులు తీసుకోవడానికి సిద్ధంగా ఉండాలి. అప్పుడే మనకు అవకాశాలు వస్తాయి. గుర్తింపూ ఉంటుంది. అవసరం అయితే... ఎక్కువ గంటలు పని చేయడానికీ వెనుకాడకూడదు.
- ఒకసారి ఉద్యోగంలో చేరాం... జీతం వస్తోందని అక్కడితోనే ఆగిపోతుంటారు చాలామంది. అది పొరపాటు. రంగం ఎలాంటిదైనా దానికి సంబంధించిన అంశాల్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుండాలి. నైపుణ్యాలు పెంచుకోవాలి. భావవ్యక్తీకరణ సూటిగా, స్పష్టంగా, కచ్చితంగా ఉండేలా చూసుకోవాలి. ఆ విధంగా మనల్ని మనం మార్చుకోవాలి.

వ్యక్తిగతంగా...

- ఆఫీసులోకి అడుగుపెట్టే ముందే ఇంటి సమస్యలూ, వ్యక్తిగత ఇబ్బందుల్ని వదిలేయాలి.
- భోజనం చేసేటప్పుడూ, కెఫెటేరియాలకు సహోద్యోగులతో కలిసి వెళ్లడం మామూలే. ఆ సమయంలో పని, ఆఫీసు విషయాలు మాట్లాడాలి తప్ప గాసిప్‌లకు దూరంగా ఉండాలి.
- ఉద్యోగం ఇచ్చేముందు ఓ సంస్థ స్త్రీలా, పురుషులా అని చూడదు. వాళ్లు ఆ ఉద్యోగానికి అర్హులా కాదా అని మాత్రమే పరిగణిస్తుంది. కాబట్టి కార్యాలయంలో ఇద్దరూ సమానమే అని గుర్తించాలి. వాళ్లతో సరదాగా ఉంటూనే పనిచేయాలి కానీ ఓ సరిహద్దు అంటూ పెట్టుకోవాలి.

అది పోవాలి...



ఉద్యోగం చేసే మహిళలకు మన సమాజంలో గౌరవం ఉంది. దాన్ని పని చేసే చోట కూడా నిలుపుకోగలగాలి. సాధారణంగా మహిళలు ఎక్కువగా గాసిప్‌లకు సంబంధించి మాట్లాడుకుంటారనే అభిప్రాయం అందరిలో ఉంటుంది. దాన్ని వీలైనంతవరకూ తగ్గించుకోగలగాలి. కెరీర్‌లో త్వరగా పైపైకి వెళ్లాలంటే ఎక్కువగా కష్టపడాలి. ఆ క్రమంలో ఒత్తిళ్లను అధిగమించగలగాలి. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా చూసుకోవాలి. అనవసర విషయాల్ని వదిలేయాలి. నిజాయతీ, నిబద్ధతతో పనిచేయగలగాలి. మహిళలు ఏ పని అయినా పూర్తిచేయగలరు అనే నమ్మకాన్ని కలిగించాలి. అవసరం అనుకున్నచోట కష్టపడేందుకు వెనుకాడకూడదు. ఎవరితోనైనా అవసరం మేరకే మాట్లాడటం... పనికి మొదటి ప్రాధాన్యం ఇవ్వడం.. లాంటి జాగ్రత్తలు తీసుకోగలిగితే గుర్తింపు ఎప్పుడూ ఉంటుంది.

- వనితా దాట్ల, వ్యాపారవేత్త.

నన్ను నేను నమ్ముతా...



పని చేసే చోట అందరితో నవ్వుతూ సరదాగా సంతోషంగా ఉండేందుకు ప్రాధాన్యం ఇస్తా. అయితే ఏదయినా ఓ హద్దులోనే. కార్యాలయంలో హుందాతనం, గౌరవం మన ఆహార్యంతోనూ వస్తుంది. అయితే అది మరీ ఎబ్బెట్టుగా ఉండకూడదు. పని వాతావరణానికి తగిన దుస్తుల్ని ఎంచుకోవాలి. మహిళల మీద ఎవరికైనా ఒక ప్రాథమిక అభిప్రాయాన్ని తీసుకొచ్చేది అలంకరణే కదా! అలాగే ఉద్యోగం చేస్తున్నాం కదాని అక్కడితోనే ఆగిపోకూడదు. మనల్ని మనం ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ ఉండాలి. మన ఆలోచనల్ని పై అధికారులకు తెలియజేయడానికి వెనుకాడకూడదు. అన్నింటితోపాటూ కాస్త సహనం ఉండటం కూడా ముఖ్యమే. ఇవన్నీ మనల్ని ఉన్నతంగా నిలబెడతాయనేది నా నమ్మకం.

-లావణ్య, యార్లగడ్డ, ,విశువల్ మర్చండైజర్, ల్యాండ్‌మార్క్ గ్రూపు

వీపుపై మొటిమలా?

కొంతమందికి వీపు మీద చిన్న చిన్న మొటిమలు లేదంటే దద్దుర్ల లాంటివి వస్తాయి. దానికి పరిష్కారంతో పాటూ కారణాలేంటో చూద్దాం..

- మనం సరైన ఆహారం తీసుకోకపోవడం కూడా దీనికి కొన్నిసార్లు కారణం కావొచ్చు. శరీరంలో వచ్చే మార్పులకు మన చర్మం తొందరగా స్పందిస్తుంది. అలాంటి మార్పు వస్తే వెంటనే గమనించాలి. చిరుతిళ్లు ఎక్కువగా తింటున్నట్లయితే మానేసి తాజా కూరగాయలూ, మాంసకృత్తులు ఉండే ఆహారం అధికంగా తినే ప్రయత్నం చేయాలి.
- కదలకుండా ఎక్కువసేపు కూర్చోవడం వల్ల వీపును అలా కుర్చీకి ఆనించి ఉంచుతాం. ఇది కూడా ఒక కారణం కావొచ్చు. అందుకే పని మధ్యలో అప్పుడప్పుడూ తప్పనిసరిగా విరామం ఉండేలా చూసుకోవాలి.
- సాయంత్రం వ్యాయామం చేసినా సరే.. స్నానం మానకూడదు. లేదంటే చెమట వల్ల కూడా ఈ సమస్య పెరిగే అవకాశం లేకపోలేదు. చర్మ రంధ్రాలు మూసుకుపోయి ఇంకా ఎక్కువయ్యే ప్రమాదం ఉంటుంది.




- జుట్టు ఎక్కువగా వీపు భాగానికి తగలడం వల్ల కూడా ఈ సమస్య ఎక్కువవుతుంది. పొడవు జుట్టు ఉన్నవాళ్లు... జుట్టు ముందు వైపునకు వేసుకుంటే మంచిది. వ్యాయామం చేస్తున్నప్పుడు కూడా పైకి ముడిలా వేసుకోడానికి ప్రయత్నించండి.
- ఈ సమస్యకు కొన్ని చిట్కాలు పాటిస్తే తొందరగానే ఫలితం ఉంటుంది. ఐసు ముక్కను తీసుకుని సమస్య ఉన్న ప్రాంతంలో తరచూ రుద్దుతూ ఉండాలి.
- కొబ్బరినూనెలో ఉండే యాంటీబ్యాక్టీరియల్ లక్షణాలు మొటిమల్ని తగ్గిస్తాయి. రాత్రి పడుకునే ముందు చిన్న దూది ఉండను కొబ్బరినూనెలో ముంచి రాసుకోవాలి. ఉదయాన్నే కడిగేస్తే చాలు. ఇలా తరచూ చేస్తే ఫలితం ఉండొచ్చు.
- తేనె కూడా దీనికి మంచి పరిష్కారం. తేనెను ఆ భాగంలో రాసుకుని ఒక అరగంట తర్వాత చల్లటి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. దీనిలో ఉండే సహజగుణాలు సమస్య తగ్గుముఖం పట్టేలా చేస్తాయి.

నజరానా

ఎలక్ట్రానిక్ పరికరాలు కొన్నప్పుడు వాటితో వచ్చే సిలికాన్ జెల్ ప్యాకెట్లను పడేయకండి. చాకులూ, పదునైన వస్తువులను వాటితో శుభ్రం చేయొచ్చు. తుప్పు పట్టకుండా ఉంటాయి.

బంగారం-వెండి



20 న ముగింపు-క్రితం

	ముగింపు	క్రితం
హైదరాబాద్		
బంగారం (24క్యా)	31,290	31,250
ఆర్నమెంట్	29,230	29,170
వెండి (కిలో)	39,190	39,400
విజయవాడ		
బంగారం (24క్యా)	31,300	31,150
ఆర్నమెంట్	29,000	28,900
వెండి (కిలో)	39,500	39,300
ప్రొద్దుటూరు		
బంగారం (24క్యా)	31,220	31,150
ఆర్నమెంట్	28,980	28,900
వెండి (కిలో)	39,200	39,100
రాజమహేంద్రవరం		
బంగారం (24క్యా)	30,430	------
ఆర్నమెంట్	28,980	28,860
వెండి (కిలో)	41,100	38,400
విశాఖపట్నం		
బంగారం (24క్యా)	31,110	31,110
ఆర్నమెంట్	28,920	28,920
వెండి (కిలో)	39,900	39,900
తమిళనాడు		
బంగారం ఆర్నమెంట్ (గ్రా)	2,898	2,886
వెండి (గ్రా)	41.20	41.00

(రూ. లలో)

రెండేళ్లలో 25 మారథాన్‌లు



50 ఏళ్లు నిండాయి... ఓపిక తగ్గుతోంది అనే మాట ఎవరైనా అంటే... మీరు కోయంబత్తూరుకు చెందిన ఊర్మిళా సురానా గురించి చెప్పండి. ఆమెకు 52 సంవత్సరాలు. కేవలం 24 నెలల్లో 25 మారథాన్‌లలో పాల్గొంది. త్వరలో స్పెయిన్‌లో ప్రపంచ మాస్టర్స్ అథ్లెటిక్ మీట్ మారథాన్‌లో పాల్గొననుంది. అసలు ఆమెకీ ఆలోచన ఎలా, ఎందుకు వచ్చిందంటే...

ఊర్మిళకు పెళ్లైన కొత్తల్లో ఆమె భర్త తనను క్రీడల్లో ప్రోత్సహించేవారట. అప్పట్లో ఆసక్తి లేక పెద్దగా పట్టించుకోలేదు. కొన్నాళ్లక్రితం ఇద్దరమ్మాయిలకు పెళ్లిళ్లు చేయడంతో కాస్త ఖాళీ దొరికింది. అప్పుడే ఆమెకు క్రీడలపై ఆసక్తి పెరిగింది. అలా రెండేళ్లక్రితం కోవై మారథాన్ గురించి ఓ దినపత్రికలో చదివి, పాల్గొనాలనుకుంది. శిక్షణ తీసుకుని మరీ వెళ్లి, మొదటి స్థానంలో నిలిచింది. అదే ఆమెలో ఆత్మవిశ్వాసం పెంచింది. అక్కడ మొదలైన ఆమె పరుగు ప్రస్తుతం ప్రపంచవేదికపై పాల్గొనే అవకాశన్ని తెచ్చిపెట్టింది. రెండో మారథాన్ అయ్యాక ఫిట్‌నెస్‌పై దృష్టి సారించింది. వ్యాయామాలు చేస్తూనే, ఈత, బ్యాడ్మింటన్‌లలో కొన్నాళ్లు శిక్షణ కూడా తీసుకుంది. తరువాత ముంబయి మారథాన్ 42 కెలో నాలుగున్నర గంటలు పరుగెత్తి రెండో స్థానంలో నిలిచింది.

హైదరాబాద్‌లోనూ: ఊర్మిళ ఉండేది కోయంబత్తూరులో అయినా... వివిధ రాష్ట్రాల్లో జరిగే మారథాన్‌లలోనూ పాల్గొంటుంది. అలా ఇప్పటివరకూ హైదరాబాద్, బెంగళూరు, కొచ్చిన్, చెన్నై.. ఇలా పలు ప్రాంతాలకు వెళ్లింది. వెళ్లిన ప్రతిచోటా పతకాలు సొంతం చేసుకుంది. హైదరాబాద్‌లో జరిగిన 21కె మారథాన్ తనకో జ్ఞాపకం అంటుందామె. ఆరు ఎత్తైన ప్రాంతాల్లో పరుగెత్తాల్సి వచ్చిందని చెబుతుంది. నిర్వాహకులు విషయం చెప్పాక.. మొదట సందేహించినా తరువాత దాన్నో సవాలుగా తీసుకున్నానని చెబుతుంది. ఇవన్నీ ఆమెకు తాజాగా అరుదైన అవకాశాన్ని తెచ్చిపెట్టాయి. సెప్టెంబరులో స్పెయిన్‌లో జరుగనున్న ప్రపంచ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున ఎంపికయ్యింది. దీనికోసం జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ట్రయల్స్ జరిగాయి. వీటిలో అర్హత సాధించిన ఊర్మిళ ఇప్పుడు 800, 1500 మీటర్లు, అలాగే 5కె, 10 కె మారథాన్‌లలో పాల్గొనబోతోంది. 'ఎలాంటి మారథాన్ అయినా సులువుగా పరుగెత్తడానికి కారణం నా దినచర్యే. పొద్దున్నే నాలుగున్నర గంటలకు నిద్రలేస్తా. గంటసేపు వ్యాయామాలు చేశాక, ఇంటిపనులు పూర్తిచేస్తా. ఆ తరువాత ఈత, బ్యాడ్మింటన్, యోగా ఉంటాయి. ఇక, నేను తీసుకునే ఆహారంలో ఎక్కువగా ఊర్మిళ తీసుకునే ఆహారంలో కూరగాయలూ, ఆకుకూరలూ, చిలకడదుంపలు ఉంటాయి. అలాగే నారింజా, బీట్‌రూట్‌రసం తాగుతా. ఈ జాగ్రత్తలే నన్ను చురుగ్గా ఉంచుతాయి...' అని చెబుతుందీమె.

పిల్లలే మనకు మార్గదర్శకులు!

పిల్లలు తల్లిదండ్రులను చూసే అన్ని విషయాలూ నేర్చుకుంటారు. కానీ మనం కూడా వాళ్లనుంచి నేర్చుకోవాల్సిన విషయాలు చాలానే ఉన్నాయి. వారిలో ఉండే అమాయకత్వం, కల్మషం లేని నవ్వు... ప్రతిదీ మనకు నిత్య జీవిత పాఠమే!



- పరిచయం లేని వ్యక్తులను చూసినా సరే కల్మషం లేకుండా నవ్వేస్తారు. అలాంటి స్పందనే ఎదుటివాళ్ల నుంచీ వస్తుంది. అంతేగానీ, నవ్వేముందు ఎందుకు నవ్వాలి అనే ప్రశ్న వాళ్లకుండదు. ఇది మనకూ వర్తిస్తుంది. మన ఇంటిపక్కో, బస్సులో పక్కసీటులోనో, ఉద్యోగంలోనో, కొత్తవాళ్లతోనో మాట్లాడాలా వద్దా.... మాట్లాడితే ఏమనుకుంటారో, ఎలా పలకరించాలి... ఇలా సవాలక్ష ప్రశ్నలు వేసుకోకుండా ఒకసారి నవ్వేస్తే చాలు. స్నేహం మొదలవుతుంది.
- పిల్లలకు ఒక వస్తువునో, జంతువునో చూస్తే భయపడాలన్న విషయం మనం చెప్పేదాకా తెలీదు. మనమే అది బూచీ, బౌ అంటూ చెప్పి భయపెడతాం. మనం ఇలా పూర్తిగా దేనికీ భయపడకుండా ఉండాలని కాదు కానీ... అన్నింటినీ విపరీతంగా ఆలోచించడం మానుకోవాలి. వయసు పెరిగే కొద్దీ తిరస్కరణా భయం, ఓటమి... లాంటి ఆలోచనలు మెదడులో నాటుకుపోతాయి. వీటిని అదుపులో పెట్టుకోడానికి ప్రయత్నించాలి.
- నవ్వడం, ఆడుకోవడం, పాడటం... చిన్నప్పుడు అందరం చేసేవే. కానీ పెద్దయ్యాక 'మెచ్యూరిటీ' పేరుతో అవన్నీ మర్చిపోతాం. అయితే సమయానికి, సందర్భానికి అనుగుణంగా అలా ఉండటం తప్పుకాదు. కానీ పూర్తిగా మన జీవితం నుంచి వేరు చేయకుండా ప్రతిక్షణం ఆనందంగా గడిపేలా చూసుకోవాలి.
- ఓ వయసు రాగానే మనం ప్రశ్నించే తత్వం మర్చిపోతాం. కానీ పిల్లల్లా మన సందేహాలను ఎప్పటిప్పుడు నివృత్తి చేసుకోవాలి.

పిల్లలకు భవిష్యత్తులో ఏమవుతుందో అనే దిగులూ, బెంగా ఉండదు. దాంతో ప్రతిపనీ శ్రద్ధగా చేస్తారు. ఆనందంగా ఉండగలుగుతారు. గతాన్ని కూడా గుర్తుంచుకోరు. ఇది మనం నేర్చుకోవాల్సిన ముఖ్య సూత్రం.



గగన వీధిలో ఘన సారథి!

నలుగురు నడిచేదారి నాకొద్దని.. ప్రత్యేకతను కోరుకుంటూ కలల ఆకాశంలో విహరించే వారికి విలువైన ఉద్యోగం పైలట్. చక్కటి ఫిట్‌నెస్, హుందాగా యూనిఫాం, సామాజిక గౌరవం.. అన్నింటికి మించి ఆకర్షణీయమైన ఆరంకెల జీతం. రాష్ట్రాలు దాటి, ఖండాలను చుట్టి ప్రపంచం మొత్తం పనిగా తిరిగి వచ్చే పసందైన కొలువు. అది కావాలంటే కమర్షియల్ లైసెన్స్ (సీపీఎల్) పొందాలి. పైలట్‌గా చేరడానికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పలు అవకాశాలు ఉన్నాయి. శిక్షణతోపాటు ఉద్యోగాన్ని కూడా ఆయా సంస్థలు అందిస్తున్నాయి.

✈ ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు అవకాశం ✈ శిక్షణలో నెలకు రూ.50 వేలకుపైగా స్టైపెండ్ ✈ ఫ్లయింగ్ ఆఫీసర్ హోదాతో ఉద్యోగం

ఆకాశంలో ఎగిరే విమానం చూస్తే అందరికీ అదో ఆనందం. విమానం శబ్దం వినగానే ఎవరైనా మిద్దె మీదకో, బాల్కనీ అంచుకో చేరి కుడిచేతిని ఎత్తి కళ్లపై కాంతి పడకుండా అడ్డం పెట్టుకొని కన్నార్పకుండా చూసి వెళ్లాల్సిందే. పెద్దయ్యాక ఏమవుతావురా అని అడిగితే పిల్లలు కొంతమంది పైలట్ అవుతా.. అంటారు. అదీ విమానం మోజే. ప్రైవేటు విమానయానం విస్తరించిన తర్వాత ఈ రంగంలో ఉద్యోగాలు పెరుగుతున్నాయి. ఇంతకీ మన పిల్ల పిడుగులు ఎవరికీ అందనంత ఎత్తులో ఎగిరే పైలట్ కావడం ఎలా అంటారా.. దానికి పలు రకాల మార్గాలు ఉన్నాయి. శిక్షణ పొందుతూనే నెలకు రూ.50 వేలపైనే స్టైపెండ్ అందుకోవచ్చు. మెరుగైన నైపుణ్యాలు సాధిస్తే యుద్ధ విమానాలూ నడిపే వీలుదొరుకుతుంది. అన్నీ కలిసొస్తే భవిష్యత్తులో భారతీయ వాయుసేనను ఆధిపత్యం చేసే స్థాయికీ చేరుకోవచ్చు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడెమీ అండ్ నేవల్ అకాడెమీ (ఎన్డీఏ అండ్ ఎన్ఎ), కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీడీఎస్ఈ) ఇంటర్, డిగ్రీ విద్యార్హతలతో పైలట్ శిక్షణ, ఉద్యోగం రెండూ అందిస్తున్నాయి. అవే కాకుండా ఎయిర్ ఫోర్స్ (ఏఎఫ్ క్యాట్), నేవీ (షార్ట్ సర్వీస్ కమిషన్)లు గ్రాడ్యుయేట్లకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి పైలట్ శిక్షణ, ఉద్యోగాన్ని కల్పిస్తున్నాయి.

ఇంటర్‌తో ఎన్డీఏ

పైలట్ కావడానికి మొదటి ప్రధాన అవకాశంగా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడెమీ (ఎన్డీఏ) పరీక్షను పేర్కొనవచ్చు. దీన్ని ఏడాదికి రెండు సార్లు నిర్వహిస్తారు. జనవరి, జూన్‌లో ప్రకటనలు వస్తాయి. ఎన్డీఏతో ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌ల్లో ఉన్నత స్థాయి ఉద్యోగాలు లభిస్తాయి. పైలట్ కావాలనుకునేవాళ్లు ఎయిర్ ఫోర్స్ విభాగాన్ని ఎంచుకోవాలి. ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణులు ఎయిర్ ఫోర్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సైతం అర్హులే. వయసు 16 1/2 ఏళ్ల నుంచి 19 1/2 ఏళ్లలోపు ఉండాలి. బాలురు మాత్రమే అర్హులు. అలాగే పైలట్ ఉద్యోగానికి 162.5 సెం.మీ. ఎత్తు ఉండాలి.



ఎంపిక ఇలా: అభ్యర్థుల ఎంపిక రెండు దశల్లో జరుగుతుంది. అవి: రాత పరీక్ష (ఆబ్జెక్టివ్ తరహా), ఇంటెలిజెన్స్ - పర్సనాలిటీ టెస్ట్. రాత పరీక్షలో మొత్తం 900 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1 మ్యాథ్స్, పేపర్-2 జనరల్ ఎబిలిటీ. రాత పరీక్షలో అర్హత పొందిన వారికి సర్వీస్ సెలక్షన్ బోర్డ్ (ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో యూపీఎస్సీ ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్టులు రెండు అంచెల్లో నిర్వహిస్తుంది. రాత పరీక్ష, సర్వీస్ సెలక్షన్ బోర్డు నిర్వహించిన పరీక్షల్లో వచ్చిన మొత్తం మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. వీరికి పైలట్ ఆప్టిట్యూడ్ టెస్టు నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధిస్తేనే పైలట్ శిక్షణలోకి అనుమతి లభిస్తుంది. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి కోర్సులో చేర్చుకుంటారు.

చదువు, శిక్షణ: ఏడు వేల ఎకరాల సువిశాల క్యాంపస్ నేషనల్ డిఫెన్స్ అకాడెమీ (ఎన్‌డీఏ) పుణెలో అభ్యర్థులకు శిక్షణ, చదువు మూడేళ్లపాటు ఉంటాయి. పుస్తకాలు, భోజనం, వసతి సౌకర్యం అన్నీ ఉచితమే. అనంతరం అసలు సిసలైన పైలట్ శిక్షణ ఎయిర్ ఫోర్స్ అకాడెమీ (ఏఎఫ్ఏ) - హైదరాబాద్ (దుండిగల్)తో పాటు పలు కేంద్రాల్లో సుమారు 18 నెలల వరకు నిర్వహిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్నవారికి బీటెక్‌ను దిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) ప్రదానం చేస్తుంది. పట్టా పుచ్చుకున్న తర్వాత వీరు ఫ్లయింగ్ ఆఫీసర్ హోదాతో ఎయిర్ ఫోర్స్‌లో చేరిపోవచ్చు.

నేవీలోనూ పైలట్

షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో ఇండియన్ నేవీ పైలట్ పోస్టులను భర్తీ చేస్తుంది. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు ఈ పోస్టులకు అర్హులు. పదోతరగతి, ఇంటర్, ఇంజినీరింగ్ అన్నింట్లోనూ 60 శాతం మార్కులు తప్పనిసరి. వీటితోపాటు టెన్త్, ఇంటర్ ఇంగ్లిష్‌లో 60 శాతం మార్కులు ఉండాలి. 162.5 సెం.మీ. ఎత్తుతో, 21-24 ఏళ్లలోపు వారు అర్హులు. మహిళలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంజినీరింగ్ ఆఖరు సంవత్సరం కోర్సులు చదువుతున్నవారూ అర్హులే. షార్ట్ లిస్ట్ చేసి ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూల ద్వారా నియామకాలు చేపడుతుంది. ఎంపికైనవారికి నేవల్ అకాడమీ ఎజిమాలలో 22 వారాల పాటు శిక్షణ ఉంటుంది. అనంతరం స్టేజ్ -1, స్టేజ్ -2 ఫ్లయింగ్ శిక్షణ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో ఇస్తారు. వీరు నౌకాదళం తరపున యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు నడుపుతారు. గరిష్ఠంగా 14 ఏళ్లపాటు సేవల్లో కొనసాగుతారు. ఏడాదికి రెండుసార్లు మార్చి, అక్టోబరుల్లో ప్రకటన వెలువడుతుంది. www.joinindiannavy.gov.in

డిగ్రీతో సీడీఎస్ఈ

డిగ్రీ అర్హతతో యూపీఎస్సీ ఏడాదికి రెండు సార్లు కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీడీఎస్ఈ) ను నిర్వహిస్తోంది. నవంబరు, ఆగస్టుల్లో ప్రకటనలు వెలువడతాయి. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌ల్లో ఉన్నత స్థాయి ఉద్యోగాలకు సీడీఎస్ఈ నిర్వహిస్తున్నారు. పైలట్ కావాలనుకున్నవారు ఎయిర్ ఫోర్స్ విభాగాన్ని ఎంచుకోవాలి.

అర్హత: ఏదైనా సాధారణ డిగ్రీ లేదా బీఈ / బీటెక్ ఉత్తీర్ణత. అయితే ఇంటర్‌లో మాత్రం మ్యాథ్స్, ఫిజిక్స్ చదివుండడం తప్పనిసరి. ఆఖరు సంవత్సరం డిగ్రీ కోర్సులు చదువుతున్నవాళ్లూ దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు: 20-24 ఏళ్లలోపు ఉండాలి. పురుషులు మాత్రమే అర్హులు. ఎత్తు 162.5 సెం.మీ. ఉండాలి.

ఎంపిక విధానం: ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్‌లతో స్టేజ్-1 రాత పరీక్ష, స్టేజ్-2లో జరిపే ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్‌ల ద్వారా జరుగుతుంది. పైలట్ ఆప్టిట్యూడ్ టెస్టులోనూ అర్హత సాధించాలి. ఎంపికైనవారికి 74 వారాల పాటు ఎయిర్ ఫోర్స్ అకాడమీలో శిక్షణ ఇస్తారు. అనంతరం ఫ్లయింగ్ ఆఫీసర్ హోదాతో ఎయిర్ ఫోర్స్‌లో విధుల్లోకి తీసుకుంటారు.

మరో మార్గం... ఏఎఫ్‌క్యాట్

ఎయిర్ ఫోర్స్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (ఏఎఫ్ క్యాట్) పేరుతో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ప్రత్యేకంగా ఏడాదికి రెండు సార్లు పరీక్ష నిర్వహిస్తోంది. ఏటా జూన్, డిసెంబరుల్లో ఈ పరీక్ష ప్రకటన వెలువడుతుంది. ఇందులో పలు రకాల పోస్టులు ఉంటాయి. వీటిలో ఫ్లయింగ్ ఆఫీసర్ (పైలట్) ఒకటి. షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో ఈ పోస్టులు భర్తీ చేస్తారు. ఈ విధానంలో ఎంపికైనవారు 14 ఏళ్లపాటు విధుల్లో కొనసాగుతారు. మహిళలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నేషనల్ కాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)-సీ సర్టిఫికెట్ ఉన్నవారు ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ ద్వారా పైలట్ కావచ్చు. ఈ నియామకాలు కూడా ఏఎఫ్‌క్యాట్ తోనే చేపడతారు.

అర్హత: ఫ్లయింగ్ బ్రాంచ్ పోస్టులకు 60 శాతం మార్కులతో ఏదైనా సాధారణ డిగ్రీ లేదా బీఈ/ బీటెక్ పూర్తిచేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఇంటర్లో మ్యాథ్స్, ఫిజిక్స్ తప్పనిసరి. ఆఖరు సంవత్సరం కోర్సులు చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులే.

వయసు: 20 నుంచి 24 ఏళ్లలోపు ఉండాలి.

ఎత్తు: కనీసం 162.5 సెం.మీ. ఉండాలి.

రాత పరీక్ష: వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. బహుళైచ్ఛిక విధానంలో ప్రశ్నలడుగుతారు. ఇందులో జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్, రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, మిలటరీ ఆప్టిట్యూడ్ విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. ఈ పరీక్షలో ఉత్తీర్ణులకు ఇంటెలిజెన్స్ పరీక్ష ఉంటుంది. ఇందులో అర్హత సాధించినవారికి సైకలాజికల్ టెస్ట్, బృంద పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. చివరగా పైలట్ ఆప్టిట్యూడ్ టెస్టులోనూ అర్హత సాధిస్తే పైలట్ శిక్షణకు ఎంపిక చేస్తారు.

శిక్షణ: ముందుగా ఆరు నెలల పాటు ప్రాథమిక శిక్షణ నిర్వహిస్తారు. సాధారణంగా దీన్ని ఎయిర్ ఫోర్స్ అకాడమీ - దుండిగల్, హాకింపేట్, ఎలహంక, బీదర్‌ల్లో చేపడతారు. అనంతరం అభ్యర్థుల ప్రతిభ ప్రకారం ఫైటర్ పైలట్, ట్రాన్స్ పోర్ట్ పైలట్, హెలికాప్టర్ పైలట్లుగా విడదీసి అందుకుతగ్గ శిక్షణను రెండు దశల్లో నిర్వహిస్తారు. ఈ సమయంలో నెలకు రూ.56,100 చొప్పున స్టైపెండ్ చెల్లిస్తారు. శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులను ఫ్లయింగ్ ఆఫీసర్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు.

ఉద్యోగంలో...

ఎన్డీఏ, సీడీఎస్ఈ, ఏఎఫ్ క్యాట్ తదితర ఏ విధానాల్లో అభ్యర్థులు ఎంపికైనప్పటికీ విజయవంతంగా పైలట్ శిక్షణ ముగించుకుని ఉద్యోగంలో చేరిన తర్వాత వేతనం, హోదా అంతా సమానంగానే ఉంటాయి. ఎయిర్ ఫోర్స్‌లో అయితే ఫ్లయింగ్ ఆఫీసర్, నేవీలో సబ్ లెఫ్టినెంట్ హోదా ఇస్తారు. రూ.56,100 మూల వేతనం చెల్లిస్తారు. దీనికి డీఏ, హెచ్ఆర్ఏ ఇతర అలవెన్సులు అదనం. మిలటరీ సర్వీస్ పే కింద ప్రతి నెల రూ.15,500 చెల్లిస్తారు. వీటితోపాటు ఫ్లయింగ్ అలవెన్సు (విమానం నడిపే వ్యవధికి) కూడా ఉంటుంది. ట్రాన్స్‌పోర్ట్ అలవెన్సు, చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అలవెన్సు, రాయితీ ధరలకు క్యాంటీన్, ఫర్నీచర్‌తో కూడిన నివాస సముదాయం, తక్కువ వడ్డీకి రుణాలు, ఎల్టీఏ, 60 వార్షిక సెలవులు, 20 సాధారణ సెలవులు... ఉంటాయి. వేతన రూపంలో ప్రతినెలా రూ. లక్ష వరకు అందుకోవచ్చు. ఫ్లయింగ్ ఆఫీసర్ హోదాతో ఎయిర్ ఫోర్స్‌లో చేరినవారు రెండేళ్ల అనుభవంతో ఫ్లయిట్ లెఫ్టినెంట్‌గా పదోన్నతి పొందుతారు. ఆరేళ్ల అనుభవం ఉన్నవారు స్క్వాడ్రన్ లీడర్ అవుతారు. పదమూడేళ్ల సర్వీస్‌తో వింగ్ కమాండర్ స్థాయికి చేరుకుంటారు. అనంతరం శాఖాపరమైన నియామకాల ద్వారా ఇంకా ఉన్నత స్థాయిలకు చేరుకోవచ్చు. అత్యున్నత ప్రతిభావంతులు భవిష్యత్తులో ఎయిర్ చీఫ్ మార్షల్ (ఎయిర్ ఫోర్స్‌లో అత్యున్నత ఉద్యోగం)గా భారతీయ వాయు సేనకు దిశానిర్దేశం కూడా చేయవచ్చు.

www.upsc.gov.in

http://careerairforce.nic.in

సివిల్ పైలట్

సివిల్ పైలట్ కోర్సుల్లో చేరడానికి ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్ చదవాలి. 17 ఏళ్లు నిండినవారికి అవకాశం లభిస్తుంది. దేశంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) గుర్తింపు పొందిన 30 పైలట్ శిక్షణ సంస్థలు ఉన్నాయి. వీటిలో 18 నెలల కోర్సు పూర్తిచేసుకుని కమర్షియల్ పైలట్ లైసెన్స్ (సీపీఎల్) అందుకోవచ్చు. ఈ 30 సంస్థల్లో ఇందిరాగాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీ (ఐజీఆర్‌యూఏ)కు జాతీయ స్థాయిలో పేరుంది. ఇక్కడ సీపీఎల్ కోర్సు పూర్తిచేయడానికి రూ. 45 లక్షల వరకు వ్యయం అవుతుంది. ప్రస్తుతం విమాన ప్రయాణికులు పెరుగుతున్నారు. చిన్న పట్టణాల్లోనూ విమానాశ్రయాలు ఏర్పాటయ్యే అవకాశాలు మెరుగవుతున్నాయి. భారీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కాబట్టి అభ్యర్థులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. పైలట్ వృత్తిలో చేరిన తర్వాత ప్రతి ఆరు నెలలకు ఒకసారి మెడికల్ టెస్టుల్లో ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి ఉంటుంది.


ఎస్పీఎల్‌తో మొదలు

స్టూడెంట్ పైలట్ లైసెన్స్ (ఎస్పీఎల్) తో సివిల్ పైలట్ శిక్షణ మొదలవుతుంది. కొన్నాళ్ల శిక్షణ అనంతరం ప్రైవేటు పైలట్ లైసెన్స్ (పీపీఎల్) మంజూరు చేస్తారు. ఈ దశలో వీరు ఒంటరిగా చిన్నపాటి శిక్షణ విమానాన్ని నడపాలి. మరికొంత అదనపు శిక్షణ, అనుభవం అనంతరం కమర్షియల్ పైలట్ లైసెన్స్ (సీపీఎల్) ప్రదానం చేస్తారు. సీపీఎల్ డిగ్రీని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) మంజూరు చేస్తుంది. ఈ లైసెన్స్‌తో ప్రయాణికులను చేరవేసే విమానాలు నడపడానికి అర్హత పొందుతారు. కొత్త పైలట్లను ఎయిర్ లైన్స్ సంస్థలు కో పైలట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటాయి.

పైలట్ శిక్షణ కోసం ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న సంస్థల్లో చేరడానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. మెరుగైన శిక్షణ పొందాలనుకునేవారు కెనడా, అమెరికాల్లో పైలట్ కోర్సు అభ్యసించవచ్చు.

తెలంగాణలో ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ ఏవియేషన్ అకాడమీ ద్వారా పైలట్ శిక్షణ అందిస్తున్నారు. ఆసియా పసిఫిక్ ఫ్లయిట్ ట్రైనింగ్ అకాడమీ లిమిటెడ్, ఫ్లైటెక్ ఏవియేషన్ అకాడమీ, వింగ్స్ ఏవియేషన్ సంస్థలు పైలట్ శిక్షణ నిర్వహిస్తున్నాయి. ఇవన్నీ హైదరాబాద్‌లోనే ఉన్నాయి.

కామర్స్‌లో అర్హత ఖాయం!



అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు అర్హత సాధించేందుకు, పరిశోధన రంగంలో ప్రవేశించేందుకు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు మంచి అవకాశం వచ్చింది. ఒకే రకమైన సిలబస్‌తో వరుసగా మూడు వారాల్లో మూడు పరీక్షలు రాసేందుకు వీలు కలిగింది. కచ్చితంగా అర్హత పొందేందుకు కాలం కలిసి వచ్చింది. ఇక సరైన ప్రణాళికతో సిద్ధం కావడమే మిగిలి ఉంది.



డాక్టర్ ఎం. మల్లారెడ్డి,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల, కరీంనగర్

జాతీయ స్థాయిలో యూజీసీ-నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (యూజీసీ-నెట్), మరోవైపు తెలంగాణ రాష్ట్ర స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్-సెట్), ఇంకోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏపీ సెట్‌లకు ఇటీవల నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. యూజీసీ ఇటీవల ప్రకటించిన నిబంధనల ప్రకారం కొత్త పద్ధతిలో మొదటిసారిగా పరీక్షలను జులైలో వరుసగా మూడు వారాలు నిర్వహించనున్నారు. ఒక ప్రిపరేషన్‌తో మూడు పరీక్షలు రాసే సువర్ణావకాశం అభ్యర్థులకు దక్కింది.

ఈ మూడు పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు పరిశోధనతోపాటు యూనివర్సిటీలు, డిగ్రీ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలకు అర్హత పొందుతారు. ఏపీ-సెట్ జులై 1న, యూజీసీ-నెట్ జులై 8న, టీఎస్-సెట్ జులై 15న జరగనున్నాయి. 3 నుంచి 4 నెలల సమయం ఉంది.

సిలబస్ విశ్లేషణ

మొదటి పేపర్ అందరికీ కామన్‌గా ఉంటుంది. అందులో అభ్యర్థుల టీచింగ్, పరిశోధన సామర్థ్యాలను పరిశీలిస్తారు. ఇప్పుడు పేపర్-2 మాత్రమే ఉంది. ఇది కూడా అభ్యర్థులకు కలిసి వచ్చే అంశం. కామర్స్ సిలబస్ పరిశీలిస్తే...

- యూనిట్-1 బిజినెస్ ఎన్విరాన్‌మెంట్‌లోని వివిధ భావనలు, ఇతర అంశాలను వర్తమాన వివరాలతో కలిపి చదవాలి.
- యూనిట్-2 ఆర్థిక, నిర్వహణ అకౌంటింగ్‌కి సంబంధించి ముఖ్యంగా ప్రాథమిక భావనలు, సూత్రాలు చదవాలి. చిన్నచిన్న సమస్యలను ఎక్కువగా సాధన చేయాలి.
- యూనిట్-3 వ్యాపార అర్థశాస్త్రంలో అభ్యర్థులు వివిధ సిద్ధాంతాల నిర్వచనాలు, ప్రమేయాలు, సంవత్సరాలు, భిన్న పటాలను ఉదాహరణలతో విశ్లేషిస్తూ లోతుగా చదవాలి.
- యూనిట్-4 వ్యాపార గణాంకశాస్త్రం- దత్తాంశ విశ్లేషణలో వివిధ పద్ధతుల సూత్రాలు, వాటి వినియోగం తెలుసుకోవాలి. తగినన్ని సమస్యలను సాధన చేయాలి. సూత్రాలను నోట్ చేసుకుంటూ చదివితే మంచి స్కోరు సాధించవచ్చు.
- యూనిట్-5 వ్యాపార నిర్వహణ విభాగంలోని శాస్త్రవేత్తల పేర్లు, వివిధ సంవత్సరాలు, వివిధ పద్ధతులపై పట్టు సాధించాలి.
- యూనిట్-6 మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ ముఖ్యమైన విభాగం. దీని నుంచి 12 నుంచి 14 ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ప్రతి భావనను వర్తమాన విశేషాలతో కలిపి అధ్యయనం చేయాలి.
- యూనిట్-7 ఆర్థిక నిర్వహణ శాస్త్రంలోని భావనలు, సూత్రాలపై అవగాహన పెంచుకుంటూ సమస్యలను సాధన చేయాలి.
- యూనిట్-8 మానవ వనరుల నిర్వహణ కూడా అభ్యర్థులు అర్హత సాధించడంలో ప్రముఖ పాత్ర వహిస్తుంది. దీని నుంచి 12 లేదా 14 ప్రశ్నలు రావచ్చు. లోతుగా విశ్లేషిస్తూ చదవాలి..
- యూనిట్- 9 బ్యాంకింగ్, విత్తసంస్థలు సెక్షన్‌ను చదివేటప్పుడు అభ్యర్థులు ముఖ్యంగా బ్యాంకులను స్థాపించిన సంవత్సరాలు, ప్రధాన కార్యాలయాలు, ఛైర్మన్‌ల పేర్లు, విధులు, బ్యాంకుల్లో జరిగే మోసాలు, ఇంకా బ్యాంకింగ్ వర్తమాన అంశాలు ముఖ్యం.
- యూనిట్-10 అంతర్జాతీయ వ్యాపారంపై కూడా అభ్యర్థులు శ్రద్ధ వహించాలి. దీని నుంచి కూడా 12 లేదా 14 ప్రశ్నలు అడగవచ్చు. ఇందులోని వివిధ సంస్థలను స్థాపించిన సంవత్సరాలు, ప్రధాన కార్యాలయాలు, వాటి అధిపతులు, వివిధ భావనలు, రేట్లు తదితరాలను వర్తమాన విశేషాలతో జోడించి చదవాలి.
- యూనిట్-11 అకౌంటింగ్, ఫైనాన్స్‌లో అభ్యర్థులు అకౌంటింగ్ ప్రమాణాలు, ఐఎఫ్ఆర్ఎస్, వివిధ స్టాక్ ఎక్స్ఛేంజీల పని తీరు, వస్తున్న మార్పులను, భావనలను వర్తమాన వివరాలతో అనుసంధానం చేసి అధ్యయనం చేయాలి.
- యూనిట్-12 ఆదాయపు పన్ను చట్టం, పన్ను ప్రణాళిక విభాగంలోని ప్రాథమిక భావనలు, వివిధ సెక్షన్లు, పన్ను రేట్లు, పన్ను గణన చదవాలి. వీటినన్నీ ఎక్కువ సమస్యలను ప్రాక్టీస్ చేయాలి.

ఈ పుస్తకాలు ఉపయోగకరం

◗ Business Environment - Ashwathappa ◗ Financial & Management Accounting - Jain and Narang ◗ Business Economics - Mithani ◗ Business Statistics - SP. Guptha ◗ Business Management - LM Prasad ◗ Marketing Management - Dhilip Kotter or Rama Swamy & Nama Kumar ◗ Financial Management - Sharma and Shashi K. Guptha ◗ Human Resource Management - P. Subba Rao ◗ International Business - OS Srivastava or P. Subba rao ◗ Accounting and Finance - VA Avadhani ◗ Banking and Financial Institutions - AV Ranganadha Chary & Koteshwar Rao ◗ Income Tax Law & Tax Planning - VP Gaur, Rajeev Puri & Puja Gaur ◗ UGC-NET/JRF/SET - Commerce - Dr. LN Koli

■ తెలుగు మాధ్యమం కోసం తెలుగు అకాడమీ పుస్తకాలను చదవచ్చు.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ఖాళీలు: స్పెషల్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్- 35, డిప్యూటీ జనరల్ మేనేజర్ (లా)- 02, డిప్యూటీ మేనేజర్ (లా)- 82. **అర్హతలు:** సీఏ/ ఐసీడబ్ల్యూఏ, డిగ్రీ(లా), ఎంబీఏ (ఫైనాన్స్), పని అనుభవం ఉండాలి. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తు:** 20.03.2018 నుంచి 07.04.2018 వరకు. **వెబ్‌సైట్:** www.sbi.co.in

ఏపీఎస్ఎస్‌డీసీలో మేనేజర్లు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్, మేనేజర్ ఖాళీలు. **విభాగాలు:** టెక్నికల్/ నాన్ టెక్నికల్ కాలేజెస్, ఎంటర్‌ప్రెన్యూర్, ఇన్నోవేషన్, డైరెక్ట్ ప్లేస్‌మెంట్, నాన్-అకడమిక్. **అర్హతలు:** డిగ్రీ/ పీజీ, పని అనుభవం. **దరఖాస్తు:** కరిక్యులం విటేను మెయిల్ చేయాలి. **ఈ-మెయిల్:** careers2018@apssdc.in **చివరి తేది:** 03.04.2018. **వెబ్‌సైట్:** www.apssdc.in

వాక్-ఇన్స్

కేవీల్లో టీచర్లు

కేంద్రాలు: తిరుపతి, గుంటూరు కేంద్రీయ విద్యాలయాలు. **పోస్టులు:** పీజీటీ, టీజీటీ, పీఆర్‌టీ, డాక్టర్, నర్సు తదితరాలు. **అర్హతలు:** ఇంటర్, డిగ్రీ, పీజీ, డీఈడీ, బీఈడీ, సీటెట్. కేవీ నెం.1, తిరుపతిలో- **ఇంటర్వ్యూ తేదీలు:** 23, 25.03.2018, www.kv1tirupati.org కేవీ, నల్లపాడు, గుంటూరులో- **ఇంటర్వ్యూ తేది:** 24.03.2018 www.kvguntur.org

డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం

ఖాళీలు: టీచింగ్ అసోసియేట్/ రిసెర్చ్ అసోసియేట్- 30.

అర్హత: మాస్టర్స్ డిగ్రీ, నెట్, రెండేళ్ల పని అనుభవం.

ఇంటర్వ్యూ తేదీలు: మార్చి 26 నుంచి 28 వరకు. **వేదిక:** డా. వైఎస్ఆర్ హెచ్‌యూ క్యాంపస్, వీఆర్ గూడెం. **వెబ్‌సైట్:** www.drysrhu.edu.in

ప్రవేశాలు

ఏయూఈఈటీ-2018

విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ 2018-19 విద్యా సంవత్సరానికి డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాంలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష. **కోర్సులు:** ఆరేళ్ల బీటెక్, ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాం **చివరి తేది:** 21.04.2018.

http://aueet.audoa.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

పాతబస్తీలో మెట్రో నిర్మించి తీరతాం

- ఎల్అండ్‌టీ సుముఖంగా లేదన్న వార్తలు ఊహాజనితం
- శాసనసభలో పురపాలక మంత్రి కేటీఆర్ స్పష్టీకరణ
- పండ్ల తోటలకూ ఏడాదికి రెండు సార్లు పెట్టుబడి సాయం: పోచారం

ఈనాడు - హైదరాబాద్



పాతబస్తీలో మెట్రోరైలు నిర్మాణం పూర్తిచేసి తీరతామని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టంచేశారు. మంగళవారం శాసనసభలో అక్బరుద్దీన్ ఒవైసీ(ఎంఐఎం), కిషన్‌రెడ్డి(భాజపా) అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. జూబ్లీబస్‌స్టేషన్-ఫలక్‌నుమా మార్గంలో ఎంజీబీఎస్ వరకూ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకూ పనులు చేపట్టేందుకు ఎల్అండ్‌టీ సుముఖంగా లేదని వార్తలు వస్తున్నాయని అక్బరుద్దీన్ లేవనెత్తిన అంశంపై కేటీఆర్ స్పందిస్తూ.. అదంతా ఊహాజనితమని, ఒకవేళ అలాంటిదేదైనా జరిగితే ప్రభుత్వమే ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తుందని చెప్పారు. మొత్తం 72 కిలోమీటర్లకుగాను ఇప్పటికి 30 కిలోమీటర్ల మార్గం పూర్తయిందని, మిగతది ఈ సంవత్సరాంతానికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. హైటెక్‌సిటీ నుంచే కాకుండా ఫలక్‌నుమా, నాగోల్ నుంచి కూడా శంషాబాద్ విమానాశ్రయానికి మెట్రోలైనును అనుసంధానం చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. మెట్రోరైలు మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.14,132 కోట్లు కాగా ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.2296 కోట్లు చెల్లించిందన్నారు. మెట్రో నిర్మాణానికి 103 మతపరమైన, వారసత్వ కట్టడాలు తొలగించాల్సి ఉంటుందని అంచనా వేసినప్పటికీ.. వాటిని నాలుగుకు తగ్గించగలిగామని, అవి కూడా నష్టపోకుండా ప్రయత్నిస్తున్నామని ఆయన చెప్పారు. పాతబస్తీలో మెట్రోరైలు ఆలస్యాన్ని నిరసిస్తూ తాము వాకౌట్ చేస్తున్నామని ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి ప్రకటించారు. తెరాస సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ అడిగిన ప్రశ్నకు కేటీఆర్ సమాధానమిస్తూ.. హైదరాబాద్‌లో పార్కింగ్ సమస్య పరిష్కరించేందుకు బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయాల నిర్మాణానికి 22 ప్రాంతాలను ఎంపిక చేశామని కేటీఆర్ తెలిపారు. పార్కింగ్ ఇబ్బందులు తొలగించేందుకు యాప్‌ను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

96 శాతం భూములు వివాదరహితం

ప్రభుత్వాలు రైతుల నుంచి శిస్తు వసూలు చేస్తుంటాయని.. కానీ, తెరాస ప్రభుత్వం మాత్రం రైతులకు పెట్టుబడి సాయం చేస్తోందని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పండ్లతోటల వంటివి సంవత్సరానికి ఒక్కసారే దిగుబడి ఇస్తాయని, అయినా వాటికీ సంవత్సరానికి రెండు సార్లు పెట్టుబడి సాయం చేయాలనే యోచనలో ఉన్నామని వెల్లడించారు. చెరుకు, పత్తి సాగు కూడా ఈ కోవలోకే వస్తాయన్నారు. మంగళవారం శాసనసభలో తెరాస సభ్యులు ఏనుగు రవీందర్‌రెడ్డి, పుట్ట మధుకర్, వేముల వీరేశం తదితరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ఎకరాకు రూ.4 వేల చొప్పున ఏడాదికి రూ.8 వేల చొప్పున చెక్కుల రూపంలో రైతులకు అందిస్తామన్నారు. ఇప్పటి వరకూ 1.42 కోట్ల ఎకరాల భూములు (96 శాతం) ఎలాంటి వివాదం లేనివిగా వెల్లడైంది. వీటన్నింటికీ పెట్టుబడి సాయం వర్తిస్తుందని చెప్పారు. 72,13,111 మంది రైతులకు మేలు జరుగుతుందన్నారు. కౌలు రైతులకు ఈ పథకం వర్తింపజేయడం సాధ్యంకాదని స్పష్టంచేశారు. రైతులు ఇప్పటికే కొన్ని బ్యాంకుల్లో బాకీ ఉన్నందున వారు చెక్కులు డిపాజిట్ చేయగానే ఆయా బ్యాంకులు తమకు రావాల్సిన బాకీ కింద మినహాయించుకునే అవకాశం ఉందని కొందరు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి మంత్రి స్పందిస్తూ.. ఈ పథకం అమలు చేసేందుకు ఆరు బ్యాంకులను ఎంపిక చేశామని, ఆ బ్యాంకుల్లో వేటిలోనైనా చెక్కును నగదుగా మార్చుకోవచ్చునన్నారు. రైతులతో సమావేశాలు నిర్వహించేందుకు 2638 రైతు వేదికలను నిర్మిస్తున్నామని, ఒక్కోదానికి రూ.12 లక్షలు ఖర్చు పెడుతున్నామని పోచారం వెల్లడించారు.

ప్రధాన రహదారుల విస్తరణ వేగవంతం: తుమ్మల

రాష్ట్రంలో ప్రధాన రహదారుల విస్తరణ వేగంగా సాగుతోందని రహదారులు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భాజపా సభ్యులు కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, రామచంద్రారెడ్డి, ప్రభాకర్ అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత 1333 కి.మీ.రోడ్లను జాతీయ రహదారులుగా గుర్తించారని, మరో 1767 కి.మీ.ల రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా ప్రకటించేందుకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించిందన్నారు.

శ్మశానాలు మంజూరు..

రాష్ట్రవ్యాప్తంగా 4271 శవ దహన వాటికలు మంజూరు చేశామని, వాటిలో వెయ్యి శ్మశానాల పనులు జరుగుతున్నాయని పంచాయతీరాజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు.



ఈటల రాజేందర్ జన్మదినం సందర్భంగా శాసనసభాపతి కార్యాలయంలో ఆయనకు కేకు తినిపిస్తున్న సభాపతి మధుసూదనాచారి, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు. చిత్రంలో రసమయి బాలకిషన్ తదితరులు

రాష్ట్రంలో 3.72 లక్షల మంది బాలకార్మికులు

తల్లిదండ్రులకు ఉపాధిపై ఆలోచన: నాయిని

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా 3,72,582 మంది బాలకార్మికులు ఉన్నారని.. వీరిలో ఎక్కువగా వ్యవసాయ రంగం, హోటళ్లు, ఆసుపత్రులు, చెత్త సేకరణలో పనిచేస్తున్నారని కార్మిక శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి పేర్కొన్నారు. శాసనమండలిలో ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. బాలకార్మికుల రక్షణ, పునరావాసానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. పిల్లలతో పని మానేయించడానికి తల్లిదండ్రులకు ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని మంత్రి చెప్పారు.

రసాయనాలు వినియోగిస్తే చర్యలు: పండ్లను మగ్గపెట్టేందుకు రసాయనాలు వినియోగిస్తే చర్యలు తీసుంటామని మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. కార్బైడ్ వాడుతున్న 19 మందిపై కేసులు పెట్టి జరిమానా విధించామని తెలిపారు.

శ్రద్ధగా వినాలి..: మండలిలో ప్రశ్నోత్తరాలు జరుగుతున్న సమయంలో ఛైర్మన్ స్వామిగౌడ్ సభ్యుల్ని సున్నితంగా మందలించారు. మంత్రులు సమాధానం చెబుతుంటే శ్రద్ధగా వినాలని.. లేదంటే ఈ విషయాల్ని ప్రజలకు ఎలా చెబుతారని ప్రశ్నించారు. కొందరు ఎమ్మెల్సీలు మాట్లాడుకోవడం, అటూఇటూ తిరుగుతుండటంపై ఛైర్మన్ పైవిధంగా స్పందించారు.

పోడు చేస్తున్న గిరిజన రైతుల్ని వేధిస్తున్నారు: అనేక దశాబ్దాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజన రైతుల్ని అటవీ అధికారులు వేధిస్తున్నారని ఎమ్మెల్సీలు పేర్కొన్నారు. భాజపా ఎమ్మెల్సీ రామచంద్రరావు ప్రశ్నోత్తరాల్లో ఈ అంశాన్ని లేవనెత్తారు. తెరాస ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ స్పందిస్తూ. . జయశంకర్‌భూపాలపల్లి జిల్లా వాజేడు, వెంకటాపురం మండలాల్లో గిరిజనులు 30 ఏళ్లుగా సాగుచేసుకుంటున్నారని.. ఆ రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. రెవెన్యూ మంత్రి మహమూద్ అలీ స్పందిస్తూ.. పట్టాలు పొంది సాగు చేసుకుంటున్న గిరిజనులకు పెట్టుబడి సాయం అందుతుందని చెప్పారు.

ప్రజలను మభ్యపెడుతున్న తెరాస ప్రభుత్వం: కిషన్‌రెడ్డి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రెండు పడక గదుల ఇళ్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా.. తెరాస ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతోందని భాజపా శాసనసభాపక్ష నేత కిషన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నాలుగేళ్లలో కేవలం 9వేల ఇళ్లు మాత్రమే పూర్తిచేశారని.. ప్రభుత్వం మాటలు కోటలు దాటుతున్నాయే కానీ.. అభివృద్ధి పనులు మాత్రం ప్రగతిభవన్ దాటడం లేదని ఎద్దేవా చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏదైనా పొరపాటు చేస్తే తెరాస ఎంపీలు దిల్లీలో మాట్లాడాలని. . ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం చేస్తోన్న పొరపాట్లను ప్రజల తరపున ఎత్తిచూపాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు.

బీసీ రిజర్వేషన్‌పై తీర్మానం చేయండి: ఆర్.కృష్ణయ్య

జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, చట్టసభల్లో బీసీలకు 52శాతం రిజర్వేషన్‌పై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని తెదేపా ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. అసెంబ్లీలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మైనారిటీ, గిరిజన రిజర్వేషన్లకై పార్లమెంటులో నిరసన చేస్తున్న తెరాస ఎంపీలు బీసీల కోసం కూడా పోరాడాలన్నారు.

అవిశ్వాసానికి మద్దతివ్వాలి: సండ్ర

పార్లమెంట్‌లో తెదేపా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వాలని తెదేపా ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందు ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రం రాష్ట్రాల హక్కులను హరిస్తుందని మాట్లాడిన ముఖ్యమంత్రి కేసీఆర్ అవిశ్వాసానికి ఎందుకు మద్దతు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.

మిషన్ కాకతీయకు కేంద్ర సాయం కరవు

- రూ.ఐదువేల కోట్లివ్వాలని నీతిఆయోగ్ సిఫార్సు చేసింది
- సీఎం సహా, ఆర్థిక మంత్రి, నేనూ పలుమార్లు అడిగాం
- శాసన మండలిలో మంత్రి హరీశ్‌రావు

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు లభిస్తున్నాయని.. నీతిఆయోగ్ సిఫార్సు చేసినా కేంద్రం నుంచి ఏ రకమైన ఆర్థిక సహాయం మాత్రం అందలేదని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. మంగళవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో



మిషన్ కాకతీయపై ఎమ్మెల్సీలు పాతూరి సుధాకర్ రెడ్డి, గంగాధర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, భూపాల్‌రెడ్డి అడిగిన ప్రశ్నపై మంత్రి స్పందించారు. "నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్ అరవింద్ పనగడియా, సభ్యుడు ఎస్.కె.జైన్ రాష్ట్రాన్ని సందర్శించి మిషన్ కాకతీయ అమలును ప్రశంసించారు. రూ.ఐదువేల కోట్లు ఇవ్వాలని కేంద్రానికి సిఫార్సు చేశారు. దీనిపై ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి, నేను కేంద్రాన్ని పలుమార్లు కలిసి అడిగాం. నేటికి కేంద్రం నుంచి సాయం అందలేదు" అని మంత్రి తెలిపారు. "ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్, రామన్ మెగసెసె అవార్డు గ్రహీత పి.రాజేంద్రసింగ్ మిషన్ కాకతీయ అమలును ప్రశంసించారు. బ్రిటన్ పార్లమెంటు, యూకే పార్లమెంటరీ సమాఖ్య సభ్యులు, బ్రిటిష్ హైకమిషనర్ రాష్ట్రంలో పర్యటించారు. కేంద్రమంత్రి ఉమా భారతి ఆదేశం మేరకు ఉత్తర్‌ప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ఇంజినీర్ల బృందం.. తమిళనాడు బృందం పర్యటించి అధ్యయనం చేసింది. ఇలా ఎంతోమంది ప్రశంసలు దక్కినా కేంద్రం నుంచి సాయం అందలేదు"అని చెప్పారు. మరోవైపు మిషన్ కాకతీయ ద్వారా రాష్ట్రంలో పది లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ అవుతుందన్న అంచనా ఉందని.. ఇప్పటికే 2.88లక్షల ఎకరాల స్థిరీకరణ జరిగిందని తెలిపారు. ఉమ్మడిరాష్ట్రంలో కాంగ్రెస్, తెదేపా ప్రభుత్వాలు చెరువుల్ని నిర్లక్ష్యం చేశాయన్నారు. "మిషన్‌కాకతీయతో మొక్కజొన్న, వరి, పత్తిపంటల దిగుబడులు గణనీయంగా పెరిగాయి. భూగర్భజలాల మట్టం 6.1మీటర్ల నుంచి 9.2మీటర్లకు పెరిగింది. చేపల దిగుబడి 36-39శాతం పెరిగింది. ఇవి నాబార్డు నివేదికలో గణాంకాలు" అని వివరించారు.

కేటీఆర్‌కు ప్రవాసుల అభినందనలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ బడ్జెట్‌లో ప్రవాసుల సంక్షేమానికి రూ.100 కోట్లను కేటాయించడంపై పలు గల్ఫ్ ఇతర దేశాల్లోని ప్రవాస తెలంగాణ సంఘాల ప్రతినిధులు శాసనసభలో మంగళవారం మంత్రి కేటీఆర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. రాచకొండ ఎత్తిపోతల పథకం సర్వే పనులకు రూ. 1.72 కోట్ల నిధుల కేటాయింపులపై ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తదితర ప్రతినిధులు శాసనసభా ప్రాంగణంలో మంత్రి హరీశ్‌రావుకు, జగదీశ్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎఫ్‌సీఎస్‌ఎఫ్ ఎండీగా సువర్ణకు బాధ్యతలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య(ఎఫ్‌సీఎస్‌ఎఫ్) ఎండీగా మత్స్యశాఖ కమిషనర్ సువర్ణకు అదనపుబాధ్యతలు అప్పగిస్తూ మత్స్యశాఖ ఉత్తర్వులిచ్చింది. ఇంతకాలం ఈ పదవిలో సహకార శాఖ అదనపు రిజిస్ట్రార్ సురేందర్ ఇన్‌ఛార్జిగా ఉన్నారు.

ప్రతిపక్షాలకు పుట్టగతులుండవు

- పేదలకు పథకాలు మా ఘనతే
- బడ్జెట్ పుస్తకాలు ముద్రించిన తర్వాత మాతో సమావేశమయ్యారు
- నిధులివ్వమని దిల్లీలోని మీ నేతలకు చెప్పండి
- ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో తెరాస ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్రంలో ప్రతిపక్షాలకు పుట్టగతులు లేకుండా చేస్తాయని రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాల ప్రజలు, అన్ని మతాల వారిని రాష్ట్ర ప్రభుత్వం సమదృష్టితో చూస్తోందన్నారు. మంగళవారం శాసనసభలో బడ్జెట్‌పై రెండోరోజు సాధారణ చర్చజరిగింది. చర్చ అనంతరం మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రాల అభివృ



ద్ధితోనే దేశాభివృద్ధి ముడిపడిందని ప్రధాని మోదీ అంటారని కానీ.. కేంద్రం మాత్రం నిధులు ఇవ్వదన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీని 50 సార్లు కలిసి నిధులు అడిగినా ప్రయోజనం లేదన్నారు. కేంద్ర బడ్జెట్ పుస్తకాలను ప్రచురించిన తర్వాతనే రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో సమావేశం నిర్వహించారని దీని వల్ల ఏ ప్రయోజనం ఉంటుందన్నారు. నిధులివ్వమని భాజపా సభ్యులు అమిత్‌షాకు, ప్రధానికి చెప్పాలని ఈటల సూచించారు. తెరాస ప్రభుత్వం ఏమీ చేయడం లేదంటూ వ్యతిరేకించడం మంచిది కాదన్నారు. లక్ష ఉద్యోగాల భర్తీలో 27588 ఉద్యోగ నియామకాలు పూర్తయ్యాయని మిగిలిన ఉద్యోగాల భర్తీని పూర్తి చేస్తామన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పేదల కోసం అనేక పథకాలను రూపొందించిన ఘనత తెరాస ప్రభుత్వానిదేనన్నారు. ఎకరాకు రూ.4000 చొప్పున ఇస్తున్న ప్రభుత్వం ఎక్కడైనా ఉందా? అని ప్రశ్నించారు.

పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలి: కాంట్రిబ్యూటరీ పింఛను విధానాన్ని (సీపీఎస్) రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని తెదేపా ఎమ్మెల్యే సండ్ర వీరయ్య కోరారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. పాతనగరానికి రూ.5వేలకోట్లతో ప్యాకేజీ ప్రకటించాలని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ కోరారు. రాష్ట్రంలో 52 శాతమున్న బీసీలకు ఉప ప్రణాళికను అమలు చేయాలని సీపీఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య కోరారు. పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.

భాజపా, తెదేపా, సీపీఎం వాకౌట్: మంత్రి సమాధానం అనంతరం భాజపా, తెదేపా, సీపీఎం సభ్యులు వాకౌట్ చేశారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఖజానాకు 70 శాతం నిధులు జమవుతున్నా నగర అభివృద్ధిని విస్మరిస్తున్నారని నిరసనగా వాకౌట్ చేస్తున్నట్లు భాజపా శాసనసభాపక్షనేత కిషన్‌రెడ్డి తెలిపారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్‌పై ప్రభుత్వం స్పందించలేదని ఆరోపిస్తూ తెదేపా ఎమ్మెల్యే సండ్ర వీరయ్య, 14 లక్షలమంది కౌలురైతులకు పెట్టుబడి ప్రోత్సాహం సహా వివిధ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించలేదని సీపీఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య వాకౌట్ చేశారు.

రాజ్యసభ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించండి

- నేడు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరనున్న కాంగ్రెస్
- సీఎల్పీ నేత జానారెడ్డి నివాసంలో ముఖ్యనేతల భేటీ
- ఎమ్మెల్యేల సభ్యత్వ రద్దు, రాజ్యసభ ఎన్నికలపై చర్చ

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఇద్దరు సభ్యుల శాసనసభ సభ్యత్వం రద్దైన నేపథ్యంలో వారికి రాజ్యసభ ఎన్నికల్లో ఓటు వేసే హక్కు కల్పించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఇద్దరు ఎమ్మెల్యేల సభ్యత్వ రద్దు, రాజ్యసభ ఎన్నికల్లో వ్యూహంపై రాష్ట్ర కాంగ్రెస్ నేతలు మంగళవారం కాంగ్రెస్ శాసనసభా పక్షనేత జానారెడ్డి నివాసంలో భేటీ అయ్యారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నేతలు షబ్బీర్‌అలీ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్, టి.రాంమోహన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, నాదెండ్ల మనోహర్‌లతోపాటు హైకోర్టు న్యాయవాది జంధ్యాల రవిశంకర్ తదితరులు హాజరయ్యారు. ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దుపై రాజ్యాంగంలో ఏముంది? గతంలో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు శాసనసభ ఎలా వ్యవహరించింది? 2012లో హరీశ్‌రావు, రేవంత్‌రెడ్డిలు గొడవ చేసినప్పుడు సభాసంప్రదాయాలను పాటిస్తూ ఏం నిర్ణయం తీసుకున్నాం. ప్రస్తుతం స్పీకర్ తీసుకున్న నిర్ణయం న్యాయస్థానంలో చెల్లుతుందా? తదితర అంశాలపై చర్చించారు. స్పీకర్ పైన పేర్కొన్న అంశాల్లో ఏ ఒక్కటీ పాటించలేదని, తమకు సభ్యత్వం రద్దుకు సంబంధించి ఎలాంటి కాపీ ఇవ్వలేదని కోమటిరెడ్డి, సంపత్‌లు తెలిపినట్లు తెలిసింది. సభా సంప్రదాయాలను పాటించనందున తీర్పు తమకే అనుకూలంగా వస్తుందనే ఆశాభావం వ్యక్తంచేశారు. రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన బలరాంనాయక్ నామినేషన్ పత్రాలపై తాము సంతకాలు చేశామని, ఆ పత్రాలు చెల్లినందున తమకు ఓటు హక్కు కల్పించాలని ఈసీని కోరనున్నారు. కోమటిరెడ్డి, సంపత్‌ల తరఫున టీపీసీసీ ఎన్నికల విభాగం ఛైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి నేతృత్వంలోని బృందం బుధవారం దిల్లీలో కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించనుంది. భేటీ అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ..'శాసనసభలో జరిగిన ఘటనపై హైకోర్టు ఉత్తర్వులపై కాంగ్రెస్ హర్షం వ్యక్తం చేస్తుంది. కోర్టులో మాకు న్యాయం జరుగుతుందనే విశ్వాసం ఉంది' అన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలందరూ కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాల్సిందేనన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో సహకరించాలని తెదేపా ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను కోరినట్లు చెప్పారు.

కాంగ్రెస్ విప్‌గా రామ్మోహన్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ శాసన సభాపక్ష విప్‌గా పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డిని నియమించారు. ఈమేరకు సీఎల్పీ నేత జానారెడ్డి మంగళవారం శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులకు లేఖ రాశారు. గతంలో విప్‌గా ఉన్న సంపత్‌కుమార్ స్థానంలో రామ్మోహన్‌రెడ్డిని నియమిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల సంపత్ సభ్యత్వం రద్దైన నేపథ్యంలో ఈ మార్పులు చేశారు.

గీత కార్మికులకు సౌకర్యాలపై ముఖ్యమంత్రి సమావేశం

ఈనాడు, హైదరాబాద్: గీత కార్మికులకు ప్రత్యేక నిధులు, సౌకర్యాలు, పథకాల మంజూరుపై ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం ప్రగతిభవన్‌లో సమావేశం నిర్వహించారు. మంత్రి పద్మారావు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్, ఇతర అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను ఒకటి, రెండు రోజుల్లో సీఎం కేసీఆర్ శాసనసభలో ప్రకటించే అవకాశం ఉంది.

సీఎంకు బ్రాహ్మణ సంఘాల కృతజ్ఞతలు

బడ్జెట్‌లో బ్రాహ్మణుల సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించడంపై బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు మంగళవారం సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరంగం గోపీకృష్ణమాచార్యులు నేతృత్వంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య, హరిహర అర్చక సంక్షేమ సంఘం, తెలంగాణ నియోగి బ్రాహ్మణ సంఘం, శ్రీవైష్ణవ సేవా సమితి, బ్రాహ్మణ సేవా సమితి, తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదిక ప్రతినిధులు మంగళవారం ప్రగతిభవన్‌లో సీఎంకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం వారు సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు రమణాచారిని కలిసి సత్కరించారు. తెలంగాణ దేవాదాయ అర్చక, ఉద్యోగుల ఐకాస అధ్యక్షుడు గంగు భానుమూర్తి ఆధ్వర్యంలో పలు ఆలయాల్లో సీఎం కేసీఆర్ పేరిట ప్రత్యేక పూజలు చేశారు.

మూడు బిల్లులు ప్రవేశపెట్టిన మంత్రులు

అసైన్డ్ భూముల చట్ట సవరణతో పాటు మరో రెండు బిల్లులను మంగళవారం మంత్రులు హరీశ్‌రావు, లక్ష్మారెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టారు. రాష్ట్ర అసైన్డ్ భూముల బదిలీ సవరణ బిల్లు-2018ని, రాష్ట్ర న్యాయవాదుల సంక్షేమ నిధి చట్టం-1987ని సవరణకు సంబంధించిన మరో బిల్లును శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర మెడికల్ ప్రాక్టీషనర్ల నమోదు సవరణ చట్టం-2018ని మంత్రి లక్ష్మారెడ్డి ప్రవేశపెట్టారు. న్యాయవాదుల సంక్షేమ నిధిలో ఉన్న రుసుములను రెట్టింపు చేస్తూ సవరణ ప్రతిపాదించారు. ఈ బిల్లు ఆమోదం పొందిన వెంటనే ఈ రుసుములు 50 నుంచి రూ.100కి, రూ.43 నుంచి 86కి, రూ.7 నుంచి 14కు పెరుగుతాయని బిల్లులో సవరణ చేశారు.

ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా బడ్జెట్

శాసనసభలో భాజపా సభ్యుడు లక్ష్మణ్

ఈనాడు, హైదరాబాద్: 'రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన బడ్జెట్.. ప్రభుత్వ హామీలకు, ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా ఉంది.. కేటాయింపుల ప్రకారం ఖర్చు కావడం లేదు. 80 వేల మంది రైతులకు రుణమాఫీ కాలేదు' అని భాజపా శాసనసభ్యుడు లక్ష్మణ్ అన్నారు. బడ్జెట్‌పై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'పంటలబీమా పథకానికి రాష్ట్ర ప్రభుత్వం వాటా కట్టకపోవడంతో రైతులకు పరిహారం అందలేదు. రైతు బీమా పథకం ఎంత మందికి వర్తింపజేస్తారు? రాష్ట్రంలోని 40 లక్షల మంది రైతులకు ఈ పథకం అందాలంటే రూ.1200 కోట్లు అవసరం. రాష్ట్రం అప్పులపై వచ్చే ఏడాది వడ్డీలకే రూ.11 వేల కోట్లు కట్టాలి' అని అన్నారు. మంత్రి తలసాని జోక్యం చేసుకుని రాష్ట్రంలో ఏమీ జరగలేదన్నట్లుగా మాట్లాడటం సరికాదన్నారు. తిరిగి లక్ష్మణ్ మాట్లాడుతూ.. "ఆసరా పథకం అమలుతీరు బాగా లేదు. కల్యాణ లక్ష్మి కింద సొమ్మును కొత్త దంపతులకు పిల్లలు పుట్టిన తరవాత ఇస్తున్నారు. రూ. 5 వేల కోట్లతో గొర్రెలను ఇచ్చామంటున్నారు. వీటి పంపిణీలో రీసైక్లింగ్ జరుగుతున్న తీరుపై ప్రభుత్వం స్పందించాలి. రాష్ట్రంలో 3 లక్షల ఉద్యోగాలు ఖాళీలుంటే అందులో 10 శాతం కూడా భర్తీ చేయలేదు. ప్రభుత్వ ఆస్పత్రులు మార్చురీల్లా తయారయ్యాయి." అని లక్ష్మణ్ అన్నారు.

మైనార్టీల సంక్షేమానికి భారీగా నిధులు: శ్రీనివాసగౌడ్

గతంలో మైనార్టీలను ఓటుబ్యాంకులా చూస్తూ పార్టీలు నాటకాలాడేవని, తెరాస పాలనలో వారి సంక్షేమానికి భారీగా నిధులిస్తున్నట్లు తెరాస సభ్యుడు శ్రీనివాసగౌడ్ తెలిపారు. బడ్జెట్‌పై చర్చలో భాగంగా ఆయన మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మన్నెగూడ దేవాలయానికి నిధులివ్వాలని కోరారు.

మమతను కేసీఆర్ ఆదర్శంగా తీసుకోవాలి: కోమటిరెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: పశ్చిమ్ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని తెలంగాణ సీఎం కేసీఆర్ ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న మమతా బెనర్జీ ఎంతో నిరాడంబరంగా ఉంటారని, కర్ర కుర్చీలో కూర్చుంటారని, కార్లకు ప్రాధాన్యం ఇవ్వరని, అతి సాధారణ పాదరక్షలు ధరిస్తారని అన్నారు. కేసీఆర్ విలాసవంతమైన జీవితానికి స్వస్తి పలకాలని వ్యాఖ్యానించారు.

అందుకే కాంగ్రెస్ సభ్యులు నిరసన తెలిపారు: రేవంత్‌రెడ్డి

గవర్నర్ ప్రసంగం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా లేనందునే కాంగ్రెస్ సభ్యులు నిరసన తెలిపారని, అది సభ్యుల హక్కని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. 63మంది ఎమ్మెల్యేలున్న తెరాస.. ముగ్గురు రాజ్యసభ సభ్యులను ఎలా నిలబెడుతుందని ప్రశ్నించారు. తన బంధువును రాజ్యసభకు పంపించడానికి సీఎం కేసీఆర్ అనైతిక చర్యలకు పాల్పడుతున్నారని వ్యాఖ్యానించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పాలకులకు దిశా నిర్దేశం చేయాల్సిన గవర్నర్.. ఉదాసీనంగా ఉండటంవల్లే రాష్ట్రంలో పాలన ఇష్టారాజ్యంగా కొనసాగుతోందని ఆరోపించారు.

పొత్తుపై కాంగ్రెస్‌తో మాట్లాడలేదు: రమణ

ఈనాడు, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో పొత్తు పెట్టుకునే అంశంపై కాంగ్రెస్‌తో అధికారికంగా ఎప్పుడూ మాట్లాడలేదని తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ చెప్పారు. మంగళవారం తెదేపా శాసనసభా పక్ష కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భాజపా పొత్తు నుంచి తెదేపా బయటికి రావడంతో ఇకనుంచి ఎవరి ప్రణాళికలు వారికుంటాయన్నారు. తెలుగు రాష్ట్రాన్ని విభజించింది భాజపా, కాంగ్రెస్‌లేనన్నారు.

మైనారిటీ గురుకులాల్లో రిజర్వేషన్లు వినియోగించుకోవాలి: రాములు

రాష్ట్రంలోని ప్రభుత్వ మైనారిటీ గురుకులాల్లో ముస్లింలు, క్రిస్టియన్లు, పర్షియన్లు, జైనులు, బౌద్ధులతోపాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీలకు కూడా రిజర్వేషన్లు ఉన్నందున వారు కూడా ఆయా గురుకులాల్లో చేరాలని తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్ రాములు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 204 గురుకులాలను మైనారిటీల కోసం ఏర్పాటు చేసిందని చెప్పారు. ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే నెల 20వ తేదీ వరకు దరఖాస్తులకు గడువుందన్నారు.

కోమటిరెడ్డి, సంపత్‌ల ఓట్లపై నేడు ఎన్నికల సంఘం స్పష్టత

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ శాసనసభలో సభ్యత్వాలు రద్దయిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్‌లు రాజ్యసభ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొనే అవకాశం ఉందా? లేదా? అనే అంశంపై బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వనుంది. వీరి సభ్యత్వాల తొలగింపు సమాచారాన్ని ఇప్పటికే శాసనసభ.. ఈసీకి నివేదించింది. దీనిపై బుధవారం ఈసీ సమాధానం పంపనున్నట్లు తెలిసింది. బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజున జరిగిన పరిణామాల నేపథ్యంలో కోమటిరెడ్డి, సంపత్‌ల సభ్యత్వాలను రద్దు చేస్తూ శాసనసభ నిర్ణయం తీసుకుంది. దీనికి అనుగుణంగా శాసనసభ వెబ్‌సైట్ నుంచి వారి పేర్లను తొలగించి.. ఈ రెండు స్థానాలు ఖాళీగా ఉన్నట్లు పేర్కొంది. అయితే, వీరికి రాజ్యసభ ఎన్నికల్లో పాల్గొనే అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. ఆ రోజు పరిణామాలు, తీసుకున్న చర్యలను వివరిస్తూ శాసనసభ కార్యదర్శి కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. రాజ్యసభ ఎన్నికల్లో వీరిని ఓటు వేసేందుకు అనుమతించాలా లేదా అనే సమాచారం ఇవ్వాలని అభ్యర్థించారు.

హైకోర్టుకు వీడియో ఫుటేజీలు..: బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజున నెలకొన్న పరిణామాలపై వీడియో ఫుటేజీలను శాసనసభ అధికారులు హైకోర్టుకు అందజేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

తెలంగాణ భవన్‌లో మాక్ పోలింగు

88 మంది ఎమ్మెల్యేల హాజరు

ఈనాడు, హైదరాబాద్: రాజ్యసభ ఎన్నికలను పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం తెలంగాణభవన్‌లో తెరాస ఆధ్వర్యంలో పార్టీ ఎమ్మెల్యేలకు నమూనా(మాక్) పోలింగు నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కేటీఆర్ ఈటల, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డిల ఆధ్వర్యంలో పోలింగు జరిగింది. మొత్తం 88 మంది ఎమ్మెల్యేలు ఇందులో పాల్గొన్నారు. సీఎం కేసీఆర్, సభాపతి మధుసూదనాచారిలు హాజరు కాలేదు. గంటసేపు పోలింగు నిర్వహించారు. అనంతరం కడియం, పలువురు నిపుణులు పోలింగు నిర్వహణ, ఓటు వేసే విధానం.. పొరపాట్లు ఎలా జరిగే అవకాశముందో వివరించారు. బుధ, గురువారాలు సైతం మాక్ పోలింగు నిర్వహించాలని తెరాస అధిష్ఠానం నిర్ణయించింది. ఎన్నికలను పురస్కరించుకొని తెరాస ఎమ్మెల్యేలకు మంగళవారం రాత్రి విందు ఇచ్చారు.

ఎమ్మెల్యేలకు అభ్యర్థుల కేటాయింపు: రాజ్యసభ ఎన్నికల కోసం జిల్లాల వారీగా అభ్యర్థులకు ఎమ్మెల్యేలను కేటాయించారు. బండా ప్రకాశ్ ముదిరాజ్‌కు పూర్వ వరంగల్, ఖమ్మం, మెదక్ జిల్లాతో పాటు హైదరాబాద్‌లోని ఏడుగురు మజ్లిస్ సభ్యులు కలిపి మొత్తం 33 మంది ఎమ్మెల్యేలు.. బడుగుల లింగయ్య యాదవ్‌కు పూర్వమహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలోని 32 మంది.. జోగినపల్లి సంతోష్‌కుమార్‌కు పూర్వ కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలోని ఒక ఎమ్మెల్యేతో కలిపి మొత్తం 32 మందిని కేటాయించారు.

సెన్సెక్స్ ▲ 74 **32997**

నిఫ్టీ ▲ 30 **10124**

డోజోన్స్ 24682 ▲ 71

నాస్‌డాక్ 7339 ▼ 05

అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి 65.20 ▼ 03 పైసలు (ఒక అమెరికా డాలరుకు)

ముడి చమురు 67.42 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)

ఈనాడు బిజినెస్


ఘనం (+) నిఫ్టీ	20న	మార్పు %
BHARTI INFRATEL	341.90	5.09
TECH MAHINDRA	633.40	3.85
EICHER MOTORS	28360.45	3.49
TATA STEEL	593.00	3.14
SUN PHARMA	508.75	2.23
BOSCH	17876.75	2.07
DR. REDDYS LAB	2157.15	1.76
WIPRO	293.60	1.71

గ్రహణం (-) నిఫ్టీ	20న	మార్పు %
VEDANTA	287.10	-6.54
INDIAN OIL CORP	173.85	-2.28
ONGC	174.10	-1.55
BPCL	424.90	-1.36
CIPLA	552.90	-1.22
ULTRATECH CEM	3936.80	-0.90
ICICI BANK	292.00	-0.87
GAIL (INDIA)	438.50	-0.80


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	59.34	68.80	బహ్రెయిన్ దీనార్	160.68	184.14
పౌండ్ స్టెర్లింగ్	83.27	96.58	కువైట్ దీనార్	179.72	223.73
యూరో	73.24	84.94	ఒమన్ రియాల్	157.35	180.02
జపనీస్ యెన్/100	55.85	64.76	సౌదీ రియాల్	15.78	18.70
ఆస్ట్రేలియా డాలరు	45.73	52.93	యూఏఈ దిర్హమ్	16.15	18.88
సింగపూర్ డాలరు	45.11	53.43	మలేషియా రింగిట్	14.84	18.25
థాయ్ బాత్/100	190.30	227.60	చైనీస్ యువాన్	7.29	11.82



మంగళవారం నిఫ్టీ కదలికలు



ఫోర్స్ మోటార్స్ రోల్స్ రాయ్స్ జట్టు

రూ.300 కోట్లతో జేవీ ఏర్పాటు

ముంబయి: ఎమ్‌టీయూ సిరీస్ ఇంజిన్ల తయారీ కోసం ఫోర్స్ మోటార్స్‌తో రోల్స్-రాయ్స్ పవర్ సిస్టమ్స్ ఒప్పందం కుదుర్చుకుంది. ఆ మేరకు 49:51 నిష్పత్తిలో పెట్టుబడులు పెట్టనున్నాయి. ప్రాథమికంగా రూ.300 కోట్లకు పైగా పెట్టుబడులను పెట్టనున్నాయి. ఫోర్స్ మోటార్స్, రోల్స్-రాయ్స్ పవర్ సిస్టమ్స్ ఏజీ విభాగం ఎమ్‌టీయూ ఫ్రైడ్‌రిచ్‌షాఫెన్‌లు కలిసి ఈ సంయుక్త సంస్థను ఏర్పాటు చేస్తాయి. ఫోర్స్ మోటార్స్‌కు 51 శాతం; ఎమ్‌టీయూకు 49 శాతం వాటా ఉంటుంది. ప్రతిపాదిత ప్లాంటు పుణెలోని ఫోర్స్ మోటార్స్ ప్లాంటులో ఏర్పాటు కానుంది. వచ్చే ఏడాది చివరి కల్లా ఉత్పత్తి మొదలయ్యే అవకాశం ఉందని ఫోర్స్ మోటార్స్ ఎండీ ప్రశాన్ ఫిరోదియా మంగళవారమిక్కడ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ఇంజిన్లను జర్మనీలోని రోల్స్‌రాయ్స్ పవర్ సిస్టమ్స్ తయారీ ప్లాంటులో తయారు చేస్తున్నారు. కాగా, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ల కోసం 1600 సిరీస్ ఇంజిన్లను సైతం ప్రతిపాదిత సంయుక్త సంస్థ(జేవీ) నిర్మిస్తుంది. కొత్త కంపెనీని ఫోర్స్ ఎమ్‌టీయూ పవర్ సిస్టమ్స్‌గా పిలుస్తారు. భారత్, నేపాల్, శ్రీలంకలోని వినియోగదార్లకు 1600 సిరీస్ జనరేటర్ల విక్రయాలు, సేవలను అందిస్తారు.

ఐ-సెక్ ఇష్యూ వస్తోంది

• రేపటి నుంచి ప్రారంభం • ధర శ్రేణి రూ.519-520 • దీర్ఘకాలానికి పరిశీలించొచ్చు!

ఈనాడు, హైదరాబాద్: ఐసీఐసీఐ సెక్యూరిటీస్(ఐ-సెక్) లో 24 శాతం వాటాను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ఐసీఐసీఐ బ్యాంకు విక్రయించనుంది. పబ్లిక్ ఇష్యూ అనంతరం ఐ-సెక్‌లో ఐసీఐసీఐ బ్యాంకుకు 76 శాతం వాటా ఉంటుందని ఐసీఐసీఐ సెక్యూరిటీస్ అధిపతి (రిటైల్ విక్రయాలు) కేతన్ కార్ఖానీస్ తెలిపారు. పబ్లిక్ ఇష్యూ మార్చి 22న ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఇష్యూ ప్రచార కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా సేవలందిస్తున్న కంపెనీ బ్రోకింగ్, ఫైనాన్షియల్ ఉత్పత్తుల పంపిణీ, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సేవలను అందిస్తోంది. రిటైల్, సంస్థాగత ఖాతాదారులపై కంపెనీ దృష్టి పెడుతోంది. మొత్తం ఆదాయంలో 36.4 శాతం నాన్ బ్రోకరేజీ కార్యకలాపాల ద్వారా లభిస్తోంది. పంపిణీ వ్యాపారం ద్వారా 24.4 శాతం ఆదాయం వస్తోంది. బ్రోకరేజీ వ్యాపారంలో పోటీ పెరుగుతున్నప్పటికీ.. మదుపర్లు బ్రోకరేజీ కన్నా ఆయా కంపెనీలు ఇచ్చే సలహాలకు ప్రాధాన్యం ఇస్తారు. ఐసీఐసీఐ సెక్యూరిటీస్‌కు లభించే బ్రోకరేజీ వ్యాపారంలో 90 శాతం రిటైల్ ఖాతాదారుల నుంచే లభిస్తోంది. ఫైనాన్షియల్ సలహా వ్యాపారంలో మరింత బలోపేతం కావడానికి ఈక్విటీ కేపిటల్ మార్కెట్లలో బలం పుంజుకుంటామన్నా'రు.



పబ్లిక్ ఇష్యూ వివరాలను వెల్లడిస్తున్న ఐసీఐసీఐ సెక్యూరిటీస్ అధిపతి (రిటైల్) కేతన్ కర్ఖానీస్

బలమైన పంపిణీ వ్యవస్థ: బలమైన పంపిణీ వ్యవస్థ కంపెనీకి అదనపు అనుకూలత. 75 పట్టణాల్లో ఐ-సెక్‌కు 200 పైగా శాఖలు ఉన్నాయి. ఐసీఐసీఐ బ్యాంకు శాఖలు కూడా పంపిణీ వ్యవస్థకు దోహదం చేస్తున్నాయి.

ధర శ్రేణి రూ.519-520

పబ్లిక్ ఇష్యూలో 7,72,49,508 షేర్లను విక్రయిస్తారు. రూ.5 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు ధర శ్రేణిని రూ.519-520గా నిర్ణయించింది. 22న ప్రారంభమైన ఇష్యూ 26న ముగుస్తుంది. కనీసం 28 షేర్లకు దరఖాస్తు చేసుకోవాలి. ఆఫర్ ఫర్ సేల్‌లో వాటా విక్రయం ద్వారా ఐసీఐసీఐ బ్యాంకుకు దాదాపు రూ.4,000 కోట్లకు పైగా నిధులు లభిస్తాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఐ-సెక్ రూ.1404 కోట్ల ఆదాయంపై రూ.338.59 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. యువ, దీర్ఘకాల మదుపర్లు ఐ-సెక్‌కు ఖాతాదారులుగా ఉన్నారని, దీర్ఘకాలంలో సాంకేతిక పరిజ్ఞానం, ఇన్నోవేషన్‌పై కంపెనీ పెట్టుబడులను కొనసాగించనుందని, ఇటువంటి సానుకూల పరిణామాలను పరిగణనలోకి తీసుకుంటే దీర్ఘకాలానికి ఇష్యూలో షేర్లను కొనుగోలు చేయొచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. బ్రోకింగ్, ఫైనాన్షియల్ సేవల్లో అగ్రస్థానం, ఆదాయ, లాభాల్లో వృద్ధిని పరిగణనలోకి తీసుకుని కూడా ఈ షేర్‌ను పరిశీలించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

బినానీ రుణదాతల నుంచి అల్ట్రాటెక్‌కు మద్దతు!

కోల్‌కతా: బినానీ సిమెంట్(బీసీఎల్)పై నియంత్రణ విషయంలో జరుగుతున్న కార్పొరేట్ యుద్ధంలో ఆ కంపెనీకి రుణాలిచ్చిన రుణదాతల సంఘం(సీఓసీ) నుంచి అల్ట్రాటెక్‌కు మద్దతు లభించే అవకాశం ఉంది. బినానీ సిమెంట్‌లో 98.43 శాతం వాటాను కొనుగోలు చేయడం కోసం బినానీ గ్రూప్‌నకు రూ.7266 కోట్ల విలువైన లేఖ(కంఫర్ట్ లెటర్)ను బిర్లా కంపెనీ జారీ చేయడం ఇందుకు నేపథ్యం. బీసీఎల్ ప్రమోటరు కంపెనీ అయిన బినానీ ఇండస్ట్రీస్ తన రుణదాతలకు అప్పులను తీర్చడానికి నిధులను సమకూర్చాలంటూ తమ వద్దకు వచ్చిందని అల్ట్రాటెక్ పేర్కొన్న సంగతి తెలిసిందే. 'ఒక రుణదాతగా అల్ట్రాటెక్ ఆఫర్‌కు మేం మద్దతునిస్తున్నాం. వారు ఇచ్చిన ఆఫర్ మెరుగ్గా ఉండడమే అందుకు కారణమ'ని కంపెనీకి రుణమిచ్చిన బ్యాంకులకు చెందిన ఒక అధికారి పేర్కొన్నారు. దాల్మియా భారత్‌కు ఇప్పటికే సీఓసీ అనుమతి లభించినప్పటికీ అల్ట్రాటెక్ రంగంలోకి దిగిన సంగతి విదితమే. సీఓసీ ఆమోదం తర్వాత సవరించిన బిడ్‌ను దాఖలు చేయడం ఇదే మొదటిసారి. ఎన్‌సీఎల్‌టీ తీసుకుంటున్న చర్యలను సుప్రీం కోర్టులో సవాలు చేస్తే సీఓసీ అపుడు మద్దతునిచ్చే అవకాశం ఉంది.

భవనానికి బీటలు

• డాక్టర్ రెడ్డీస్ మెదక్ యూనిట్‌లో లోపం

• తనిఖీల్లో గుర్తించిన యూఎస్ఎఫ్‌డీఏ!

దిల్లీ: మెదక్‌లోని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌కు చెందిన ముడి ఔషధాల (బల్క్ డ్రగ్గులు) తయారీ యూనిట్‌లో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో యూఎస్ఎఫ్‌డీఏ ఇన్‌స్పెక్టర్లు అయిదు లోపాలను గుర్తించారు. ఫారమ్ 483ని జారీ చేశారు. అయితే.. లోపాల వివరాలను కంపెనీ వెల్లడించలేదు. ఈ నేపథ్యంలో ముడి ఔషధాలు తయారు చేస్తున్న భవనం పైకప్పు బీటలు బారడం, రంధ్రాలు ఉండడం వంటి నిర్వహణ లోపాలను యూఎస్ఎఫ్‌డీఏ ఇన్‌స్పెక్టర్లు గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ సదుపాయంలోని నాణ్యత నియంత్రణ ప్రక్రియలు కూడా యూఎస్ఎఫ్‌డీఏ ప్రమాణాలకు అనుగుణంగా లేవని, ముడి పదార్థాల సరఫరాదారులతో నాణ్యత ఒప్పందాలు కూడా సరిగా లేవని తనిఖీల్లో తేలిందని కోజెన్సిస్ వార్తా సంస్థ పేర్కొంది. కాగా మార్చి 5 నుంచి 9 మధ్య మెదక్ యూనిట్‌లో తనిఖీలు జరిగాయని.. యూఎస్ఎఫ్‌డీఏ కనుగొన్న లోపాలు విధాన (ప్రొసీజర్), యూనిట్ నిర్వహణకు సంబంధించినవని గతంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ తెలిపింది. వీటినీ నిర్ణీత కాలంలో సరి చేస్తామని పేర్కొంది.

హనీవెల్ నుంచి 100వ నీటిశుద్ధి కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సేఫ్ వాటర్ నెట్‌వర్క్, హనీవెల్ ఇండియా తెలంగాణలో 100వ నీటిశుద్ధి కేంద్రాన్ని ప్రారంభించాయి. 'ఐజల్ సేఫ్ వాటర్' పేరుతో ఇప్పటివరకూ 17 జిల్లాల్లో వీటిని ఏర్పాటు చేశాయి. ఇందులో 5 హైదరాబాద్‌లో ఉన్నాయి. దాదాపు 3,30,000 మందికి వీటిద్వారా శుద్ధమైన తాగునీరును అందిస్తున్నట్లు హనీవెల్ ఇండియా ప్రెసిడెంట్ వికాస్ చద్దా తెలిపారు. 2019 నాటికి కొత్తగా మరో 30 కేంద్రాలను ఏర్పాటు చేసి 4,20,000 మందికి తాగునీటి సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. గత రెండేళ్లుగా హనీవెల్ ఇండియా, సేఫ్ వాటర్ నెట్‌వర్క్‌తో కలిసి తెలంగాణలో ఈ నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి. మొత్తం 400 మందికి ఉద్యోగావకాశాలు కల్పించాయి. ఇందులో మహిళలు 150 వరకూ ఉన్నారని వికాస్ తెలిపారు. నీటిశుద్ధి కేంద్రాలను నిర్వహించేవారిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మార్చడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

'రక్షణ'లోకి పెన్నార్ ఇండస్ట్రీస్

ఈనాడు, హైదరాబాద్: పెన్నార్ ఇండస్ట్రీస్ రక్షణ రంగంలోకి అడుగు పెడుతోంది. రక్షణ రంగానికి చెందిన ఉత్పత్తులను తయారు చేయడానికి ఎనెర్‌టెక్ ఇంజినీరింగ్‌తో కలిసి ప్రత్యేక కంపెనీ (ఎస్‌పీవీ)ని ఏర్పాటు చేస్తున్నట్లు పెన్నార్ ఇండస్ట్రీస్ తెలిపింది. ప్రత్యేక కంపెనీలో పెన్నార్‌కు 51 శాతం, ఎనెర్‌టెక్ ఇంజినీరింగ్‌కు 49 శాతం వాటా ఉంటుంది. పెన్నార్ ఇండస్ట్రీస్‌కు అనుబంధ కంపెనీగా ఏర్పాటు చేయడానికి ఎగ్జిక్యూటివ్ ఫైనాన్స్ కమిటీ ఆమోదం తెలిపిందని, ఆదిత్య రావు వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తారని పేర్కొంది.

మార్కెట్ కబుర్లు

- **ఎన్‌టీపీసీ** నుంచి రూ.309 కోట్ల విలువైన ఆర్డరు లభించిందని **జీఈ పవర్ ఇండియా** లభించింది. ఆర్డరులో భాగంగా తెలంగాణలోని సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టుకు ఎఫ్‌జీడీ (ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్) సిస్టమ్‌ను అమర్చాల్సి ఉంటుంది.
- **డి ఎస్ కులకర్ణి డెవలపర్స్** షేర్లలో ట్రేడింగ్‌ను బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు నిషేధం విధించనున్నాయి.
- మార్పిడి రహిత డిబెంచర్ల జారీ ద్వారా రూ.4,500 కోట్లను సమీకరించే యోచనలో ఉన్నట్లు **వేదాంతా** వెల్లడించింది. ఈ ప్రతిపాదన పరిశీలన నిమిత్తం ఈ నెల 23న డైరెక్టర్ల కమిటీ సమావేశం ఏర్పాటు చేయనున్నామని తెలిపింది.
- మహారాష్ట్రలో రూ.448 కోట్ల విలువైన 2 రహదారి ప్రాజెక్టులకు అతి తక్కువ మొత్తానికి బిడ్‌లు దాఖలు చేసినట్లు **అశోకా బిల్డ్‌కాన్** తెలిపింది.
- రిలయన్స్ కమ్యూనికేషన్ల ఆస్తుల విక్రయానికి సంబంధించిన కేసును విచారణకు చేపట్టాలని సుప్రీంకోర్టును **ఎస్‌బీఐ** ఆశ్రయించింది. ఎస్‌బీఐ పిటీషన్‌ను గురువారం సుప్రీం కోర్టు విచారణకు తీసుకోనుంది.
- **హిందుస్థాన్ ఏరోనాటిక్స్** తొలి పబ్లిక్ ఆఫర్‌కు చివరి రోజు ముగిసేనాటికి 99 శాతం స్పందన లభించింది.
- 2018 కల్లా బాటా షూ ఆర్గనైజేషన్‌కు భారత్ అత్యంత ముఖ్యమైన విపణిగా అవతరించే అవకాశం ఉందని కంపెనీ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. స్విట్జర్లాండ్‌కు చెందిన బాటా షూ ఆర్గనైజేషన్ భారత్‌లో **బాటా ఇండియా** పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.
- గోవా ప్లాంట్‌లో తనిఖీలు నిర్వహించిన యూఎస్ఎఫ్‌డీఏ కొన్ని అభ్యంతరాలు వెలిబుచ్చిందని **సిప్లా** వెల్లడించింది.
- బాండ్ల జారీ ద్వారా రూ.4000 కోట్లు సమీకరించినట్లు **ఐసీఐసీఐ బ్యాంక్** వెల్లడించింది.
- దివాలా ప్రక్రియను ఎదుర్కొంటోన్న **వీడియోకాన్ ఇండస్ట్రీస్** సాధారణ బీమా కార్యకలాపాల నుంచి బయటకు వచ్చేసింది. లిబర్టీ వీడియోకాన్ జనరల్ ఇన్సూరెన్స్‌లో తనకున్న వాటా మొత్తాన్ని డీపీ జిందాల్ గ్రూపు, ఎనామ్ సెక్యూరిటీస్‌లకు విక్రయించింది.

ఎట్టకేలకు ఒక లాభం

• సూచీలకు ఒడుదొడుకులు

• ఫెడ్ సమావేశంపై మదుపర్ల చూపు

సమీక్ష

అయిదు రోజుల వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. ఆద్యంతం ఒడుదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో.. మార్కెట్లు స్వల్ప లాభాన్ని నమోదు చేయగలిగాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటంతో ఐటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. టెక్ మహీంద్రా, హెక్సావేర్ టెక్, విప్రో, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్ షేర్లు 3.80 శాతం వరకు లాభాలు నమోదు చేశాయి. మిశ్రమ అంతర్జాతీయ సంకేతాలు ఇందుకు దోహదపడ్డాయి. అమెరికా ఫెడరల్ రిజర్వు ద్రవ్య పరపతి సమావేశాల నేపథ్యంలో మదుపర్లు ఆచితూచి వ్యవహరించారు. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా షేర్లు మెరుగ్గా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 32,876.48 పాయింట్ల వద్ద బలహీనంగానే ప్రారంభమైంది. అయితే ఐటీ, టెలికాం షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో కోలుకున్న సూచీ లాభాల్లోకి వచ్చింది. ఇంట్రాడేలో 33,102.74 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసిన సెన్సెక్స్.. చివరకు 73.64 పాయింట్ల లాభంతో 32,996.76 వద్ద ముగిసింది. అంతర్జాతీయ ప్రతికూలతలతో గత అయిదు సెషన్లలో సూచీ 994.82 పాయింట్లు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇక నిఫ్టీ సైతం 10,100 పాయింట్లను తిరిగి అందుకుంది. 30.10 పాయింట్లు పెరిగి 10,124.35 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,049.10- 10,155.65 పాయింట్ల మధ్య కదలాడింది.

కెనరా బ్యాంక్ డీలా: మోసం, ఫోర్జరీ ఆరోపణలపై మాజీ సీఎండీ ఆర్‌కే దూబే, ఇద్దరు మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లపై దర్యాప్తు సంస్థ సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేయడంతో కెనరా బ్యాంక్ షేర్లు డీలాపడ్డాయి. ఇంట్రాడేలో 5.41 శాతం కోల్పోయిన షేరు.. చివరకు 3.84 శాతం నష్టంతో రూ.254.15 వద్ద ముగిసింది. బ్యాంక్ మార్కెట్ విలువ 605.87 కోట్లు తగ్గి రూ.15,180.13 కోట్లకు పరిమితమైంది.

సెన్సెక్స్ 30 షేర్లలో 18 లాభాలతో ముగిశాయి. టాటా స్టీల్ 3.17%, సన్‌ఫార్మా 2.20%, విప్రో 1.98%, డాక్టర్ రెడ్డీస్ 1.85%, అదానీ పోర్ట్స్ 1.47%, హెచ్‌డీఎఫ్‌సీ 1.38%, ఇన్ఫోసిస్ 1.30%, ఎల్ అండ్ టీ 1.09%, టీసీఎస్ 1.07%, టాటా మోటార్స్ 1.04%, బజాజ్ ఆటో 0.69% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. ఓఎన్‌జీసీ (1.42%), ఐసీఐసీఐ బ్యాంక్ (1.10%), యెస్ బ్యాంక్ (0.92%), రిలయన్స్ ఇండస్ట్రీస్ (0.64%), ఎన్‌టీపీసీ (0.57%)లు నష్టాలు చవిచూశాయి. రంగాల వారీ సూచీల్లో ఐటీ 1.29% రాణించింది. టెలికాం, వాహన, విద్యుత్, ఆరోగ్య సంరక్షణ, యంత్ర పరికరాలు, ఎఫ్ఎమ్‌సీజీ షేర్లు అదే బాటలో నడిచాయి. చమురు- గ్యాస్, లోహ, బ్యాంకింగ్, స్థిరాస్తి షేర్లు మాత్రం డీలాపడ్డాయి.

నేటి మార్కెట్


అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకోనున్న నేపథ్యంలో మన స్టాక్ మార్కెట్లు నేడు చాలా తక్కువ శ్రేణికి పరిమితమై కదిలే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. అదే సమయంలో వడ్డీ రేట్ల పెంపు వేగంపై ఫెడ్ రిజర్వ్ చేసే వ్యాఖ్యలనూ మార్కెట్ వర్గాలు సునిశితంగా పరిశీలించే అవకాశం ఉంది. 2018లో నాలుగు పర్యాయాలు రేట్లను పెంచే అవకాశం ఉందని ఫెడ్ రిజర్వ్ కొత్త ఛైర్‌పర్సన్ జెరోమ్ పావెల్ గతంలో సంకేతాలిచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి మాత్రం ఈ ఏడాది మూడు పెంపులే ఉండొచ్చని ఆ బ్యాంకు అంచనా వేస్తుండడం గమనార్హం. 60 బిలియన్ డాలర్ల వరకు చైనా ఎగుమతులను ఇబ్బందే పెట్టే విధంగా దిగుమతి సుంకం విధించాలని అమెరికా భావిస్తోందన్న వార్తలనూ మదుపర్లు గమనించొచ్చు. చైనా, అమెరికాల మధ్య జరుగుతున్న ఈ వాణిజ్య యుద్ధంపై ఓ కన్నేసి ఉంచొచ్చు. బుధవారం నిఫ్టీ-50 10,040-10,220 శ్రేణిలో కదలాడవచ్చని ఓ సాంకేతిక సలహాదారు అంచనా వేశారు.

భారతీ ఇన్‌ఫ్రాటెల్



రూ.325 వద్ద ప్రారంభమై రూ.323.45 - 343.95 మధ్య కదలాడి క్రితం ముగింపు 325.35తో పోలిస్తే రూ.16.55 (5.09%) లాభంతో రూ.341.90 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 55,24,750

వేదాంతా




రూ.284.80 వద్ద మొదలై రూ.283.75 - 293.10 మధ్య చలించి క్రితం ముగింపు 307.20తో పోలిస్తే రూ.20.10 (6.54%) నష్టంతో రూ.287.10 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 1,45,98,256 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)		52 వారాల కనిష్ఠం (రూ.లలో)	
షా అల్లాయ్స్	49.00	ఆస్ట్రా మైక్రోవేవ్ ప్రొడక్ట్స్	81.50
ఆశారి ఏజెన్సీస్	56.20	ఆదిత్య బిర్లా క్యాపిటల్	145.00
జెట్ ఇన్‌ఫ్రా వెంచర్	141.00	ఆల్ కార్గో లాజిస్టిక్స్	149.75
దలాల్ స్ట్రీట్ ఇన్వెస్ట్‌మెంట్స్	142.80	అపోలో మైక్రోసిస్టమ్స్	265.05
రిద్ధి కార్పొరేట్ సర్వీసెస్	224.00	బీఈఎంఎల్	996.00

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
20/03	4,976	4,632	344	3,574	2,843	731
19/03	4,288	3,996	292	3,967	4,158	−191
16/03	14,025	14,175	−150	4,486	5,256	−771
15/03	4,248	4,953	−705	3,113	2,857	256

20న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



(100కు రూపాయలలో)

కోడిగుడ్లు			
హైదరాబాద్	330	వరంగల్	332
చిల్లరగా(ఒక గుడ్డు)	3.90	విశాఖపట్నం	325
బెంగళూరు	365	చెన్నై	370
21వ తేదీకి...		చిత్తూరు	363
విజయవాడ/గోదావరి	317	నమక్కల్	360

ఎన్ఎస్ఈ

మంగళవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 370.00 (364.30) 1780257
AMBUJA CEMEN 230.40 (231.15) 1711628
ASIAN PAINTS 1106.50 (1102.55) 720303
AUROBIND PHA 571.60 (572.90) 2432442
AXIS BANK LT 521.10 (519.45) 5398111
BAJAJ AUTO L 2873.00 (2849.45) 227109
BAJAJ FINANC 1657.30 (1631.85) 1318758
BHARTI AIRTE 400.40 (399.65) 7463026
BHARTI INFRA 341.90 (325.35) 5524750
BOSCH LTD 17876.75 (17515.05) 15492
BPCL 424.90 (430.75) 2812798
CIPLA 552.90 (559.75) 9119209
COAL INDIA L 270.25 (272.30) 1804554
DR. REDDYS 2157.15 (2119.85) 387372
EICHER MOTOR 28360.45 (27403.05) 47070
GAIL 438.50 (442.05) 1975422
HCL TECH 937.20 (926.50) 1853893
HDFC 1800.05 (1774.50) 3441458
HDFC BANK 1839.50 (1847.25) 914343
HERO MOTOCOR 3513.80 (3515.30) 212901
HINDALCO IND 217.30 (214.55) 9600657
HINDUSTAN UN 1313.25 (1309.40) 1249242
HPCL 354.85 (352.35) 2465054
ICICI BANK 292.00 (294.55) 10880002
INDIABULLS H 1198.30 (1187.85) 714240
INDIAN OIL 173.85 (177.90) 14209418
INDUSINDBANK 1716.65 (1718.80) 779431
INFOSYS LTD 1164.55 (1146.75) 4276883
ITC 259.20 (259.15) 7481088
KOTAK MAHIND 1045.30 (1049.00) 987156
LARSEN & TOU 1293.50 (1279.55) 2831066
LUPIN 771.75 (766.60) 975082
M&M 740.95 (742.70) 1248986
MARUTI SUZIK 8802.40 (8773.50) 408924
NTPC LTD 166.40 (167.00) 3150362
ONGC 174.10 (176.85) 3020586
POWER GRID C 194.90 (194.20) 5434545
RELIANCE IND 889.80 (895.50) 6945721
SBI 249.10 (247.95) 20556571
SUN PHARMA 508.75 (497.65) 4615574
TATA CONSULT 2864.85 (2831.00) 2012492
TATA MOTORS 338.80 (335.70) 5080453
TATA STEEL L 593.00 (574.95) 17645035
TECH MAHINDR 633.40 (609.90) 3320421
ULTRATECH 3936.80 (3972.40) 155144
UPL LIMITED 712.30 (701.85) 1296133
VEDANTA LIMI 287.10 (307.20) 14598256
WIPRO 293.60 (288.65) 3024209
YES BANK LTD 302.40 (304.80) 9874137
ZEE ENTERTAI 575.10 (566.45) 1329829

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1304.70 (1317.30) 116191
ACC 1554.80 (1562.90) 339628
ASHOK LEYLAN 146.00 (145.70) 11845334
AVENUE SUPER 1346.50 (1342.55) 754220
BAJAJ FINSER 5080.85 (4963.45) 107777
BANK OFBAROD 135.85 (133.35) 27633823
BEL 149.50 (148.55) 2231710
BHEL 84.10 (83.75) 4103288
BRITANNIA 4825.05 (4815.55) 161626
CADILA HEALT 385.45 (376.95) 554872
COLGATE PALM 1040.65 (1034.00) 224802
CONTAINER 1185.15 (1199.10) 455502
CUMMINS INDI 744.70 (755.15) 376615
DABUR INDIA 319.35 (319.70) 2312806
DLF LIMITED 215.40 (214.35) 6577013
EMAMI LIMITE 1031.65 (1025.65) 55282
GLAXOSMI CON 6612.90 (6527.50) 6209
GLAXOSMI PHA 2226.05 (2227.65) 12635
GLENMARK PHA 546.40 (543.85) 377843
GODREJ CONSU 1068.45 (1047.30) 230240
HAVELLS INDI 499.00 (506.50) 1365921
HINDUSTAN ZI 313.00 (308.70) 2430725
ICICI PRU LI 371.20 (372.30) 484244
IDEA CELLULR 77.15 (77.80) 12418167
INTERGLOBE A 1242.95 (1215.80) 1354380
JSW STEEL LT 285.50 (283.60) 5586853
LIC HOUS.FIN 518.05 (511.25) 1338772
MARICO LIMIT 318.95 (303.25) 3252553
MCDOWELL 3043.90 (3038.25) 229355
MOTHERSON 304.90 (306.65) 2410751
MRF 69593.05 (70074.85) 2849
NHPC LTD 26.35 (26.45) 3648398
NMDC LTD 118.40 (117.90) 2813896
OIL INDIA 327.10 (337.00) 689486
ORACLE FIN S 3797.85 (3880.05) 29828
P&G HYG&HEAL 9237.15 (9304.30) 2755
PETRONET LNG 235.65 (233.65) 2637166
PIDILITE IND 902.70 (907.65) 240585
PIRAMAL ENTE 2469.80 (2492.25) 185570
PNB 96.85 (96.55) 27906714
POWER FIN CO 88.95 (87.70) 9470767
RURAL ELEC C 127.10 (124.75) 5294362
SAIL 72.25 (68.90) 24587743
SHREE CEMENT 16423.75 (16015.50) 12523
SHRIRAM TRAN 1377.85 (1404.00) 952245
SIEMENS 1108.50 (1090.50) 190944
SUN TV LTD 892.20 (907.30) 1006750
TATA POWER 80.35 (79.55) 2206517
TITAN IND 871.75 (869.00) 1985478
TORRENT PHAR 1254.80 (1261.65) 101598

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 157.70 (158.70) 575261
ADANI ENTERP 160.95 (160.60) 9395255
ADANI POWER 25.80 (26.10) 11160757
ALL BANK 49.35 (49.40) 4816215
AMARA RAJA 784.30 (775.20) 372218
ANANT RAJIND 50.95 (52.10) 988266
ANDHRA BANK 42.55 (41.90) 29324584
APOLLO HOSPI 1042.80 (1056.20) 545440
APOLLO TYRES 263.25 (261.25) 1132351
APTECH 300.80 (294.50) 595790
BAJAJ ELECT. 553.35 (557.55) 696753
BAJAJ HIND 10.10 (10.10) 4188647
BAJAJ HOLDIN 2543.75 (2531.90) 5301
BALAJI TELE 125.80 (126.90) 137528
BALLARPUR IN 13.15 (13.50) 940064
BALRAMPUR CH 85.75 (81.80) 7906412
BANK OF MAHA 14.40 (14.60) 851862
BANK OFINDIA 100.70 (100.40) 15975916
BATA INDIA 693.00 (676.90) 470099
BGR ENERGY S 105.75 (102.30) 565779
BHARAT FORGE 707.75 (709.25) 1013796
BHUSHAN STEE 41.75 (40.60) 3147446
BIOCON LTD 576.30 (579.10) 2434797
BOMBAY DYE 264.50 (267.70) 4359889
CANARA BANK 254.20 (264.20) 14253284
CEAT LIMITED 1524.60 (1538.20) 430520
CENTRAL BANK 74.30 (77.20) 7986163
CHAMBAL FERT 167.20 (165.55) 340765
CHENNAI PETR 340.50 (338.60) 325072
CITY UNIBANK 174.95 (176.30) 457788
CORPO BANK 30.15 (30.25) 288539
COX & KINGS 236.30 (238.05) 43075
D B REALTY L 51.25 (53.90) 710345
DELTA CORP L 289.45 (296.40) 2323886
DENA BANK 19.50 (19.85) 1306842
DHANALAKBANK 23.60 (21.40) 1929478
DIVIS LAB 1094.40 (1088.00) 545426
EDELWEISS CA 251.70 (253.45) 1885405
EID PARRY 276.55 (282.25) 104212
EIH 167.20 (166.05) 366888
ESSAR SHIPPI 25.05 (22.60) 244509
ESTER INDUST 71.80 (69.20) 461232
EXIDE INDUST 212.30 (210.20) 931216
FEDERAL BANK 91.25 (90.70) 4040369
FINOLEX CABL 647.85 (659.90) 43933
G E SHIP LTD 347.85 (347.70) 531487
GAMMON INFRA 2.60 (2.65) 7515326
GATI LIMITED 100.40 (100.95) 261752
GAYATRI PROJ 188.15 (188.15) 230176
GITANJALIGEM 11.15 (11.70) 16412
GMR INFRASTR 17.80 (17.60) 21469293
GODREJ IND 539.70 (540.95) 244383
GRASIM IND 1096.10 (1098.20) 877345
GUJ ALK&CHEM 698.10 (696.15) 28084
HCL INFOSYS 52.80 (53.55) 1810485
HEXA TECH 374.45 (361.55) 1299196
HIMACHAL FUT 26.80 (27.30) 7013550
HOUSING DEV 42.20 (42.00) 5968551
IDBI 73.70 (73.75) 75054926
IDFC 49.95 (49.75) 3077673
IFCI 20.55 (20.45) 10141334
IL&FS TRANS 66.00 (67.30) 283977
IND SWIFTLAB 59.15 (60.90) 5494
INDBULLS REL 199.45 (197.85) 4540988
INDIA CEM 142.95 (141.70) 4134302
INDIAN BANK 288.75 (293.65) 1751015
INDO RAMA SY 31.40 (31.55) 168796
INDRAPRASTHA 286.95 (290.35) 2540554
IND-SWIFTLTD 7.30 (7.35) 8656
INGERSOLL-R 688.15 (691.70) 12320
IOB 18.25 (18.30) 447041
IPCA LAB 661.20 (657.90) 100021
IRB INFRA DE 217.60 (219.05) 1428327
J&K BANK 58.65 (59.00) 317262
JAI CORP 139.05 (140.05) 1535436
JAIN IRRIGAT 106.60 (106.20) 4156749
JAYPEE INFRA 9.95 (10.20) 6477288
JAYSHREE TEA 95.55 (95.05) 23684
JET AIRWAYS 669.25 (673.35) 3481065
JINDAL SAW 120.85 (121.15) 989378
JINDAL STEEL 233.55 (220.95) 21033261
JK LAKSHMI C 419.90 (419.85) 69706
JK PAPER LIM 136.65 (139.95) 245642
JM FINANCIAL 123.15 (126.80) 847691
JP ASSOCIATS 20.00 (19.55) 171279223
JSW ENERGY L 75.35 (73.55) 2307915
JUBILANT FOO 2121.80 (2113.15) 621810
JUBILANT ORG 799.20 (802.50) 845747
JYOTHY LABS 360.20 (364.50) 149350
JYOTI STRUC 8.95 (9.00) 126364
KARNATA BANK 118.75 (117.60) 1956776
KEC INTL LTD 388.55 (380.15) 477043
KOLTE PATIL 313.70 (314.25) 126594
KPIT CUMMINS 230.80 (226.20) 2575885
L&TFIN.HOLD 153.60 (157.30) 6232154
LAK VIL BANK 99.85 (98.00) 637365
M & M FINANC 435.80 (431.80) 1172889
MANAPPURAM G 104.35 (102.95) 2073095
MMTC LIMITED 64.05 (66.15) 5379120
MPHASIS LTD 841.80 (855.60) 157267
MRPL 113.85 (112.10) 1642036
MTNL 19.40 (19.70) 1167336
NAGARJUNA OI 4.00 (4.00) 314357
NCC LIMITED 121.00 (119.15) 2974881
NETWORK18 FI 56.05 (56.30) 565956
NEULAND LAB 717.70 (734.40) 13322
NIIT LTD 88.45 (89.90) 733200
NIIT TECHNOL 918.05 (881.80) 3583752
OMAXE LTD 227.95 (226.30) 410141
ONMOBILE GLO 42.40 (43.95) 494096
ORIENT PAPER 38.20 (38.35) 125267
ORIENTALBANK 95.25 (95.05) 5806765
PARSVNATH DE 15.55 (15.95) 1360942
PATEL ENGG 66.70 (67.15) 167685
PFIZER 2130.35 (2144.55) 9036
POLARIS SOFT 473.00 (473.00) 28047
POWERTRADING 90.15 (92.50) 1950079
PRAJ IND 82.90 (81.95) 388160
PRISM CEMENT 114.45 (112.35) 2503727
PROVOGUE (IN 4.50 (4.45) 46425
PUNJ LLOYD 17.60 (17.75) 725780
PUNJAB & SIN 35.80 (36.25) 40998
PURAVANKARA 138.35 (138.55) 306776
PVP VENTURES 6.30 (6.00) 233577
PVR LIMITED 1262.60 (1267.75) 176944
RDICO KHAIT 321.20 (321.70) 837362
RAJESH EXPOR 742.45 (748.15) 58918
RALLIS INDIA 222.60 (227.30) 188684
RAMCO IND 235.15 (234.15) 139532
RAMCO SYS 391.10 (394.20) 34061
RAMKY INFRA 196.40 (198.40) 86211
RAYMOND 913.80 (904.65) 355930
RELIANCE CAP 424.20 (418.85) 5468515
RELIANCE COM 23.10 (23.00) 35334974
RELIANCE INF 453.05 (424.25) 5744461
RELIANCE POW 39.00 (38.45) 4338360
ROLTA INDIA 60.75 (60.95) 589507
SAGAR CEMENT 892.05 (905.50) 2228
SAREGAMA 657.20 (677.25) 75966
SHANTHI GEAR 130.00 (132.25) 14826
SHIPPNG CORP 64.95 (65.20) 538723
SHREE RENUKA 15.50 (15.40) 5702825
SINTEX IND 19.60 (20.50) 4690189
SOBHA DEVELO 490.70 (502.75) 459224
SOUTHINDBANK 24.05 (24.30) 6860541
SRS LIMITED 1.05 (1.10) 657123
STERLITE TEC 315.85 (318.15) 1081748
SUJANA METAL 1.15 (1.20) 118430
SUN PHARMA 391.30 (394.10) 164699
SUND FASTNER 562.20 (562.40) 269604
SUZLON ENERG 11.30 (11.25) 32288626
SYND. BANK 60.30 (60.50) 4453054
TATA CHEM 671.70 (667.05) 571338
TATA COFFEE 118.40 (118.65) 270578
TATA COMMUN 637.50 (626.00) 1678875
TATA GLOBAL 262.05 (260.60) 2855717
TATA METALIK 739.20 (741.75) 40337
TATA MOT DVR 190.00 (188.90) 1889126
TATA STEEL L 140.60 (138.60) 2474113
TATA TELESER 6.25 (6.40) 1036260
THE INDIAN H 129.00 (129.45) 1796176
TORRENT POWE 238.35 (240.00) 384759
TRIVENI ENGG 47.30 (46.35) 829920
TTK PRESTIGE 6327.90 (6351.40) 6043
TV TODAY NET 469.25 (464.30) 500270
TV18 BROADCA 64.50 (64.15) 14161544
TVS MOTOR 622.75 (614.30) 700933
UCO BANK 23.05 (23.40) 514468
UNION BANK 96.45 (96.40) 7137992
UNITECH 6.05 (6.10) 10255946
UNITED BANK 13.95 (14.30) 1923984
UNITED BREWE 1003.40 (995.25) 266710
USHA MARTIN 18.60 (19.05) 1009778
VADILAL INDU 852.85 (873.20) 26706
VENKYS 3921.75 (4090.30) 185050
V-GUARD IND 222.15 (225.15) 787914
VIJAYA BANK 54.55 (54.85) 593505
VIP 302.05 (297.10) 215983
VOLTAS 620.70 (620.90) 894158
ZEE LEARN LI 36.65 (37.05) 206606
ZUARI GLOBAL 184.80 (185.60) 49231
ZYDUS WELLNE 1203.70 (1200.80) 4616

ALPHAGEO 747.05 (755.40) 8514
AMAR RAJA BA 783.05 (772.50) 15376
ANDHRA BANK 42.85 (41.85) 1431237
ANDHRA CEMEN 9.90 (10.37) 68996
ANDHRA PAPER 291.65 (292.25) 5254
ANDHRA PETRO 54.15 (55.50) 34815
ANDHRA SUGAR 436.40 (432) 6422
ASTRA MICROW 82 (82.95) 72261
AUROBINDO PH 571.05 (571.95) 202858
AVANTEL SOFT 517.65 (520.35) 2474
AVANTI FEEDS 2290.80 (2298.35) 11375
BALAJI AMIN 583.85 (582.90) 67273
BARTRONICS 11.16 (11.44) 14303
BHAGIRA CHEM 284 (286) 4525
BHAGYA NAG 44.85 (45.80) 45889
BN RATHI SEC 39 (38.95) 16884
BRILLIANT SE 9.64 (9.21) 161772
CAMBRIDGE TE 68.80 (68.75) 851
COMBAT DRUGS 22.35 (23.50) 246
CONT COFFEE 287.80 (284.25) 4109
COROMAN FERT 518.65 (508.55) 3951
CYBERMATE 2.91 (2.85) 18525
CYIENT LIMIT 642.75 (639.20) 10189
DECCAN CEMEN 524.65 (524.85) 595
DIVI'S LAB 1092.20 (1087.40) 21140
DR REDDY 2157.40 (2118.20) 27081
ESSEN SUPPLE 22.45 (23.60) 1000
GATI CORPN 100.20 (101.25) 49256
GAYATRI PROJ 186.80 (186.95) 7567
GMR INFRASTR 17.85 (17.65) 2372943

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

GOLDST INFRA 189.85 (197.95) 22899
GOLDSTONE EN 13.84 (13.60) 30024
GRANULES (I) 108.45 (108.30) 74986
GSS AMERICA 61.10 (64.25) 289966
GVK POWER 14.05 (14.50) 1773088
HBL NIFE POW 47.95 (49.50) 85499
HERITAGE FOO 719.55 (743.70) 1409
HIL LTD 1519.40 (1561.30) 1175
ILFS ENGINEE 34.50 (34.90) 6265
INNAREDY COM 3.10 (3.21) 154456
IVRCL INFRAS 3.62 (3.65) 260918
KAKATIYA CEM 257.20 (259.65) 2634
KALLAM SPG 30.90 (31.50) 27009
KAVERI SEED 484 (483.35) 12985
LANCO INDUS 323.45 (327.95) 11175
LANCO INFRAT 1.23 (1.27) 3004184
LAURUS LABS 514.05 (523.80) 7840
MADHUCON PRO 23 (23.10) 28761
MIC ELECTRON 5.52 (5.81) 19969
MOLD-TEK.TEC 53.15 (53.50) 56315
MOLDTK PLA 315.20 (319.70) 1012
NAGARJAGRICH 40.10 (40.45) 14273
NATCO PHARMA 778.25 (764.25) 37444
NAVA BH VENT 138.85 (139.20) 32338
NCC 121 (119.20) 316260
NEULAND LAB 715.30 (733.20) 3575
NIHAR INFO 14.80 (14.80) 700
PANKAJ POLY 8.48 (8.90) 8487
PANYAM CEMEN 41.95 (42.20) 11147
PENNER IND 52.90 (53.40) 87744
PIONEER DIST 178.80 (184) 2170
PITTI LAMIN 85 (83.75) 12486
PRAJAY ENGS 12.21 (12.53) 7763
PRISM CEMENT 114.60 (112.55) 2572396
PRUDENTL PHA 3.90 (4.01) 331469
RAIN INDUSTR 383.45 (373.35) 445547
SAMKRG PIST 283.40 (286.55) 5484
SATVAH. ISPA 19.90 (19.45) 61096
SMS PHARMA 75.70 (76.60) 14708
SPHERE GLOBA 35 (33.50) 22749
SREE RAYAL A 52.70 (52.10) 181297
STEEL EXCHAN 25.65 (26.95) 27831
SUJANA METAL 1.15 (1.21) 28141
SUJANA TOWER 3.63 (3.82) 5905
SUJANA UNIVE 0.74 (0.71) 37268
SURYALAKSH.C 69.05 (69.80) 9610
SUVEN PHARMA 167.65 (173.15) 48595
TAJ GVK HOTE 155.60 (162) 314783
TANLA 33.35 (33.60) 96687
TERA SOFTWAR 42.05 (43.65) 8382
VICEROY HOTE 14.95 (14.80) 39372
VIJAY TEXTIL 42.70 (43.95) 3242
VISAKA IND 671.60 (673.15) 4048
VISTA PHARMA 39.60 (40.70) 12399
VIVIMED LABS 75.80 (76.95) 105777
YBRANT DIGIT 4.93 (4.94) 78050
ZENTECH 120 (118.20) 49704



టాటా కార్ల ధరలు ప్రియం



దిల్లీ: ఏప్రిల్ 1 నుంచి టాటా మోటార్స్ కార్ల ధరలు పెరగబోతున్నాయి. తమ అన్ని రకాల కార్లపై రూ.60,000 వరకు ధరలు పెంచుతున్నట్లు కంపెనీ మంగళవారం ప్రకటించింది. ఈ సంస్థ నుంచి వస్తున్న కార్లలో జెన్ ఎక్స్ నానో అతి తక్కువ ధరల శ్రేణిలో ఉంది. రూ.2.28 లక్షలకు లభ్యమవుతోంది. పెద్ద కారు (ప్రీమియం ఎస్‌యూవీ) హెక్సా ధర రూ.17.42 లక్షలు (ఎక్స్‌షోరూం, దిల్లీ). 'ఖర్చులు పెరగడం, మార్కెట్ పరిస్థితులు, ఇతర ఆర్థిక అంశాలు పరిగణనలోకి తీసుకొని ధరలు పెంచాల్సి వస్తోంది. అయినప్పటికీ టియాగో, హెక్సా, టిగోర్, నెక్సాన్ మోడళ్లతో వచ్చే ఏడాది ఆశాజనకమైన వృద్ధి నమోదు చేస్తామన్న నమ్మకం ఉంద'ని టాటా మోటార్స్ అధ్యక్షుడు (ప్యాసింజర్ వెహికల్ వ్యాపారం) మయాంక్ పరీక్ తెలిపారు. ఇదిలా ఉంటే ఆడి సంస్థ తమ కార్ల ధరల్ని ఏప్రిల్ 1 నుంచి పెంచబోతున్నట్లు గత వారమే ప్రకటించింది. రూ.1-9 లక్షల మధ్య ఈ ధరలు పెరగబోతున్నాయి. బడ్జెట్‌లో కస్టమ్స్ సుంకం పెంచిన నేపథ్యంలో ధరలు పెంచాల్సి వస్తోందని జర్మన్ లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడి వెల్లడించింది.

ఏప్రిల్ 1 నుంచి..

నిస్సాన్ కూడా అదేబాటలో..



దిల్లీ: కార్ల తయారీ సంస్థ నిస్సాన్ తమ ఉత్పత్తులపై 2 శాతం వరకు ధరలు పెంచబోతోంది. ఏప్రిల్ 1 నుంచి ఈ కొత్త ధరలు అమల్లోకి వస్తాయి. నిస్సాన్‌తోపాటు డాట్సన్ బ్రాండ్‌పై తయారవుతున్న గో, గో+, రెడీ-గో కార్ల ధరల్ని కూడా వచ్చే నెల 1 నుంచి పెంచబోతున్నట్లు సంస్థ ప్రకటించింది. నిస్సాన్ నుంచి ప్రస్తుతం మైక్రా, సన్నీ, టెర్రనో కార్లు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. వీటి ధరలు రూ.4.64 లక్షల నుంచి రూ.14.46 లక్షల మధ్య ఉన్నాయి. డాట్సన్ మోడళ్ల ధరలు రూ.2.49 లక్షల నుంచి రూ.5.12 లక్షలు (ఎక్స్‌షోరూం, దిల్లీ). 'కార్ల తయారీలో ఖర్చులు బాగా పెరిగిపోవడంతో నిస్సాన్, డాట్సన్ కార్ల ధరల్ని ఏప్రిల్ 1 నుంచి పెంచాల్సి వస్తోంద'ని జపనీస్ కార్ల తయారీ సంస్థ నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీ జెరోమ్ సైగాట్ ఓ ప్రకటనలో తెలిపారు.

జనవరిలోనూ మారుతీ హవా

జనవరి అమ్మకాల్లోనూ మారుతీ మోడళ్ల హవా నడిచింది. విక్రయాలపరంగా ఆల్టో, డిజైర్, బాలెనో, స్విఫ్ట్, వ్యాగన్‌ఆర్‌లు మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి. మరో మోడల్ సెలేరియో 9వ స్థానం పొందింది. హ్యుందాయ్ గ్రాండ్ ఐ10, ఎలైట్ ఐ20, ఇయాన్‌లు కూడా అత్యుత్తమ-10 జాబితాలో చోటు సంపాదించాయి. టాటా టియాగో కు 8వ స్థానం లభించింది.

1..2..3..4..5..7

● ఫిబ్రవరి అమ్మకాల్లో మారుతీ మోడళ్ల ర్యాంకులు ● ఆల్టోదే అగ్రస్థానం
● అత్యుత్తమ-10లో హ్యుందాయ్‌వి 3 ● మహీంద్రా బొలెరోకు తొలిసారి చోటు

దిల్లీ



ఫిబ్రవరిలో అత్యధికంగా అమ్ముడుపోయిన తొలి 10 ప్రయాణికుల వాహనాల జాబితాలో మహీంద్రా బొలెరో చోటు సంపాదించింది. గత రెండేళ్లలో బొలెరోకు చోటు దక్కడం ఇదే మొదటిసారి. ఇక ఎప్పటిలాగానే మారుతీ సుజుకీ మోడళ్లు ర్యాంకులను కొల్లగొట్టాయి. అత్యుత్తమ-10 మోడళ్లలో ఈ కంపెనీవే ఆరు ఉన్నాయి. హ్యుందాయ్‌వి 3 మోడళ్లు స్థానం సంపాదించాయి. ఫిబ్రవరి నెలకు సియామ్ విడుదల చేసిన గణాంకాల వివరాలు ఇలా..

- ✦ ఆల్టో, డిజైర్‌లు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. ✦ 2017 ఫిబ్రవరిలో ఐదో స్థానంలో ఉన్న స్విఫ్ట్ ఈ ఫిబ్రవరిలో మూడో స్థానానికి ఎగబాకింది. బాలెనో తొమ్మిదో స్థానం నుంచి నాలుగో స్థానానికి దూసుకెళ్లింది.
- ✦ మారుతీకే చెందిన వ్యాగన్ ఆర్ ఐదో స్థానం పొందింది. అయితే 2017 ఫిబ్రవరిలో ఈ మోడల్ మూడో స్థానంలో ఉండటం గమనార్హం.
- ✦ విటారా బ్రెజాకు ఏడో స్థానం లభించింది.

ర్యాంకు	మోడల్	ఫిబ్రవరిలో అమ్మకాలు
1	ఆల్టో	19,760
2	డిజైర్	17,784
3	స్విఫ్ట్	17,291
4	బాలెనో	15,807
5	వ్యాగన్ ఆర్	14,029
6	ఎలైట్ ఐ20	13,378
7	విటారా బ్రెజా	11,620
8	గ్రాండ్ ఐ10	10,198
9	క్రెటా	9,278
10	బొలెరో	8,001

- ✦ హ్యుందాయ్‌కు చెందిన ఎలైట్ 20కి ఆరో స్థానం దక్కగా.. గ్రాండ్ ఐ10, క్రెటా మోడళ్లు వరుసగా 8, 9 ర్యాంకులను పొందాయి.
- ✦ 2017 ఫిబ్రవరిలో అత్యుత్తమ-10 జాబితాలో ఉన్న మారుతీ సెలేరియో, రెనో క్విడ్‌లకు ఈసారి స్థానం దక్కలేదు.

దేశంలోనే తొలిసారిగా

అంతర్జాతీయ ఆరోగ్య బీమా

ముంబయి: అతిపెద్ద జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ న్యూ ఇండియా అసూరెన్స్ దేశంలోనే తొలి అంతర్జాతీయ ఆరోగ్య బీమా(మెడిక్లెయిమ్) పాలసీని తీసుకొచ్చింది. విదేశీ ఆసుపత్రుల్లో కేన్సర్, అవయవ మార్పిడి, ఎముక మజ్జ మార్పిడి వంటి ఆరు కీలక అనారోగ్యాలకు 0.5-2 మిలియన్ డాలర్ల(రూ.3.25-13 కోట్లు) వరకు కవరేజీ ఇస్తోంది. ఈ సేవలను అందించడం కోసం అంతర్జాతీయంగా 100 ఆసుపత్రులతో ఒప్పందం చేసుకున్నట్లు కంపెనీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జి.శ్రీనివాసన్ మంగళవారమిక్కడ విలేకర్లతో పేర్కొన్నారు. కింగ్ కాలేజ్ హాస్పిటల్(లండన్), జాన్ హాప్కిన్స్ మెడికల్ సెంటర్(బాల్టిమోర్), సెడార్-షినాయ్ మెడికల్ సెంటర్(అమెరికా) వంటి ప్రఖ్యాత ఆసుపత్రులు కూడా ఇందులో ఉన్నాయి.

18-75 ఏళ్ల వయసు ఉండి.. ఆ ఆరు రోగాల ఛాయలు లేనివారు ఈ పాలసీని తీసుకోవచ్చు. రోగాల కవరేజీని, వయసును బట్టి ప్రీమియం మారుతుంది. ఉదాహరణకు 18 ఏళ్ల వ్యక్తికి ఒక రోగానికి రూ.5672(పన్నులు అదనం) అయితే.. ఆరు రోగాలూ కవరేజీ కావాలంటే రూ.12,716 ప్రీమియం అవుతుంది. అదే 75 ఏళ్ల వ్యక్తికి ఈ ప్రీమియంలు వరుసగా రూ.2,05,696; రూ.4,95,899గా ఉంటుంది. 'న్యూ ఇండియా గ్లోబల్ మెడిక్లెయిమ్ పాలసీ'గా పిలిచే ఈ పథకం కింద విదేశాల్లో కేన్సర్, న్యూరో సర్జరీ, గుండె శస్త్ర చికిత్స, బైపాస్ సర్జరీ, అవయవ మార్పిడి, ఎముక మజ్జ మార్పిడి తదితరాలకు ఆసుపత్రుల వ్యయాలు కవర్ అవుతాయి. అంతే కాకుండా, బీమా చేసిన వ్యక్తికి విమాన ప్రయాణం బిజినెస్ క్లాస్ టికెట్ (3000 డాలర్లు) కూడా ఇస్తారు. ఒక వేళ అవయవ మార్పిడి ఉంటే దాతకు కూడా టికెట్ ఇస్తారు. ఒక వేళ రోగి విదేశాల్లో చికిత్స పొందుతూ మరణిస్తే 15,000 డాలర్ల వరకు చెల్లిస్తారు. కాగా, ఈ పాలసీ కేవలం భారతీయులకు అది కూడా రూ.8 లక్షలు అంత కంటే ఎక్కువ ఆరోగ్య బీమా కవరేజీ ఉండాలి.

'బాధ్యతాయుత' రుణాలకు ప్రమాణాలు

● కసరత్తు చేస్తున్న ఎఫ్‌పీఎస్‌బీ
● వ్యక్తిగత రుణాలపై అధ్యయనం

ఈనాడు, హైదరాబాద్: భారత్‌లో వ్యయపరంగా ఆమోదయోగ్యమైన, స్థిరమైన, సరైన రుణ వ్యవస్థకు (రెస్పాన్సిబుల్ లెండింగ్) ప్రమాణాలు రూపొందించడానికి ఫైనాన్షియల్ ప్లానింగ్ స్టాండర్డ్స్ బోర్డు ఆఫ్ ఇండియా (ఎఫ్‌పీఎస్‌బీ) నడుం బిగించింది. ఇందుకు అనుగుణంగా భారత వినియోగ రుణాల రంగంపై అధ్యయనాన్ని నిర్వహించింది. బ్యాంకులు, ఇతర బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల వద్ద ఉన్న వ్యక్తిగత, కన్జూమర్ డ్యూరబుల్ రుణాల సమాచారాన్ని తీసుకుని ఈ అధ్యయనాన్ని నిర్వహించామని 'నావిగేటర్ ఆఫ్ రెస్పాన్సిబుల్ లెండింగ్ ఇన్ ఇండియా' పేరుతో అధ్యయన వివరాలను వెల్లడించామని ఎఫ్‌పీఎస్‌బీ ఇండియా వైస్ ఛైర్మన్, ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) రంజిత్ ఎస్ ముధోల్కర్ తెలిపారు. ఇటువంటి అధ్యయనాన్ని నిర్వహించడం ఇదే తొలిసారి. ముందు, ముందు ఈ దశగా మరిన్ని అధ్యయనాలు చేపడతామన్నారు. దాదాపు 15 బ్యాంకులు, బ్యాంకింగేతర సంస్థల వద్ద ఉన్న రూ.15,000 వరకూ విలువ కలిగిన రుణాలపై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్, లక్నోతో కలిసి ఎఫ్‌పీఎస్‌బీ అధ్యయనం చేసింది. రుణాల దరఖాస్తుల ప్రాసెస్, రుణదాతలు బహిరంగంగా వెల్లడించే సమాచారం, రుసుములు, ఛార్జీలు, రుణ సర్వీసింగ్, ఫైనాన్షియల్ ఇంక్లూషన్ అంశాల ఆధారంగా సర్వే జరిగిందని ముధోల్కర్ చెప్పారు. యాక్సిస్ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, పీఎన్‌బీ, బజాజ్ ఫిన్‌సర్వ్, కేపిటల్ ఫస్ట్ తదితర సంస్థల నుంచి ఆన్‌లైన్, సాధారణ విధానంలో సమాచారాన్ని తీసుకున్నారు. వ్యక్తిగత రుణాల విభాగంలో దరకాస్తు ప్రాసెస్‌లో యాక్సిస్ బ్యాంకు, ఫుల్లెర్టన్ క్రెడిట్ ఇండియా, హోమ్ క్రెడిట్ ఇండియా స్టాండర్డ్ చార్టర్ బ్యాంకు పనితీరు బాగుంది. డ్యూరబుల్ రుణాల్లో బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీబీఎఫ్‌ఎస్, హోమ్ క్రెడిట్ ఇండియాలు మొదటి స్థానంలో ఉన్నాయని ముధోల్కర్ తెలిపారు. 'రుణాలు తీసుకునే వారు ఇచ్చే వారి మధ్య పరస్పర బాధ్యత ఉంది. ఇద్దరి మధ్య బాధ్యతయుత, ఆరోగ్యకర సంబంధాలను ఏర్పాటు చేయడమే ఈ అధ్యయనం ఉద్దేశమన్నా'రు.

ఈనాడు వాణిజ్య విభాగం

కొత్త కంపెనీలకు క్లౌడ్ భేష్

ఐటీ రంగంలో ప్రతి నాలుగైదేళ్లకు సరికొత్త సాంకేతికతలు వస్తుంటాయి. సాంకేతికత ఏది వచ్చినా, డేటా నిల్వ అనేది తప్పనిసరి కనుక క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ భద్రతకు అపార అవకాశాలు లభిస్తాయని ఇన్ఫోసిస్ అభిప్రాయంతో ఉంది. సంప్రదాయ ధోరణికి భిన్నంగా క్లౌడ్ పద్ధతిలో డేటా నిల్వ చేసుకునే కంపెనీలకు 25-30 శాతం ఖర్చు కలిసి రావడమే కాక, వినియోగదార్లకు మెరుగైన, వినూత్న సేవలందుతాయని ఇన్ఫోసిస్ క్లౌడ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెక్యూరిటీ విభాగాల అధిపతి ఎం.నరసింహారావు తెలిపారు. సైబర్ దాడులను తట్టుకునే సురక్షిత సైబర్ భద్రతా వ్యవస్థలను క్లౌడ్ కంపెనీలు కలిగి ఉన్నాయన్నారు. అందువల్లే క్లౌడ్ కంప్యూటింగ్‌ను ఇ కామర్స్ సంస్థలు విరివిగా వినియోగిస్తున్నాయని పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ చదివిన వారికి ఈ రంగంలో ఉద్యోగాలు లభిస్తున్నాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా క్లౌడ్ విపణి పరిమాణం (మార్కెట్) 2020 నాటికి సుమారు రూ.16 లక్షల కోట్లకు (240 బిలియన్ డాలర్లకు పైగా) చేరుతుందనే అంచనాలున్న నేపథ్యంలో, 'ఈనాడు' ఇంటర్వ్యూలో క్లౌడ్‌కు సంబంధించి ఆయన పలు అంశాలు వెల్లడించారు. ముఖ్యాంశాలివీ..

పాత కంపెనీలూ మారక తప్పదు

● ఖర్చులు 25-30 శాతం కలిసొస్తాయ్ ● సైబర్ దాడుల్లో డేటా రికవరీకీ వీలు
● ఖాతాదారులకు మెరుగైన సేవలందుతాయ్ ● డేటా భద్రతకు ముప్పే ఉండదు



? క్లౌడ్ విపణి ఎలా ఉండనుంది

భవిష్యత్తు క్లౌడ్ కంప్యూటింగ్‌దే. ఎక్కడనుంచి, ఎవరైనా డేటాను యాక్సెస్ చేసుకునే వీలున్న బ్లాక్‌చెయిన్ సాంకేతికత కూడా క్లౌడ్ నుంచి వచ్చిందే. నెట్‌వర్క్ వేగం పెరిగి, డేటా వ్యయాలు తగ్గినందున డేటాను మన కార్యాలయంలోనే దాచుకోవాల్సిన అవసరం లేదు. సుదూర ప్రాంతాల్లో కూడా నిల్వ చేసుకుని, అవసరమైనది వాడుకోవచ్చు. క్లౌడ్ కేంద్రాల్లో డేటా నిల్వ సౌకర్యవంతం, సురక్షితం కనుకే దేశ, విదేశీ, బహుళజాతి సంస్థలు దీన్ని వినియోగిస్తున్నాయి. అంకుర సంస్థలకు మరింత ఉపయోగం. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి దిగ్గజ ఇ కామర్స్ సంస్థలన్నీ క్లౌడ్‌పైనే ఆధారపడి ఉన్నాయి. అయితే పాశ్చాత్య దేశాల్లో దిగ్గజ సంస్థలు, బ్యాంకులు దశాబ్దాల క్రితమే కంప్యూటర్లు, సర్వర్లపై పెట్టుబడులు పెట్టి ఉన్నాయి. పాత డేటా, అప్లికేషన్లను కాపాడుకోవడం, మళ్లీ కొత్తవాటికి మారడం కొంత ఇబ్బంది కలిగిస్తుంది. అవి క్లౌడ్‌కు వారేందుకు సమయం పడుతుంది. పాత సాంకేతికత, డేటాను క్లౌడ్‌కు తెచ్చేందుకు కొత్త వ్యవస్థలు కావాలి. కొత్త అప్లికేషన్లు రాయాలి, వ్యవస్థలూ అవసరం. అయినా దశల వారీగా మారక తప్పదు. ఇప్పటివరకు కంప్యూటర్లపై పెట్టుబడులు పెట్టని దేశీయ కంపెనీలు క్లౌడ్‌ను వినియోగించుకోవడం ఎంతో ఉపయుక్తం. అందువల్ల భారీ విపణికి అవకాశం ఉంది.

? పాత సంస్థలు పాత పద్ధతిలోనే ఉంటాయా

పాత కంపెనీలు 100శాతం క్లౌడ్‌కు ఒకేసారి మారకపోవచ్చు. కానీ ప్రధాన సమాచారాన్ని పాత పద్ధతిలో ఉంచకుని, అప్రధానమైనవి, కొత్తగా ప్రారంభించే సేవల కోసం క్లౌడ్ పద్ధతిని ఎంచుకుంటున్నాయి. కొత్త కంపెనీలు 100 శాతం క్లౌడ్‌ను వాడుతుంటే, పాతవి 20 శాతం నుంచి 70-80 శాతం వరకు క్లౌడ్‌కు మారొచ్చు. కానీ 0 శాతం దగ్గర ఏదీ ఉండవు.

? పబ్లిక్ క్లౌడ్, ప్రైవేట్ క్లౌడ్ తేడా లేంటి

పబ్లిక్ క్లౌడ్ అంటే మన డేటాను వేరే చోట నిల్వ చేయడం. ప్రైవేటు క్లౌడ్ అంటే మన డేటాను మన కార్యాలయంలో సర్వర్లు పెట్టుకుని నిల్వ చేయడం.. ఇది సంప్రదాయ ధోరణి. కొత్తగా ప్రైవేటు డేటా సెంటర్లు వచ్చాయి. అమెజాన్‌లోనే ప్రైవేటు డేటా సెంటర్లు పెట్టుకోవచ్చు. మౌలిక సదుపాయాలన్నీ అమెజాన్ వారు నిర్వహిస్తారు. మన డేటా అంతా మనకు ప్రత్యేకించిన హార్డ్‌వేర్‌లో మన డేటా ఉంటుంది. వేరే సంస్థల సమాచారంతో పంచుకోవడం ఉండదు. మన కార్యాలయంలో డేటా నిల్వకు సర్వర్లు కొనడం, నిర్వహించడం ఎంతో ఖర్చుతో కూడుకున్నది. అంతరాయం లేని విద్యుత్తు సరఫరా, సైబర్ దాడుల రక్షణకు మరింత వెచ్చించాలి. ఇక డిజాస్టర్ రికవరీ మరింత సంక్లిష్టం. ప్రైవేటు క్లౌడ్ కేంద్రాల్లో కూడా ఇవన్నీ మెరుగ్గా, కాస్త తక్కువ వ్యయానికే లభిస్తాయి.

? ఖర్చు ఎంత తగ్గుతుంది, భద్రత మాటేంటి

క్లౌడ్ వల్ల ఆదా అయ్యే వ్యయం విషయంలో కంపెనీకి, కంపెనీకి తేడా ఉంటుంది. అయితే 25-30 శాతం ఖర్చు మాత్రం తప్పనిసరిగా తగ్గుతుంది. దీనికంటే కూడా డిజాస్టర్ రికవరీ, సెక్యూరిటీ, పవర్ బ్యాకప్ (జనరేటర్లు, బ్యాటరీల నిర్వహణ ఖర్చు)వంటివి క్లౌడ్‌లో మెరుగ్గా ఉంటాయి. పబ్లిక్/ప్రైవేట్ డేటా సెంటర్లు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉంటాయి. సంప్రదాయ కంపెనీలు, వ్యాపార సంస్థలు ఈ స్థాయిలో ఏర్పాట్లు చేసుకోలేవు. క్లౌడ్ సెంటర్ల స్థాయిలో డేటా నిల్వకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలంటే బాగా అధిక మొత్తాలు వెచ్చించాలి. కానీ క్లౌడ్‌లో డేటా భద్రత తక్కువ ఉంటుందన్నది అపోహ మాత్రమే. గతేడాది వైరస్ దాడులు జరిగినపుడు, సొంత డేటా కేంద్రాల్లో రికవరీకి చాలా సమస్యలు ఎదురయ్యాయి. క్లౌడ్ ఖాతాదారులకు ఇబ్బందులు రాలేదు.

? వ్యాపార ప్రయోజనాలు ఎలా ఉంటాయి

కేవలం హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఖర్చు తగ్గించడమే కాదు. కంపెనీలు, బ్యాంకుల వంటివి తమ ఖాతాదార్లకు మెరుగైన అనుభవాన్ని అందించేందుకు క్లౌడ్ ఉపయోగ పడుతుంది.

ఈనాడు ఇంటర్వ్యూ

ఇన్ఫోసిస్ క్లౌడ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెక్యూరిటీ విభాగాల అధిపతి
ఎం.నరసింహారావు

కొత్త వ్యాపార విధానాలు ప్రారంభించేందుకు, ఆదాయం పెంచుకునేందుకు ఉపకరిస్తుంది. సంప్రదాయ బ్యాంకులనే తీసుకుందాం. వాళ్లు క్లౌడ్‌కు మారేందుకు సిస్టమ్స్‌ను క్లౌడ్‌కు అనుసంధానించాల్సి ఉంటుంది. డేటా నిల్వపై ఆలోచించకుండా, ఖాతాదార్లకు మరింత మెరుగైన, వినూత్న సేవలు ఎలా అందించాలో వారు ఆలోచించి, అమలు చేయొచ్చు. చెక్‌బుక్ కోసం అభ్యర్థన ఉందనుకుందాం.. దీన్ని క్లౌడ్‌కు బదలాయించవచ్చు. అభ్యర్థన అందిన వెంటనే, ఎంత త్వరగా ఖాతాదారుకు చేర్చగలమో ఆలోచించాలి. వినియోగదారుకు త్వరగా సేవలందించగలిగితే, వ్యాపారం పెరుగుతుంది. అయితే ప్రధాన వ్యాపార డేటాను పాత పద్ధతిలోనే నిల్వ చేసుకుంటే, అప్రధానమైనవి తొలుత క్లౌడ్‌కు మార్చవచ్చు. ఇమెయిల్‌నే తీసుకోండి.. అవుట్‌లుక్ సర్వర్లను తమ కార్యాలయాల్లో పెట్టుకుని, వాడుకునేవారు. మైక్రోసాఫ్ట్ ఆఫీస్ 365 వచ్చిన తరవాత ఇదంతా పోతోంది. ఇ మెయిల్ నుంచి ఇలా క్లౌడ్‌కు మారుతున్నారు.

? ఏయే రంగాలకు ఎక్కువ ప్రయోజనం

మెయిల్ అనేది అందరికీ అవసరమే. ఇది 100 శాతం క్లౌడ్‌కు మారుతోంది. కంపెనీల్లో మానవ వనరుల విభాగం, ఇతర అంతర్గత అప్లికేషన్ల వంటివి తొలుత మారతాయి. సహేతుక పరిమాణంలో వ్యాపారం నిర్వహిస్తున్న కంపెనీ ఏదీ క్లౌడ్‌ను వాడకుండా ఉండదు. కొంతైనా మారుతుంటారు. ఇ కామర్స్, అంకురాలకు పాత సిస్టమ్స్ లేవు కనుక ఇవి క్లౌడ్‌తోనే ప్రారంభమవుతున్నాయి.

? ఎన్ని కంపెనీలు సేవలందిస్తున్నాయి

వాస్తవానికి పబ్లిక్ క్లౌడ్ కంపెనీలు ప్రపంచంలో 5 మాత్రమే ఉన్నాయి. అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), అజ్యూర్ (మైక్రోసాఫ్ట్), గూగుల్, ఒరకల్, ఐబీఎం లు మాత్రమే అతిపెద్ద, పబ్లిక్ క్లౌడ్ కంపెనీలు. ఈ ప్లాట్‌ఫామ్‌లను వినియోగించుకుని, ఇన్ఫోసిస్, టీసీఎస్, క్యాప్‌జెమినీ.. వంటి సర్వీస్ ప్రొవైడర్లు క్లౌడ్ సేవలు అందిస్తున్నాయి. అప్లికేషన్‌ను బట్టి పబ్లిక్/ప్రైవేట్ క్లౌడ్ అనేది ఆధారపడి ఉంటుంది. ఒకే కంపెనీ రెండు తరహాల్లోనూ తమ డేటా నిల్వ చేస్తుంటుంది. మమ్మల్ని సంప్రదించే ఖాతాదారు సంస్థ వ్యూహాలు ఏమిటి, ఎంత పరిమాణంలో డేటా నిల్వ కావాలి అనేది చూసుకుని సేవలందిస్తాం. ఇక ప్రైవేటు క్లౌడ్ కంపెనీలకు వస్తే 10-12 ఉన్నాయి. వీటిల్లో ఒకటైన కంట్రోల్ ఎస్ డేటా కేంద్రం హైదరాబాద్‌లోనే ఉంది. ఈ కేంద్రాల్లో మనకు ప్రత్యేకించిన హార్డ్‌వేర్‌లో డేటా నిల్వ చేసుకోవచ్చు. ఈ కేంద్రాలు టైర్ 1, 2, 3, 4 అనే నియమాల ప్రకారం నిర్మించాల్సి ఉంటుంది. టియర్ 4 డేటా కేంద్రం అంటే అనేక దాడులను తట్టుకునే వ్యవస్థలతో నిర్మితమై ఉంటుంది. ఇలా మనం సొంతగా చేయాలనుకుంటే చాలా వ్యయం అవుతుంది. ఈ రంగంలో సన్‌గార్డ్, ఎన్‌టీపీ వంటివి ఉన్నాయి.

? ఉద్యోగావకాశాలు ఎలా లభిస్తాయి

ఇదేమీ కొత్త సాంకేతికత కాదు కానీ భవిష్యత్తు ఇదే. అంతమే ఉండదు కనుక ఉద్యోగావకాశాలకు ఢోకా ఉండదు. ఇంజినీరింగ్ ప్రధానంగా కంప్యూటర్ సైన్స్ చేసిన వారికి ఈ రంగంలో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఇన్ఫోసిస్ లాంటి కంపెనీల్లో నూతన ఉద్యోగులకు అవసరమైన శిక్షణ ఇచ్చి వినియోగించుకుంటున్నాం. క్లౌడ్, డేటా అనలిటిక్స్, సెక్యూరిటీ వంటివాటిలో భవిష్యత్తు ఉంది.

చక్కెర ఎగుమతులపై సుంకం రద్దు

దిల్లీ: చక్కెర ఎగుమతిదార్లకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ముడి, శుద్ధి చేసిన చెక్కరపై ఉన్న 20 శాతం ఎగుమతి సుంకాన్ని రద్దు చేస్తున్నట్లు మంగళవారం ప్రకటించింది. 2017-18 మార్కెటింగ్ ఏడాదిలో (అక్టోబరు-సెప్టెంబరు) భారత్ రికార్డు స్థాయిలో 29.5 మిలియన్ టన్నుల చక్కెరను ఉత్పత్తి చేస్తుందన్న అంచనా నేపథ్యంలో ఎగుమతుల్ని ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. దిగుమతుల్ని తగ్గించేందుకు ఇంతకు ముందే దిగుమతి సుంకాన్ని 100 శాతానికి పెంచింది.

- ✦ ఉత్పత్తి ఖర్చు కంటే దేశీయంగా చక్కెర ధరలు పడిపోతున్న నేపథ్యంలో దేశీయ మిగులు స్టాక్‌ను ఎగుమతి చేసుకునేందుకు వీలుగా సుంకాన్ని రద్దు చేయాలని ఇండియన్ సుగర్ మిల్స్ అసోసియేషన్ (ఐఎస్ఎంఏ), నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కోఆపరేటివ్ సుగర్ ఫ్యాక్టరీస్ (ఎన్ఎఫ్‌సీఎస్ఎఫ్) కోరడంతో ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది.
- ✦ చక్కెర ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది. 2017-18 మార్కెటింగ్ ఏడాది (అక్టోబరు-సెప్టెంబరు)లో ఉత్పత్తి 29.5 మిలియన్ టన్నులకు చేరుతుందని అంచనా. ఏడాది క్రితం ఇదే కాలానికి చక్కెర ఉత్పత్తి 20.3 మిలియన్ టన్నులు.

పీఎన్‌బీ ప్రభావంతో

భారత్ రేటింగ్ తగ్గించిన గోల్డ్‌మన్ శాక్స్

ముంబయి: భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి అంచనాలను ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ శాక్స్ కోత వేసింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో వెలుగుచూసిన 2 బిలియన్ డాలర్లకు పైగా కుంభకోణమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ కుంభకోణం వల్ల బ్యాంకింగ్ రంగంలో నిబంధనలు కఠినతరం కావొచ్చని, రుణాల వృద్ధికి ఇవి అడ్డంకి మారొచ్చని గోల్డ్‌మన్ శాక్స్ వెల్లడించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19)లో భారత జీడీపీ 8 శాతంగా ఉండొచ్చని ముందుగా అంచనా వేసిన గోల్డ్‌మన్ శాక్స్.. తాజాగా దాన్ని 7.6 శాతానికి కోత వేసింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం తర్వాత.. ఇతర బ్యాంక్‌లు సైతం పలు మోసాలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటికే మూడింట రెండొంతుల బ్యాంకింగ్ ఆస్తులు.. మొండి బకాయిలుగా పేరుకుపోయాయి. భారత బ్యాంకులు తిరిగి రుణాలివ్వడం, ఉద్యోగాల వృద్ధికి దోహదపడేందుకు భారీ మూలధన పునర్వ్యవస్థీకరణను ప్రకటించిన ప్రభుత్వానికి గోల్డ్‌మన్ శాక్స్ హెచ్చరిక ప్రతికూల పరిణామమనే చెప్పాలి.

ఎన్‌ఎండీసీ గనులకు 5స్టార్ రేటింగ్

ఈనాడు, హైదరాబాద్: ఎన్‌ఎండీసీకి చెందిన ఐదు గనులకు కేంద్ర గనుల శాఖ నుంచి 5స్టార్ రేటింగ్ లభించింది. మంగళవారం దిల్లీలో జరిగిన మూడో జాతీయ గనులు, ఖనిజాల సదస్సులో వీటిని కేంద్ర గనుల శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, సహాయ మంత్రి హరిబాయ్ పరాథిభాయ్ చౌదరి చేతుల మీదుగా మూడో ఈ సర్టిఫికెట్లను ఎన్‌ఎండీసీ ప్రతినిధులు అందుకున్నారు. బాచెలి కాంప్లెక్స్‌లోని రెండు గనులు, కిరండోల్ లోని రెండు, దోనిమలైలో ఉన్న ఒక గనులకు ఈ రేటింగులు వచ్చాయి. గనుల్లో శాస్త్రీయ పద్ధతులు, నైపుణ్యాల వినియోగం, గనుల తవ్వకాల వల్ల ఏర్పడే సామాజిక సమస్యలకు సరైన పరిష్కారం చూపడం, స్థానికంగా ఉన్న ప్రజల సంక్షేమం తదితర విభాగాల్లో గనుల పనితీరును విశ్లేషించి ఈ సర్టిఫికెట్లను అందించారు.



ఎన్నికల వరకు సంస్కరణలు ఉండకపోవచ్చు: రాజన్

దిల్లీ: రాబోయే సార్వత్రిక ఎన్నికల వరకు సంస్కరణల జోలికి ప్రభుత్వం వెళ్లకపోవచ్చని ఆర్‌బీఐ మాజీ గవర్నరు రఘురాం రాజన్ అభిప్రాయపడ్డారు. అయితే ఆ తర్వాత నుంచి దేశం అధిక వృద్ధి బాటలో పయనించే అవకాశం ఉందని అంచనా వేశారు. తదుపరి సార్వత్రిక ఎన్నికలు 2019లో జరగనున్న సంగతి తెలిసిందే. మరోవైపు ఉద్యోగ కల్పన అవకాశాలపై రాజన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఏటా చదువు ముగించుకొని కళాశాలల నుంచి బయటకు వస్తోన్న సుమారు 1.2 కోట్ల మంది యువతకు ఉద్యోగం కల్పించాలంటే 7.5 శాతం వృద్ధి రేటు సరిపోదని ఆయన అన్నారు. 'తదుపరి ఎన్నికల వరకు సంస్కరణలను పక్కకు పెడతారని నేను అనుకుంటున్నాను. అయితే ఎన్నికల తర్వాత సంస్కరణలు వేగవంతం చేస్తే రెండు మూడేళ్లలో అధిక వృద్ధి రేటు దిశగా భారత్ ఎందుకు పయనించకుండా ఉంటుంద'ని ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజన్ చెప్పారు. మౌలిక వసతుల వృద్ధి, కంపెనీలకు సత్వర అనుమతులు, వ్యాపారానుకూలతకు వీలు, విద్య-వైద్యకు ప్రాధాన్యం తదితరాల ద్వారా భారత్ 10 శాతం వృద్ధిని కూడా సాధించగలుగుతుందని అన్నారు. అయితే ఇది జరగాలంటే వీటిపై కసరత్తు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం సంస్కరణలు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదనే విషయాన్ని తాను గుర్తించానని తెలిపారు. రాజకీయంగా భిన్నాభిప్రాయాలే ఇందుకు కారణమవుతున్నాయని పేర్కొన్నారు. 'ప్రపంచానికి ఎగుమతుల అవసరం పరిమితంగానే ఉంది. ఒకవేళ రాత్రికిరాత్రే భారత్ తయారీరంగ దిగ్గజంగా అవతరిస్తే.. మనం తయారుచేసిన వస్తువులను ఎవరు కొంటారు. అందుకే తన సొంత వృద్ధి పథంలో పయనించే అంశంపై భారత్ దృష్టి పెట్టాలి. అది చైనా కంటే భిన్నంగా ఉండాల'ని రాజన్ తెలిపారు.



టీకే కెమికల్స్ కార్పొరేషన్ సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్, ఉపాధ్యక్షుడు టీకే కిమ్, ప్రతినిధులతో జయేశ్ రంజన్, టీఎస్ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి

కాకతీయ జౌళి పార్కులో కొరియా పరిశ్రమలు

వరంగల్ గ్రామీణ జిల్లాలో రూ.1500 కోట్ల పెట్టుబడులు!

ఈనాడు, హైదరాబాద్: వరంగల్ గ్రామీణ జిల్లా చింతలపల్లి, శాయంపేట గ్రామాల్లో ఏర్పాటుకానున్న కాకతీయ మెగా జౌళిపార్కులో దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ వస్త్రసంస్థ టీకే కెమికల్స్ కార్పొరేషన్ రూ.1500 కోట్లతో పరిశ్రమలను స్థాపించేందుకు సంసిద్ధత తెలిపింది. ఈ సంస్థ సీనియర్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు టీకే కిమ్, జనరల్ మేనేజర్ ఎస్‌బీ కిషన్, సహాయ మేనేజర్ కేఎస్ క్వాన్, జియోన్ ఇంటర్నేషనల్ ఎండీ కార్తికేయలు మంగళవారం రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీఎస్ఐఐసీ) కేంద్ర కార్యాలయంలో పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, టీఎస్ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డిలతో సమావేశమయ్యారు. జౌళిపార్కు ప్రణాళిక, రాష్ట్ర ప్రభుత్వ, రాయితీలు, ప్రోత్సాహకాలు ఇతర అంశాలను జయేశ్ వారికి వివరించారు. టీకే కిమ్ మాట్లాడుతూ ఇటీవల కొరియా పర్యటనలో మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చామన్నారు. ఫిలమెంట్, స్పాండెస్, లైక్రా, యాన్ ఫిలమెంట్ దుస్తుల తయారీలో తమ సంస్థ పేరొందిందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా తాము పరిశ్రమలను నిర్వహిస్తున్నామన్నారు. జయేశ్ మాట్లాడుతూ టీకే కెమికల్స్ సంస్థను ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు స్వాగతించారన్నారు. మెగా జౌళిపార్కులో 50 ఎకరాల భూమిని కేటాయించనున్నట్లు చెప్పారు. బుధవారం సంస్థ ప్రతినిధులు వరంగల్‌కు వెళ్లి జౌళిపార్కులో అనువైన భూములను ఎంపిక చేసుకుంటారన్నారు. వరంగల్‌కు విమాన సౌకర్యం గురించి చర్చించారు. మామునూరులోని విమానాశ్రయానికి చిన్న విమానాలు నడిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జయేశ్ వారికి వివరించారు.

మొబైల్ నుంచి 'దోస్త్'కు దరఖాస్తు

ఎంసెట్ తరహాలో రుసుము చెల్లింపు

ఈనాడు, హైదరాబాద్: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్-తెలంగాణ (దోస్త్)ను విద్యార్థులకు మరింత చేరువగా తీసుకెళ్లాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఈ దిశగా రానున్న విద్యాసంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియలో పలు సంస్కరణలను తీసుకురానుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 132 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనూ సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన దోస్త్ కమిటీ విద్యార్థులు మొబైల్ నుంచి దరఖాస్తు చేసేందుకు యాప్‌ను సిద్ధం చేస్తోంది. 'దోస్త్ కన్వీనర్' పేరిట బ్యాంకులో చలానా రూపంలో రుసుము (ఎంసెట్ కౌన్సెలింగ్ తరహాలో) చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులు డిగ్రీ రెండో ఏడాదిలో చేరేందుకు జీఓ ఉన్నా దాన్ని అమలు చేయడం లేదు. ఈసారి జీఓను అమలు చేయాలని నిర్ణయించామని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడు, దోస్త్ కన్వీనర్ ఆచార్య లింబాద్రి చెప్పారు.

మరికొన్ని నిర్ణయాలివీ..

- గత మూడేళ్లలో 25 శాతం లోపు సీట్లు భర్తీ అయిన కోర్సులను కళాశాలల యాజమాన్యాలే రద్దు చేసుకునేలా చూడాలని వర్సిటీలను దోస్త్ కమిటీ కోరింది. కౌన్సెలింగ్ తర్వాత 25 శాతంలోపు సీట్లు భర్తీ అయితే ఆ విద్యార్థులను మరో కళాశాలలో చేర్పించాలని ప్రాథమిక నిర్ణయం తీసుకున్నారు.
- ఏప్రిల్ 30లోపు ఆరు విశ్వవిద్యాలయాలు కోర్సులు, మొత్తం సీట్ల సంఖ్యను దోస్త్ వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేయాలి. అన్ని వర్సిటీల్లోని కోర్సుల్లో ఒకే సంఖ్యలో సీట్లు ఉండేలా చూస్తారు.
- కళాశాల ఉన్న ప్రాంతాన్ని విద్యార్థి గుర్తించేలా కళాశాలలకు జియో ట్యాగింగ్ చేస్తారు. ఇంటర్ ఉత్తీర్ణులైన వారు వెబ్‌సైట్ నుంచి మార్కుల ధ్రువపత్రం డౌన్‌లోడ్ చేసుకుంటే దోస్త్ మార్గదర్శకాలు వచ్చేలా చర్యలు తీసుకుంటారు.

కేసీఆర్ కూటమికి పవార్ అడ్డు చక్రం!

- భాజపాయేతర పార్టీలను ఏకతాటిపైకి తెచ్చే యత్నంలో ఎన్సీపీ అధినేత
- 27న శరద్ ఇంట భేటీకి మమతా, అఖిలేశ్ తదితరులు
- తెరాస మూడో కూటమి ఆశలకు ఈ సమావేశ ఫలితమే కీలకం!

ఈనాడు - దిల్లీ

దేశంలో కాంగ్రెస్సేతర, భాజపాయేతర పార్టీలతో మూడో కూటమిని పట్టాలెక్కించాలని భావిస్తున్న తెరాస అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ యత్నాలకు ఎన్సీపీ అధినేత శరద్ పవార్ అవరోధంగా నిలవనున్నారా? మరాఠా నేత ఈ నెల 27న దిల్లీలో నిర్వహిస్తున్న భాజపాయేతర పక్షాల సమావేశం నుంచి వెలువడే రాజకీయ సందేశమే ఈ అంశాన్ని నిర్ణయిస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. జాతీయ రాజకీయాల్లో భాజపాను వ్యతిరేకిస్తున్న పలు పార్టీలు కాంగ్రెస్‌తో జత కట్టేందుకూ సిద్ధంగా లేవు. ఇటీవలే ఎన్డీయేను వీడిన తెలుగుదేశం పార్టీకి కూడా ఆంధ్రప్రదేశ్‌లోని రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్న కూటమితో కలసి పనిచేయటం ఇబ్బందికరమే. ఈ పరిస్థితిని గమనించిన శరద్ పవార్ ...తృణమూల్ కాంగ్రెస్, బిజూ జనతా దళ్ (బిజద) వంటి పార్టీలకు చేరువయ్యేందుకు యత్నిస్తున్నారు.

ఎన్సీపీ భుజాలపై..

మహారాష్ట్రలో 2014లో దేవేంద్ర ఫడణవీస్ నేతృత్వంలో భాజపా-శివసేన సంకీర్ణ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఆ రెండు పార్టీల మధ్య విభేదాలు తలెత్తిన ప్రతిసారీ శరద్ పవార్‌కు చెందిన ఎన్సీపీ... భాజపా ప్రభుత్వానికి అండగా ఉంటామన్న సంకేతాలిచ్చింది. తమ ప్రభుత్వానికి ఎన్సీపీ ఇచ్చిన భరోసాకు ఫలితంగా కాంగ్రెస్-ఎన్సీపీ సంకీర్ణ ప్రభుత్వ హయాం(1999-2004)లో ఎన్సీపీ మంత్రుల ప్రమేయం ఉందని భావిస్తున్న రూ.72వేల కోట్ల సాగునీటి కుంభకోణం వైపు ఫడణవీస్ ప్రభుత్వం కన్నెత్తి కూడా చూడలేదు. ఆ విధంగా ఎన్సీపీ-భాజపా పరస్పరం సహకరించుకున్నాయని సమాచారం. 2019 సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్సీపీ... లౌకికవాదం విషయంలో తన సహజ స్నేహితుడైన కాంగ్రెస్ పార్టీకి చేరువయ్యేందుకు ప్రయత్నిస్తోంది. అదే సమయంలో జాతీయ రాజకీయాల్లో శరద్‌పవార్‌కున్న పలుకుబడిని ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. పరస్పర అవగాహనలో భాగంగానే భాజపాను వ్యతిరేకించే పార్టీలన్నిటినీ తన చిరకాల మిత్రుడు కాంగ్రెస్ వెనక మోహరింపజేసే కృషిని శరద్ పవార్ తన భుజాలపై వేసుకుని యుద్ధప్రాతిపదికన సన్నాహాలు చేస్తున్నారని తెలుస్తోంది.



నేతలకు స్వయంగా ఆహ్వానాలు

దిల్లీలోని తన నివాసంలో ఈనెల 27న ఏర్పాటు చేసిన సమావేశానికి భాజపాయేతర రాజకీయ పార్టీల నేతలను శరద్ పవార్ స్వయంగా ఆహ్వానిస్తున్నారు. మంగళవారం లఖ్‌నవూ వెళ్లి సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తో భేటీ అయ్యారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి ఇప్పటికే ప్రత్యేక దూత ద్వారా ఆహ్వానం పంపగా ఆమె హాజరయ్యేందుకు అంగీకరించారని తెలిసింది. ఈ నెల 26 నుంచి నాలుగు రోజుల పాటు దిల్లీలో ఉండే ఆమె యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో భేటీకి అవకాశాలున్నాయని టీఎంసీ వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ పార్టీపై మమతా బెనర్జీకి ఇదివరకు ఉన్నంత ఆగ్రహంలేదని, జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్‌తో కలసి పనిచేయటం ఆమెకు అభ్యంతరం ఉండకపోవచ్చని టీఎంసీ వర్గాలు వ్యాఖ్యానించాయి. రాజ్యసభ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్ నుంచి అయిదో స్థానంలో తన అభ్యర్థిని గెలిపించుకోవటానికి కాంగ్రెస్...సీపీఎం మద్దతుకు బదులుగా తృణమూల్ కాంగ్రెస్ సాయాన్ని స్వీకరించటం గమనార్హం. ఈ క్రమంలో తన చిరకాల రాజకీయ విరోధి, పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌదరి సలహాను సోనియా గాంధీ పక్కన పెట్టటం కూడా మమతా బెనర్జీ మారిన మనసుకు కారణం కావచ్చని భావిస్తున్నారు. అందువల్లే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కోల్‌కతాలో తన భేటీని ఫలవంతం అని మాత్రమే మమతా బెనర్జీ పేర్కొన్నారని అంటున్నారు. భాజపాయేతర కూటమికి కాంగ్రెస్‌ను దూరంగా ఉంచే ప్రతిపాదనపై తొందర వద్దని, భావసారూప్య పార్టీలన్నిటితో చర్చలు జరగనివ్వాలని కేసీఆర్‌కు సూచించారని వినికిడి.

ఈ నేపథ్యంలోనే శరద్‌పవార్ ఇంట జరిగే సమావేశానికి భాజపాయేతర పార్టీలు ఎన్ని హాజరవుతాయి అన్నది ఆసక్తికరం. వాటి సంఖ్య తక్కువగా ఉంటే భాజపాయేతర పార్టీల్లో అత్యధికం కాంగ్రెస్ నాయకత్వంలో ఏకమయ్యేందుకు సుముఖంగా లేవనే సంకేతాలు వెలువడుతాయి. ఒకవేళ అధిక సంఖ్యలో విచ్చేస్తే...ఆ పార్టీలన్నీ తమ విభేదాలను పక్కనపెట్టి భాజపాతో తలపడేందుకు కాంగ్రెస్ నాయకత్వంలో పనిచేయటానికి సిద్ధమనే అభిప్రాయం కలుగుతుంది. ఇదే జరిగితే కేసీఆర్ ప్రతిపాదిస్తున్న భాజపాయేతర, కాంగ్రెస్సేతర మూడో కూటమికి అవకాశాలు సన్నగిల్లినట్లేనని రాజకీయ పండితుల విశ్లేషణ.

ఉపరాష్ట్రపతి వ్యక్తిగత సహాయకుడినంటూ మోసం

- కిషన్‌రెడ్డి ఫిర్యాదుతో నిందితుడి అరెస్ట్

ఈనాడు, హైదరాబాద్: ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి వ్యక్తిగత సహాయకుడినంటూ బదిలీలు, వైద్య కళాశాలల్లో సీట్లు ఇప్పించుకోవడంతో పాటు ప్రజాప్రతినిధులనూ బెదిరిస్తున్న నిందితుడు పసుపులేటి నవీన్ అలియాస్ అర్జున్ రావ్‌ను సీసీఎస్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. భాజపా ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఫిర్యాదులోని చరవాణుల ద్వారా అర్జున్‌రావ్ ఆచూకీని గుర్తించారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా భోగాపురం వాసిగా గుర్తించి అతని కదలికలపై నిఘా ఉంచారు. హైదరాబాద్‌లో శాసనసభ పరిసర ప్రాంతాల్లో మంగళవారం సంచరిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా... నేరం అంగీకరించడంతో కోర్టులో హాజరు పరిచి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. భోగాపురంలో ఉంటున్న పసుపులేటి నవీన్ ఓ స్థిరాస్తి సంస్థలో పనిచేస్తున్నాడు. తనకు తానే ఉపరాష్ట్రపతి పీఏగా పదవి సృష్టించుకున్నాడు. విజయనగరం, శ్రీకాకుళం, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫోన్లు చేసి వారి బంధువులకు అవసరమైన పనులు చేయించుకునేవాడు. మండలస్థాయి అధికారుల బదిలీలు, వైద్య కళాశాలల్లో సీట్లు ఇప్పించేందుకు డబ్బులు వసూలు చేసేవాడు. కొద్దిరోజుల క్రితం ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి ఫోన్‌చేసి ఉప రాష్ట్రపతి కార్యాలయానికి అవసరమైన వస్తువులు అందజేయాలంటూ బెదిరించాడు. ఎమ్మెల్యే ఫిర్యాదుతో విషయం వెలుగులోకి వచ్చింది.


నవీన్

మిషన్ భగీరథ పైపులు చోరీ.. మహారాష్ట్రలో ప్రత్యక్షం

ఎదులాపురం, న్యూస్‌టుడే: మిషన్ భగీరథ పథకం పైపులు ఇక్కడ మాయమై మహారాష్ట్రలో ప్రత్యక్షమవుతున్నాయి. అయినా అధికారులు, గుత్తేదారులు వాటి గురించి ఫిర్యాదు చేయటం లేదు. పనులు చేపడుతున్న నిర్వహణ సిబ్బంది విక్రయిస్తున్నారేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాకు సరఫరా అయిన పైపులపై ఎంబీ టీఈ ఎస్ఆర్ఎస్‌పీ ఏడీబీ అని ముద్రించి ఉన్నప్పటికీ యథేచ్ఛగా మహారాష్ట్రకు తరలుతున్నాయి. ఇటీవల నాందేడ్ జిల్లాలోని ఇత్వారా పోలీసులు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన 41 పైపులను స్వాధీనం చేసుకొని, అన్‌క్లైమ్ ప్రాపర్టీ కింద ఉంచినట్లు సమాచారం. ఇలా ఆదిలాబాద్, మెదక్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాలకు చెందిన పైపులను అక్కడి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని పురపాలక సంఘాల్లో గుత్తేదారులు వీటిని కొనుగోలు చేసి వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఈమేరకు గుత్తేదారు ప్రతినిధికి సమాచారమివ్వగా ఆయన పైపులు చోరీకి గురైనట్లు మూడ్రోజుల కిందట ఫిర్యాదు చేశారు.

అమెరికా చర్యతో వాణిజ్య యుద్ధం ముప్పు

- ఉక్కు, అల్యూమినియంపై దిగుమతి సుంకం పెంపు సరికాదు
- డబ్ల్యూటీవో సభ్యదేశాల ఆందోళన
- దిల్లీలో ముగిసిన అనధికారిక సదస్సు
- సుంకం పెంపు విషయాన్ని అమెరికాతో చర్చిస్తాం: సురేశ్ ప్రభు

దిల్లీ: ఉక్కు, అల్యూమినియంపై దిగుమతి సుంకం పెంచుతూ అమెరికా ఇటీవల తీసుకున్న నిర్ణయంపై ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో) సభ్య దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అగ్రరాజ్యం చర్యతో ఇతర దేశాలు కూడా దిగుమతులను పరిమితం చేసే చర్యలకు పూనుకునే అవకాశముందని సూచించాయి. ఫలితంగా వాణిజ్య యుద్ధం తలెత్తే ముప్పుందని భయాందోళన వ్యక్తం చేశాయి. డబ్ల్యూటీవోను బలోపేతం చేసుకోవాల్సిన ఆవశ్యకతను కూడా నొక్కిచెప్పాయి. దిల్లీలో జరిగిన డబ్ల్యూటీవో దేశాల మంత్రులస్థాయి అనధికార సదస్సులో ఈ మేరకు పలు అంశాలపై చర్చలు జరిగాయి. భారత్ పిలుపుమేరకు ఈ సమావేశాలకు అమెరికా, చైనా సహా 53 డబ్ల్యూటీవో సభ్యదేశాలు తమ ప్రతినిధులను పంపించాయి. భారత్‌లో పాక్ హైకమిషన్‌కు చెందిన ప్రతినిధి ఇందులో పాల్గొన్నారు. రెండు రోజులపాటు జరిగిన సదస్సు మంగళవారంతో పూర్తయింది. ఆహార భద్రతపై నెలకొన్న ఆందోళనలు, డబ్ల్యూటీవో విచారణ సంఘానికి సభ్యులను నియమించడం, దోహా అభివృద్ధి అజెండా, ఇ-వాణిజ్యం తదితర అంశాలపై తాజా సమావేశాల్లో సభ్యదేశాలు చర్చించాయి. కొన్ని దేశాలు ఏకపక్షంగా తీసుకుంటున్న నిర్ణయాలు దీర్ఘకాలంలో ప్రతిఒక్కరిపై ప్రతికూల ప్రభావం చూపుతాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేశ్ ప్రభు విలేకర్లతో మాట్లాడుతూ అన్నారు. అమెరికాకు ఉక్కు, అల్యూమినియంను ఎగుమతి చేసే ప్రధాన దేశాల్లో భారత్ ఒకటి కానప్పటికీ.. దిగుమతి సుంకం పెంపు విషయాన్ని అమెరికాతో చర్చిస్తామని తెలిపారు. ఇటీవల ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య సంబంధాల్లో ఉద్రిక్తతలు పెరిగాయని డబ్ల్యూటీవో డైరెక్టర్ జనరల్ రాబర్టో అజెవెడో ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని దేశాలు డబ్ల్యూటీవో నియమాలకు లోబడి వ్యవహరించాలని కోరారు.

భారత్ చిత్తశుద్ధితో ఉంది: మోదీ

నిబంధనల ఆధారిత బహుముఖ వాణిజ్య వ్యవస్థ పట్ల భారత్ చిత్తశుద్ధితో ఉందని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. అందరినీ కలుపుకొని వెళ్లడం, ఏకాభిప్రాయం అనే సిద్ధాంతాల ఆధారంగా ఆ వ్యవస్థ పనిచేయాలని అభిలషించారు. డబ్ల్యూటీవో అనధికార సదస్సుకు విచ్చేసిన ప్రతినిధులను ఉద్దేశించి మోదీ మంగళవారం ప్రసంగించారు. డబ్ల్యూటీవోకు ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లను ఉమ్మడిగా ఎదుర్కోవాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన తెలిపారు. డబ్ల్యూటీవో తాజా అనధికార సదస్సులో నిర్మాణాత్మక చర్చలు జరిగాయని తాను విశ్వసిస్తున్నట్లు చెప్పారు.

పిటిషన్ చెల్లుబాటులో ఉంటే ప్రయాణం చేయవచ్చు



ఈనాడు, హైదరాబాద్: అమెరికా వీసాలకు సంబంధించిన అంశాలపై 'అమెరికాయానం' పేరిట పాఠకుల నుంచి 'ఈనాడు' ఆహ్వానించిన ప్రశ్నలకు హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ అధికారులు సమాధానాలిచ్చారు. అవి ఇలా ఉన్నాయి...

హెచ్1బి వీసాపై అమెరికాలోని ఓ క్లయింటు వద్ద పని చేస్తున్నాను. ఆ సంస్థ నుంచి మారాలనుకుంటున్నాను. హెచ్1బి వీసాను బదలాయించేందుకు నూతన యాజమాన్యం ప్రయత్నాలు చేస్తోంది. ఆ ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఈలోగా భారత్ వద్దామనుకుంటున్నాను. తిరుగు ప్రయాణంలో ఇబ్బంది అవుతుందా? - వెంకటరాజు కేవీ

అమెరికాలో మీరు పని చేస్తున్న యాజమాన్యం ద్వారా వచ్చిన పిటిషన్ చెల్లుబాటులో ఉంటే ప్రస్తుత హెచ్1బి వీసాపై మీరు ప్రయాణం చేయవచ్చు. నూతన పిటిషన్ ఆమోదం పొందే సమయానికి మీరు అమెరికా వెలుపల ఉన్న పక్షంలో నూతన వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. వర్క్ వీసా సమాచారానికి www.uscis.gov ను చూడండి.

డిపెండెంట్ వీసాపై అమెరికాలో ఉంటున్నాను. అమెరికా రాక మునుపు 2015లో ఎఫ్-1 వీసా కోసం రెండు దఫాలు దరఖాస్తు చేసుకుంటే తిరస్కరించారు. వివాహం తరవాత భర్తతో కలిసి అమెరికా వచ్చాను. ఇక్కడ మాస్టర్స్ చేయాలనుకుంటున్నాను. హెచ్-4 వీసా నుంచి ఎఫ్-1 వీసా మార్చుకోవచ్చా? - పద్మజా వెలిమినేడు

చెల్లుబాటు అయ్యే హెచ్-4 వీసా ద్వారా విద్యా సంస్థలకు హాజరయ్యేందుకు అర్హులే. మీరు కూడా ఎఫ్-1 వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్వ్యూ సమయంలో ఇతర దరఖాస్తుదారుల మాదిరిగానే మీరు ఎఫ్-1 వీసాకు అర్హులా? కాదా? అన్నది కాన్సులర్ అధికారి నిర్ణయం తీసుకుంటారు. అమెరికాలో విద్యాభ్యాసం తదితర సమాచారం కోసం ఎడ్యుకేషన్ యూఎస్ఎ వెబ్‌సైట్ Rhttps://educationusa.state.govను పరిశీలించండి.

పర్యాటక వీసా దరఖాస్తు విధానమేమిటి? - శ్రీనివాసరాజు మంగపూడి

వీసా ప్రక్రియలో తొలిదశ వెబ్‌సైట్‌లో మీ ప్రొఫైల్‌ను తయారు చేసుకోవటం, ఎమ్మార్వీ ఫీజు చెల్లించటం, వేలిముద్రల కోసం వీసా దరఖాస్తు కేంద్రంలో సమయాన్ని షెడ్యూల్ చేసుకుని ఆ తరవాత కాన్సులేట్‌లో ఇంటర్వ్యూకు అపాయింటుమెంటును షెడ్యూల్ చేసుకోవాలి. దరఖాస్తు విధానాన్ని www.traveldocs.com/inలో వివరించారు. మరింత సమాచారానికి 040 4625 8222, 0120 4844644 నంబర్లకు ఫోన్ చేయండి.

నేను విద్యార్థి వీసా(ఎఫ్-1)దారుడను. భారతదేశం వద్దామనుకుంటున్నాను. నా వీసా, పాస్‌పోర్టులు చెల్లుబాటులో ఉన్నాయి. ఎస్ఈవిఐఎస్ నంబరులోనూ మార్పులు లేవు. అయితే, ఎఫ్-1 వీసాదారులు మాతృదేశానికి వెళితే మళ్లీ స్టాంపింగ్ చేయించుకోవాలని నా మిత్రులు చెబుతున్నారు. ఇది ఎంత వరకు వాస్తవం? - రమేష్ కాశీనాధుని

కొన్ని కేసుల్లోనే నూతన వీసా కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. విద్యార్థి ఎస్ఈవిఐఎస్ నంబరులో, విశ్వవిద్యాలయంలో మార్పులున్నా, అమెరికాలో చివరిసారిగా చదువుకుని అయిదు నెలలు దాటిన వారే నూతన వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలి. మీకేమైనా ప్రశ్నలుంటే 040 4625 8222, 0120 4844644 నంబర్లకు ఫోన్ చేయండి లేదా support-india@ustraveldocs.com కు ఈ-మెయిల్ చేయండి.

- వీసాలకు సంబంధించిన నిర్దిష్టమైన అంశాలు, తిరస్కారాలపై సందేహాలను support-india@ustraveldocs.com కు ఈ-మెయిల్ చేయండి.
- మరింత సమాచారం కోసం హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వెబ్‌సైట్ http://hyderabad.usconsulate.gov ను సంప్రదించవచ్చు.
- హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం అందించే వీసాసేవలకు సంబంధించిన ప్రశ్నలను usvisa@eenadu.net కు పంపగలరు.

కట్టుకున్నవాడే కాలయముడయ్యాడు

- భార్య, ఇద్దరు పిల్లలను హతమార్చిన భర్త
- పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు


వరలక్ష్మి నితీష్ యశస్విని సురేందర్, వరలక్ష్మి పెళ్లినాటి చిత్రం

బాలాపూర్, న్యూస్‌టుడే: అన్యోన్యంగా ఉంటున్న ఆ కుటుంబం ఛిన్నాభిన్నమైంది. ఆలూమగల మధ్య మాటామాటా పెరగడంతో.. భర్త కాలయముడిగా మారి కట్టుకున్న భార్యను, కన్నబిడ్డలను అంతమొందించాడు. భార్య పుట్టింట్లోనే వారిని కడతేర్చి పోలీసులకు లొంగిపోయిన ఉదంతం కలకలం రేపింది. మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బడంగ్‌పేట సాయిప్రభుహోమ్స్ కాలనీలో మంగళవారం ఈఘటన జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడకు చెందిన తుమ్మ మహేష్, జ్యోతిల పెద్ద కుమార్తె వరలక్ష్మి(28)కి.. లింగంపల్లిలోని కొమరంభీమ్ కాలనీకి చెందిన సంగిశెట్టి సురేందర్(32)తో తొమ్మిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి నితీష్(5), యశస్విని(3)లు ఉన్నారు. సోమవారం సాయంత్రం బడంగ్‌పేటలోని అత్తారింటికి సురేందర్, భార్య వరలక్ష్మి.. ఇద్దరు పిల్లలతో వచ్చారు. మంగళవారం తెల్లవారుజామున 5గంటల సమయంలో భార్య వరలక్ష్మిని నిద్రలేపి ఇంటికి వెళ్దామని సురేందర్ అడగ్గా ఆమె లేచి మళ్లీ నిద్రపోయింది. ఉదయం 6గంటలకు ఆమెను మళ్లీ లేపగా తొందరేముంది వెళ్దామంది. దీంతో వారిమధ్య మాటామాటా పెరిగింది. దీంతో సురేందర్ భార్య గొంతు నులిమేశాడు. పక్కనే నిద్రిస్తున్న కూతురు యశస్వినిని, అమ్మమ్మ వద్ద ఆడుకుంటున్న కొడుకునూ గొంతు పిసికి చంపేశాడు. ఎవరికీ అనుమానం రాకుండా కల్లు తాగుదాం తీసుకురమ్మని చెప్పి మామను, మరో పనిమీద బావమరిదిని, ఉప్మారవ్వ తెమ్మని అత్తను బయటకు పంపించాడు. వారంతా బయటకు వెళ్లగానే మామ మహేష్‌కు ఫోన్ చేసి వరలక్ష్మిని, ఇద్దరు పిల్లలను హత్యచేశానని చెప్పాడు. కారులో వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. తన భర్త ద్వారా విషయం తెలుసుకున్న జ్యోతి లబోదిబోమంటూ కుప్పకూలింది. వరలక్ష్మి, పిల్లలను ఒవైసీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే వారు మృతి చెందారని వైద్యులు తెలిపారు. గొంతు నులిమే వారిని అంతమొందించినట్లు వైద్యులు ధ్రువీకరించారని పోలీసులు పేర్కొన్నారు. ఎల్‌బీనగర్ డీసీపీ వెంకటేశ్వరరావు, వనస్థలిపురం ఏసీపీ రవీందర్‌రెడ్డి, సీఐ మన్మోహన్‌లు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీమ్, పోలీసు జాగిలాన్ని రప్పించి ఆధారాలు సేకరించారు. డీసీపీ మాట్లాడుతూ కుటుంబ కలహాల వల్లే అతను హత్యలు చేసి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నామన్నారు.

ఉద్యోగుల హక్కుల కోసం పోరాటం

ఉద్యోగ ఐకాస ఛైర్మన్ కారెం రవీందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: "ప్రత్యేక తెలంగాణలో ఉద్యోగులకు సమస్యలుండవని భావించి రాష్ట్రం కోసం ఉద్యమించాం.. కానీ, ప్రస్తుతం ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతోంది. మళ్లీ అన్ని సంఘాలు ఏకమై ఉద్యోగుల హక్కుల కోసం పోరాడేందుకు సన్నద్ధమవుతున్నాయి" అని తెలంగాణ ఉద్యోగ ఐకాస ఛైర్మన్ కారెం రవీందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన సకల ఉద్యోగుల మహాసభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25న హైదరాబాద్‌లో ఉద్యోగుల హక్కుల కోసం నిర్వహిస్తున్న సభకు 254 సంఘాలు మద్దతు ఇచ్చాయన్నారు. 142 రకాల సమస్యలతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఏపీలో తెలంగాణకు సంబంధించిన 1,200 మంది విద్యుత్తు ఉద్యోగులు పని చేస్తున్నారని.. వారిని ఇక్కడి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం చొరవ చూపడం లేదన్నారు. ఆనాడు తెలంగాణ ఉద్యమంలో పాలు పంచుకున్నారన్న నెపంతో ఏపీ ప్రభుత్వం ఆ ఉద్యోగులను వేధిస్తోందని. . వారిలో 24 మంది మానసిక వేదనతో మృతి చెందారని ఆరోపించారు. టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, వివిధ సంఘాల, రాష్ట్ర, జిల్లా నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రశ్నపత్రం బయటికొచ్చిన ఘటనలో 15 మందిపై కేసు

మరికల్, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ జిల్లా మరికల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పరీక్ష కేంద్రం నుంచి ఆంగ్లం-1 పేపర్ ప్రశ్నపత్రం బయటకు వెళ్లిన ఘటనలో 15 మందిపై కేసు నమోదు చేసినట్లు నారాయణపేట డీఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పరీక్ష కేంద్రంలో సోమవారం మాల్ ప్రాక్టీస్ జరిగినట్లు అధికారులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కొంతమందిని అదుపులోకి తీసుకుని సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు విచారణ నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో మొత్తం 15 మంది ఉండగా.. 12 మందిని అదుపులోకి తీసుకున్నామని వీరిని నారాయణపేట కోర్టులో హాజరు పరుస్తున్నామని తెలిపారు. ముందుగా ప్రశ్నపత్రాన్ని నవీన్ అనే యువకుడు. . బాలకృష్ణ అనే వ్యక్తి చరవాణితో ఫొటో తీశాడని, అది ప్రవీణ్‌కు, మోహన్‌కు షేర్‌ఇట్ ద్వారా చేరిందని చెప్పారు. ప్రవీణ్ దేవరకద్రలోని తపోవన్ ప్రైవేటు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు స్వాతి, గోపాల్‌లకు పంపించారని చెప్పారు. మరో యువకుడు మణికంఠ చరవాణి నుంచి ఆత్మకూర్‌లోని ఎంవీ రామన్ పాఠశాలకు చెందిన జోసెఫ్ అనే ఉపాధ్యాయుడికి పంపించారన్నారు. ఆత్మకూర్‌కు చెందిన ఎంవీ రామన్ పాఠశాల యజమాని ప్రమేయంపై విచారణ జరుగుతోందని, నిజమని తేలితే చర్యలు తీసుకుంటామని అన్నారు. విచారణలో హైదరాబాద్ పోలీసుల సాయం తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

కేసు ఎవరెవరిపై?: ఈ ఉదంతంలో మరికల్, దేవరకద్ర, ఆత్మకూర్‌లోని ప్రైవేటు పాఠశాలలకు చెందిన వారి ప్రమేయం ఉందని డీఎస్పీ తెలిపారు. నవీన్, వెంకటయ్య, ప్రవీణ్, మోహన్, బాలకృష్ణ, అంబ్రుజ్‌కుమార్, రాజేందర్ రెడ్డి, హన్మంత్‌రెడ్డి, స్వప్న, టి.గోపాల్, జోసెఫ్‌తో పాటు నలుగురు బాలురపై కేసు నమోదయిందన్నారు. విలేకరుల సమావేశంలో మక్తల్, మరికల్ సీఐలు వెంకట్, శ్రీకాంత్‌రెడ్డి, ధన్వాడ ఎస్సై శంషుద్దీన్ ఉన్నారు.

క్రిమినల్ కేసులన్నా.. బేఖాతరు

ఈనాడు, హైదరాబాద్: పదో తరగతి పరీక్షల్లో చూచిరాతలకు పాల్పడే విద్యార్థుల మీద.. కాపీయింగ్‌ను ప్రోత్సహించే వారిపైనా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పాఠశాల విద్యాశాఖ హెచ్చరించినా అక్రమాలు మాత్రం ఆగడం లేదు. కాపీయింగ్‌కు పాల్పడుతూ విద్యార్థులు దొరికితే పరీక్ష విధుల్లో ఉన్న ఇన్విజిలేటర్లపైనా చర్యలు తీసుకుంటామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. హెచ్చరికలను పలువురు బేఖాతరు చేస్తున్నారు. ఫలితంగా పదో తరగతి పరీక్షలు జరుగుతున్న తీరుపై ఎన్నో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా మరికల్ మండలం తాడిహత్నూర్‌లో బయట నుంచి వచ్చి కొందరు యువకులు సెల్‌ఫోన్ల ద్వారా ప్రశ్నపత్రాన్ని ఫొటో తీస్తూ వాట్సాప్ ద్వారా ఇతరులకు పంపిస్తున్నా పర్యవేక్షణ చేస్తున్న సిబ్బంది చూడలేదంటే అక్కడ నిఘా ఎలా ఉందో అర్థమవుతోంది. కొందరు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో కుమ్మక్కవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తుతోందని ఆరోపణలు వస్తున్నాయి. ఆసిఫాబాద్ జిల్లాలో ఉపాధ్యాయురాలే ఫొటో తీసి ప్రశ్నపత్రాన్ని బయటకు పంపారంటే క్రిమినల్ కేసులన్నా భయం లేకుండాపోయిందని ఓ ఫ్లైయింగ్ స్క్వాడ్ బృంద అధికారి వ్యాఖ్యానించారు. సెల్‌ఫోన్లు తీసుకురావొద్దన్న నిబంధనలను సిబ్బంది పాటించడం లేదు. బయట వ్యక్తులు పరీక్ష కేంద్రాల్లోకి ప్రవేశిస్తే బందోబస్తులో ఉన్న పోలీసులపై ఎందుకు చర్యలు తీసుకోరని విధులు నిర్వహిస్తున్న ఓ ఉపాధ్యాయుడు ప్రశ్నించడం గమనార్హం.


కారణాలెన్నో..: పదో తరగతిలో ఉత్తీర్ణత ప్రకారం జిల్లాలకు ర్యాంకులు ఇవ్వడం.. తక్కువ ఉత్తీర్ణత వస్తే చర్యలు తీసుకోవడం వంటి చర్యలతో ఉపాధ్యాయుల నుంచి డీఈఓల వరకు ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఎక్కువ ఉత్తీర్ణత సాధిస్తే వారు బాగా పనిచేసినట్లు లెక్క. అందుకే చూచిరాత ఘటనలు చోటు చేసుకుంటున్నట్లు భావిస్తున్నారు. 9వ తరగతి వరకు నో డిటెన్షన్ విధానం అమల్లో ఉండటంతో విద్యార్థులు చదువును అశ్రద్ధ చేసి, పదో తరగతిలో కాపీయింగ్ వైపు మొగ్గుచూపుతున్నారు. పదిలో 2,600 పరీక్ష కేంద్రాలున్నాయి. మారుమూల ప్రాంతాల్లో కనీసం ప్రహరీలు లేని కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుండటం.. చుట్టూ పొలాలు, ముళ్లచెట్లు ఉండటంతో చూచిరాతలపై నిఘా కష్టసాధ్యమవుతోందని అధికారులు చెబుతున్నారు.

ఇప్పటివరకు: పది పరీక్షల్లో ఇప్పటివరకూ 3సబ్జెక్టుల పరీక్షలు పూర్తి కాగా.. 8 మందిని పరీక్షల విధుల నుంచి తొలగించారు. 14 మందిని సస్పెండ్ చేశారు. మంగళవారం ఒక్కరోజే మహబూబ్‌నగర్ జిల్లాలో 9 మంది సిబ్బందిని సస్పెండ్ చేశారు. ఆరు నెలలపాటు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు.



నైజాం కాలం వంతెన.. ప్రమాదం జరిగితే అంతేనా

నైజాం పాలనలో నిర్మించిన పురాతన వంతెన ఇది. జగిత్యాల- నిజామాబాద్ 63 జాతీయ రహదారి మెట్‌పల్లి శివారు వద్ద ఇలా ప్రమాదకరంగా తయారైంది. తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపేసుంటున్నారు.. సిమెంటు ఇటుకలతో రక్షణ గోడ నిర్మించినప్పటికీ అది కూలిపోయింది. భారీ వాహనాలు రెండూ ఒకేసారి రాకపోకలు సాగించలేని పరిస్థితి. – ఈనాడు, కరీంనగర్



ముక్కలై... వంతెనపై వేలాడింది

యాదాద్రి జిల్లా భువనగిరి మండలం రాయగిరి బైపాస్ వంతెనపై మంగళవారం ఓ టిప్పర్ ప్రమాదవశాత్తు రక్షణ గోడను ఢీకొట్టి ముక్కలై కొంత భాగం కిందకు వేలాడింది. బొమ్మల రామారం నుంచి ఆత్మకూరు(ఎం)కు కంకర లోడుతో వెళుతుండగా మార్గమధ్యలో ఇలా ప్రమాదానికి గురైంది. అదృష్టవశాత్తు సర్వీస్ రోడ్డుపై పడకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా, టిప్పర్ డ్రైవర్ గణేష్‌తో పాటు అందులో ఉన్న బాలరాజు అనే వ్యక్తి గాయాలపాలయ్యారు.

– న్యూస్‌టుడే, భువనగిరి గ్రామీణం

ఛాంపియన్స్

పద్మశ్రీ అందుకున్న శ్రీకాంత్

భారత స్టార్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ మంగళవారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకున్నాడు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో టెన్నిస్ ఆటగాడు సోమ్‌దేవ్ దేవ్‌వర్మన్, పారాలింపిక్ స్వర్ణ విజేత మురళీకాంత్ పేట్కర్ కూడా పద్మశ్రీ పురస్కారాన్ని స్వీకరించారు. ఈ ఏడాది పద్మభూషణ్ అవార్డుకు ఎంపికైన ధోని, పంకజ్ అడ్వాణీ అనివార్య కారణాల వల్ల ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు.







ధోని యూనివర్సిటీ టాపర్!


- నేనింకా అక్కడే చదువుకుంటున్నా
- నాయర్ నది.. నేను పడవ
- దినేశ్ కార్తీక్ ఆసక్తికర వ్యాఖ్యలు

చెన్నై

బంగ్లాదేశ్‌తో ముక్కోణపు టీ20 సిరీస్ ఫైనల్లో సంచలన బ్యాటింగ్‌తో భారత్‌ను గెలిపించిన దినేశ్ కార్తీక్‌పై ప్రశంసల జల్లు కురుస్తోంది. మ్యాచ్‌లను ముగించడంలో మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనితో అతడిని పోలుస్తున్నారు అభిమానులు. ధోని తర్వాత ఫినిషర్ పాత్ర పోషించబోయేది కార్తీకే అని కూడా అంటున్నారు. దీనిపై కార్తీక్ స్పందించాడు. తనను ధోనీతో పోల్చవద్దని కోరాడు. ''ధోని టాపర్‌గా ఉన్న యూనివర్శిటీలో నేను చదువుకుంటున్నా. నేను స్ఫూర్తి కోసం చూసే ఆటగాళ్లలో అతనొకడు. నన్ను అతడితో పోల్చడం సబబు కాదు. ప్రస్తుతం నేనున్న స్థితితో సంతృప్తిగా ఉన్నా'' అని కార్తీక్ స్పష్టం చేశాడు. ధోని కంటే ముందే అంతర్జాతీయ క్రికెట్లోకి అడుగుపెట్టిన కార్తీక్.. అంచనాలకు తగ్గట్లుగా రాణించలేకపోయాడు. అతడి తర్వాత భారత జట్టులోకి వచ్చిన ధోని ఆటగాడిగా, కెప్టెన్‌గా తిరుగులేని స్థాయిని అందుకున్నాడు. ఈ నేపథ్యంలో కార్తీక్ మాట్లాడుతూ.. ''ధోనితో పోలిస్తే నా ప్రయాణం పూర్తి భిన్నమైంది. అతను గొప్ప ఆటగాడు. ఒకప్పుడు ధోని సిగ్గరి. ఎవరితో ఎక్కువగా మాట్లాడేవాడు కాదు. కానీ ఇప్పుడు కుర్రాళ్లకు సాయం చేసేందుకు చాలా మాట్లాడుతున్నాడు'' అని చెప్పాడు. ఆదివారం నాటి ఇన్నింగ్స్‌తో తనపై అందరి దృష్టి నిలవడం మంచి అనుభూతినిస్తోందని, ఇన్నేళ్లలో తాను చేసిన మంచి పనులు నాకు కలిసొచ్చి ఆ సిక్సర్ బాదేలా చేశాయనుకుంటున్నానని కార్తీక్ అన్నాడు. ''ఈ అనుభూతిని మాటల్లో చెప్పడం కష్టం. క్రికెట్ ఆడటం నాకెంతో సంతోషాన్నిచ్చే విషయం. హఠాత్తుగా ఇంత గుర్తింపు రావడం గొప్పగా అనిపిస్తోంది. అయితే ఏదైనా ప్రత్యేకంగా చేయడానికి ఇది మంచి ఆరంభం అనుకుంటున్నా'' అని చెప్పాడు. రెండేళ్ల కిందట ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్నపుడు తనకు అండగా నిలిచి, శిక్షణ ద్వారా తాను మెరుగుపడేందుకు కృషి చేసిన ముంబయి ఆటగాడు అభిషేక్ నాయర్‌పై కార్తీక్ ప్రశంసలు కురిపించాడు. ''గత రెండేళ్లలో నా కెరీర్ ఎదుగుదలలో అతడి పాత్ర ఎంతో కీలకం. మ్యాచ్‌లకు సన్నద్ధమయ్యే విషయంలో నాయర్ నాకు సాయం చేశాడు. వ్యూహాల విషయంలో ఆలోచించేలా చేశాడు. శ్రమించడానికి సరైన మార్గమేంటో అతడికి తెలుసు. ఈ ప్రయాణంలో అతను నది అయితే.. నేను పడవ అని చెప్పొచ్చు'' అన్నాడు. బంగ్లాతో మ్యాచ్‌లో బంతులు వృథా చేసి విమర్శలెదుర్కొన్న విజయ్ శంకర్‌కు కార్తీక్ అండగా నిలిచాడు. అతను ప్రతిభావంతుడని చెప్పాడు. ''శంకర్‌కు నైపుణ్యం ఉంది. బౌలర్‌గా అతను చక్కటి ప్రదర్శన చేశాడు. ఒత్తిడిలో అతను బాగానే ఆడాడు. అతడికి మంచి భవిష్యత్తు ఉంది. అతడిది ప్రత్యేకమైన ప్రతిభ. శంకర్ చాలా కాలం ఆడతాడు'' అన్నాడు. తన కంటే ముందు శంకర్‌ను బ్యాటింగ్‌కు పంపిన రోహిత్ శర్మకు కూడా కార్తీక్ మద్దతిచ్చాడు. ''కెప్టెన్‌గా రోహిత్ మూడు ఐపీఎల్ ట్రోఫీలు గెలిచాడు. తన సామర్థ్యంపై, జట్టును నడిపించే విషయంలో రోహిత్‌కు ఎంతో ఆత్మవిశ్వాసం ఉంది. ప్రతి మ్యాచ్‌కు ముందు రోహిత్ ఎన్నో వ్యూహాలు రచిస్తాడు. అతను తిరుగులేని కెప్టెన్'' అన్నాడు.

అవును.. షమి దుబాయ్‌లో రెండు రోజులు ఉన్నాడు

దిల్లీ: టీమ్‌ఇండియా ఫాస్ట్‌బౌలర్ మహ్మద్ షమి గత నెల 17, 18వ తేదీల్లో దుబాయ్‌లో ఉన్నట్లు బీసీసీఐ ధ్రువీకరించింది. పాకిస్థాన్ మోడల్‌తో వివాహేతర సంబంధం పెట్టుకున్న షమి.. గత నెలలో దక్షిణాఫ్రికా పర్యటన ముగిసిన అనంతరం ఆమెను కలిసేందుకు దుబాయ్ వెళ్లాడని అతడి భార్య హసీన్ జహాన్ ఆరోపించిన సంగతి తెలిసిందే. మ్యాచ్ ఫిక్సింగ్ కోసం ఇంగ్లాండ్‌కు చెందిన ఓ వ్యాపారి నుంచి డబ్బులు తీసుకున్నాడని కూడా ఆమె ఆరోపించింది. ఈ నేపథ్యంలో షమి దుబాయ్‌లో పర్యటించడంపై సమాచారం కోరగా బీసీసీఐ స్పందించింది. ''బీసీసీఐ నుంచి మాకు లేఖ అందింది. షమి ఫిబ్రవరి 17, 18వ తేదీల్లో దుబాయ్‌లో ఉన్నట్లు తెలిపింది. ఇతర అంశాల పైనా విచారణ జరుపుతున్నాం'' అని జాయింట్ కమిషనర్ ప్రవీణ్ త్రిపాఠి చెప్పాడు.



ఆమె అభిమాని కాదు.. ప్రేయసి!

కోల్‌కతా: పాకిస్థాన్‌తో మహిళ అలిష్బాతో తన భర్త మహ్మద్ షమికి వివాహేతర సంబంధం ఉందన్నది అతడి భార్య ఆరోపణ. దీనిపై వివరణ ఇచ్చిన అలిష్బా తాను షమి అభిమానిని మాత్రమేనని, అతడితో అల్పాహారం చేయడానికే హోటల్‌కు మాత్రమే వెళ్లానని చెప్పింది. ఐతే అలిష్బా చెబుతున్నదంతా అబద్ధమని తాజాగా హసీన్ వ్యాఖ్యానించింది. ఆమె అల్పాహారం కోసమే అతణ్ని కలవలేదని, వారి కలయిక చివరికి పడకపై ముగిసిందని అంది. ''ఆమె షమి అభిమాని కాదు. ఆమె అతడి ప్రేయసి కావొచ్చు లేదా వ్యభిచారి కావొచ్చు. ఒక అమ్మాయి కుటుంబానికి తెలియకుండా ఒక మగాణ్ని రహస్యంగా కలుస్తోందంటే అర్థమేంటి? అలిష్బా నా వైవాహిక జీవితాన్ని నాశనం చేయడానికే వచ్చింది. నా భర్త కూడా అమాయకుడు కాదు. షమితో అలిష్బాకు సంబంధముందని ఇంతకుముందే చాలా సార్లు చెప్పాను. తప్పు చేయడానికే వాళ్లు దుబాయ్‌లో కలిశారు. కలవాలని వాళ్లు జనవరి నుంచే అనుకుంటున్నారు. వాళ్ల కలయిక అల్పాహారానికే పరిమితమా? కాదు.. అది చివరికి పడకపై ముగిసింది'' అని హసీన్ విలేకర్లతో చెప్పింది. షమిని, అతడి కుటుంబాన్ని వెంటనే అరెస్ట్ చేయాలని ఆమె డిమాండ్ చేసింది. షమిని నడిరోడ్డుపై కొట్టాలని అంది.

మాకు ఐపీఎల్ ఇప్పుడే వద్దు



భారత కెప్టెన్ మిథాలీరాజ్

ముంబయి

మహిళల ఐపీఎల్‌కు ఇది సరైన సమయం కాదని భారత టెస్ట్ కెప్టెన్ మిథాలీరాజ్ అభిప్రాయపడింది. మహిళల క్రికెట్లో బలమైన దేశవాళీ వ్యవస్థ ఉన్నప్పుడే మహిళల ఐపీఎల్‌కు అర్థముంటుందని చెప్పింది. ''ఐపీఎల్ లాంటి టోర్నీల్లో ఆడేందుకు తగినంత సంఖ్యలో నాణ్యమైన క్రీడాకారులు ఉండడం అవసరం. భారత మహిళల-ఏ జట్టుకే ఇంకా నాణ్యమైన క్రీడాకారులు కావాలి. అలాంటి వాళ్లు ఉన్నప్పుడే మహిళల ఐపీఎల్‌ను నిర్వహించాలి. అప్పుడే దానికి అర్థముంటుంది'' అని ఆమె చెప్పింది. బీసీసీఐ వచ్చే ఐపీఎల్‌లో మహిళలకు ఎగ్జిబిషన్ మ్యాచ్‌లు నిర్వహించనుంది. ఇది మహిళల ఐపీఎల్‌కు బాటలు వేస్తుందని భావిస్తున్నారు. ''అంతర్జాతీయ ప్లేయర్‌కు, దేశవాళీ ప్లేయర్‌కు మధ్య చాలా తేడా ఉంటుంది. ఇప్పుడే ఐపీఎల్‌ను నిర్వహిస్తే మహిళల క్రికెట్ వ్యాప్తికే అది ప్రతికూలంగా మారొచ్చు. పటిష్ఠమైన దేశవాళీ వ్యవస్థ, చాలా మంది నాణ్యమైన క్రీడాకారిణులు ఉన్నప్పుడే ఐపీఎల్ నిర్వహిస్తే బాగుంటుందన్నది నా వ్యక్తిగత అభిప్రాయం'' అని మిథాలీ విలేకర్లతో చెప్పింది. ఆమెతో వెటరన్ పేస్ బౌలర్ జులన్ గోస్వామి కూడా అంగీకరించింది. ''ఆమె చెప్పిన దానితో నేను పూర్తిగా ఏకీభవిస్తా. దేశవాళీ వ్యవస్థ ఇంకా బలపడాలి'' అని అంది.

నాణ్యమైన రిజర్వ్‌లేరి?

భారత మహిళల జట్టుకు రిజర్వ్‌బెంచ్ బలంగా లేదని మిథాలీరాజ్ ఒప్పుకుంది. తర్వాతి తరం అంతర్జాతీయ క్రికెటర్లు తయారు కావడానికి కనీసం మరో రెండేళ్ల సమయం పడుతుందని చెప్పింది. ఇటీవల స్వదేశంలో ఆస్ట్రేలియా మహిళలతో వన్డే సిరీస్‌లో భారత్ 0-3తో పరాజయం పాలైన నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేసింది. ఓటమి కన్నా. బాగా ఆడనివాళ్ల స్థానాలను భర్తీ చేసేందుకు అవసరమైన నాణ్యమైన క్రీడాకారిణులు లేకపోవడమే భారత్‌కు ఆందోళన కలిగిస్తోంది. ''ఇప్పుడిప్పుడే భారత-ఏ పర్యటనలు, ఏ జట్టు కూర్పుపై దృష్టి సారించాం. ద్వితీయ శ్రేణి క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిని అందుకోవడానికి కనీసం ఓ రెండేళ్ల సమయం పడుతుంది'' అని మిథాలీ చెప్పింది. వన్డే సిరీస్‌లో తమను ఓడించిన ఆస్ట్రేలియా తమకంటే చాలా చాలా బలమైన జట్టు అని ఆమె తెలిపింది. బీసీసీఐ కాంట్రాక్టులు ఇచ్చిన నేపథ్యంలో మహిళా క్రికెటర్లు మరింత కష్టపడాలని అభిప్రాయపడింది.

ఆ అద్దం పగలగొట్టింది షకిబేనా?



కొలంబో: ఇటీవలే శ్రీలంకలో ముక్కోణపు టీ20 సిరీస్ చివరి లీగ్ మ్యాచ్ సందర్భంగా ఆట చివర్లో వివాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. లంక బౌలర్ ఉదాన వరుసగా రెండో బంతిని కూడా ఎక్కువ ఎత్తుకు విసిరినప్పటికీ నోబాల్ ఇవ్వకపోవడంపై బంగ్లాదేశ్ ఆటగాళ్లు గొడవ చేయడం, కెప్టెన్ షకిబ్ అల్‌హసన్ క్రీజులో ఉన్న బ్యాట్స్‌మెన్‌ను వెనక్కి వచ్చేయాలని కోరడం పెద్ద చర్చకే దారి తీసింది. ఈ గొడవ అనంతరం, మ్యాచ్ ముగిశాక బంగ్లాదేశ్ డ్రెస్సింగ్ రూం గది అద్దం పగలడం సంచలనం రేపింది. అయితే దీనికి బాధ్యులెవరనే విషయంలో స్పష్టత లేకపోయింది. సీసీ టీవీ కెమెరాల్లోనూ అద్దం పగిలిన ఘటన రికార్డవలేదు. అయితే మ్యాచ్ రిఫరీ క్రిస్ బ్రాడ్ దీనిపై విచారణ జరపగా.. అద్దం పగలగొట్టింది బంగ్లా కెప్టెన్ షకిబేనని తేలినట్లు శ్రీలంక మీడియా తెలిపింది. ఆటగాళ్లకు ఆహార పదార్థాలు సరఫరా చేసిన సిబ్బంది ఈ విషయం వెల్లడించినట్లు సమాచారం. అయితే వీడియో సాక్ష్యాలు లేకపోవడంతో షకిబ్‌పై చర్యలు చేపట్టలేకపోయినట్లు తెలిసింది.


ఎందుకీ.. హాలో..!



మెల్‌బోర్న్: హాలో.. ప్రస్తుతం ఫార్ములావన్‌లో చర్చనీయాంశంగా మారిన అంశమిది. రేసులో డ్రైవర్ల రక్షణ కోసం అంతర్జాతీయ ఆటోమొబైల్ సమాఖ్య (ఎఫ్ఐఏ) నూతనంగా ప్రవేశపెట్టిన రక్షణ కవచం పేరే హాలో. టైటానియం, కార్బన్ ఫైబర్ పదార్థంతో రూపొందిన ఈ కవచాన్ని డ్రైవర్లు కూర్చునే ప్రదేశం (కాక్‌పిట్)పై ఏర్పాటు చేస్తారు. ఎఫ్1 కార్లకు వీటిని కచ్చితంగా అమర్చాలని ఎఫ్ఐఏ ఆదేశించింది. ప్రమాదానికి గురైన సమయంలో కారు శకలాలు డ్రైవర్ల తలకు తాకకుండా ఉండేందుకే ఈ ఏర్పాటు! 2014 జపనీస్ గ్రాండ్‌ప్రిలో ప్రమాదం కారణంగా జూలెస్ బియాంచి. ఆ తర్వాత ఏడాది ఇండికార్ రేసులో జరిగిన ప్రమాదంలో జస్టిన్ విల్సన్‌లు మృతి చెందిన నేపథ్యంలో ఎఫ్ఐఏ ఈ నిర్ణయం తీసుకుంది. ఐతే హాలోపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఆకర్షణ కోల్పోతున్న ఎఫ్1.. తాజా నిబంధన కారణంగా మరింత ప్రజాదరణ కోల్పోవడం ఖాయమనేది రేసర్ల వాదన. రక్షణ కవచం చాలా అసౌకర్యంగా ఉందని, డ్రైవర్లకు మరింత ప్రమాదం తెచ్చిపెట్టేలా ఉందన్నది మరికొందరి అభిప్రాయం. ''కారులోకి వెళ్లేందుకు, బయటకు వచ్చేందుకు చాలా ఇబ్బందిగా ఉంది. స్టీరింగ్ వీల్‌ను తీసి పెట్టేందుకు కూడా కష్టపడాల్సి వస్తోంది. అసౌకర్యంగా అనిపిస్తోంది. కారును మలుపు తిప్పే సమయంలో.. హాలో అడ్డుగా ఉంటోంది. తల పక్కకు వంచాల్సి వస్తోంది'' అని హాస్ డ్రైవర్ కెవిన్ మాగ్నసన్ విమర్శించాడు.

కామన్వెల్త్ తొలి అడుగు

దిల్లీ: తాను నిరూపించుకోవాల్సింది ఇంకా ఏమీ లేదని స్టార్ రెజ్లర్ సుశీల్ కుమార్ అన్నాడు. ఐతే సాధించాల్సింది ఇంకా ఉందని చెప్పాడు. అసంపూర్తిగా మిగిలిపోయిన తన మూడో ఒలింపిక్ పతక కలను నెరవేర్చుకోవడానికి కామన్వెల్త్ క్రీడలు తొలి అడుగని అన్నాడు. కామన్వెల్త్‌లో పోటీ తన కెరీర్‌ను పొడిగిస్తుందని అతడు భావిస్తున్నాడు. ''రెజ్లింగ్ ఆరంభించినప్పటి నుంచి నా



ఏకైక లక్ష్యం దేశానికి ప్రాతినిధ్యం వహించడం, మెరుగైన ప్రదర్శన చేయడమే. మ్యాట్‌పై ఎప్పుడూ నూరు శాతం శ్రమించా. నేను ప్రజల ఆలోచనా దృక్పథాన్ని మార్చలేను. నేను ఎవరికీ కొత్తగా నిరూపించుకోవాల్సిందేమీ లేదు'' అని సుశీల్ చెప్పాడు. బీజింగ్‌లో కాంస్యం, లండన్‌లో రజతం సాధించిన సుశీల్.. వివాదాస్పద రీతిలో 2016 రియో ఒలింపిక్స్‌కు ఎంపిక కాని సంగతి తెలిసిందే. ఇప్పుడు కామన్వెల్త్ క్రీడలకు కూడా వివాదాల నడుమ ఎంపికయ్యాడు. ''నేను రెండు ఒలింపిక్ పతకాలు సాధించా. ఇక నేను ఎవరికీ నిరూపించుకోవాల్సిందేమీ లేదు. కానీ నాకో అసంపూర్ణ కల ఉంది. 2012 (లండన్ ఒలింపిక్స్‌లో రజతం గెలిచాడు)లో దానికి దగ్గర వచ్చా. ఈ దేశానికి ఓ ఒలింపిక్ స్వర్ణం బాకీ పడ్డా'' అని సుశీల్ చెప్పాడు.



రబాడకు ఊరట

తొలగిన నిషేధం

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా జట్టుకు పెద్ద ఊరట. టాప్ ఫామ్‌లో ఉన్న ఆ జట్టు ఫాస్ట్‌బౌలర్ కాగిసో రబాడ.. ఆస్ట్రేలియాతో మిగతా రెండు టెస్టుల్లో ఆడేందుకు మార్గం సుగమమైంది. అతడిపై పడ్డ రెండు టెస్టు మ్యాచ్‌ల నిషేధాన్ని ఐసీసీ అప్పీల్ కమిషనర్ మికెల్ హెరాన్ ఎత్తివేశాడు. రెండో టెస్టు సందర్భంగా ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్‌ను భుజంతో ఢీకొట్టిన నేపథ్యంలో రబాడ నిషేధానికి గురైన సంగతి తెలిసిందే. రబాడ ఉద్దేశపూర్వకంగానే ఢీకొట్టాడని తేల్చిన ఐసీసీ మ్యాచ్ రిఫరీ జెఫ్ క్రో.. అతడి మ్యాచ్ ఫీజులో 50 శాతాన్ని జరిమానాగా విధించాడు. మూడు అయోగ్యతా పాయింట్లను కూడా ఇచ్చింది. దీంతో ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించినందుకు గతంలో పొందిన వాటితో కలిపి అయోగ్యతా పాయింట్లు 8కి చేరాయి. దీంతో నిబంధనల ప్రకారం రబాడపై దానంతటదే రెండు టెస్టుల నిషేధం పడింది. ఐతే ఈ నిషేధాన్ని రబాడ సవాలు చేశాడు. అప్పీలుపై విచారణ జరిపిన కమిషనర్.. అతడు ఉద్దేశపూర్వకంగా స్మిత్‌ను ఢీకొట్టలేదని తేల్చాడు. రబాడపై అభియోగాల తీవ్రతను తగ్గించాడు. అయోగ్యత పాయింట్లను మూడు నుంచి ఒకటికి, జరిమానాను 50 శాతం నుంచి 25 శాతానికి తగ్గించాడు. పాయింట్లు ఏడే కావడంతో రబాడపై నిషేధం తొలగిపోయింది. మళ్లీ నియమావళిని ఉల్లంఘిస్తే మాత్రం నిషేధం తప్పదు. దక్షిణాఫ్రికా- ఆస్ట్రేలియా మూడో టెస్టు గురువారం ఆరంభమవుతుంది.

ప్రపంచ రికార్డుకు చేరువలో రషీద్



హరారె: అంతర్జాతీయ క్రికెట్లో అఫ్గానిస్థాన్ యువ స్పిన్నర్ సంచలన ప్రదర్శన కొనసాగుతోంది. అరంగేట్రం నాటి నుంచి అదరగొడుతున్న 19 ఏళ్ల మిస్టరీ స్పిన్నర్.. వన్డేల్లో అత్యంత వేగంగా వంద వికెట్ల మైలురాయిని అందుకునే దిశగా దూసుకెళ్తున్నాడు. ఐసీసీ వన్డే ప్రపంచకప్ క్వాలిఫయర్స్ సూపర్ సిక్స్ దశలో మంగళవారం యూఏఈతో మ్యాచ్‌లో అతను ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. అతను 41 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టడంతో యూఏఈ 43 ఓవర్లలో 177 పరుగులకే కుప్పకూలింది. అనంతరం నైబ్ (74), నజీబుల్లా (64) రాణించడంతో అఫ్గాన్ 35వ ఓవర్లోనే 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. వన్డేల్లో రషీద్ వికెట్ల సంఖ్య 96కు చేరుకుంది. అతడికిది 42వ వన్డేనే. ఆస్ట్రేలియా ఫాస్ట్‌బౌలర్ మిచెల్ స్టార్క్ 52 వన్డేల్లో 100 వికెట్లతో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. రషీద్ ప్రస్తుత టోర్నీలో ఇప్పటికే 15 వికెట్లు పడగొట్టాడు.

అక్రమ సంబంధమే హత్యకు కారణం

- **తెదేపా మహిళా నేత హత్యకేసులో వీడిన మిస్టరీ**

కాటారం, న్యూస్‌టుడే: భూపాలపల్లి జిల్లా కాటారం మండలం కొత్తపల్లిలో ఈ నెల 11న జరిగిన తెదేపా మహిళా నాయకురాలు రామిల్ల కవిత హత్యకేసు మిస్టరీ వీడిపోయింది. హత్యకు సంబంధించిన వివరాలను మంగళవారం కాటారం డీఎస్పీ కేఆర్‌కే ప్రసాదరావు విలేకర్లకు వివరించారు. సుదీర్ఘకాలంగా భర్తతో విడిపోయిన కవిత తన ఇద్దరు కుమార్తెలతో కాటారం మండలం కొత్తపల్లిలో నివాసం ఉంటున్నారు. దూరపు బంధువైన ములుగు సర్పంచి గుగ్గిళ్ల సాగర్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండటంతో అతని భార్య సుజాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కవిత, సాగర్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించినా భర్త ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో సుజాత పలు



హత్య కేసు నిందితులను చూపుతున్న పోలీసులు

మార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పెద్దల సమక్షంలో పంచాయతీలు నిర్వహించారు. ఈ క్రమంలో తమ ఇంట్లో అద్దెకు దిగిన భూపాలపల్లి మండలం పెద్దాపురానికి చెందిన పసరగొండ రజినీకాంత్‌కు తన భర్త ప్రవర్తనను సుజాత వివరించారు. కవితను హత్య చేస్తే సమస్య పరిష్కారమవుతుందని రజినీకాంత్ చెప్పడంతో ఆమె ఆత్మహత్య ప్రయత్నాన్ని విరమించుకున్నారు. కవితను హతమార్చేందుకు నేరచరిత్ర కలిగిన పెద్దాపురానికి చెందిన కన్నూరి కుమారస్వామితో రూ.5 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. హత్య కోసం కుమారస్వామి, రజినీకాంత్, కుక్కమూడి అశోక్, నూనగంటి చిరంజీవి అలియాస్ అభిలాష్‌లతో కలిసి పలుమార్లు రెక్కీ నిర్వహించారు. తర్వాత కుమారస్వామికి తెలియకుండానే రజినీకాంత్, అశోక్, చిరంజీవిలు భూపాలపల్లిలో ఈనెల 11న కవిత ఇంటి వద్ద మకాం వేశారు. అర్ధరాత్రి వేళ వెనక కిటికీ లోంచి అశోక్, చిరంజీవిలు ఇంట్లోకి ప్రవేశించి, కవితను హత్య చేసి పారిపోయినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో గుగ్గిళ్ల సుజాత, రజినీకాంత్, అశోక్, కుమారస్వామి, జగదీశ్, మోహన్, చంద్రయ్యలను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. పరారీలో ఉన్న చిరంజీవి, రాజులను త్వరలోనే పట్టుకుంటామన్నారు. హత్య కేసును ఛేదించిన కాటారం సీఐ శంకర్‌రెడ్డిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ముంబయిలో రైలు మార్గాల దిగ్బంధనం

- **ఉద్యోగాలు కోరుతూ ఆందోళన.. లాఠీఛార్జి**
- **11 మంది పోలీసులకు గాయాలు.. వందల మందిపై కేసులు**

ముంబయి, న్యూస్‌టుడే/ దిల్లీ: రైల్వేలో శాశ్వత ఉద్యోగాలకు డిమాండ్ చేస్తూ నైపుణ్యశిక్షణ(అప్రెంటిస్‌షిప్) పూర్తిచేసిన విద్యార్థులు ముంబయిలో మంగళవారం అకస్మాత్తుగా ఆందోళనకు దిగారు. అధికసంఖ్యలో ఆందోళనకారులు మధ్యరైల్వే పరిధిలోని మాటుంగా-దాదర్ స్టేషన్ల మధ్య ఉదయం 7గంటల ప్రాంతంలో రైలుమార్గాన్ని(పట్టాలను) దిగ్బంధనం చేశారు. మూడున్నర గంటల ఆందోళన నేపథ్యంలో దక్షిణ ముంబయిలోని ఛత్రపతి శివాజీ టెర్మినస్ 4మార్గాల్లో సబర్బన్ సహా వివిధ



ముంబయిలో పట్టాలపై కూర్చున్న ఆందోళనకారులు

రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. కార్యాలయాలకు, పనిప్రాంతాలకు వెళ్లేవారు, డబ్బావాలాలు.. ఇలా నిత్యం అధికసంఖ్యలో రాకపోకలు సాగించే ప్రయాణికులంతా ఇబ్బందులు పడ్డారు. తమకు జీఎం కోటా కింద 20శాతం ఉద్యోగాలను కేటాయించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా నియామకాలు లేకపోవడంతో 10మందికి పైగా ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. డీఆర్ఎంకు అనేకసార్లు విన్నవించామని.. రైల్వేమంత్రి లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలని పట్టుపట్టారు. కాగా పట్టాలు ఖాళీ చేయాలంటూ పోలీసులు, రైల్వే అధికారులు, ఆర్పీఎఫ్ సిబ్బంది విజ్ఞప్తి చేసినప్పటికీ విద్యార్థులు ససేమిరా అనడంతో పోలీసులు లాఠీఛార్జి చేశారు. ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో 11మంది రైల్వే పోలీసులకు గాయాలయ్యాయి.

రైల్వేమంత్రి విజ్ఞప్తి..: రైల్వేమంత్రి పీయూష్ గోయల్ దిల్లీలో హుటాహుటిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన వివిధ తీర్పులను అనుసరించి 20శాతం ఉద్యోగాలను నైపుణ్యశిక్షణ చట్టం ప్రకారం కోర్సును పూర్తి చేసినవారికే ఇచ్చామని.. వారంతా విధుల్లో ఉన్నట్లు తెలిపారు. అయితే మార్చి 31 వరకు గడువున్న దాదాపు 90 వేల గ్రూప్ సీ, డీ ఉద్యోగాలకు అభ్యర్థులంతా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



ధ్వంసమైన పెరియార్ విగ్రహం ★ మరమ్మతుల అనంతరం..

తమిళనాడులో పెరియార్ విగ్రహం ధ్వంసం

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు పుదుక్కోట జిల్లాలో పెరియార్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. జిల్లాలోని అలంగుడి ప్రాంతంలోని ఓ కొలను వద్ద ఉన్న ఈ విగ్రహం తల భాగాన్ని తొలగించిన గుర్తు తెలియని వ్యక్తులు.. పక్కనే దాన్ని పడేశారు. ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే వారు వచ్చి అధికారుల సాయంతో తల భాగాన్ని విగ్రహానికి మళ్లీ అతికించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు.

పోలీసు నిర్బంధంలో ఫ్రెంచి మాజీ అధ్యక్షుడు సర్కోజీ

పారిస్: ఎన్నికల ఖర్చులకు గాను 2007లో నాటి లిబియా నియంత గడాఫీ నుంచి అక్రమంగా నిధులు పొందిన అభియోగాలపై ఫ్రెంచి మాజీ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీని పోలీసులు మంగళవారం నిర్బంధం(కస్టడీ)లోకి తీసుకున్నారు. ఈమేరకు అవినీతి విచారణ అధికారులు(ప్రాసిక్యూటర్లు) ఆయనతో పాటు, నాటి మంత్రి బ్రైస్ హోర్టెఫెక్స్‌ను కూడా ప్రశ్నించినట్లు ఓ వార్తాసంస్థ తెలిపింది. సర్కోజీ ఎన్నికల వ్యయానికి గాను గడాఫీ, అతని కుమారుడు సైఫ్ అల్-ఇస్లామ్‌లు ఓ వ్యాపారవేత్త ద్వారా నిధులు సమకూర్చారన్నది ఒక అభియోగం. 2012 నుంచి ఈ వ్యవహారంపై విచారణ ప్రారంభం కాగా.. సర్కోజీ ఖండిస్తూ వచ్చారు. అయితే ఫ్రెంచి-లెబనెస్ జైద్ టైకెడిన్ తాను గడాఫీ నుంచి 3 సూట్‌కేసులతో నగదు తెచ్చినట్లు 2016లో అంగీకరించడంతో కేసు తీవ్రత పెరిగింది. అతన్ని జనవరిలోనే అదుపులోకి తీసుకున్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00